
'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 242

గురువారం 16-5-2024



పిండానికీ జీవించే హక్కుంది

27 వారాల గర్భ విచ్ఛిత్తికి నిరాకరించిన సుప్రీంకోర్టు - 6లో



ఎస్‌బీఐ వడ్డీరేట్లు అప్

రిటైల్ స్థిర డిపాజిట్ల మీద పలు కాల పరిమితులపై వడ్డీరేట్లు పెంపు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఓటు వేసేందుకు వచ్చి మృత్యువాత

- హైదరాబాద్ నుంచి ఓటర్లను పిలిపించిన టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి
- తిరుగు ప్రయాణంలో చిలకలూరిపేట వద్ద బస్సు ప్రమాదం
- టిప్పర్‌ను బస్సు ఢీకొనడంతో చెలరేగిన మంటలు.. పూర్తిగా దగ్ధమైన బస్సు, టిప్పర్
- ఇద్దరు డ్రైవర్లు సహా ఆరుగురు సజీవ దహనం
- 30 మందికి గాయాలు.. ఒక మహిళ పరిస్థితి విషమం
- సీఎం జగన్ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం
- తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు సాయం

10లో

బడుగులపై బరితెగింపు

వైఎస్సార్‌సీపీ అనుకూల వర్గాలే టార్గెట్.. మహిళలపై పచ్చ మూకల దాష్టీకాలు

నర్సీపట్నంలో దుశ్శాసన పర్వం


ఒంటరి మహిళను జుట్టు పట్టుకొని ఈడ్చి కాళ్లతో తన్నిన అయ్యన్న అనుచరులు

2లో

కృష్ణా జిల్లాలో దమనకాండ

మహిళను ట్రాక్టర్‌తో తొక్కి చంపడానికి ప్రయత్నించిన టీడీపీ నేత

- మహిళలపై హత్యాయత్నాలు చేస్తున్నా ఏమీ పట్టనట్లు ఈసీ నిర్లిప్తత
- గ్రామాలు వీడి దూరంగా తలదాచుకుంటున్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు
- చేష్టలుడిగి చూస్తున్న అధికార యంత్రాంగం
- ఓట్ల లెక్కింపు దాకా కొనసాగించేలా చంద్రబాబు పన్నాగం.. రాష్ట్రవ్యాప్తంగా దాడులకు పురిగొల్పుతూ భయానక వాతావరణం
- రాజకీయ ప్రత్యర్థులపై గ్రామాల్లో విచ్చలవిడిగా దాడులు..
- కౌంటింగ్‌కు వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను దూరంగా ఉంచడమే లక్ష్యం



అయ్యన్న గ్యాంగ్ అరాచకం

ఎన్నికల్లో చురుగ్గా పని చేసిందనే కక్షతో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం ధర్మసాగరంలో ఓ ఒంటరి మహిళ పట్ల అయ్యన్నపాత్రుడి అనుచరులు దుశ్శాసనుల్లా వ్యవహరించారు. మంగళవారం అర్ధరాత్రి బాధితురాలి ఇంట్లోకి చొరబడి జుత్తు పట్టుకొని ఈడ్చుకొచ్చి కాళ్లతో తన్నుతూ.. తాకరాని చోట తాకుతూ అసభ్యంగా ప్రవర్తించారు. ఈ దుశ్చర్యను అడ్డుకోడానికి ప్రయత్నించిన స్థానికులపై పచ్చమూకలు విరుచుకుపడ్డాయి. బాధితురాలు పొలమూరి రాజకుమారి 13 ఏళ్ల తన కుమారుడితో కలసి జీవిస్తోంది. కొన్నాళ్లు వలంటీరుగా పని చేసింది. పోలింగ్ రోజు ఓటర్లకు స్లిప్‌లు రాసిచ్చి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పని చేయడం అయ్యన్న పాత్రుడి అనుచరులకు మింగుడు పడలేదు. పోలింగ్ మర్నాడు బాధితురాలు అదే గ్రామంలో ఉన్న తన పుట్టింటికి వెళ్లింది. రాత్రి 10 గంటల సమయంలో టీడీపీకి చెందిన రెడ్డి రాజేష్, రెడ్డి సత్యసాయి, కామిరెడ్డి శివ, సుకల రాజేష్, పెట్ల గంగాధర్, అల్లు రాజు, వానపల్లి రాజేష్, సార్ల రఘు, నందిపల్లి బోయిల నాయుడు ఆమె ఇంటిని చుట్టుముట్టి తలుపులు బాదటంతో బయటకు వచ్చింది. రౌడీ మూకలు ఆమె మొబైల్‌ను లాక్కుని భౌతిక దాడికి పాల్పడ్డాయి. మెడలోని బంగారు గొలుసు లాక్కున్నారు. దీన్ని ప్రతిఘటించిన వృద్ధురాలు సీతమ్మ చెంపపై కొట్టి చెవి దుద్దులు లాక్కున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు 324, 506, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయ్యన్నపాత్రుడి అనుచరురాలు, జెడ్పీటీసీ సుకల రమణమ్మ తన అనుచరులను దాడికి పురిగొల్పినట్లు బాధితురాలు పేర్కొంది.

టీడీపీ గూండాగిరికి పోలీసుల వత్తాసు

- ఈసీ అసంబద్ధ నిర్ణయాలతోనే దాడులు, విధ్వంసం
- చంద్రబాబు, పురందేశ్వరి ఒత్తిడితో పోలీసు అధికారుల బదిలీ
- పథకం ప్రకారం ఆ ప్రాంతాల్లో పచ్చ మూకల స్వైర విహారం
- కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

2లో

హింసపై ఈసీ సీరియస్

- నేడు ఢిల్లీకి సీఎస్, డీజీపీ
- పోలింగ్‌కు ముందు ఆకస్మిక బదిలీలతో సమస్యలు ఉత్పన్నం
- కొన్ని చోట్ల పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించినట్లు ఎన్నికల పరిశీలకుల నివేదిక

3లో

పెత్తందార్లకు బుద్ధి చెప్పేలా ప్రజా తీర్పు

- పాజిటివ్ ఓట్ల సునామీతో జగనే మళ్లీ ముఖ్యమంత్రి
- మంత్రి మేరుగు నాగార్జున

5లో



సెన్సెక్స్ డౌట్!

ఓటింగ్ తగ్గుతుండటంతో ఇన్వెస్టర్లలో అలజడి

- బీజేపీకి ఈసారి సీట్లు భారీగా తగ్గొచ్చనే అంచనాలు
- సొంతంగా మేజిక్ ఫిగర్‌ను సాధిస్తుందా అన్న ఆందోళన
- విదేశీ ఇన్వెస్టర్ల రివర్స్ గేర్, నెలలో రూ.30 వేల కోట్లు వెనక్కి
- ఆల్‌టైమ్ గరిష్టాల నుంచి సెన్సెక్స్, నిఫ్టీ 3 శాతం మేర డౌన్
- ఫలితాల వరకూ ఒడిదుడుకులు ఉండొచ్చంటున్న విశ్లేషకులు

మళ్లీ వచ్చేది మోదీయే... ఈసారి ఎన్డీయే కూటమికి 400 పై చిలుకు సీట్లు పక్కా... బీజేపీకి కనీసం 370 సీట్లు ఖాయం... కమలనాథుల అంచనాలివి! తీరా ఎన్నికలు మొదలై ఒక్కో విడత పోలింగ్ ముగుస్తున్నకొద్దీ ఈ ఉత్సాహం మెల్లమెల్లగా నీరుగారుతోంది. నాలుగు విడతల్లోనూ పోలింగ్ గత ఎన్నికలతో పోలిస్తే తగ్గడంతో అధికార పార్టీలో కాస్త అలజడి మొదలైంది. ఇదే మూడ్ స్టాక్ మార్కెట్లోనూ ప్రతిబింబిస్తోంది. ఓటింగ్ తగ్గడంతో బీజేపీ సొంతంగా మేజిక్ ఫిగర్‌ను అందుకుంటుందో లేదోనన్న అనుమానాలు తలెత్తడంతో ఇన్వెస్టర్లలో విశ్వాసం దెబ్బతింది. రోజుకో కొత్త రికార్డులతో రంకెలేసిన బుల్ ఒక్కసారిగా రివర్స్ గేర్ వేసింది. ఎన్నికల 'వేడి'కి తికమకపడుతోంది. నిన్నమొన్నటిదాకా పెట్టుబడుల వరద పారించిన విదేశీ ఇన్వెస్టర్లు పాలోమంటూ అమ్మకాలకు తెగబడుతున్నారు. అయితే ఫలితాలపై అనిశ్చితి వల్లే సెంటిమెంట్‌పై ప్రభావం పడుతోందని, బీజేపీ మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఇన్వెస్టర్లు తరలివస్తారని నిపుణులు పేర్కొంటున్నారు.. - సాక్షి, నేషనల్ డెస్క్

> అధికార పక్షం గెలుపు అంచనాలు తప్పొచ్చనే ఆందోళనల వల్లే దేశీ ఈక్విటీ మార్కెట్లలో తీవ్ర ఒడిదుడుకులు వస్తున్నాయి. ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. బీజేపీకి సీట్లు భారీగా తగ్గినా, సొంతంగా మెజారిటీ రాకపోయినా, ఫలితాల రోజున మార్కెట్ నుంచి తీవ్ర ప్రతిస్పందన ఉండొచ్చు. ఫలితాలొచ్చేదాకా ఇదే అలజడి ఉంటుంది
> - మాధవీ అరోరా, ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ ముఖ్య ఆర్థికవేత్త

స్టాక్ మార్కెట్లో ఈసారి ఎన్నికల ముందస్తు ర్యాలీతో రికార్డుల మోత మోగింది. మోదీ 3.0పై నమ్మకానికి తోడు ఎన్డీయే సీట్ల సంఖ్య కూడా పెరుగుతుందన్న అంచనాలు దీనికి కారణం. అయితే, ఎన్నికల 'వేడి' జోరందుకుని, పోలింగ్ మొదలయ్యాక ఇన్వెస్టర్లలో నెమ్మదిగా నమ్మకం సడలుతూ వస్తోంది. ఇప్పటిదాకా పోలింగ్ పూర్తయిన నాలుగు విడతల్లోనూ గత ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ శాతం తగ్గడం దీనికి ఆజ్యం పోసింది. మండుటెండలు, పట్టణ ఓటర్ల నిరాసక్తత వంటి కారణాలు ఎన్నున్నా ... ఓటింగ్ పడిపోవడంతో ఫలితాల్లో బీజేపీ బంపర్ విక్టరీపై అనుమానాలు ఇన్వెస్టర్లలో గుబులు పుట్టిస్తున్నాయి. ఇటీవలే సెన్సెక్స్ (75,111 పాయింట్లు), నిఫ్టీ (22,795 పాయింట్లు) కొత్త ఆల్‌టైం గరిష్టాలను తాకిన తర్వాత భారీగానే క్షీణించాయి. గడచిన నెల రోజుల్లో సూచీలు దాదాపు 3 శాతం పైగానే పడటం దీనికి అద్దం పడుతోంది. గత ఎన్నికల్లో తొలి విడతల్లో పోలింగ్ తగ్గినా, క్రమంగా పుంజుకుంది. దాంతో మొత్తమ్మీద రికార్డు స్థాయిలో 67.4 శాతం ఓటింగ్ జరిగింది. బీజేపీ సొంత బలం కూడా 282 నుంచి 303 లోక్‌సభ స్థానాలకు ఎగబాకింది. ఈసారి మాత్రం తొలి విడత నుంచే ఓటింగ్ క్రమంగా తగ్గుముఖం పడుతూ వస్తోంది. మిగతా 3 విడతల్లోనూ ఇలాగే మందకొడిగా జరిగితే మొత్తం ఓటింగ్ గతం కంటే 2 నుంచి 3 శాతం తగ్గేలా కన్పిస్తోంది.

2004లో 20% క్రాష్

ఎన్నికల ముందస్తు పరిస్థితులతో సంబంధం లేకుండా గత నాలుగు ఎన్నికల్లోనూ ఫలితాల తర్వాత సెన్సెక్స్, నిఫ్టీ భారీ లాభాలనే అందించాయి. అయితే 2004 ఎన్నికల్లో వాజ్‌పేయి సర్కారు అనూహ్య ఓటమి చవిచూడటం, హంగ్ కారణంగా ఫలితాల తర్వాత 20 శాతం మార్కెట్ క్రాష్ అయింది! కానీ మన్మోహన్ సింగ్ ప్రధానిగా యూపీఏ ప్రభుత్వం కొలువుదీరాక మార్కెట్ విశ్వాసం పుంజుకుంది. మిగతా ఏడాది కాలంలో రాబడులు దండిగానే వచ్చాయి. 2009 ఫలితాల తర్వాత మే 18 నుంచి డిసెంబర్ వరకు 31 వరకు సెన్సెక్స్, నిఫ్టీ ఏకంగా 40 శాతం దూసుకెళ్లడం విశేషం. ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు జోరుకు తోడు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల వరద, ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అమెరికాలో సహాయక ప్యాకేజీలు కూడా దోహదం చేశాయి. 2019 ఎన్నికల తర్వాత మాత్రం మార్కెట్లు ఏమంత పెద్దగా పెరగలేదు. ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి, అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, బలహీన వృద్ధి రేటు వంటి ప్రభావాలతో 4 నుంచి 5 శాతం మాత్రమే రాబడులొచ్చాయి.

విదేశీ ఇన్వెస్టర్లు పీఛే ముడ్..

ఓటింగ్ శాతం తగ్గుతుండటం, ఎన్నికల ఫలితాలపై అనిశ్చితి నెలకొనడంతో విదేశీ ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)లో కూడా ఆందోళన మొదలైంది. మన ఈక్విటీ మార్కెట్లలో గత నెలన్నరలో రూ.30 వేల కోట్లకు పైగా విలువైన షేర్లను అమ్మేయడం దీనికి నిదర్శనం. మార్కెట్లు భారీగా పడటానికి ఎఫ్‌పీఐల విక్రయాలే కీలకంగా నిలుస్తున్నాయి. 2023లో విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) ఏకంగా రూ.1.77 లక్షల కోట్లను దేశీ మార్కెట్లో కుమ్మరించి రికార్డులు బద్దలుకొట్టారు. అంతేకాదు, ఇందులో దాదాపు మూడో వంతు (రూ.58 వేల కోట్లు) ఒక్క డిసెంబర్‌లోనే ఇన్వెస్ట్ చేయడం విశేషం. దీనికి తోడు దేశీ ఇన్వెస్టర్లు, ఫండ్స్ జోరుతో బుల్ రంకెలేసింది. గతేడాది సెన్సెక్స్, నిఫ్టీ 20 శాతం రాబడులు అందించాయి. కార్పొరేట్ కంపెనీల లాభాలు పుంజుకోవడం, ప్రభుత్వ పెట్టుబడుల జోరు, స్థూల ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉండటం, వృద్ధి రేటు పుంజుకోవడం, సుస్థిర ప్రభుత్వం, స్థిరమైన పాలసీలు తదితర కారణాలతో విదేశీ ఇన్వెస్టర్లకు భారత్ ఆకర్షణీయ గమ్యస్థానంగా నిలుస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల విషయానికొస్తే, 2014లో ఎన్నికలు జరిగిన ఏప్రిల్-మే నెలల్లో విదేశీ ఇన్వెస్టర్లు రూ.23,607 కోట్ల విలువైన షేర్లు కొన్నారు. 2019 ఇదే కాలంలో రూ.29,113 కోట్లు దేశీ మార్కెట్లో కుమ్మరించారు. దీంతో 2019లో నాలుగో దశ పోలింగ్ ముగిసే నాటికి నెల రోజుల్లో సెన్సెక్స్ 3.7 శాతం, నిఫ్టీ 2.2 శాతం చొప్పున ఎగబాకాయి. ఈసారి మాత్రం ట్రెండ్ దీనికి పూర్తి భిన్నంగా ఉంది. ఒకపక్క విదేశీ ఇన్వెస్టర్లు తిరోగమన బాట పట్టగా.. దేశీయంగానూ ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తుండటం మార్కెట్‌కు ప్రతికూలంగా మారింది.

విదేశీ మార్కెట్లు రయ్ రయ్

ఉక్రెయిన్-రష్యా యుద్ధం, మధ్య ప్రాచ్యంలో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతల వంటి భౌగోళిక రాజకీయ అనిశ్చితుల ప్రభావం కంటే, ఎన్నికల ప్రభావమే మన మార్కెట్లో ప్రధానంగా కనిపిస్తోంది. విదేశీ మార్కెట్లు గత నెల రోజుల్లో భారీగా పెరిగినప్పటికీ.. మన సూచీలు ఆ స్థాయిలో పెరగకపోగా, 3 శాతం మేర పడిపోవడం దీనికి నిదర్శనం. గత నెల రోజుల వ్యవధిలో హాంకాంగ్ హాంగ్‌సెంగ్ ఇండెక్స్ ఏకంగా 15.2 శాతం జంప్ చేసింది. బ్రిటన్ ఎఫ్‌టీఎస్‌ఈ సూచీ 6 శాతం, యూఎస్ డోజోన్స్ 4.7 శాతం, జర్మనీ డాక్స్ సూచీ 4.1 శాతం, చైనా షాంఘై ఇండెక్స్ 3 శాతం చొప్పున ఎగబాకాయి. ''ఎన్నికల ఫలితాలపై అనుమానంతోనే విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాల బాట పట్టారు. ఓటింగ్ శాతం భారీగా తగ్గితే, బీజేపీ అంచనాలు తారుమారు కావచ్చు. ఆ పార్టీ సాధించే సీట్లు గణనీయంగా తగ్గే అవకాశముంది. మిగతా విడతల ఓటింగ్‌పై ఇన్వెస్టర్లు దృష్టి సారిస్తారు. తదనుగుణంగానే మార్కెట్ల గమనం ఉంటుంది' అని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అభిప్రాయపడ్డారు.

మధువాల మద్దతెవరికో!

బన్‌గావ్‌లో పోరు ఆసక్తికరం బీజేపీ, టీఎంసీ హోరాహోరీ

బన్‌గావ్. పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ సరిహద్దులోని లోక్‌సభ స్థానం. ఈ ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంలో మధువాల ప్రాబల్యం ఎక్కువ. ఇక్కడ పార్టీల గెలుపోటములను నిర్ణయించేది వాళ్లే. దాంతో బీజేపీ, తృణమూల్ రెండూ మధువా సామాజిక వర్గానికి చెందిన వారినే బరిలోకి దించాయి. గత ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో గెలుపొందిన శంతను కుమార్ బీజేపీ నుంచి మళ్లీ పోటీ చేస్తున్నారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ నుంచి బిశ్వజిత్ దాస్ రంగంలో ఉన్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్


బిశ్వజిత్ దాస్


శంతను కుమార్

బన్‌గావ్ లోక్‌సభ స్థానం 2009లో ఏర్పడింది. స్వాతంత్ర్యానంతరం, 1971లో బంగ్లాదేశ్ విమోచన యుద్ధ సమయంలో హిందూ శరణార్థులు భారీగా బన్‌గావ్ ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డారు. వీరిలో అత్యధికులు మధువాలే. బన్‌గావ్ ఓటర్లలో 67 శాతం దాకా వాళ్లే ఉన్నారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) నేపథ్యంలో వీరు సహజంగానే బీజేపీకి మద్దతిస్తున్నారు. బన్‌గావ్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఆరు బీజేపీ చేతిలోనే ఉన్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని మోదీ బన్‌గావ్ నుంచి బెంగాల్ ప్రచారాన్ని ప్రారంభించారు. మధువా సామాజికవర్గానికి పౌరసత్వం ఇస్తామని హామీ ఇచ్చారు. దాంతో వారి ఓట్లు అత్యధికంగా బీజేపీకే పడ్డాయి. అలా ఇక్కడ తొలిసారి బీజేపీ విజయం సాధించింది. శంతను లక్షకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచి కేంద్ర నౌకాయాన శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో కూడా బన్‌గావ్‌లో సీఏఏ ప్రధాన ఎన్నికల అంశంగా మారింది. సీఏఏ చట్టాన్ని అమల్లోకి తెస్తూ ఎన్నికల ముందు కేంద్రం నోటిఫికేషన్ జారీ చేయడం తెలిసిందే. అయితే ఆన్‌లైన్ దరఖాస్తుల్లో బంగ్లాదేశ్‌లో ఉన్నప్పటి చిరునామా, నివాస పత్రాల వివరాలను చాలామంది సమర్పించలేదు. ఇది సమస్యలకు దారి తీయడంపై ఇక్కడి మధువాలు అసంతృప్తితో ఉన్నారు.

తప్పుదారి పట్టిస్తున్నారు: టీఎంసీ

సీఏఏను తృణమూల్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది మధువా వర్గాన్ని తప్పుదోవ పట్టించేందుకు బీజేపీ చేస్తున్న కుట్రగా అభివర్ణిస్తోంది. మధువాలు ఇప్పటికే భారతీయులని, వారికి ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు ఉన్నాయని తృణమూల్ అధినేత్రి మమత అంటున్నారు. ''ఈ దేశ పౌరులు కాకుంటే ఇన్నేళ్లు వారు ఓటెలా వేశారు? ప్రజాప్రతినిధులుగా పార్లమెంటుకు, బెంగాల్ అసెంబ్లీకి ఎలా వెళ్లారు?'' అని ప్రశ్నిస్తున్నారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో బన్‌గావ్‌లో ఘోర పరాజయం తర్వాత గతేడాది పంచాయతీ ఎన్నికల్లో తృణమూల్ దుమ్ము రేపింది.

బోరో కుటుంబానిదే ఆధిపత్యం...

బన్‌గావ్ రాజకీయాలను బోరో మా (బీనాపాణి దేవి) కుటుంబమే శాసిస్తోంది. 1947లో బీనాపాణి దేవి, ఆమె భర్త ప్రమథ్ రంజన్ ఠాకూర్ బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చి దక్షిణ కోల్‌కతాలోని బల్లిగంజ్‌లో స్థిరపడ్డారు. ప్రమథ్ నామశూద్ర (ఎస్సీ) కమ్యూనిటీకి చెందిన ప్రముఖ నాయకుడు. మధువాల హక్కుల కోసం పోరాడారు. తమలా వలస వచ్చిన వారికి ఆశ్రయం కోసం స్థానిక ఠాకూర్‌నగర్లో భూమి కొనుగోలు చేశారు. 'ఠాకూర్బరీ ల్యాండ్ అండ్ ఇండస్ట్రీస్' పేరుతో కొన్న ఆ స్థలంలో శరణార్థుల కోసం తొలి ప్రైవేట్ కాలనీ నిర్మించారు. ప్రమథ్ 1962లో కాంగ్రెస్ అభ్యర్థిగా హన్స్‌ఖాలీ అసెంబ్లీ స్థానం నుంచి గెలిచారు. కుమారుడు కపిల్ కృష్ణ ఠాకూర్ 2014లో ఎంపీ అయ్యారు. ఆయన మరణానంతరం భార్య మమత 2015 ఉప ఎన్నికలో గెలిచారు. చిన్న కుమారుడు మంజుల్ కృష్ణ ఠాకూర్ టీఎంసీ ఎమ్మెల్యేగా చేశారు. తర్వాత బీజేపీలో చేరారు. బీజేపీ అభ్యర్థి శంతను ఆయన రెండో కుమారుడే.

బడుగులపై బరితెగింపు

నర్సీపట్నంలో దుశ్శాసన పర్వం.. కృష్ణా జిల్లాలో దమనకాండ

సాక్షి, అమరావతి/విశాఖ సిటీ/ ఉంగుటూరు, నెట్‌వర్క్‌:

'ఈసీ' ఉదాసీనతతో పేట్రేగుతున్న పచ్చ ముఠాలు రాష్ట్రవ్యాప్తంగా భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ మహిళలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీలపై పాశవికంగా దాడులకు తెగబడుతున్నాయి. గ్రామాల్లో హింసను ప్రేరేపిస్తూ దమనకాండకు తెర తీశాయి. అనకాపల్లి జిల్లాలో టీడీపీ నేత అయ్యన్నపాత్రుడి అనుచరులు ఒంటరి మహిళపై కీచక పర్వానికి తెగబడగా కృష్ణా జిల్లా ఉంగుటూరులో ఫ్యాన్‌కు ఓటేసిందనే కక్షతో ఓ మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి హత్యాయత్నానికి తెగబడ్డాయి. ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీకి మద్దతుగా పని చేయడమే ఈ అక్కచెల్లెమ్మలు చేసిన నేరం! తాజాగా పల్నాడులోనూ టీడీపీ మూకల దాష్టీకాలకు బడుగు, బలహీన వర్గాలు ఓ రాత్రంతా దేవాలయంలో తలదాచుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. ఓట్ల లెక్కింపు వరకు విధ్వంసకాండ కొనసాగించే ప్రణాళికను టీడీపీ మూకలు అమలు చేస్తున్నాయి. ఓట్ల లెక్కింపు చేపట్టే జూన్‌ 4వరకు రాష్ట్రం రావణకాష్టంగా రగులుతూ ఉండాలని టీడీపీ నేతలు, కార్యకర్తలకు చంద్రబాబు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. దీనికనుగుణంగానే టీడీపీ గూండాలు, రౌడీ మూకలు స్వైర విహారం చేస్తుండటంతో ఏపీలో భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన ఎన్నికల కమిషన్‌ ఈ దాడుల పట్ల నిర్లిప్తంగా వ్యవహరించడం పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. సమస్యాత్మక జిల్లాల్లో బదిలీలపై వచ్చిన పోలీసు అధికారులు పచ్చమూకల దౌర్జన్యకాండకు కొమ్ము కాస్తున్నారు.

ఫ్యాన్‌కు ఓటేసిందని.. మహిళను ట్రాక్టర్‌తో తొక్కించబోయాడు!

వైఎస్సార్‌ సీపీకి ఓటు వేసిందని కక్షగట్టి ఓ మహిళను టీడీపీ నాయకుడు ట్రాక్టర్‌తో తొక్కించబోగా తృటిలో తప్పించుకుంది. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన వేముల సంధ్యారాణి వైఎస్సార్‌ సీపీకి ఓటు వేసిందని టీడీపీ నాయకుడు ఏడుకొండలు కక్ష పెంచుకున్నాడు. బుధవారం ఉద్దేశపూర్వకంగా ఆమెతో ఘర్షణ పడి తన ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని గన్నవరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంశీమోహన్‌ పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బెదిరించి.. భయపెట్టి


టీడీపీ దాడిలో గాయపడి బంగారు చెవి దుద్దులు కోల్పోయిన వృద్ధురాలు

ప్రజాబలంతో టీడీపీ నెగ్గలేదని స్పష్టం కావడంతో పోలింగ్‌ రోజు రాష్ట్రవ్యాప్తంగా అవ్వా తాతలు, మహిళలను బెదిరిస్తూ దాడులతో హడలెత్తించే కుట్రలను చంద్రబాబు అమలు చేశారు. పోలింగ్‌ రోజు మొదలైన ఈ విధ్వంస కాండ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కల్పించేందుకు పథకాలను రచిస్తున్నారు. వైఎస్సార్‌ సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు కొనసాగిస్తూ గ్రామాల్లో లేకుండా చేయాలని, జూన్‌ 4న కౌంటింగ్‌ కేంద్రాల వద్దకు సైతం రాకుండా భయోత్పాతం సృష్టించాలని చంద్రబాబు ఎత్తుగడలు వేస్తున్నారు.

పల్నాడులో చల్లారని ఉద్రిక్తతలు

ఎన్నికలు ముగిసి మూడు రోజులైనా పల్నాడులో ఉద్రిక్తతలు చల్లబడలేదు. టీడీపీ మూక దాడులతో ఎస్టీ, బీసీ వర్గాలు గ్రామాలు వీడి దూరంగా తలదాచుకుంటున్నాయి. పోలింగ్‌ రోజు రాత్రి అరాచక ముఠాల దాడులతో మాచవరం మండలం కొత్త గణేశునిపాడులో గ్రామం వదిలి వెళ్లిన ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఇంతవరకు స్వగ్రామాలకు చేరుకోలేదు. పల్నాడులో 144 సెక్షన్‌తో దుకాణాలు మూతబడ్డాయి. మాచర్ల, గురజాల, నరసరావుపేట ఎమ్మెల్యేలు హౌస్‌ అరెస్ట్‌లో ఉన్నారు. దాచేపల్లి మండలం మాదినపాడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త దొండేటి ఆదిరెడ్డిపై టీడీపీ నేతలు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేయడంతో గాయపడ్డాడు. తాడిపత్రిలో పట్టణాన్ని వీడి వెళ్లిన ఎమ్మెల్యే కేతిరెడ్డి నివాసంలో చొరబడ్డ పోలీసులు తలుపులు బద్దలు కొట్టారు. కంప్యూటర్లను పగులగొట్టారు.

పోలీసుల దన్ను... ఈసీ ఉదాసీనత

టీడీపీ మూకలు బరితెగించి దాడులు, విధ్వంసానికి పాల్పడుతున్నా పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం విస్మయపరుస్తోంది. పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో డీఐజీ నుంచి ఎస్సై వరకూ పోలీసు అధికారులను పోలింగ్‌కు ముందు ఈసీ హఠాత్తుగా బదిలీ చేసింది. వారి స్థానంలో క్షేత్రస్థాయి పరిస్థితులపై ఏమాత్రం అవగాహనలేని అధికారులను నియమించింది. శాంతిభద్రతల పరిరక్షణలో కీలకమైన డీజీపీ, ఇంటెలిజెన్స్‌ డీజీలను కూడా ఈసీ బదిలీ చేసింది. చంద్రబాబు ఆదేశాలతో పురందేశ్వరి అందచేసిన జాబితాలో సూచించిన వారినే నియమించింది. అదే దన్నుగా టీడీపీ గూండాలు చెలరేగిపోతున్నారు. ఈసీ టీడీపీకి అనుకూలంగా ఉందనే సంకేతాలు వెలువడటంతో విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయి. అధికార యంత్రాంగాన్ని నడిపిస్తున్న ఈసీ ఈ దాడుల పట్ల బుధవారం వరకూ స్పందించలేదు. ఎస్పీలు, డీఐజీలకు ఆదేశాలు ఇవ్వలేదు. డీజీపీ, ఇంటెలిజెన్స్‌ చీఫ్‌లతో చర్చించలేదు. ఈసీ, పోలీసుల తీరుపై వైఎస్సార్‌ సీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ గట్టిగా నిలదీయడంతో ఇక తప్పదన్నట్లుగా సమీక్షకు ఉపక్రమించింది.

ఓటేసుకునే స్వేచ్ఛ కూడా లేదా?

- టీడీపీకి ఓటేయకుంటే ఊరు వదిలి పోవాలా...
- ఆవేదన వ్యక్తం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీలు
- వైఎస్సార్‌సీపీకి ఓటేయడం మేం చేసిన తప్పా?
- భయాందోళనలోనే కొత్తగణేశునిపాడు ప్రజలు

సాక్షి, నరసరావుపేట: 'స్వతంత్రంగా ఓటేసుకునే హక్కు ఉండకూడదా... టీడీపీకి ఓటేయకుంటే గ్రామాలు విడిచిపెట్టి వెళ్లిపోవాలా... వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపడం నేరమా... మమ్మల్ని పోలీసులు ఎందుకు కాపాడటం లేదు...' ఇదీ ఇప్పుడు గురజాల నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ప్రజల ఆవేదన. సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటేయలేదన్న అక్కసుతో మాచవరం మండలం కొత్త గణేశునిపాడులో టీడీపీ గూండాలు సోమవారం అరాచకం సృష్టించిన విషయం తెలిసిందే. ప్రాణాలను కాపాడుకునే క్రమంలో ఊరొదిలి వేరేచోట బిక్కుబిక్కుమంటూ బతుకుతూ 'సాక్షి'తో తమ గోడును వెళ్లబోసుకున్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటేశామన్న కక్షతో సోమవారం రాత్రి 7 గంటల నుంచి సుమారు ఐదు గంటల పాటు గ్రామంలో అరాచకం సృష్టించారనీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలే లక్ష్యంగా వారు దాడిచేశారని తెలిపారు. ఇంత జరుగుతున్నా పోలీసులు తమకు రక్షణ కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం



ఎస్టీ వాడివి మాకు వ్యతిరేకంగా ఓటు వేస్తావా ఎంత ధైర్యంరా అంటూ మాపై టీడీపీ వాళ్లు దాడి చేశారు. భయంతో పొలాల్లోకి పరుగులు తీశాం. ఇళ్లల్లోకి చొరబడి వస్తువులు, ఆటోని ధ్వంసం చేశారు. ఆడవాళ్లు, పిల్లలు అనే కనికరం లేకుండా బూతులు తిడుతూ మావాళ్లను కొట్టారు. దిక్కుతోచని స్థితిలో బంధువుల వద్ద తలదాచుకున్నాం.

– కాంద్రకుంట హనుమంతు

ఊళ్లో ఉంటే చంపేస్తామంటున్నారు



జగనన్న పాలనలో మాకు మంచి జరిగింది కాబట్టే వైఎస్సార్‌సీపీకి ఓటేశాం. అందుకే మాపై కక్ష పెంచుకున్నారు. ఊళ్లో ఉంటే చంపుతామని బెదిరించారు. పోలీసులే రక్షణ కల్పించాలి.

– దేవరపు రత్తయ్య బీసీ రజక

టీడీపీకి ఓటేయకపోతే బతకనివ్వరా



పొలం పనులు చేసుకుంటూ బతికేవాళ్లం. మా జీవితాలు మారుస్తున్నాడన్న అభిమానంతో జగనన్నకి ఓటేశాం. దానికే మాపై దాడిచేసి, కులం పేరుతో దూషించారు. మా జేసీబీ, ట్రాక్టర్, బైకులు ధ్వంసం చేశారు. ఊళ్లో ఉంటే చంపుతారని భయమేసి భార్యా, పిల్లలతో పక్క ఊళ్లో ఉంటున్నాం. టీడీపీకి ఓటేయకపోతే ఊరొదిలి పోవాలా...

– మేకల హనుమంతు, కొత్తగణేశునిపాడు

వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌పై టీడీపీ మూకల హత్యాయత్నం

వాకింగ్‌కు వెళ్లొస్తుండగా బీర్‌ బాటిళ్లతో దాడి

బండరాయితో తలపై మోది చంపే యత్నం.. తీవ్రగాయాలతో ఆస్పత్రికి..

మైదుకూరు: పోలింగ్‌ రోజు ఏజెంట్‌గా కూర్చున్నాడనే అక్కసుతో వైఎస్సార్‌ జిల్లా మైదుకూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త భూమిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డిపై బుధవారం సాయంత్రం టీడీపీ వర్గీయులు హత్యాయత్నం చేశారు. బాధితుడి కథనం ప్రకారం... చాపాడు మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన భూమిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డి సమగ్ర శిక్ష అభియాన్‌లో ఏఈగా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన మైదుకూరులోని బద్వేలు రోడ్డులో నివాసముంటున్నారు. ఈ ఎన్నికల్లో స్వగ్రామం విశ్వనాథపురంలో పోలింగ్‌ సందర్భంగా సోమవారం వైఎస్సార్‌ సీపీ తరఫున ఏజెంట్‌గా కూర్చున్నారు. అంతకు ముందు రోజు టీడీపీ వర్గీయులు ఏజెంట్‌గా కూర్చోవద్దని బెదిరించారు. వారి బెదిరింపులకు తలొగ్గక ఆయన వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌గా కూర్చున్నారు. ఆ కడుపుమంటతో టీడీపీ వర్గీయులు చంద్ర ఓబుళరెడ్డి ప్రొద్దుటూరు రోడ్డులోని బైపాస్‌ వద్దకు రోజూ వాకింగ్‌కు వస్తుంటారని తెలుసుకుని.. బుధవారం సాయంత్రం అదే రోడ్డులోని ఏవీఆర్‌ స్కూల్‌ వద్ద కాపు కాశారు. వాకింగ్‌ ముగించుకుని వస్తున్న చంద్ర ఓబుళరెడ్డిపై విశ్వనాథపురం గ్రామానికి చెందిన కార్తీక్‌ రెడ్డి, ఇల్లూరు సుబ్బారెడ్డి, బొచ్చు సుబ్బారెడ్డి, మరో ముగ్గురు దాడి చేసి బీర్‌ బాటిళ్లతో తలపై కొట్టారు. 'చెప్పినా వినకుండా ఏజెంట్‌గా కూర్చుంటావా...ఇప్పుడే నిన్ను చంపుతాం..' అంటూ కేకలు వేశారు. వారి దెబ్బలకు తీవ్రంగా గాయపడిన చంద్ర ఓబుళరెడ్డి స్పృహ తప్పి కింద పడిపోయాడు. అయినా విడిచి పెట్టకుండా నిందితుల్లో కొందరు బండరాయిని ఎత్తి తలపై మోదేందుకు ప్రయత్నించారు. సమీపంలో ఉన్న కొందరు మహిళలు గట్టిగా కేకలు వేయడంతో నిందితులు అతన్ని వదిలేసి తమ వెంట తెచ్చుకున్న బైకులపై పరారయ్యారు. తలపై తీవ్ర గాయాలైన చంద్ర ఓబుళరెడ్డిని మైదుకూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం తరలించారు. సంఘటన గురించి తెలియగానే ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రభుత్వాస్పత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. దాడి గురించి అడిగి తెలుసుకున్నారు. పోలింగ్‌కు ముందు రోజే టీడీపీ వారు బెదిరించారని బాధితుని భార్య, కుమారుడు మధుసూదన్‌ రెడ్డి ఎమ్మెల్యేకు తెలిపారు. పథకం ప్రకారమే దాడి చేసి హత్యాప్రయత్నం చేశారని వారు చెప్పారు. దాడి సమాచారం తెలియగానే చాపాడు ఎంపీపీ తెలిదేల లక్ష్మయ్య, మండల నాయకులు, మైదుకూరు సింగిల్‌ విండో చైర్మన్‌ మూలె సుధాకర్‌రెడ్డి, ఖాజీపేట వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మైదుకూరు మున్సిపల్‌ కోఆప్షన్‌ సభ్యుడు ఎంఆర్‌ఎఫ్‌ సుబ్బయ్య తదితరులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మైదుకూరు డీఎస్పీ వెంకటేశులు, రూరల్, అర్బన్‌ సీఐలు శ్రీనాథరెడ్డి, ఏపీ మస్తాన్‌ ఆస్పత్రికి వచ్చి చంద్ర ఓబుళరెడ్డితో మాట్లాడారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు.


ఓబుళరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

జేసీ ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డిపై కేసులు నమోదు

మరికొందరిపైన కూడా..

తాడిపత్రి అర్బన్‌: అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపల్‌ చైర్మన్, టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డితో పాటు మరికొందరిపై తాడిపత్రి అర్బన్‌ పోలీసులు హత్యాయత్నం, ఇతర కేసులు నమోదు చేశారు. వీరు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హత్యకు కుట్ర పన్నినట్లు వైఎస్సార్‌సీపీ నేత రవితేజారెడ్డి ఫిర్యాదు చేశారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డి వారి అనుచరులు కాకర్ల రంగనాథ్, కాకర్ల జగన్నాథ్, కాకర్ల రంగనాయకులు, జగదీశ్వర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, ఎస్వీ రవీంద్రారెడ్డి, సూర్యముని, కౌన్సిలర్లు మల్లికార్జున, విజయ్‌కుమార్, ఇండిపెండెంట్‌ అభ్యర్థి ఆర్‌.చంద్రఓబుళరెడ్డి, చిక్కేపల్లి ఖాదర్, శివ, ఎం.షబ్బీర్‌బాషా అలియాస్‌ గోరా, గండికోట కార్తీక్, ముచ్చుకోట సుదర్శన్, మహబూబ్‌బాషా, పరమేష్, పొట్టి వేణు, జనసేన పార్టీ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, చింబిలి ప్రసాద్, బీజేపీ గంగాధర్, కమలమ్మ, వెన్నెపూస మల్లికార్జునరెడ్డి, ముచ్చుకోట లోకనాథరెడ్డితో పాటు సుమారు 500 మందితో కలిసి ఎమ్మెల్యే పెద్దారెడ్డిని హత్యచేసేందుకు యత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అందులో భాగంగానే ఎమ్మెల్యే ఇంటిపై దాడికి దిగారని తెలిపారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు జేసీ ప్రభాకర్‌రెడ్డి, జేసీ అస్మిత్‌రెడ్డితో పాటు మరికొంతమందిపై కేసు నమోదు చేశారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డి, వారి అనుచరులు బి.జగదీశ్వర్‌రెడ్డి, ఎస్వీ రవీంద్రారెడ్డి, కాకర్ల జయుడు, సూర్యముని, బార్‌బాబు మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగేశ్వర్‌రెడ్డిపై అశోక్‌పిల్లర్‌ వద్ద రాడ్లతో దాడిచేసి హత్యాయత్నం చేసినట్లు కేసు నమోదైంది. తీవ్రంగా గాయపడిన నాగేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలింగ్‌ సందర్భంగా ఈనెల 13న తాడిపత్రిలోని ఓంశాంతి నగర్‌లో జరిగిన దాడులకు సంబంధించి జేసీ అస్మిత్‌రెడ్డి, జేసీ ప్రభాకర్‌రెడ్డి, జేసీ పవన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిలపై అర్బన్‌ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంట్లో పోలీసుల విధ్వంసం

తాడిపత్రిలో వివాదాస్పదమైన పోలీసుల తీరు.. ఎమ్మెల్యే ఇంట్లో లేని సమయంలో ఘటన

- పని మనుషులను బెదిరించి.. కంప్యూటర్లు, ఫర్నిచర్‌ ధ్వంసం
- దాడులతో సంబంధం లేని 30 మంది వైఎస్సార్‌సీపీ నేతల అరెస్టు
- టీడీపీ నేతల వైపు కన్నెత్తి చూడలేదు


ఎమ్మెల్యే పెద్దారెడ్డి నివాసంలో పోలీసులు ధ్వంసం చేసిన కంప్యూటర్‌


టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి ముందు భారీగా మోహరించిన పోలీసు బలగాలు

తాడిపత్రి అర్బన్‌: చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. మంగళవారం జరిగిన అల్లర్ల అనంతరం పోలీసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఆయనతో పాటు కుటుంబ సభ్యులు కూడా ఇంట్లోని గదులకు తాళం వేసుకుని వెళ్లిపోయారు. అయితే మంగళవారం అర్ధరాత్రి దాటాక రెండు గంటల సమయంలో ఎవరూ ఊహించని రీతిలో పోలీసులు ఆయన ఇంట్లోకి చొరబడ్డారు. అక్కడ నిద్రిస్తున్న పని మనుషులను నిద్రలేపి ఇంటి తలుపులు తీయాలని బలవంతం చేశారు. తమ వద్ద తాళాలు లేవని చెప్పడంతో పోలీసులు అక్కడే ఉన్న వంట చేసే కబ్‌గిరి(పెద్ద పొడవైన గరిటె)తో ఇంటి తలుపులను బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లోని సీసీ కెమెరాలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. కంప్యూటర్లను పగులగొట్టి హార్డ్‌ డిస్క్‌లను మాయం చేశారు. కాన్ఫరెన్స్‌ హాలు తలుపులు బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించి అక్కడున్న ఫ్యాన్, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులు

పోలింగ్‌ రోజు నుంచి తాడిపత్రి పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అదనపు ఎస్పీ రామకృష్ణ టీడీపీ గూండాలను రెచ్చగొడుతూ వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్‌ చేస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మీడియా ఎదుట మండిపడ్డారు. పోలింగ్‌ రోజున కూడా టీడీపీ నేతల వైపు వారు కన్నెత్తి చూడకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులను టార్గెట్‌ చేశారు. 144 సెక్షన్‌ అమలులో ఉన్నప్పటికీ టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి, ఆయన తండ్రి జేసీ ప్రభాకర్‌రెడ్డి వందలాది మంది అనుచరులను వెంటేసుకుని రోడ్లపై హల్‌చల్‌ చేసినా వారించలేదు. ప్రభాకర్‌రెడ్డి అల్లుడు దీపక్‌ రెడ్డి తన వాహనానికి ఎమ్మెల్యే స్టిక్కర్‌ అతికించుకుని తిరిగినా పోలీసులు ప్రశ్నించలేదు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి లక్ష్యంగా టీడీపీ అల్లరి మూకలు దాడులకు పాల్పడుతున్నా ఆయన ఇంటి ముందు బందోబస్తు ఏర్పాటు చేయలేదు. మంగళవారం ఘర్షణల అనంతరం డీఐజీతో సహా రాయలసీమ జిల్లాల నుంచి పోలీసు బలగాలు పెద్ద ఎత్తున తాడిపత్రికి చేరుకున్నాయి. కానీ ఎమ్మెల్యే ఇంటి ముందు మాత్రం నామమాత్రపు బందోబస్తు ఏర్పాటు చేసి, టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసం వద్ద మాత్రం పెద్ద ఎత్తున బలగాలను మోహరింపజేశారు. అంతేగాకుండా సోమ, మంగళవారాల్లో జరిగిన దాడులతో ఎటువంటి సంబంధం లేని వైఎస్సార్‌సీపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేశారు. వారిని మంగళవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుని ఎఫ్‌ఐఆర్‌ కూడా నమోదు చేయకుండానే పోలీస్‌ స్టేషన్‌లో నిర్బంధించారు. మరికొందరిని కౌన్సెలింగ్‌ పేరిట ఇష్టారాజ్యంగా కొడుతున్నట్లు సమాచారం. తాడిపత్రి పోలీసుల ఏకపక్ష వైఖరి, తన ఇంట్లోకి చొరబడి విధ్వంసం సృష్టించడంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.

మీడియాపై ఎస్పీ ఆంక్షలు

తాడిపత్రిలో వరుసగా జరుగుతున్న సంఘటనలకు సంబంధించి న్యూస్‌ కవరేజీకి వెళ్లిన మీడియా ప్రతినిధులపై కూడా పోలీసులు ఆంక్షలు విధించారు. గొడవలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు చిత్రీకరించకూడదని సాక్షాత్తు జిల్లా ఎస్పీ అమిత్‌ బర్దర్‌ ఆంక్షలు విధించడం గమనార్హం. ఎమ్మెల్యే పెద్దారెడ్డి నివాస సమీపంలో అదనపు ఎస్పీ రామకృష్ణతో బందోబస్తుపై ఆయన సమీక్షిస్తుండగా ఫొటోలు తీస్తున్న ఓ విలేకరిపై ఆయన చిందులు తొక్కారు. సెల్‌ ఫోన్‌ తీసుకోండంటూ అక్కడే ఉన్న తన గన్‌మన్లను ఆదేశించారు.

టీడీపీ గూండాగిరికి పోలీసుల వత్తాసు

- ఈసీ అసంబద్ధ నిర్ణయాలతోనే దాడులు, విధ్వంసం
- చంద్రబాబు, పురందేశ్వరి ఒత్తిడితో పోలీసు అధికారుల బదిలీ
- పథకం ప్రకారం ఆ ప్రాంతాల్లో పచ్చ ముఠాల స్వైర విహారం
- తక్షణమే చర్యలు తీసుకోవాలని డీజీపీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు


డీజీపీ ఆఫీస్‌ ఎదుట మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు తదితరులు

సాక్షి, అమరావతి: యథేచ్ఛగా సాగుతున్న టీడీపీ శ్రేణుల దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాన్ని అరికట్టేందుకు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌ సీపీ డిమాండ్‌ చేసింది. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా పక్కా పన్నాగంతో జరుగుతున్న దాడులను డీజీపీ హరీశ్‌కుమార్‌ గుప్తా దృష్టికి తెచ్చింది. పార్టీ నేతలు అంబటి రాంబాబు, మేరుగు నాగార్జున, పేర్ని వెంకట్రామయ్య(నాని), లేళ్ల అప్పిరెడ్డి తదితరులు బుధవారం రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీని కలసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో టీడీపీ గూండాలు దాడులకు తెగబడిన 21 ఘటనలకు సంబంధించి పూర్తి ఆధారాలను అందచేశారు. ఎన్నికల షెడ్యూల్‌ ప్రకటించినప్పటి నుంచి టీడీపీ విధ్వంసం సృష్టించే పన్నాగాన్ని అమలు చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు శాంతియుతంగా వ్యవహరిస్తున్నా కవ్వింపు చర్యలకు పాల్పడుతూ దాడులకు దిగుతోందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హింసాత్మక ఘటనలపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి కారకులపై కఠిన చర్యలు చేపట్టి వీటికి అడ్డుకట్ట వేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నేతలు డీజీపీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు.

దౌర్జన్యాలకు కొమ్ముకాసిన పోలీసులు: అంబటి

టీడీపీ గూండాలు బరితెగించి దాడులకు పాల్పడుతుంటే పోలీసులు చోద్యం చూశారు. రాజకీయ ఒత్తిళ్లతో పోలీసు అధికారులను ఈసీ హఠాత్తుగా బదిలీ చేసింది. వారిని మార్చిన తరువాత కూడా హింసాత్మక సంఘటనలు యథేచ్ఛగా సాగుతున్నాయి. దీనికి ఈసీ ఏం సమాధానం చెబుతుంది? అవగాహనలేని డీజీపీ, డీఐజీలు, ఎస్పీలు, ఇతర అధికారులను నియమించడంతోనే హింసాత్మక సంఘటనలు జరుగుతున్నాయి. ఈసీ తీసుకున్న తప్పుడు నిర్ణయాలతో రాష్ట్రం రావణ కాష్టంలా మారింది. ఢిల్లీ నుంచి వచ్చిన ఆదేశాలు, పురందేశ్వరి సూచనల ప్రకారం ఈసీ అడ్డగోలుగా వ్యవహరించింది. అసలు పోలీసు వ్యవస్థ ఉందా? అనే సందేహం కలుగుతోంది. కొందరు పోలీసు అధికారులు టీడీపీతో కుమ్మక్కయ్యారు. టీడీపీ గూండాలు పోలింగ్‌ బూత్‌లలో దౌర్జన్యం చేస్తున్నా, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల ఇళ్లపై పడి దాడులు చేస్తున్నా పోలీసు యంత్రాంగం ఏమాత్రం అడ్డుకోలేకపోయింది. ఎన్నికలు సక్రమంగా నిర్వహించడంలో పోలీసు యంత్రాంగం విఫలమైంది. వైఎస్సార్‌సీపీ నేతలను హౌస్‌ అరెస్ట్‌లు చేసిన పోలీసులు టీడీపీ శ్రేణులు స్వైర విహారం చేసినా కన్నెత్తి చూడలేదు. నన్ను హౌస్‌ అరెస్ట్‌ చేసి నా ప్రత్యర్థిని మాత్రం యథేచ్ఛగా తిరగనిచ్చారు. నా నియోజకవర్గంలో రీపోలింగ్‌ అవసరం లేదని ఈసీ ఎలా చెబుతుంది? వెబ్‌ కెమెరా రికార్డింగ్‌లను పరిశీలించకుండా ఏకపక్షంగా నిర్ణయాన్ని ఎలా ప్రకటిస్తుంది? ఇందుకు ఈసీ సమాధానం చెప్పాలి.

దాడులు.. ఆపై కేసులు: పేర్ని నాని

టీడీపీ పక్కా పన్నాగంతో దాడులకు పురిగొల్పుతోంది. కర్రలు, కత్తులు, రాడ్లు చేతబట్టుకుని పచ్చ ముఠాలు దాడులకు పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. దీన్ని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై తిరిగి కేసులు బనాయించడం దారుణం. పోలింగ్‌ అనంతరం హింసకు పోలీసుల వైఫల్యమే కారణం. పల్నాడు ఎస్పీకి ఎన్నిసార్లు ఫోన్లు చేసినా పట్టించుకోలేదు. రిటైర్డ్‌ అధికారిని పోలీస్‌ పరిశీలకుడిగా ఈసీ నియమించడం ఏమిటి? ఆయనకు ఏం జవాబుదారీతనం ఉంటుంది? బీజేపీ, టీడీపీ నేతలకు సహకరించాలంటూ ఆయన పోలీసు అధికారులను బెదిరించారు. మా కార్యకర్తలపై హత్యాయత్నం కేసులు పెడుతున్నారు. పురందేశ్వరి చెప్పిన విధంగా పోలీసు అధికారులను మార్చిన చోటే హింసాత్మక సంఘటనలు జరుగుతున్నాయి. పక్కా కుట్రతో పోలీసు అధికారులను బదిలీ చేసి టీడీపీ, బీజేపీ, జనసేన విధ్వంసానికి పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. దీనికి పోలీసులతోపాటు ఈసీ కూడా సమాధానం చెప్పాలి. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల భద్రత కోసం ప్రజాస్వామ్యయుతంగా పోరాడతాం.

చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని ఈసీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

రాష్ట్రంలో హింస, దాడులు, అల్లర్లలో ప్రధాన ముద్దాయి చంద్రబాబేనని, ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్‌ చేసింది. మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, జోగి రమేష్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు పేర్ని నాని, నంబూరు శంకరరావు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి బుధవారం ఎన్నికల సంఘం కార్యాలయంలో ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌ మీనాను కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. గొడవలకు సంబంధించిన ఆధారాలు అందజేశారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ ఇటీవల చేసిన హింసాకాండపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ముఖ్యంగా పల్నాడులో ఉద్దేశపూర్వకంగా, ప్లాన్‌ ప్రకారం దాడులు చేశారని తెలిపారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, కూటమి పార్టీలకు కొమ్ముకాస్తున్నారని వారు వివరించారు.


ప్రధాన ఎన్నికల అధికారికి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతిలో 144 సెక్షన్‌ కొనసాగింపు

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలుంటాయని కలెక్టర్‌ హెచ్చరిక

తిరుపతి అర్బన్‌: శాంతి భద్రతలకు అత్యంత ప్రాధాన్యత కల్పించాల్సి ఉందని తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. బుధవారం ఆయన జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ పటేల్‌తో కలిసి శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని ఇంజనీరింగ్‌ కళాశాలలో ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్‌ రూమ్‌ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి అధికారులకు భద్రతా అంశాలపై పలు సూచనలు చేశారు. ఎన్నికల కోడ్‌ జూన్‌ 6 వరకు కొనసాగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 14వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 144 సెక్షన్‌ను విధించినట్లు చెప్పారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు 144 సెక్షన్‌ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల ముందే కాకుండా ఎన్నికల తర్వాత కూడా ప్రశాంతమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. అనవసరంగా వివాదాల జోలికి వెళ్లి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. 144 సెక్షన్‌ నేపథ్యంలో డ్రోన్లు ఎగుర వేస్తే చర్యలు తప్పవని, సభలు, సమావేశాలకు అనుమతి లేదని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలుంటాయన్నారు. పోలీసులు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా పెట్టారని తెలిపారు.


శ్రీపద్మావతి మహిళా వర్సిటీ పరిధిలోని ఇంజనీరింగ్‌ కళాశాల వద్ద ఎస్పీతో కలసి పరిశీలిస్తున్న కలెక్టర్‌

క్షయ నిరోధానికి టీకా

- నేటి నుంచి 12 జిల్లాల్లో పంపిణీ షురూ
- హైరిస్క్ కేసులను ఎంపిక చేసి వ్యాక్సినేషన్

సాక్షి, అమరావతి: ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే క్షయ (టీబీ) వ్యాధి నియంత్రణకు రాష్ట్ర వైద్య శాఖ పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోంది. కరోనా వ్యాప్తి సమయంలో అవలంబించిన టీటీటీ (ట్రేసింగ్, టెస్టింగ్, ట్రీట్‌మెంట్) విధానాన్ని టీబీ నియంత్రణలోనూ వినియోగిస్తోంది. కరోనా పరీక్షల తరహాలో వీలైనంత ఎక్కువ మందికి టీబీ పరీక్షలు చేస్తున్నారు. కాగా.. దేశంలో పెద్దలకు టీబీ నుంచి రక్షణ కోసం బాసిల్లస్ కాల్మెట్–గ్వెరిన్ (బీసీజీ) వ్యాక్సిన్ పంపిణీ చేయాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిర్ణయించింది. గురువారం నుంచి రాష్ట్రంలోని 12 జిల్లాల్లో టీకా పంపిణీని వైద్య శాఖ ప్రారంభించనుంది. టీబీ బారినపడే అవకాశం ఉన్న హైరిస్క్ వ్యక్తులను గుర్తించి వారికి టీకా పంపిణీ చేయనున్నారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, టీబీతో బాధపడుతున్న వ్యక్తుల కుటుంబ సభ్యులు, టీబీ చరిత్ర కలిగిన వారితోపాటు ధూమపానం చేసేవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, చ.మీ.కు 18 కిలోల కంటే తక్కువ బాడీ మాస్ ఇండెక్స్ కలిగిన వ్యక్తులు వంటి ఆరు వర్గాలకు చెందిన వారికి తొలుత టీకాలు వేస్తారు. టీకా పంపిణీకి ఎంపిక చేసిన 12 జిల్లాల్లో ఈ వర్గాల వారు 50 లక్షల మంది వరకూ ఉన్నట్టు వైద్య శాఖ నిర్ధారించింది. ఇప్పటికే హైరిస్క్ బాధితుల గుర్తింపు ప్రక్రియను ఆయా జిల్లాల్లో వైద్య శాఖ పూర్తి చేసింది.

రెచ్చిపోతున్న పచ్చమూక

వైఎస్సార్‌సీపీ నేతలపై ఇనుపరాడ్లతో దాడి

భయాందోళనలో అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు

పల్నాడులో ఆగని విధ్వంసం

ఎన్నికలు ముగిసి మూడు రోజులైనా ఇంకా ఉద్రిక్తతలు

- జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలు
- దుకాణాలు బంద్, అనుమానితుల బైండోవర్
- గృహనిర్బంధంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి, కాసు, గోపిరెడ్డి


టీడీపీ మూక దాడిలో తీవ్రంగా గాయపడ్డ దొండేటి ఆదిరెడ్డి


నాదెండ్ల మండలం అప్పాపురంలో వైఎస్సార్‌సీపీ నేతపై దాడికి వాడిన కారు

సాక్షి, నరసరావుపేట: ఎన్నికలు ముగిసి మూడు రోజులైనా పల్నాడు జిల్లాలో టీడీపీ మూకల విధ్వంసకాండ కొనసాగుతూనే ఉంది. ఓటమి ఖాయమని తేలిపోవడంతో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై టీడీపీ మూకలు బుధవారం దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడుల్లో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. టీడీపీ దాడుల నుంచి తప్పించుకొని గ్రామాలు వదిలివెళ్లిపోయిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఇంకా ఇళ్లకు పూర్తిగా చేరుకోలేదు. తెలిసిన వారి ఇళ్లల్లో దూరప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. కుటుంబంలోని మహిళలు, పిల్లల బాగోగుల గురించి వారంతా తీవ్ర ఆందోళనలో ఉన్నారు. పోలీసులు రక్షణ కల్పిస్తే గ్రామాలకు తిరిగిరావాలని చూస్తున్నారు. మరోవైపు మాచర్ల, గురజాల, నరసరావుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాసు మహేశ్ రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలను పోలీసులు గృహనిర్బంధం చేశారు.

టీడీపీ మూక స్వైరవిహారం..

మాచవరం మండలం కొత్త గణేషునిపాడులో గ్రామం వదిలి వెళ్లిన ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఇంకా గ్రామాలకు చేరలేదు. పోలీస్ పికెటింగ్ ఉన్నా మళ్లీ టీడీపీ మూకలు దాడులు చేస్తాయనే అభద్రతాభావంతో గ్రామానికి దూరంగా ఉంటున్నారు. పల్నాడు జిల్లాలో పలు ప్రాంతాల్లో టీడీపీ మూకలు విధ్వంసకాండ కొనసాగిస్తుండటంతో పోలీసులు జిల్లావ్యాప్తంగా మంగళవారం సాయంత్రం నుంచి 144 సెక్షన్ విధించారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణాల్లో దుకాణాలను మూసివేయించారు. చివరకు కొన్నిచోట్ల మెడికల్, కూరగాయలు, పాల దుకాణాలు, టీస్టాల్స్‌ను కూడా తెరవలేదు. బహిరంగ ప్రదేశాల్లో నలుగురికి మించి గుమిగూడకూడదని పోలీసులు ఆంక్షలు విధించారు. అయినప్పటికీ టీడీపీ నేతల దాడులు ఆగడం లేదు. వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా స్వైరవిహారం చేస్తున్నారు. తమకు ఓటు వేయని వారిపై దాడులు కొనసాగిస్తున్నారు.

గ్రామానికి తిరిగిరాగానే పచ్చ మూకల దాడి..

గురజాల నియోజకవర్గంలో టీడీపీ దౌర్జన్యకాండ కొనసాగుతోంది. పల్లెల్లో టీడీపీ ఫ్యాక్షన్ చిచ్చురేపుతోంది. దాచేపల్లి మండలం మాదినపాడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త దొండేటి ఆదిరెడ్డిపై టీడీపీ నేతలు కర్రలు, ఇనుపరాడ్లతో దాడి చేశారు. ఆయన పరిస్థితి విషమంగా ఉంది. పోలింగ్ రోజునే ఆదిరెడ్డితో టీడీపీ నాయకులు వాగ్వివాదానికి దిగారు. పోలింగ్ ముగిశాక గ్రామంలో పరిస్థితి బాగోలేకపోవటంతో రెండు రోజులపాటు వేరే గ్రామంలో ఉన్న బంధువుల ఇంటిలో ఆయన తలదాచుకున్నాడు. బుధవారం ఉదయం మాదినపాడు చేరుకున్న వెంటనే 30 మందికిపైగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు కర్రలు, ఇనుపరాడ్లతో ఆదిరెడ్డిపై దాడి చేశారు. ఈ ఘటనలో ఆయన తలకు బలమైన గాయాలు కావడంతో సొమ్మసిల్లిపడిపోయాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు గ్రామానికి చేరుకుని ఆదిరెడ్డిని పిడుగురాళ్లలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తీసుకెళ్లారు. ఆదిరెడ్డి తలలో నరాలు తెగి రక్తప్రసరణ నిలిచిపోయిందని.. రెండు మేజర్ సర్జరీలు చేయాలని వైద్యులు చెబుతున్నారు.

ఎమ్మెల్యేల హౌస్ అరెస్ట్..

పల్నాడు జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులతో పోలీసులు కీలక నేతలను హౌస్ అరెస్ట్ చేసి వారిని ఇంటికే పరిమితం చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలను హౌస్ అరెస్ట్‌లో ఉంచారు. మరోవైపు అల్లర్లకు కారణమైన టీడీపీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై జిల్లావ్యాప్తంగా పోలీసులు కేసులు నమోదు చేశారు. ముందు జాగ్రత్తగా నేరస్వభావం ఉన్న వారిని బైండోవర్ చేశారు. దీంతో వందలాది మంది గ్రామాలను వదిలి వేరే ప్రాంతాలకు మకాం మార్చారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై హత్యాయత్నం..

నాదెండ్ల మండలం అప్పాపురంలో వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ నేతలు హత్యాయత్నానికి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన మాజీ మండల ఉపాధ్యక్షుడు కోవెలమూడి సాంబశివరావుపై కర్రలు, కత్తులతో దాడికి తెగబడ్డారు. పోలింగ్ రోజు పన్నెండో బూత్‌లో ఎస్సీ ఓటర్లు ఎక్కువ సంఖ్యలో బారులు తీరి రాత్రి 7 గంటల వరకు ఓట్లేశారు. వీరికి సాంబశివరావు అండగా ఉన్నాడు. ఇది మనసులో పెట్టుకున్న టీడీపీ నేతలు ఆయనపై దాడికి దిగారు. మరి కొంతమందిపై కూడా దాడి చేసేందుకు కారులో వెంటపడ్డారు. అలాగే పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లిలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు వెంకయ్య, విజయేంద్రబాబుల ఇళ్లపై దాడి చేశారు. వారిద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో గురజాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

టీడీపీ గూండాలపై కేసు నమోదు

- ఎమ్మెల్యే గోపిరెడ్డి ఆసుపత్రిపై దాడి చేసిన టీడీపీ అల్లరి మూకలు
- టీడీపీ ఇన్‌చార్జి అరవిందబాబుతో సహా 20 మందిపై కేసు నమోదు
- నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు
- అజ్ఞాతంలోకి జారుకున్న టీడీపీ నాయకులు

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆసుపత్రి ధ్వంసంతో పాటు అడ్డువచ్చిన వారిపై హత్యాయత్నానికి పాల్పడ్డ టీడీపీ ఇన్‌చార్జి చదలవాడ అరవిందబాబు, మరి కొందరిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సార్వత్రిక ఎన్నికల రోజు సోమవారం టీడీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో సుమారు 200 మంది మారణాయుధాలతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. వైద్యశాల ఎదుట నిలిపి ఉన్న ఎమ్మెల్యేకు చెందిన మూడు వాహనాలను టీడీపీ గూండాలు ధ్వంసం చేశారు. వైద్యశాలపై రాళ్లు రువ్వి, అద్దాలను ధ్వంసం చేశారు. వైద్యశాల నుంచి బయటకు వచ్చి దాడిని అడ్డుకోబోయిన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మామ కంజుల రామకోటిరెడ్డిపై ఇనుప రాడ్లతో అరవిందబాబు, మరి కొందరు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. సంఘటన అంతా వైద్యశాలలోని సీసీ పుటేజ్‌లో నిక్షిప్తమైంది. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కర్ తెలిపారు.

కులంపేరుతో దూషించిన టీడీపీ నాయకులపై కేసు

షాలెం నగర్‌కు చెందిన గంటెనపాటి గాబ్రేల్‌పై సోమవారం మున్సిపల్ బాలుర పాఠశాల వద్ద ఉండగా టీడీపీ నేత చదలవాడ అరవిందబాబు కొంత మందితో అక్కడికి చేరుకుని తనపై దాడిచేయటంతో పాటు కులం పేరుతో దూషించాడని ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది. క్రిష్టియన్ పాలెంకు చెందిన కొదవపాటి రాజు గుంటూరు రోడ్డులో వెళ్తుండగా టీడీపీ నాయకుడు కపలవాయి విజయకుమార్, మరి కొందరు అకారణంగా దూషించి దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పల్నాడులో హింసకు పోలీసులే కారణం

- టీడీపీని గెలిపించాలని తెగ ఆరాటపడ్డారు
- అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టారు
- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మాచర్ల: పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో అశాంతికి ప్రధాన కారణం పోలీసులేనని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆరోపించారు. బుధవారం మాచర్లలోని తన గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గంలో ఒక సామాజికవర్గానికి అనుకూలమైన గ్రామాల్లో గొడవలు సృష్టించి ఏకపక్షంగా ఓట్లుపడేలా టీడీపీ మూకలు తెగబడ్డారని, దానికి జిల్లా ఎస్పీ బిందు మాధవ్, టీడీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, అదే సామాజికవర్గానికి చెందిన కారంపూడి సీఐ నారాయణ స్వామి సహకరించారని తెలిపారు. కారంపూడి మండలంలోని చింతపల్లి, ఒప్పిచర్లతో పాటు మరో నాలుగు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బయటకు గెంటేసి టీడీపీ నేతలు దాడులు చేస్తే పోలీసులు కనీసం పట్టించుకోలేదని తెలిపారు. జిల్లా ఎస్పీ ఒక సామాజికవర్గానికి అనుకూలంగా వ్యవహరించారని, ఆయనతో పాటు కారంపూడిలో గతంలో ఎస్ఐగా పనిచేసి తిరిగి నాలుగు రోజుల కింద సీఐగా వచ్చిన నారాయణస్వామి టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యమనీ, టీడీపీ అరాచక శక్తులను వదిలిపెట్టబోమనీ తెలిపారు. తమ కుటుంబ సభ్యులపైనా, తమపైనా టీడీపీ నేతలు దాడులు చేస్తే పట్టించుకోని పోలీసులు పోలింగ్ రోజున వారికి అనుకూలమైన గ్రామాల్లో బూత్‌లు ఆక్రమించుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తుంటే వారిని అడ్డుకోకుండా ఏదో ఒక వంకతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సబబన్నారు. తాను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా చేశానని, ఏనాడూ శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహరించలేదన్నారు. నియోజకవర్గ ప్రజలు టీడీపీ నేతలు రెచ్చగొట్టినా సంయమనం కోల్పోకుండా ఉండాలన్నారు. తాను రాజకీయాల్లో ఏనాడు ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించలేదని, అందరినీ గౌరవించానని, ఒక టీడీపీ ఫ్యాక్షన్ లీడర్ కోసం ఈ నియోజకవర్గంలో ఇంత దారుణమైన పరిస్థితులు ఏర్పడటం దురదృష్టకరమన్నారు.

ఎన్నికల హింసపై ఈసీ సీరియస్

- నేడు ఢిల్లీకి సీఎస్, డీజీపీ
- పోలింగ్‌కు ముందు ఆకస్మిక బదిలీలతో సమస్యలు ఉత్పన్నం
- కొన్ని చోట్ల పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించినట్లు ఎన్నికల పరిశీలకుల నివేదిక



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోలింగ్ రోజు, ఆ తరువాత హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవటాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. దీనిపై స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్.జవహర్‌రెడ్డి, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను ఆదేశించింది. ఈ నేపథ్యంలో వారిద్దరూ ఢిల్లీ వెళ్లి గురువారం మధ్యాహ్నం వివరణ ఇవ్వనున్నారు. పోలింగ్ అనంతరం పల్నాడు, కారంపూడి, చంద్రగిరి, తాడిపత్రిలో ఘర్షణలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరించినా స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించటాన్ని తీవ్రంగా పరిగణించిన ఈసీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. కొంత మంది పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని, ప్రేక్షక పాత్ర పోషించారని కేంద్ర పరిశీలకులు ఈసీకి నివేదిక ఇచ్చారు.

ఆకస్మిక బదిలీలతో సమస్యలు..

సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి బందోబస్తు ఏర్పాట్లు చేసినా అక్కడ పోలీసు ఉన్నతాధికారులను ఈసీ హఠాత్తుగా బదిలీ చేయడంతోనే సమస్యలు ఉత్పన్నమైనట్లు అధికార యంత్రాంగం భావిస్తోంది. కొత్త అధికారులకు క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర అవగాహన లేకపోవడంతో కొన్ని చోట్ల ఘర్షణలు చోటు చేసుకున్నట్లు పేర్కొంటున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా బుధవారం సచివాలయంలో సమావేశమై చర్చించారు. విధి నిర్వహణలో ఏకపక్షంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్చించారు. వీరిని ఇప్పటికే గుర్తించామని, వారిపై తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు.

రోహిణి ప్రభావం లేనట్టే!

- లానినో ఎఫెక్ట్.. తగ్గిన ఎండలు
- రెండు, మూడు రోజుల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం
- వారం రోజులుగా పలుచోట్ల వర్షాలు
- నెలాఖరు నాటికి నైరుతి రుతుపవనాలు కేరళను తాకే అవకాశం



సాక్షి, అమరావతి/విశాఖపట్నం: ఎల్‌నినో ప్రభావం తగ్గి.. లానినో పరిస్థితులు ఏర్పడడంతో రాష్ట్రంలో ఎండల తీవ్రత తగ్గిపోయింది. అక్కడక్కడా వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం చల్లబడింది. ఆగస్టు నుంచి ఏప్రిల్ వరకు ఎల్‌నినో కొనసాగింది. ఏప్రిల్ నుంచి తగ్గుతూ లానినో పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఎండల తీవ్రత తగ్గింది. ఈ నెల 25వ తేదీ నుంచి రోహిణి కార్తె మొదలవుతున్నా.. దాని ప్రభావం రాష్ట్రంపై పెద్దగా ఉండదని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. రాబోయే రోజుల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఉష్ణోగ్రతలు ఉన్నా 40 డిగ్రీలలోపే నమోదయ్యే అవకాశం ఉంది. ఉపరితల ఆవర్తనాల్లో ఏమైనా మార్పులు ఉంటే ఒకటి, రెండు రోజులు ఎండలు పెరిగే అవకాశం ఉంటుందని, మార్పులు లేకపోతే ఆ ఎండలు కూడా ఉండవని చెబుతున్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతుండటం, అరేబియన్ మహాసముద్రం నుంచి గాలులు వీస్తుండటం, తమిళనాడు, బంగాళాఖాతం వైపు నుంచి కూడా గాలులు వీస్తుండడంతో రాష్ట్రంలో వాతావరణం చల్లబడింది. ఈ నేపథ్యంలో వారం రోజులుగా రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, కోస్తాలోని కృష్ణా, గుంటూరు, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి.

ముందుగానే నైరుతి రుతుపవనాలు

అనుకూల వాతావరణ పరిస్థితులు ఉండటంతో ఈ సీజన్‌లో నైరుతి రుతుపవనాలు ముందే వచ్చే అవకాశం ఉన్నట్టు ఇప్పటికే భారత వాతావరణ శాఖ తెలిపింది. అరేబియా మహా సముద్రంలో ఏర్పడిన ద్రోణి తుపానుగా మారకుండా ఉంటే.. రుతుపవనాలు ముందే కేరళను తాకవచ్చని చెబుతున్నారు. ఆ ద్రోణి బలపడే అవకాశం లేదని భావిస్తున్నారు. ఒకవేళ అది బలపడి తుపానుగా మారితే రుతుపవనాలు కొంత ఆలస్యమయ్యే పరిస్థితి ఉంటుందని భావిస్తున్నారు. అలాగే బంగాళాఖాతంలో అండమాన్ పరిసరాల్లో ఈ నెలాఖరుకు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. అది బలపడితే నైరుతి రుతుపవనాలు ఇంకా వేగంగా విస్తరించవచ్చని చెబుతున్నారు. ఏదైనా ఈ నెలాఖరుకల్లా రుతు పవనాలు కేరళను తాకవచ్చని.. జూన్ 1కల్లా ఏపీకి విస్తరించవచ్చని అంచనా వేస్తున్నారు.

నేటి నుంచి వర్షాలు

ద్రోణి ప్రభావంతో గురువారం రాష్ట్రంలోని పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కృష్ణా, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శుక్రవారం ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇక శనివారం ప్రకాశం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పల్నాడు, బాపట్ల, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురవవచ్చని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది. ఈ మూడు రోజులు వానలతో పాటు ఉరుములు, మెరుపులు, పిడుగులు సంభవిస్తాయని తెలిపింది. గంటకు 40–50 కి.మీల వేగంతో ఈదురు గాలులు కూడా వీస్తాయని పేర్కొంది. కాగా.. శనివారం శ్రీకాకుళం జిల్లాలో 16, విజయనగరం జిల్లాలో ఆరు, పార్వతీపురం మన్యం జిల్లాలో రెండు మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

సోషల్ మీడియాతో మన గుట్టురట్టు..!

వ్యక్తిత్వాన్ని డీకోడ్ చేస్తున్న సోషల్ మీడియా అల్గారిథమ్

- చూసే వీడియోలతో మానసిక స్థితి అంచనా
- డిజిటల్ సైకాలజీతో పొంచి ఉన్న ముప్పు
- ఖాతాదారుల యూఆర్ఎల్స్‌ను అమ్మేస్తున్న బ్లాగర్స్
- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు



విజయవాడస్పోర్ట్స్: స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్న ప్రతి వ్యక్తిపై సోషల్ మీడియా అల్గారిథమ్ పెత్తనం చెలాయిస్తోంది. అత్యధికంగా సోషల్ మీడియా ప్లాట్ ఫారంలలో ఎక్కువ సమయం గడుపుతున్న ప్రజల భద్రతకు ఇది పెనుసవాల్‌గా మారింది. సైబర్ నేరాలకు సోషల్ మీడియా అల్గారిథమ్ సహాయకారిగా పనిచేస్తోందని సైబర్ నిపుణులు ఆందోళన చెందుతున్నారు.

మనమేంటో చెప్పేస్తోంది..

సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ ఫేస్‌బుక్, యూట్యూబ్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, లింక్‌డిన్ వ్యక్తిగత గోప్యతను పూర్తిగా హరించేస్తున్నాయి. సోషల్ మీడియాలో యూజర్స్ పని తీరు వెనుక జరిగే సెర్చ్ ఇంజిన్‌కు అనుసంధానంగా ఉండే అల్గారిథమ్ మ్యాపింగ్ వెనుక ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. ఖాతాదారులు ఎక్కవగా చూసే వీడియోలు, అప్‌లోడ్ చేసే పోస్టులు, చదివే శీర్షికలు, లైక్, షేర్‌లు, చేసే కామెంట్స్ ఆధారంగా ఆయా వ్యక్తుల మానసిక స్థితి, ఆలోచనా విధానం, నిబద్ధత తదితర అంశాలను ఓ ప్రత్యేకమైన మ్యాపింగ్ ద్వారా అల్గారిథమ్ నూరు శాతం పసిగడుతుంది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయ సంబంధిత, ప్రభుత్వ/ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలకు, కామెడీ వీడియోలు/మీమ్స్, వంటలు, అశ్లీల వీడియోలు చూసే వ్యక్తులకు అలాంటి సంబంధిత వీడియోలు అల్గారిథమ్ ఇచ్చే సమాచారంతోనే స్మార్ట్ ఫోన్‌లకు చేరుకుంటున్నాయి. దీంతోనే స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న వ్యక్తి మానసిక స్థితితో పాటు అతని జాతకాన్ని పూర్తిగా అల్గారిథమ్ గుర్తించేస్తోంది.

సైబర్ నేరాలు వీటి వల్లే..

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కొన్ని బ్లాగ్స్ వ్యక్తుల సోషల్ మీడియా అకౌంట్‌లతోనే తమ వ్యాపారం సాగిస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు. ఖాతాదారుల మానసిక స్థితి ఆధారంగా ఫిల్టర్ చేసిన సోషల్ మీడియా యూఆర్ఎల్స్‌ను బ్లాగర్స్ దగ్గర నుంచి సైబర్ నేరగాళ్లు కొనుగోలు చేస్తున్నారు. లోన్స్ ఇప్పిస్తామని నమ్మించడం, అశ్లీల వీడియోలు చూసే వ్యక్తులను గుర్తించి, వారికి వీడియో కాల్స్ చేసి హనీ ట్రాప్‌లకు తెగబడుతున్నారు. ఈ తరహా మోసాల్లో విజయవాడ నగరంలోనే బాధితులు వేల సంఖ్యలో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అంతేకాదు అల్గారిథమ్ ఇచ్చిన సమాచారంతో వ్యక్తుల యూఆర్ఎల్స్ కొనుగోలు చేసిన యాడ్ ఏజెన్సీలు వారికి అనుసంధానంగా ఉన్న కంపెనీలు యాడ్‌లను ఫోన్‌లో గుప్పిస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి. ఈ యాడ్‌లతో ఆన్‌లైన్ షాపింగ్ చేస్తూ మహిళలు సైబర్ నేరాల బారిన పడుతున్నారు.

అప్రమత్తంగా లేకుంటే అనర్థాలే..

ఓ వ్యక్తి నుంచి అతను వాడుతున్న స్మార్ట్ ఫోన్ తీసుకుని.. ఓ పది నిమిషాలు ఆ ఫోన్‌లోని సోషల్ మీడియాలో వచ్చే వీడియోలు చూస్తే సదరు వ్యక్తి ఆలోచన విధానం, మానసిక స్థితిని ఇట్టే చెప్పేయొచ్చని పోలీసులు చెబుతున్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగంలో అప్రమత్తంగా లేకపోతే భవిష్యత్తులో ఎన్నో అనర్థాలను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగంలో మెలకువలు తెలియని వ్యక్తులు.. వాటికి దూరంగా ఉండటమే ఎంతో మేలని చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించండి..



డిజిటల్ సమాచారం ఇతరులకు తెలియకుండా జాగ్రత్తపడుతూ, ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లు అసలైనవా.. నకిలీవా అని తనిఖీ చేసుకోవాలని విజయవాడ సైబర్ క్రైం సీఐ కోమాకుల శివాజీ యూజర్లకు సూచిస్తున్నారు. ముందుగా సెర్చ్ ఆధారంగానే మోసాలు జరుగుతుంటాయని, ఆన్‌లైన్ షాపింగ్ యాడ్స్ వచ్చినప్పుడు, సంబంధిత అధికారిక వెబ్‌సైట్ తనిఖీ చేసుకోవాలని హెచ్చరించారు. ఉద్యోగ ప్రకటనలు వచ్చినప్పుడు విద్యార్థులు ఎక్కువగా మోసపోతుంటారు. ప్రభుత్వాలు, మల్టీ నేషనల్ కంపెనీలు డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇవ్వవని, ఏ విధమైన ఫీజులు అనధికారికంగా వసూలు చేయవని తెలుసుకోవాలి. అశ్లీల వెబ్‌సైట్‌లు చూసినప్పుడు, వీడియో కాల్ రావడం బెదిరింపు కాల్స్ వస్తుంటాయి. ఎవరైనా ఆడియో/వీడియో కాల్ చేసి బెదిరిస్తే కంగారు పడకుండా, ఇంటర్నెట్ ఆఫ్ చేసి వెంటనే సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని శివాజీ సూచించారు. ప్రకటనలు రాకుండా చేసుకునే వీలు గూగుల్ సెట్టింగ్స్‌లో ఉంటుంది. ప్రైవసీ సెట్టింగ్స్ అనే ఫీచర్స్ వినియోగించుకుని అకౌంట్‌కు అవసరమైన రక్షణ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

అరుదైన క్షీరదం గుర్తింపు

- సొరిసిడే కుటుంబానికి చెందిన చిట్టెలుక తరహాలో ఉండే జీవిని గుర్తించిన వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్
- ఏనుగు తొండం మాదిరిగా కదలికలు గల మూతి భాగం, వెడల్పాటి చెవులు, ఒంటె మూపురం వంటి దేహ నిర్మాణం



అనంతపురం: కొత్త చిట్టెలుక జాతికి చెందిన క్షీరదాన్ని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం జువాలజీ విభాగానికి చెందిన టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ బాలసుబ్రమణ్యం గుర్తించారు. అరుదైన జాతికి చెందిన క్షీరదంగా నిర్ధారించారు. పొడుచుకు వచ్చినట్టు ఏనుగు తొండంలా, కదలికలు గల మూతి భాగం(రోస్ట్రం) నిర్మాణ శైలిని కలిగి వెడల్పాటి చెవులు, ఒంటె మూపురం వంటి దేహ నిర్మాణం కలిగి ఉంది. సొరిసిడే కుటుంబానికి చెందిన ఈ క్షీరదం భారతదేశంలో మాత్రమే కనిపిస్తుంది. దీని సహజ నివాసం ఉష్ణ లేదా ఉష్ణమండల పొడి అడవులు మాత్రమే. డీఎన్ఏ అనాలిసిస్ కోసం వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డెహ్రాడూన్)కు పంపించారు.

ఇప్పటి దాకా పేరు లేని జీవి

➢ ప్రస్తుతం గుర్తించిన ఈ అరుదైన జీవికి ఇప్పటి దాకా ఎలాంటి పేరు లేదు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ 465 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో జీవ వైవిధ్యం పెంపొందించేలా మియావాకీ అడవులను పెంచుతున్నారు. ఇందులోనే దీనిని గుర్తించారు.

➢ ఈ జాతి అటవీ ప్రాంతాలు, వ్యవసాయ భూములు, మానవ కార్యకలాపాలకు సంబంధించిన ప్రాంతాలలో అరుదుగా కనిపిస్తుంది. రక్షిత ఆవాసాలలో గూడు కట్టుకుని నివసిస్తుంది. ఆకులు, అందుబాటులో ఉన్న ఏదైనా ఇతర గూడు పదార్థాలను సేకరించి, ఆపై గూడును నిర్మించడానికి ఒక రహస్య ప్రాంతాన్ని కనుగొంటాయి.

పొడి అడవుల్లో మాత్రమే జీవించే అరుదైన జీవి



కొత్త చిట్టెలుక జాతికి చెందిన క్షీరదాన్ని ఎస్కేయూలో గుర్తించాం. పొడి అడవుల్లో మాత్రమే జీవించే అరుదైన జీవి ఇది. డీఎన్ఏ అనాలిసిస్ కోసం వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా(డెహ్రాడూన్)కు పంపాము.

– డాక్టర్ బాలసుబ్రమణ్యం, జువాలజీ విభాగం టీచింగ్ అసిస్టెంట్, ఎస్కేయూ

➢ చిట్టెలుకలు ప్రధానంగా కీటకాహారులు. ఇవి 82 శాతం కీటకాలను తింటాయి. కొన్ని సార్లు మొక్కలను, విత్తనాలను తింటాయి. అలాగే అనేక రకాల అకశేరుకాలు, మానవ ఆహార పదార్థాలను కూడా తింటాయి.

➢ ఇవి రాత్రి పూట ఎక్కువగా అడవులు, సాగు చేసిన పొలాలు, మానవ జనాభా ఉన్న ప్రాంతాల్లో ఆహారం తీసుకుంటాయి. కీటకాలు, తెగుళ్లు రాకుండా అరికడతాయి. రైతులకు కీటకాలను నియంత్రించడంలో దోహదం చేస్తాయి.

> సహనం అనేది మరణం కాదు. నిజానికి ప్రతి ఒక్కరి హృదయంలో జీవించడం. ఒక మనిషి మీకు ఎంత వ్యతిరేకమైనా, ఒక్కసారి కాదు పదిసార్లు సహించాల్సి వచ్చినా, సహనపు శక్తి అనేది వృథాగా పోదు. తియ్యటి ఫలితం ఇస్తుంది.
>
> – బ్రహ్మకుమారీలు

సాక్షి

గురువారం, 16 మే 2024

అమెరికా బెదిరింపు ధోరణి

అహంకారం తలకెక్కితే బుద్ధి మందగిస్తుంది. పెత్తనం చలాయించాలన్న యావ పరిధుల్ని మరిచిపోతుంది. భారత్‌–ఇరాన్‌ల మధ్య సోమవారం కుదిరిన ఒప్పందంపై అమెరికా స్పందించిన తీరు దాని అహంకారానికి నిలువెత్తు నిదర్శనం. ఇరాన్‌తో ఒప్పందానికి సిద్ధపడేవారు ఆంక్షలు ఎదుర్కొనక తప్పదంటూ అమెరికా విదేశాంగ ప్రతినిధి వేదాంత్‌ పటేల్‌ చేసిన వ్యాఖ్య బెదిరింపు ధోరణిలో వుంది. 2003లో వాజపేయి నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో ఇరాన్‌తో చాబహార్‌ ఓడరేవు నిర్మాణంపై ఒప్పందం కుదిరింది మొదలు అమెరికా అడుగడుగునా అడ్డుపడుతోంది. అందువల్లే అయిదేళ్లలో పూర్తికావాల్సిన ప్రాజెక్టు కాస్తా ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంది. 2018లో పూర్తయిందనిపించి లాంఛనంగా ప్రారంభించారు. కానీ దానికి సంబంధించి రోడ్లు, రైల్వేలైన్లు మొదలుకొని వివిధ మౌలిక సదుపాయాల కల్పన, యంత్ర సామగ్రి వగైరాల విషయం అనిశ్చితిలో పడింది. మొత్తంమీద ఇప్పటికి 21 ఏళ్లయింది. ప్రభుత్వ రంగ సంస్థ ఇండియా పోర్ట్స్‌ గ్లోబల్‌ లిమిటెడ్‌ (ఐపీజీఎల్‌), ఇరాన్‌ పోర్టులు, నౌకా సంబంధ సంస్థల మధ్య ఓడరేవు టెర్మినల్‌ ప్రారంభంపై ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కింద ఐపీజీఎల్‌ 12 కోట్ల డాలర్ల (రూ. వెయ్యికోట్లుపైగా) పెట్టుబడి పెడుతుంది. మన దేశం మరో 25 కోట్ల డాలర్ల రుణం సమకూరుస్తుంది. చాబహార్‌ సమీపంలో నిర్మించిన ఈ షహీద్‌ బెహెస్తీ పోర్టు మన దేశానికి లాభదాయకమైన ప్రాజెక్టు. అంతేకాదు... మధ్య ఆసియా, పశ్చిమాసియా, యూరప్‌ దేశాలకు అది 'బంగారువాకిలి'. ఈ ప్రాజెక్టు కింద నిర్మాణమయ్యే రోడ్లు, రైల్వేలైన్లు వివిధ ఓడరేవులతో అనుసంధానమవుతాయి. సరుకు రవాణా చకచకా సాగుతూ పలు దేశాల ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తుంది. పెట్రో కెమికల్స్‌, ఉక్కు, ఎరువుల రంగాల్లో ఇరాన్‌ బ్రహ్మాండమైన అభివృద్ధి సాధిస్తుంది. మధ్య ఆసియా మార్కెట్లలో ఇప్పటికే తిష్ఠవేసి, బెల్ట్‌ అండ్‌ రోడ్‌ ఇనిషియేటివ్‌ (బీఆర్‌ఐ) ప్రాజెక్టుతో బంగారు భవిష్యత్తును కలగంటూ అందరినీ మించి ఎదగాలని దూకుడుగా వెళ్తున్న చైనాకు చాబహార్‌ ఓడరేవు కంట్లో నలుసు. ఎందుకంటే ఇది పూర్తి స్థాయిలో పనిచేయటం ప్రారంభిస్తే బీఆర్‌ఐ ప్రాజెక్టుకు పెద్ద విలువుండదు.

ఇంతలోనే అమెరికా కొరడా ఝుళిపించటం ప్రారంభించింది. 'మేం ఇరాన్‌పై ఆంక్షలు విధించాం కనుక దానితో ఎవరూ వాణిజ్యబంధం నెలకొల్పుకోరాద'ంటూ ఫర్మానాలు జారీచేస్తోంది. రెండు సార్వభౌమత్వ దేశాల మధ్య ఒప్పందం కుదిరితే ఎందుకీ కడుపుమంట? ఏమిటీ బెదిరింపులు? ఇరాన్‌లో తనకు అనుకూలమైన మహమ్మద్‌ రెజా పహ్లావి (ఇరాన్‌ షా) పాలన సాగినంతకాలమూ అమెరికా ఆ దేశంతో సఖ్యంగా వుంది. ఇస్లామిక్‌ విప్లవం విజయవంతం కావటంతో ఆ పాలకుడు కాస్తా నిష్క్రమించాడు. ఆ తర్వాత ఖొమేనీ కనుసన్నల్లోకి ఇరాన్‌ వచ్చిననాటి నుంచీ ఆ దేశాన్ని అమెరికా అష్టదిగ్బంధం చేస్తోంది. ఏదో ఒక కారణంతో కయ్యానికి దిగుతోంది. తన సమస్యను ప్రపంచ సమస్య చేసి ఎవరూ ఆ దేశంతో వ్యాపార, వాణిజ్యాలను నడపరాదంటూ బెదిరిస్తోంది. పోనీ ఈ విషయంలోనైనా నిలకడగా వున్న చరిత్ర లేదు. 2003లో ఒప్పందం కుదిరినప్పుడు మౌనంగావున్న అమెరికా, ఆ తర్వాత కాలంలో ఇరాన్‌పై ఆంక్షలు విధించింది. పర్యవసానంగా ఆ ప్రాజెక్టు మూలనపడింది. 2014లో ప్రధాని నరేంద్ర మోదీ వచ్చేనాటికి అంతర్జాతీయంగా పరిస్థితులు చక్కబడ్డాయి. అమెరికా, యూరప్‌ దేశాలు ఇరాన్‌తో అణు ఒప్పందం కుదుర్చుకుని ఆంక్షలు సడలించాయి. మరుసటి ఏడాదికల్లా చాబహార్‌పై భారత్‌–ఇరాన్‌ ద్వైపాక్షిక ఒప్పందం కుదిరింది. కానీ 2017లో డోనాల్డ్‌ ట్రంప్‌ అమెరికా అధ్యక్షుడయ్యాక ఇరాన్‌తో కుదిరిన అణు ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్టు ప్రకటించారు. ఆంక్షల పర్వం మళ్లీ మొదలైంది. కానీ మన దేశానికి మాత్రం మినహాయింపు ఇచ్చారు. అప్పటికి అఫ్గాన్‌ ఆర్థికాభివృద్ధిని, దానికి అందాల్సిన మానవతా సాయాన్ని దృష్టిలో ఉంచుకుని మినహాయింపు ఇచ్చామని అమెరికా ప్రకటించింది. సారాంశంలో క్షణక్షణమూ మారే తన చిత్తానికి అనుగుణంగా ప్రపంచ దేశాలన్నీ మసులుకోవాలని అమెరికా వాంఛిస్తోంది. ఇలాంటి పోకడలను మొగ్గలోనే తుంచే ప్రయత్నం చేసివుంటే వేరుగా వుండేది. అది లేకపోవటం వల్లనే తాజాగా మరోసారి హూంకరిస్తోంది.

దేశాలకు తమవైన విధానాలుంటాయి. ధూర్త దేశంగా మారి ఇరుగు పొరుగుకే కాక ప్రపంచ శాంతికే భంగంగా పరిణమించినప్పుడు ఎవరూ అలాంటి దేశంతో కలవాలనుకోరు. గతంలో ఇరాన్‌ విషయంలో భారత్‌కు ఇచ్చిన మినహాయింపులకు షరతులున్నాయి. ఇరాన్‌నుంచి దిగుమతి చేసుకునే ముడి చమురును వెంటనే తగ్గించుకోవాలని, ముందుముందు ఆపేయాలని అప్పట్లో అమెరికా కోరింది. అప్పటికి రోజుకు ఏడు లక్షల చమురు బ్యారెళ్లు దిగుమతి చేసుకునే భారత్‌... చివరకు ఆ దిగుమతిని ఆపేసింది కూడా! ఉక్రెయిన్‌ యుద్ధం కారణంగా రష్యా నుంచి చమురు దిగుమతులు నిలిపేయాలని అమెరికా కోరినా లెక్కచేయని భారత్‌... మొదటినుంచీ అన్ని విషయాల్లో మద్దతుగా నిలుస్తున్న తమ విషయంలో భిన్నంగా ఉంటున్నదని ఇరాన్‌ ఇప్పటికే విమర్శించింది. ఇరాన్‌ వైఖరేమిటన్న సంగతలావుంచి మన ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చి మనవైన విధానాలు రూపొందించుకోవటం తప్పనిసరి. విదేశాంగమంత్రి జైశంకర్‌ అన్నట్టు అంతర్జాతీయంగా ఎన్నో దేశాల ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడే చాబహార్‌ పోర్టును అమెరికా సంకుచిత దృష్టితో చూడటం, మోకాలడ్డాలని ప్రయత్నించటం తగదు. మన దేశం ఇతర దేశాలతో కూడా ఈ విషయంలో చర్చించాలి. కాస్త వెనకా ముందూ కావొచ్చుగానీ ఇలాంటి అనారోగ్య ధోరణులు అందరికీ ముప్పు తెచ్చేవే!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.అష్టమి ఉ.7.22 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** మఖ రా.7.12 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ఉ.6.06 నుండి 7.50 వరకు, తదుపరి తె.4.02 నుండి 5.46 వరకు(తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.9.47 నుండి 10.35 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.46 వరకు, **అమృతఘడియలు:** సా.4.31 నుండి 5.56 వరకు.

సూర్యోదయం : 5.32
సూర్యాస్తమయం: 6.20
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

గాజాలో కూలుతున్న జ్ఞాన వ్యవస్థలు

ప్రపంచ బ్యాంకు ప్రకారం పాలస్తీనా అక్షరాస్యత రేటు 97.51 శాతం. పాలస్తీనియన్లు 'ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యావంతులైన శరణార్థులు'. అయితే గాజాలోని విశ్వవిద్యాలయాలు ఇప్పుడు ఇజ్రాయెల్‌ దాడిలో నాశనమయ్యాయి. ఇప్పటివరకూ సుమారు 90 మందికి పైగా ప్రొఫెసర్లు ఈ దాడుల్లో మరణించారు. గాజా పిల్లల విద్యావకాశాలను నిర్మూలిస్తూ... పాఠశాలలు, పుస్తకాల దుకాణాలు, లైబ్రరీలు ధ్వంసమయ్యాయి. పాలస్తీనా విజ్ఞానం, జ్ఞానాన్ని ఉత్పత్తి చేసే సంస్థల వినాశనం సమస్త జ్ఞానాన్ని అంతమొందించడం కంటే తక్కువేమీ కాదు! ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యావేత్తలు దీనిని అర్థం చేసుకున్నారు. అమెరికా, ఇతర దేశాలలోని విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థుల ఆందోళనలకు కారణం అదే.

విశ్లేషణ



అమర్‌జీత్‌ భుల్లర్‌

గాజాలోని విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యా సంస్థలపై ఇజ్రాయెల్‌ దాడి పాలస్తీనా విజ్ఞాన, పర్యావరణ వ్యవస్థలను నాశనం చేయడానికి చేసిన ఉద్దేశపూర్వక ప్రయత్నంగా కనిపిస్తుంది. ఇప్పటివరకు, మొత్తం 12 విశ్వవిద్యాలయాలు వైమానిక దాడులకు గురయ్యాయి. ఇజ్రాయెల్‌ లక్ష్యాలలో అల్‌–అజహర్‌ విశ్వవిద్యాలయం, ఇస్లామిక్‌ యూనివర్సిటీ ఆఫ్‌ గాజా (ఐయూజీ) ఉన్నాయి. దీని ఫలితంగా పాలస్తీనా అధ్యాపకులు, పండితులు, విద్యార్థులు సంవత్సరాల తరబడి సాగించిన పరిశోధన ధ్వంసమైపోయింది.

ఐయూజీ ప్రెసిడెంట్‌, వైస్‌ ఛాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ సుఫియాన్‌ తాయెహ్‌, ఆయన కుటుంబ సభ్యులు విశ్వవిద్యాలయ క్యాంపస్‌పై జరిగిన ఇజ్రాయెల్‌ దాడిలో మరణించారు. ఐయూజీ అనేది గాజాకు చెందిన ప్రముఖ విద్యాసంస్థ. ప్రొఫెసర్‌ తాయెహ్‌ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన పరిశోధకుడు. అలాగే, కొనసాగుతున్న దాడిలో మరణించిన 90కి పైగా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లలో ఐయూజీలో ఆంగ్ల సాహిత్యం బోధించే డాక్టర్‌ రెఫాత్‌ అలరీర్‌ మరొకరు.

పాలస్తీనా విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2024 జనవరి 20 వరకు దాదాపు 4,400 మంది విద్యార్థులు మరణించారు, 7,800 మంది గాయపడ్డారు. 231 మంది ఉపాధ్యాయులు, నిర్వాహకులు మరణించారు, 756 మంది గాయపడ్డారు. అలాగే 378 ప్రభుత్వ నిర్వహణలోని పాఠశాలలతోపాటు, గాజాలో యునైటెడ్‌ నేషన్స్‌ రిలీఫ్‌ అండ్‌ వర్క్స్‌ ఏజెన్సీ (యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ) నిర్వహణలోని పాఠశాలలు పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసమయ్యాయి. 2023 అక్టోబర్‌లో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి కనీసం 97 మంది జర్నలిస్టులు, మీడియా కార్యకర్తలతోపాటు 35,000కు పైగా ప్రజలు మరణించారు.

"దాదాపు 90,000 మంది పాలస్తీనియన్‌ విశ్వవిద్యాలయ విద్యార్థులు గాజాలోని విశ్వవిద్యాలయానికి హాజరు కాలేరు. 60 శాతానికి పైగా పాఠశాలలు, దాదాపు అన్ని విశ్వవిద్యాలయాలు, లెక్కలేనన్ని పుస్తకాల దుకాణాలు, లైబ్రరీలు దెబ్బతిన్నాయి లేదా ధ్వంసమయ్యాయి. గాజా పిల్లలు, యువకుల విద్యావకాశాలను నిర్మూలిస్తూ, యూనివర్సిటీల డీన్‌లు, ప్రముఖ పాలస్తీనా పండితులతో సహా... వందలాది మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలు చంపబడ్డారు" అని దక్షిణాఫ్రికా న్యాయపరమైన అంశాల ప్రతినిధి బ్లిన్నె నీ ఘ్రాలే అంతర్జాతీయ న్యాయస్థానంలో వెల్లడించారు.

ప్రజల చిహ్నాలను, డాక్యుమెంట్‌ చరిత్రను తుడిచిపెడుతూ లైబ్రరీలు, ఆర్కైవ్‌లు, మ్యూజియంలతో సహా అనేక సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలు కూడా ధ్వంసమయ్యాయి. పాలస్తీనా మేధావులు దీనిని 'చరిత్ర నుండి పాలస్తీనా ఉనికిని తుడిచివేయడానికి' చేసే ప్రయత్నంగా చూస్తున్నారు. కెనడియన్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ యూనివర్సిటీ టీచర్స్‌కు రాసిన లేఖలో కెనడాలోని మౌంట్‌ రాయల్‌ యూనివర్సిటీకి చెందిన సోషియాలజీ ప్రొఫెసర్‌ ముహన్నద్‌ అయ్యాష్‌ దీనిని 'రాజకీయ పటం నుండి పాలస్తీనాను తుడిచిపెట్టే ప్రయత్నం'గా పేర్కొన్నారు. 'పాలస్తీనా విజ్ఞానం, విజ్ఞాన నిర్మాతలు మరియు జ్ఞానాన్ని ఉత్పత్తి చేసే సంస్థల వినాశనం సమస్త జ్ఞానాన్ని అంతమొందించడం(ఎపిస్టెమిసైడ్‌) కంటే తక్కువేమీ కాదు' అని వ్యాఖ్యానించారు.



'ఎపిస్టెమిసైడ్‌' అంటే జ్ఞాన వ్యవస్థను చంపడం, మూగబోయేలా చేయడం, నాశనం చేయడం లేదా విలువ తగ్గించడం అని అర్థం. సోషియాలజిస్ట్‌ బోవెంచురా డి సౌసా శాంటోస్‌ ఈ పదాన్ని రూపొందించారు. 'వలస పాలన, అణచివేత, మారణహోమాల కారణంగా అధీన సంస్కృతిలో సంభవించే విజ్ఞాన మరణంగా' దీనిని ఆయన అభివర్ణించారు. ఇది సైనికపరంగా, సైద్ధాంతికపరంగా రెండు విధాలుగానూ ఉండొచ్చు. ఇది విముక్తి పేరుతో స్వాధీనం, శాంతి పేరుతో దురాక్రమణ, జీవన పవిత్రత పేరుతో జీవన విధ్వంసం, హక్కుల పరిరక్షణ పేరుతో మానవ హక్కులను ఉల్లంఘించే రూపంలో జరగవచ్చు.

1948లో ఇజ్రాయెల్‌కు స్థానం కల్పించడం కోసం తాము వైదొలగాల్సి వచ్చిన తర్వాత పాలస్తీనియన్‌ విద్యావంతులైన ఉన్నతవర్గాలు పాలస్తీనా విద్యావ్యవస్థను పునర్నిర్మించడానికి అత్యంత ప్రాధాన్యమిచ్చాయి. వారు విద్యను తమ జీవితాలను పునర్నిర్మించడానికి, పురోగతిని సాధించడానికి ఒక చోదకశక్తిగా భావించారు. అర్థవంతమైన సాంస్కృతిక మార్పిడి, శాస్త్రీయ పురోగతి, చరిత్రపై అవగాహన, సృజనాత్మక సాహిత్య రచనలతో గాజాను పాలస్తీనా సమాజాన్ని అభివృద్ధి చేసే ప్రదేశంగా మార్చాలనే ఆశతో అనేక మంది పండితులు వివిధ ప్రాంతాల నుండి అక్కడికి వెళ్లారు. ఇందులో వారు విజయం సాధించారా లేదా అనేది చర్చనీయాంశం. కానీ కచ్చితంగా, పాలస్తీనా నేడు అత్యధిక అక్షరాస్యత రేటు ఉన్న ప్రాంతాలలో ఒకటిగా పరిగణించబడుతోంది. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం పాలస్తీనా అక్షరాస్యత రేటు 97.51 శాతం. పాలస్తీనియన్లను 'ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యావంతులైన శరణార్థులు' అంటారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యావేత్తలు దీనిని అర్థం చేసుకున్నారు. అమెరికా, ఇతర దేశాలలోని విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, విద్యార్థుల తిరుగుబాటు వెనుక ఉన్న కారణం అదే. పాలస్తీనా విద్యా సంస్థల్లో జరుగుతున్న ప్రతిధ్వనులు విదేశాల్లోని క్యాంపస్‌లలో వినిపిస్తున్నాయి. ఇజ్రాయెల్‌ దురాక్రమణకు అమెరికా ప్రభుత్వం అందిస్తున్న నిరంతర ద్రవ్య, సైనిక, దౌత్య, నైతిక మద్దతును నిరసిస్తూ అనేక విశ్వవిద్యాలయాలలో శిబిరాలు ఏర్పాటైనాయి. దాదాపు 10 విశ్వవిద్యాలయాలలోకి పోలీసులను పిలిపించారు, 645 మందిని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో చాలా మందిని తర్వాత విడుదల చేశారు. ఉన్నత స్థాయి కొలంబియా, బోస్టన్‌ విశ్వవిద్యాలయాలు నిరసనల కేంద్రాలుగా మారాయి. ఈ రెండు విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల నుండి 200 మందికి పైగా అరెస్టులు చేశారు. గాజాలో కాల్పుల విరమణ పిలుపులో గణనీయమైన సంఖ్యలో అధ్యాపకులు పాల్గొన్నారు లేదా మద్దతు ఇచ్చారు. కొన్ని యూనివర్సిటీలలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పాలనాధికారులు విరుచుకుపడ్డారు, వారిలో కొందరిని బహిష్కరించారు.

లాస్‌ఏంజిల్స్‌లోని క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయం,ఇతర ప్రదేశాలలో పాలస్తీనా అనుకూల, ఇజ్రాయెల్‌ అనుకూల ప్రదర్శనకారుల మధ్య గొడవలు జరిగినట్లు వార్తలు వచ్చాయి. పాలస్తీనా విద్యను విధ్వంసకరమైన విభజన దురదృష్టాల నుండి రక్షించడానికి ప్రపంచం తన స్వరాన్ని పెంచాలి. జ్ఞాన వ్యవస్థను నాశనం చేయడానికి వారాలు పడుతుంది. కానీ దానిని పునర్నిర్మించడానికి దశాబ్దాలు పడుతుంది.

ఇజ్రాయెల్‌తో జట్టు కట్టిన దేశాలలోని కొన్ని విశ్వవిద్యాలయాలు దురదృష్టవశాత్తూ పాలస్తీనా సంస్థలతో విద్యా మార్పిడి ఒప్పందాలను కుదుర్చుకోవడానికి విముఖత చూపాయి. మరోవైపు, ఇజ్రాయెల్‌ విశ్వవిద్యాలయాల విద్యార్థులను అంతర్జాతీయ సహకారానికి చెందిన ప్రయోజనాలను ఆస్వాదించడానికి సాదరంగా స్వాగతించారు. ఇజ్రాయెల్‌ విశ్వవిద్యాలయాలు కెనడాకు చెందిన పోస్ట్‌–సెకండరీ సంస్థలతో ఇప్పటికే 60 విద్యా ఒప్పందాలను కలిగి ఉన్నాయి. ముఖ్యంగా అభివృద్ధి చెందిన ప్రపంచంలోని విద్యావేత్తలు, అధ్యాపక సంఘాలు, యూనియన్లు... అస్తవ్యస్తంగా ఉన్న పాలస్తీనా వ్యవస్థను పునర్నిర్మించడానికి వాగ్దానం చేయడంతో పాటు, యుద్ధాన్ని ముగించే వైపుగా ప్రజల అభిప్రాయాన్ని నిర్మించడానికి, ఆత్మపరిశీలన చేసుకోవడానికి ఇది తగిన సమయం.

వ్యాసకర్త నార్తర్న్‌ బ్రిటిష్‌ కొలంబియా విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్‌
('ద ట్రిబ్యూన్‌' సౌజన్యంతో)

సోషల్‌ నెట్‌ వర్కింగ్‌ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్‌, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



వెనక ఎవరున్నారు?



తీవ్రమైన లైంగిక దాడుల ఆరోపణలు ఎదుర్కొంటూ, దేశం విడిచి వెళ్లిన ప్రజ్వల్‌ రేవణ్ణ డిప్లొమాటిక్‌ పాస్‌పోర్టును ఇంకా ఎందుకు రద్దు చేయలేదు? ఎవరు అతడిని కాపాడుతున్నారు? ఎందుకు?

– సుమంత్‌ రామన్‌, టీవీ హోస్ట్‌

చూస్కుందాం!



2020లో డోనాల్డ్‌ ట్రంప్‌ రెండు డిబేట్లలో నాతో ఓడిపోయారు. అప్పటినుంచీ మళ్లీ నాతో చర్చకు రాలేదు. మళ్లీ ఇప్పుడు ఆయన నాతో చర్చకు సిద్ధంగా ఉన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అలా అయితే స్నేహితుడా, నేనేమిటో చూపిసా!

– జో బైడెన్‌, అమెరికా అధ్యక్షుడు

విచక్షణారహితం



ఐక్యరాజ్యసమితి కోసం పనిచేస్తున్న రిటైర్డ్‌ కల్నల్‌ వైభవ్‌ అనిల్‌ కాలే గాజాలో యూరోపియన్‌ హాస్పిటల్‌కు కారులో వెళ్తుండగా చంపబడ్డారు. ఇజ్రాయిల్‌ దాడులు ఎంత విచక్షణా రహితంగా సాగుతున్నాయో ఇది చెబుతుంది. అయినా వాళ్లు ఎవరికీ జవాబుదారీ కాదు. మహా అయితే వాళ్లు ప్రభుత్వానికి ఒక అధికారపూర్వక క్షమాపణ చెబుతారంతే!

– జావేద్‌ అఖ్తర్‌, కవి

సునాయాస విజయం



ఇప్పటికి 70 శాతం స్థానాలకు ఓటింగ్‌ ముగిసింది. దాదాపుగా మా దగ్గర మొత్తం భారతదేశానికి సంబంధించిన డేటా ఉంది. మా అంచనాలో బీజేపీ (మొత్తం ఎన్డీయే కాదు) 43 శాతం ఓటు షేరుతో (ప్లస్‌ ఆర్‌ మైనస్‌ 3 శాతం) 358 (ప్లస్‌ ఆర్‌ మైనస్‌ 3 శాతం) స్థానాలను కచ్చితంగా గెలుచుకుంటుంది.

– రణదీప్‌ సింగ్‌ సిసోడియా, విశ్లేషకుడు

పడిపోయిన ప్రమాణాలు



'న్యూస్‌క్లిక్‌' వ్యవస్థాపకుడు ప్రబీర్‌ పుర్‌కాయస్థను 'ఉపా' కింద అరెస్ట్‌ చేయడం చట్టబద్ధం కాదంటూ సుప్రీంకోర్టు విడుదల చేయడానికే సంతోషించాల్సి రావడం ఎంత దారుణం! కక్షపూరిత ప్రభుత్వం ఒక సంపాదకుడిని అక్రమ అరెస్టు చేయడం పట్ల గగ్గోలు చెలరేగొద్దా?

– కత్యూషా, వ్యాఖ్యాత


అవే చేయగలిగితే...



బాలాకోట్‌ సర్జికల్‌ దాడులే 2019 ఎన్నికల చిత్రాన్ని మార్చాయని ప్రతిపక్షాల వాళ్లు అంటుంటారు. కానీ నాగరికత పరంగా, సంస్కృతి పరంగా అంతకంటే ఎన్నో రెట్లు ప్రాధాన్యం ఉన్న రామ మందిరం మాత్రం ఎన్నికలను ప్రభావితం చేయదంటారు. తారాస్థాయి భ్రమ!

– అభిజిత్‌ అయ్యర్‌ మిత్రా, వ్యాఖ్యాత

మోదీజీ ఇంటికే...



సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటి వరకూ జరిగిన నాలుగు దశల పోలింగును బట్టి చూస్తే, ఇండియా కూటమి పటిష్ఠమైన స్థితిలో ఉంది. భారత ప్రజలు నరేంద్ర మోదీజీని బయటికి పంపేయడానికి కచ్చితంగా నిర్ణయించుకున్నారు. జూన్‌ 4న ఇండియా కూటమి నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నాను.

– మల్లికార్జున్‌ ఖర్గే, కాంగ్రెస్‌ జాతీయాధ్యక్షుడు

వైజ్ఞానిక వేగుచుక్కలు

వెల్లూరు సీఎమ్‌సీ వెనుక...



ఐడా ఎస్‌. స్కడ్డర్‌

గుంటూరులో కుగ్లర్‌ ఆసుపత్రితో చరిత్ర సృష్టించిన అన్నా సారా బృందంలో పని చేసిన డాక్టర్‌ మేరీ బేయర్‌ 1912లో చీరాలలో మరో ఆసుపత్రిని ప్రారంభించి, సుమారు ఆరు దశాబ్దాలు గణనీయమైన సేవ చేశారు. అన్నా సారాతో కొన్ని రోజులు పని చేసిన అమెరికన్‌ మిషనరీ ఐడా ఎస్‌. స్కడ్డర్‌ వెల్లూరులో నేడు సీఎంసీగా పేరుగాంచిన క్రిస్టియన్‌ మెడికల్‌ ఆసుపత్రిని తొలుత మెడికల్‌ స్కూల్‌గా బాలికలకు మాత్రమే 1918లో ప్రారంభించారు. మద్రాస్‌కు 80 మైళ్ళ దూరంలో ఉన్న తిండివనంలో జీవిస్తున్న రోజుల్లో ఒకే రాత్రి ప్రసవ సమయంలో సరైన వైద్య సహాయం లేక ముగ్గురు స్త్రీలు మరణించడం ఆమెను కలచివేసింది. ఆ రాత్రి తను వైద్యశాస్త్రం అభ్యసించాలని నిర్ణయించుకున్నారు. ఫలితంగా 1899లో న్యూయార్క్‌ సిటీలోని కార్నెల్‌ మెడికల్‌ కాలేజీలో డాక్టర్‌ పట్టా పొందారు. 1900లో చిత్తూరు పట్టణానికి 20 మైళ్ళ దూరంలో ఉండే వెల్లూరు లేదా రాయవెల్లూరులో ఒక చిన్న డిస్పెన్సరీని ప్రారంభించారు. తొలి రెండేళ్లలోనే దాదాపు 5,000 మంది రోగులకు వైద్య సేవలు అందించారు.

1902లో మేరీ టేబర్‌ స్కెల్‌ హాస్పిటల్‌ను ప్రారంభించారు. 1928లో వెల్లూరుకు సమీపంలో ఉండే బాగాయం వద్ద 200 ఎకరాల్లో హిల్‌ సైట్‌ మెడికల్‌ స్కూల్‌ ప్రాంగణాన్ని మొదలుపెట్టారు. అదే సంవత్సరం మహాత్మా గాంధీ ఈ మెడికల్‌ స్కూల్‌ని సందర్శించడం విశేషం.1945లో ఈ వైద్య కళాశాలలో యువకులకు కూడా ప్రవేశాన్ని కల్పించారు. చివరికి ఐడా సోఫియా స్కడ్డర్‌ ద1960 మే 23న కన్ను మూశారు.

ఎల్సీ ఎమ్‌ మోరీస్‌ అనే అమెరికన్‌ మిషనరీ డాక్టర్‌ 1930లో నెల్లూరులోని మిషనరీ హాస్పిటల్‌లో చేరి (ఆ కాలంలో ఆమె ఒక్కరే క్వాలిఫైడ్‌ డాక్టర్‌) ఆ ప్రాంతంలో ఎనలేని సేవలందించారు. బెల్జియంలో జన్మించిన క్లైర్‌ మేరీ జీన్‌ వెల్లట్‌ కంచి సమీపంలోని పోలంబక్కంలో కుష్ఠు ఆసుపత్రి 1955లో ప్రారంభించి చాలా పెద్ద ఎత్తున వైద్య సేవలు అందించి 1981లో పద్మశ్రీ గౌరవాన్ని కూడా పొందారు.

డా।। నాగసూరి వేణుగోపాల్‌ । ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

ఇక ఫలితాల ప్రకటన లాంఛనమే!

అభిప్రాయం



పూనూరు గౌతమ్‌ రెడ్డి

రాష్ట్రంలో ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీకి విజయం నల్లేరు మీద బండి నడకలా మారింది. అయినప్పటికీ తెలుగుదేశం, ఎల్లో మీడియా మాత్రం కూటమి పార్టీలకు చెందిన నిరుపేదలతో పందేలా కాయించి లేనిది ఉన్నట్లుగా చూపించే ప్రయత్నంచేస్తూ వారిని ఆర్థికంగా అప్పులపాలుచేసే ఓ కుట్రకార్యక్రమానికి తెరలేపింది. పోలింగ్‌ జరిగిన తీరుపై అనేక మంది విశ్లేషకులు వారివారి అభిప్రాయలను నిర్భీతిగా, నిష్పక్షపాతంగా చెప్పిన సంగతి అందరూ చూశారు. సోషల్‌ మీడియా విస్తృతంగా ఉన్న ఈ రోజుల్లో యూట్యూబ్‌ ద్వారా రాష్ట్రంలో ఏం జరుగుతోందన్న దానిపై సామాన్య మానవుడు క్షణాల్లో తెలుసుకోగలుగుతున్నాడు. కానీ, పార్టీ అనే ఒక పెద్ద బూచిని చూపడం ద్వారా సామాన్య, మధ్య తరగతి వర్గాల్లోని అమాయక ప్రజల క్షణికావేశాలను వాడుకునే చంద్రబాబు లాంటి వంచనపరులు ఇప్పటికీ వారి పంథా మార్చుకోకపోవడం బాధాకరం.



పోలింగ్‌ రోజు ఓటింగ్‌ ప్రక్రియ ప్రారంభం కాగానే మహిళలు, వృద్ధులు, వికలాంగులు పెద్ద సంఖ్యలో పోలింగ్‌ బూత్‌ల దగ్గర బారులు తీరారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఈ ఫ్లో కొనసాగింది. మళ్లీ మధ్యాహ్నం 3 గంటల నుండి మహిళలు పెద్ద ఎత్తున బారులు తీరారు. అర్ధరాత్రి వరకూ పోలింగ్‌ జరిగిన అరుదైన సందర్భాన్ని మనం ఈసారి ఎన్నికల్లో చూడగలిగాం. అనుకున్నట్లే ఓటింగ్‌ శాతం అదే రోజు రాలేదు. ఎన్నికలు పూర్తయిన రెండో రోజు మొత్తం పోలింగ్‌ 81.86 శాతం నమోదైనట్లు ఎన్నికల సంఘం తేల్చి చెప్పింది. ఈ ఎన్నికల్లో ఏయే నియోజకవర్గాల్లో ఏయే మేర పోలింగ్‌ జరిగిందన్నది సుస్పష్టంగా చెప్పింది.

పోలింగ్‌ సరళిని ఒకసారి నిశితంగా పరిశీలిస్తే కొన్ని అంశాలు కచ్చితంగా స్ఫురణకు వస్తున్నాయి. ఈ ఐదేళ్లు ముఖ్యమంత్రి తానేమి చేసిందీ ప్రజలకు స్పష్టంగా చెప్పారు. కరోనా వంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా మొక్కవోని ఆత్మస్థైర్యంతో ప్రజల ప్రాణాలను కాపాడటంలో ముఖ్య భూమిక పోషించిన విషయం ప్రజలు గుర్తుంచుకున్నారు. అట్టడుగు వర్గాలను 'నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనార్టీలు' అంటూ వారిని తన సొంత కుటుంబీకులుగా చెప్పుకొచ్చారు. అది వారిని జగన్‌ తమ మనిషి అని నమ్మేలా చేయగలిగింది.

ఈ ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్నాయంటూ జగన్‌ మోహన్‌ రెడ్డి పదే పదే చెబుతూ వచ్చారు. జగన్‌ చెప్పినట్లుగానే ఇటీవలి కాలంలో తెలుగుదేశం కూటమి నేతలు వ్యవహరించిన తీరు ప్రజలను ఆలోచింపజేసింది. ఈ ఎన్నికలే చివరి ఎన్నికలన్న రీతిలో దేశవిదేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఏపీ ప్రజలను ఖర్చుపెట్టి మరీ ఏపీకి తీసుకొచ్చి ఓట్లు వేయించారు. ఇది కూడా మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో కసిని పెంచింది. జగన్‌ను ఓడించడం కోసం వీరంతా ఒక్కటైతే... తమకు ఆర్థిక భరోసా కల్పించిన తమ కుటుంబ సభ్యుడిని గెలిపించుకునేందుకు ఆ వర్గాలన్నీ ఏకతాటిపైకి వచ్చినట్లు కనిపించింది.

మహిళలు, వృద్ధులు పెద్ద ఎత్తున ఓటు వేయడానికి వస్తుండడంతో వైసీపీ గెలుపు ఖాయమని భావించి టీడీపీ అధినేత కుట్రలకు తెరలేపారన్న ప్రచారం సాగుతోంది. మనమే గెలుస్తున్నామంటూ పేద, మధ్యతరగతి వర్గాలను రెచ్చగొట్టి పందేలు కాసేలా ఉసిగొల్పి ప్రజల్లో ఒక గందరగోళాన్ని సృష్టించేలా వ్యవహరించారని అంటున్నారు.


మనమే గెలుస్తున్నామన్న భావన తీసుకురావడం ద్వారా ఎన్నికల్లో ప్రజల అటెన్షన్‌ను మళ్లించేందుకు పన్నిన కుట్ర ఫలించలేదు. ఈ విషయాన్ని ఎన్నికల ఓటింగ్‌ శాతం సుస్పష్టంగా తెలియజేస్తోంది. పెరిగిన పోలింగ్‌ తమకే అనుకూలమనే మేకపోతు గాంభీర్యం ప్రదర్శించేలా మళ్లీ కుట్రలు చేస్తున్నారు. ఓటమిని అంగీకరించలేని చంద్రబాబు అండ్‌ కో చేస్తున్న విన్యాసాలన్నీ ప్రజలు చూసి జాలిపడటం తప్ప మరేమీ చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. జూన్‌ 4న బ్యాలెట్‌ బాక్సులు ఫ్యాన్‌ గాలి జోరుకు చిగురుటాకుల్లా వణికిపోవడం ఖాయమన్న విషయాన్ని ఇప్పుడు సామాన్యుడే బయటకు వచ్చి చెబుతున్న విషయాన్ని మనం స్పష్టంగా చూడగలుగుతున్నాం. ఇదంతా చూస్తే 2024లో మళ్లీ సీఎం జగనే అని కచ్చితంగా అర్థమౌతోంది.

వ్యాసకర్త వైఎస్సార్‌ ట్రేడ్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు ।98481 05455।

సర్వం ఆధ్యాత్మికమే!

ప్రమాదకరమైన లేక సందిగ్ధ పరిస్థితులన్నింటిలో భగవన్నామమే లంగరు వంటిది. కాబట్టి హృదయాంతరంగంలో భగవన్నామాన్నే నిలుపుకోవాలి. ఆత్మసాధనలో ఆచరించు పద్ధతులు అన్నింటిలోనూ 'రామ, కృష్ణ, గోవింద' అని ఉచ్చరించుటే సులభమైంది. కలియుగంలో భగవంతుని కృప పొందటానికి భగవన్నామం ఉచ్చరించడం లేదా నామ సంకీర్తన చేయడం అత్యంత సులభమైన మార్గం. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా హృదయపూర్వకంగా తదేక ధ్యానంతో భగవంతుని నామస్మరణ చేయాలి. భగవన్నామాన్ని మించిన మార్గం లేదు. మార్గాలన్నీ సమానమైన ప్రాముఖ్యం కలిగినవీ, ప్రభావ వంతమైనవే. ఎందుకంటే జీవాత్మను పరమాత్మునిలో చేర్చుటయే ఈ మార్గములన్నింటి లక్ష్యం. ఏ వ్యక్తికి ఏ మార్గం సులభంగా, మనస్సుకు నచ్చినట్లుంటుందో అదే అతనికి అత్యంత ఉత్తమ మార్గము. అనేక నదులు వివిధ దిశల నుండి వేగంగా ప్రవహిస్తూ చివరగా సముద్రంలో కలసిపోయినట్లే... భక్తి, జ్ఞాన మార్గాల్లో పయనించు వారందరూ చివరిగా చేసే ప్రయత్నం ఒక్కటే. జీవుడు ఏ మూలం నుండి వచ్చాడో, అదే మూలంలోనికి జీవుని చేర్చుటమే భక్తి, జ్ఞాన మార్గాల లక్ష్యం.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

సర్వమూ ఆధ్యాత్మికమే. ఇది ఆధ్యాత్మికం, అది ప్రాపంచికం అని రెండింటి మధ్య గీత గీచి విభజించటం సరైంది కాదు. అలాగే నిత్యజీవితం, ఆధ్యాత్మిక జీవితం వేరు వేరు కాదు. నిత్యజీవితం ఆధ్యాత్మిక జీవితానికి భిన్నంగా ఉండడాన్ని ఎంతవరకు ఊహిస్తావో, అంతవరకు నీ ఆధ్యాత్మిక ప్రగతి మార్గంలో విరోధ భావాలు ఏర్పడుతూనే ఉంటాయి. ప్రతివిషయం పవిత్రమైనదే. చర్యలన్నీ ఒకదానితో ఒకటి సమానంగా ఉంటాయి. జీవితంలో ఒడుదొడుకులు, సుఖ దుఃఖాలు ఒకదాని తర్వాత ఇంకొకటి కలుగుతూనే ఉంటాయి. దీనిలో నీ మానసిక ప్రవర్తన ముఖ్యమైంది. పైన పేర్కొన్న విషయాలన్నింటినీ ఒకే రీతిగా చూడాలంటే గురుకృప, సహాయం కావాలి. తగిన ప్రవర్తనను పెంపొందించుకొని బాధల నుండి విముక్తి పొందటానికై భగవంతుని ప్రార్థిద్దాం.

క్లుప్తంగా...

17 నుంచి పద్మావతీ పరిణయోత్సవాలు



తిరుమల: శ్రీ పద్మావతీ శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఈ నెల 17–19 వరకు తిరుమలలో జరగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను టీటీడీ నిర్వహించనుంది. తొలిరోజు శ్రీ మలయప్పస్వామివారిని గజవాహనం, రెండో రోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడవాహనంపై వేంచేపు చేస్తారు. మరోపక్క ఉభయనాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేసి కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 17–19 వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

వైఎస్సార్‌సీపీకి ఓటేశారని ‘ఉపాధి’ లేదన్నారు!

- మేటీల అత్యుత్సాహం

ఆత్మకూరు: నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం కొత్తరామాపురంలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని ముగ్గురు కూలీలకు ‘ఉపాధి’ పని కల్పించకపోవడం చర్చనీయాంశమైంది. కొత్తరామాపురం గ్రామానికి చెందిన వాడల పక్కీరయ్య అనే మేటీ బుధవారం తన పరిధిలోని పుస్తెల శీను, పుస్తెల నిర్మల అనే ఉపాధి కూలీలకు పనులు లేవని.. కూలీకి రావాల్సిన అవసరం లేదంటూ తెగేసి చెప్పాడు. మస్టర్లలో మీపేరు ఎక్కించలేదంటూ బుకాయించాడు. జాబ్‌కార్డులో పేరు ఉన్నా ఎందుకు పనులు కల్పించడంలేదని ప్రశ్నించినా స్పందన లేకపోయింది. అదే గ్రామానికి చెందిన చాబోలు సుబ్బమ్మ అనే మేటీ ఆ గ్రామానికి చెందిన పుస్తెల సారమ్మ అనే వితంతు మహిళకు కూడా పనిలేదని ఇంటికి పంపించారు. ఒక్కొక్క వ్యవసాయ కూలీ రోజుకు రూ.250 కూలీ వేసుకున్నా ఏడు రోజులకు రూ.1,750 కూలి ఆగిపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఎం నాగమ్మ దృష్టికి తీసుకెళ్లగా మేటీతో మాట్లాడి కూలీలకు పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విజయవాడ మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ, గుంటూరు డివిజన్‌లలో జరుగుతున్న ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా ఆయా మార్గాల్లో నడిచే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు విజయవాడ డివిజన్ పీఆర్‌ఓ నుస్రత్ మండ్రూప్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 నుంచి 26 వరకు రాజమండ్రి-విజయవాడ (07466/07467), నర్సాపూర్-నిడదవోలు (07897/07771), నర్సాపూర్-విజయవాడ (17270/07862), నర్సాపూర్-రాజమండ్రి (07883/07884), విశాఖపట్నం-గుంటూరు (22701/22702/17239) రైళ్లు, 16 నుంచి 27 వరకు విశాఖపట్నం-గుంటూరు (17240), 16 నుంచి 31 వరకు నర్సాపూర్-గుంటూరు (17282), 17 నుంచి జూన్ 1 వరకు గుంటూరు-నర్సాపూర్ (17281), 16 నుంచి 31 వరకు హుబ్లీ-విజయవాడ (17329), 17 నుంచి జూన్ 1 వరకు విజయవాడ-హుబ్లీ (17330) రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. అదే విధంగా రామవరప్పాడు-నర్సాపూర్ (07861) రైలును భీమవరం-నర్సాపూర్ మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

ఎల్ అండ్ టీకి పనులెలా అప్పగిస్తారు?

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు



డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగానికి అవసరమైన 5 ఫ్లీట్ సపోర్టు నౌకలను (సుమారుగా రూ.20 వేల కోట్లతో) నిర్మించడానికి విశాఖలో హిందుస్థాన్ షిప్‌యార్డ్‌కు ఆర్డరు ఇచ్చిందని, కానీ హిందుస్థాన్ షిప్‌యార్డ్ యాజమాన్యం వీటిలో 2 ఫ్లీట్ సపోర్టు నౌకల నిర్మాణం ఎల్ అండ్ టీకి అప్పగించడంలో ఆంతర్యమేంటని సిటూ (సిఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు ప్రశ్నించారు. నగరంలోని సిటూ కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. విశాఖ హిందూస్థాన్ షిప్‌యార్డ్‌ను బలహీనపరిచే విధంగా చైర్మన్ హేమంత్ ఖత్రీ నిర్ణయాలు చేయడం షిప్‌యార్డ్ అభివృద్ధికి ఆటంకం కల్గిస్తుందన్నారు. ఎల్ అండ్ టీకి 2 నౌకల నిర్మాణ పనులను అప్పగించే చర్యలు నిలుపుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. కావాలనే ఎల్ అండ్ టీకి ఫ్లీట్ల నౌకల నిర్మాణం అప్పగించడానికి సీఎండీ కుట్ర చేస్తున్నారని తెలిపారు. గత 20 ఏళ్లలో షిప్‌యార్డ్‌కు వచ్చిన భారీ వర్క్ ఆర్డర్‌ను షిప్‌యార్డ్ ఎందుకు ఉపయోగించుకోలేక పోతుందో సీఎండీ సమాధానం చెప్పాలన్నారు. 5 షిప్పులు షిప్‌యార్డ్‌లోనే కట్టాలని, ఎల్ అండ్ టీ, ఎస్ఇడిఎస్ కొచ్చిన్‌కు ఫిన్కాటియరీ సంస్థకు ఇచ్చిన ఆర్డర్లు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఉపాధ్యక్షుడు కేఎం కుమార్‌మంగళం పాల్గొన్నారు.





సీఎం జగన్‌కు వేద పండితుల ఆశీర్వచనం

పూర్ణాహుతితో ముగిసిన శ్రీ మహారుద్ర సహిత రాజశ్యామల సహస్ర చండీయాగం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజాహిత పాలన కొనసాగాలని, ఆయనకు మరోసారి విజయం చేకూరాలని ఆకాంక్షిస్తూ.. 41 రోజులుగా 45 మంది వేద పండితులతో తాడేపల్లిలో నిర్వహిస్తున్న శ్రీ మహారుద్ర సహిత రాజశ్యామల సహస్ర చండీయాగం బుధవారం దిగ్విజయంగా ముగిసింది. ఈ సందర్భంగా బుధవారం ముఖ్యమంత్రి నివాసంలో సీఎం వైఎస్ జగన్‌తో వేద పండితులు ప్రత్యేక పూజలు చేయించారు. పూర్ణాహుతికి వినియోగించే ద్రవ్యాలకు సీఎం జగన్‌తో షోడశోపచార పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు, వేద ఆశీర్వచనం అందజేశారు. బ్రహ్మశ్రీ నల్లపెద్ది శివరామ ప్రసాద్ శర్మ, గొరావర్జుల నాగేంద్రశర్మ ఆధ్వర్యంలో ఈ యాగం జరిగింది. పూర్ణాహుతి కార్యక్రమంలో చండీయాగ నిర్వాహకులు డాక్టర్ ఆరిమండ వరప్రసాద రెడ్డి, విజయశారదా రెడ్డి దంపతులు, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి దంపతులు, రక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు పడమట సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పెత్తందార్లకు బుద్ధి చెప్పేలా ప్రజా తీర్పు

- దేవుడు, ప్రజలు సీఎం జగన్ పక్షానే
- పాజిటివ్ ఓట్ల సునామీతో జగనే మళ్లీ సీఎం
- రాష్ట్రంలో దాడులు, హింసలో ప్రధాన ముద్దాయి చంద్రబాబే
- వైఎస్సార్‌సీపీకి ఓట్లేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, పేదల పైనే దాడులు
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి, అమరావతి: ఈ ఎన్నికల్లో చంద్రబాబు నేతృత్వంలోని పెత్తందార్లకు బుద్ధి చెప్పేలా ప్రజల తీర్పు ఉండబోతోందని, పాజిటివ్ ఓట్ల సునామీతో ముఖ్యమంత్రి వైఎస్ జగనే సీఎం అవబోతున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. దేవుడు, ప్రజలు సీఎం జగన్ పక్షానే ఉన్నారని స్పష్టంచేశారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే నెల 4న వెలువడే ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయాన్ని నమోదు చేస్తుందని చెప్పారు. చంద్రబాబు కూటమికి ఘోర పరాభవం తప్పదని అన్నారు. ఓడిపోతున్న ఫ్రస్ట్రేషన్‌లోనే బడుగు, బలహీన వర్గాలపై చంద్రబాబు దాడులు చేయిస్తున్నాడని చెప్పారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లేశారన్న కక్షతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, పేదలపైన టీడీపీ దాడులకు తెగబడుతోందన్నారు. రాష్ట్రంలో దాడులు, హింసలో ప్రధాన ముద్దాయి చంద్రబాబే అని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా కొణిదెలలో వైఎస్సార్‌సీపీకి ఓటేసిందని ఓ బీసీ మహిళపై టీడీపీ మూకలు దాడి చేశాయన్నారు. మాచర్లలోనూ బేడ బుడగ జంగాల సామాజికవర్గం వారి ఇళ్లపై దాడులకు పాల్పడ్డారన్నారు. ఇలాంటి ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా అనేకం జరిగాయని వివరించారు. టీడీపీ పెద్దల పిలుపు మేరకు గ్రామాల్లో ఆ పార్టీ శ్రేణులు రెచ్చిపోయి వైఎస్సార్‌సీపీ అనుకూల సామాజికవర్గాలు, ప్రాంతాలపై దాడులు చేసి మారణహోమానికి పాల్పడుతున్నాయని మండిపడ్డారు.

గొడవలకు ఆస్కారమున్న ప్రాంతాల్లో బందోబస్తు ఏది?

కూటమితో ఎన్నికల కమిషన్ కుమ్మక్కయిందని మంత్రి ఆరోపించారు. సమస్యాత్మక ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద పోలీసుల బందోబస్తు ఉండాలని వైఎస్సార్‌సీపీ ఎన్నికల అధికారులకు అనేక ప్రతిపాదనలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన పోలీసు అబ్జర్వర్ ఎక్కడున్నాడో, ఏం చూస్తున్నాడో ఎవరికీ తెలియదన్నారు. గొడవలకు, రిగ్గింగ్ చేయడానికి ఆస్కారమున్న ప్రాంతాల్ని వదిలేసి వైఎస్సార్‌సీపీకి అనుకూల ప్రాంతాల్లోనే పోలీసులను ఎక్కువ సంఖ్యలో పెట్టారన్నారు. ఎక్కడైతే, టీడీపీ సానుకూల బలమైన కేడర్ ఉంటుందో అక్కడ పోలీసు బందోబస్తును పెట్టడంలో యంత్రాంగం విఫలమైందని తెలిపారు. చాలా చోట్ల పోలీసు అధికారులు పచ్చచొక్కాలేసుకున్నట్టుగా రెచ్చిపోయారన్నారు. గ్రామాల్లో దాడులకు తెగబడుతున్న టీడీపీ శ్రేణులను కట్టడి చేయలేదని అన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, నాయకుల్ని మాత్రమే గృహ నిర్బంధం చేసి, టీడీపీ అభ్యర్థులు, నేతలను ఇష్టానుసారంగా వదిలేశారన్నారు. నేటికీ గ్రామాల్లో టీడీపీ శ్రేణుల ఆగడాలను పోలీసులు ఎందుకు నియంత్రించలేకపోతున్నారని ప్రశ్నించారు. ఓడిపోతున్న విషయం తెలిసి చంద్రబాబు కేంద్రంతో లాలూచీ అయి పోలీసులను పావుగా చేసుకుని పేట్రేగి పోతున్నాడనేది ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజల అంతిమ తీర్పులో వైఎస్సార్‌సీపీదే విజయమని మంత్రి నాగార్జున చెప్పారు.

4న కూటమికి మైండ్ బ్లాంక్ ఖాయం

- మరోసారి వైఎస్ జగనే సీఎం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు



సాక్షి, అమరావతి: జూన్ 4న వెల్లడయ్యే ఎన్నికల ఫలితాలతో కూటమికి మైండ్ బ్లాంక్ కావడం ఖాయమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. విప్లవంలాగా మహిళలు తండోపతండాలుగా కనీవినీ ఎరుగని రీతిలో వచ్చి ఓట్లేశారని చెప్పారు. మరోసారి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం సుధాకర్‌బాబు మీడియాతో మాట్లాడారు. పోలింగ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు విశ్వరూపం చూపారన్నారు. కూటమి పార్టీలు అది ప్రభుత్వ వ్యతిరేకత అనుకుంటే వాటి మూర్ఖత్వమే అవుతుందన్నారు. టీడీపీ ఊహాలోకాల్లో బతుకుతోందని ఎద్దేవా చేశారు. కౌంటింగ్ రోజు ఆ పార్టీకి దిమ్మతిరుగుతుందని చెప్పారు. ‘2019లో కూడా పోలింగ్ శాతం పెరిగితే ‘పసుపు కుంకుమ’ పనిచేసిందన్నారు.. చివరకు ఏమైందో చూశారుగా? ప్రభుత్వంపై పచ్చ పత్రికల్లో కూటమి నేతలు చిమ్మిన విషాన్ని ప్రజలు గమనించారు. అందుకే ప్రజలు ఓటుతో పోటెత్తారు. తమ బిడ్డ జగన్‌ను సీఎంని చేసుకోవడానికి బారులు తీరారు. దేశంలోనే అత్యధిక పోలింగ్ శాతం నమోదు కావడం శుభసూచికం. 2019లో 79.8% పోలింగ్ శాతం నమోదైతే..ఇప్పుడు 81.86% నమోదైంది. ఇది మహిళా విప్లవం.. మహిళా సమాజం ఉవ్వెత్తున, ఉప్పెనలా తమ ప్రేమను జగన్‌పై చూపించింది. ఓట్లు వేసేందుకు అర్ధరాత్రి వరకూ వేచిఉంది. వైఎస్సార్‌సీపీ శిరస్సు వంచి వారికి పాదాభివందనం చేస్తోంది’ అని తెలిపారు.

డీజీపీ తక్షణమే చర్యలు చేపట్టాలి..

‘ఒక సమర్థుడు ధర్మంగా పరిపాలన చేశారు. ఏ దళారీ వ్యవస్థ లేకుండా చిట్టచివరి చేతికి కూడా సంక్షేమ ఫలాలను అందించడమే పోలింగ్ శాతం పెరగడానికి కారణం. ప్రజలు ఓటు అనే ఖడ్గంతో కూటమి పార్టీలను చీల్చిచెండాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు జగన్‌ని సీఎంను చేసుకోవడానికి పోటెత్తారు. బాబు భయపెట్టినా.. బాంబులేసినా..గండ్ర గొడ్డలి తీసుకొచ్చినా ఆగలేదు. సీఎం జగన్ మద్దతుదారులు సమాజంలో 80 శాతం ఉన్నారు. బాబు ఎన్ని చేసినా వాళ్లు ఇవ్వాలనుకున్న తీర్పును 13న ఇచ్చేశారు. ఎన్నికల్లో హింసాత్మక ఘటనలకు సంబంధించి ఎన్నికల సంఘం సీసీ కెమెరా ఫుటేజీలు తెప్పించుకుని పరిశీలించాలి. మాపై జరిగిన దాడుల విషయంలో డీజీపీకి కూడా ఫిర్యాదు చేశాం. తక్షణమే న్యాయపరమైన చర్యలు చేపట్టాలని విన్నవిస్తున్నాం’ అని సుధాకర్‌బాబు చెప్పారు.

వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

- జగన్‌కు అండగా నిలిచిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాలు
- అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాంనాయుడు



సాక్షి, అమరావతి: పెరిగిన పోలింగ్ శాతాన్ని బట్టి ఎవరెన్ని లెక్కలేసుకున్నా రాష్ట్రంలో మరోసారి వచ్చేది ముమ్మాటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురాంనాయుడు చెప్పారు. ఆయన బుధవారం విజయవాడలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని మెజార్టీ నియోజకవర్గాల్లో ఓటింగ్ సరళిని పరిశీలించానని, పెరిగిన పోలింగ్‌పై బూత్‌ల వారీగా విశ్లేషించానని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాలు జగన్‌కి జై కొట్టినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. ముఖ్యంగా మహిళా ఓటింగ్ పెరగడం వైఎస్సార్‌సీపీకి కలిసొచ్చే విషయమని తెలిపారు. గత ఐదేళ్లుగా డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా లబ్ధిపొందిన మహిళలంతా జగన్‌కు వెన్నుదన్నుగా నిలిచారని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలన్నీ జట్టుకట్టి సీఎం వైఎస్ జగన్‌ను లక్ష్యంగా చేసుకుని పనిగట్టుకుని దుష్ప్రచారం చేశాయని, మరోపక్క వారితో జతకట్టిన ఎల్లో మీడియా విషం చిమ్మిందని పేర్కొన్నారు. అయినా సామాన్య ప్రజలెవరూ నమ్మలేదని చెప్పారు. దొంగ హామీలతో మరోసారి అధికారంలోకి రావాలని చంద్రబాబు చేసిన కుట్రలను రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టారన్నారు. ముఖ్యంగా కాపు జాతి ఆత్మగౌరవాన్ని బాబు కాళ్లవద్ద తాకట్టుపెట్టిన పవన్‌కళ్యాణ్‌ను కాపు సామాజిక వర్గీయులెవరూ నమ్మలేదని చెప్పారు. ఈ విషయం జూన్ 4న వచ్చే ఫలితాలతో స్పష్టమవుతుందన్నారు. పోలింగ్‌కు ముందు ఆడినట్టుగా ఇప్పుడూ బాబు కూటమి మైండ్‌గేమ్ ఆడుతోందని, నూరుశాతం మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావడం ఖాయమని తెలిపారు. గత ఐదేళ్లుగా ఆక్వారంగానికి వెన్నుదన్నుగా నిలవడంతో మెజార్టీ ఆక్వారైతులు జగన్‌కు అండగా నిలిచారని చెప్పారు. త్వరలో ఏర్పడే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆక్వారంగానికి, ఆక్వారైతులకు మరింత మేలు జరిగేలా అప్సడా ద్వారా ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.

టీడీపీ దర్శి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిపై కేసు

- ఎన్నికల అల్లర్లపై ఆరు కేసులు
- ఈవీఎం పగులగొట్టిన వ్యక్తి పోలీసుల నుంచి తప్పించుకుని పరారీ

దర్శి: ఎన్నికల సందర్భంగా ప్రకాశం జిల్లా దర్శి మండలంలో జరిగిన పలు ఘటనల్లో 6 కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..బొట్లపాలెంలో ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ గ్రామంలో పోలింగ్ ఆపాలని నిబంధనలకు విరుద్ధంగా ధర్నాకు దిగిన టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిపై కేసు నమోదు చేశారు. ఆమెతో పాటు ధర్నా చేసిన వారి వివరాలు తెలుసుకుని కేసులు నమోదు చేయనున్నారు. దర్శిలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని ఎంఈవో కార్యాలయంలోని పోలింగ్ బూత్‌లో ఈవీఎం పగులకొట్టిన టీడీపీ నేత వీసీ రెడ్డిపై కేసు నమోదైంది. ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకోగా కళ్లు తిరుగుతున్నాయని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి పోలీసులు కళ్లుగప్పి వీసీ రెడ్డి పరారయ్యాడు. పోలీసుల వైఫల్యంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. వీసీ రెడ్డి కోసం పోలీసులు వెతుకుతున్నారు. పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద పోలింగ్ బూత్ వద్ద అల్లర్లు సృష్టించి పోలీసులపై రాళ్లు రువ్విన కేసులో దారం సుబ్బారావు పై కేసు నమోదు చేశారు. రాళ్లు రువ్విన వారి వీడియోలు పరిశీలించి బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పారు. బొట్లపాలెంలో జరిగిన గొడవల్లో క్షతగాత్రులు ఇచ్చిన ఫిర్యాదులపై 2 కేసులు నమోదు చేసి ఇరువర్గాలపై కలిపి 22 మంది పై కేసులు నమోదు చేశారు. దేవవరంలో వైఎస్సార్ సీపీకి చెందిన కిష్టిపాటి నాగిరెడ్డిని శేషంవారిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తులు దేవవరం వచ్చి తల పగులగొట్టిన కేసులో సానె గురువయ్య, సానె వీరాంజనేయులు, ఎ.నరసింహారావు, ఎస్.శ్రీను, అచ్చయ్య, ముత్యాల నరశింహంపై కేసు నమోదు చేశారు.



టీడీపీ నేత వీసీ రెడ్డిని చొక్కా పట్టుకుని లాక్కెళుతున్న పోలీసులు

ఈనాడుపై న్యాయ పోరాటం

ఆర్టీసీ బహుజన ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రకటన



చిర్రా శ్యాంసన్

తణుకు టౌన్: ఆర్టీసీ ఉద్యోగులు చెప్పినట్టుగా ఈనాడు పత్రికలో కథనాన్ని ప్రచురించడంపై న్యాయపోరాటం చేస్తామని ఏపీఎస్ఆర్టీసీ బహుజన ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిర్రా శ్యాంసన్ ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 28న ‘బతుకు చక్రబంధం’ శీర్షికన తాను ఈనాడుకు చెప్పినట్టుగా కథనం ప్రచురించారని.. వాస్తవానికి ఎలాంటి వీడియో, ఆడియో తన నుంచి తీసుకోలేదని పేర్కొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్త రాసే ఉద్దేశంతో యూనియన్ నాయకులుగా వ్యవహరిస్తున్న తమ పేర్లతో కథనం రాశారని, ఆ కథనానికి తమకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తమకు సంబంధం లేకుండానే కథనం ప్రచురించినందువల్ల సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి ఈఏపీ సెట్

- 142 సెంటర్లలో సీబీటీ మోడ్‌లో పరీక్ష
- 3,61,640 మంది దరఖాస్తు
- ప్రతి హాల్ టికెట్ వెనుక సెంటర్ రూట్ మ్యాప్
- విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి రావాలి
- ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



మాట్లాడుతున్న కే హేమచంద్రారెడ్డి. చిత్రంలో కె. రామ్మోహన్ రావు, జీవీఆర్ ప్రసాద్ రాజు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు శుక్రవారం నుంచి జరిగే ఏపీ ఈఏపీ సెట్ –2024 కు పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మంగళగిరిలోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి 23 వరకు 142 సెంటర్లలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోనూ రెండు సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం హాల్ టికెట్ వెనుక పరీక్ష కేంద్రం రూట్ మ్యాప్ ముద్రించామన్నారు. హాల్ టికెట్‌తో పాటు గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఆభరణాలతో పరీక్ష కేంద్రంలోనికి అనుమతించబోమన్నారు. చేతులకు గోరింటాకు పెట్టుకుంటే బయోమెట్రిక్ సమయంలో సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం దూర ప్రాంతంలోని పరీక్ష కేంద్రాలకు ప్రత్యేక బస్సులను నడపాలని ఆర్టీసీని కోరామన్నారు.

గత ఏడాదికంటే ఎక్కువ దరఖాస్తులు

ఎన్నికల కారణంగా ఈ నెల 13 నుంచి జరగాల్సిన ప్రవేశ పరీక్షలను 16కి మార్చినట్టు చెప్పారు. ఈఏపీ సెట్‌కు ఎంపీసీ స్ట్రీమ్‌లో 2,73,008, బైపీసీ స్ట్రీమ్‌కు 87,421, ఎంబైపీసీకి 1,211తో కలిపి మొత్తం 3,61,640 మంది దరఖాస్తు చేశారన్నారు. గతేడాది 3,38,739 దరఖాస్తులతో పోలిస్తే 22,901 దరఖాస్తులు అధికంగా వచ్చాయన్నారు. ముఖ్యంగా ఎంపీసీ స్ట్రీమ్‌లో 34,828 దరఖాస్తులు పెరిగాయన్నారు.

నంద్యాలలో సెంటర్ల మార్పు

ఎన్నికల్లో భాగంగా స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల కోసం నంద్యాలలో ముందుగా ప్రకటించిన శాంతిరామ్ ఇంజనీరింగ్ కాలేజీ, ఆర్జీఎంఐటీ కళాశాల సెంటర్ల నుంచి పరీక్ష కేంద్రాలను మార్చినట్టు చెప్పారు. అక్కడ పరీక్షలు రాయాల్సిన సుమారు 4,500 మంది విద్యార్థులకు సమీపంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కాలేజీ (అటానమస్), శ్రీరామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కాలేజీ (అటానమస్), ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీల్లో సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఎస్ఎంఎస్‌లు, ఫోన్ కాల్స్, ఈ మెయిల్ ద్వారా ఈ సమాచారం అందించామన్నారు. ఈ విద్యార్థుల రివైజ్డ్ హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో ఉంచామని, 4 వేల మందికిపైగా వాటిని డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులు పొరపాటున పాత సెంటర్లకు వెళితే వారికి ఇబ్బంది కలగకుండా రెండు సెంటర్ల వద్ద ప్రత్యేక అబ్జర్వర్లు, వాహనాలను అందుబాటులో ఉంచామన్నారు. సందేహాల నివృత్తికి కోసం హెల్ప్ లైన్ (0884 2359599, 0884 2342499) నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తెలంగాణతో సంప్రదింపులు జరుపుతున్నాం

ఇప్పటి వరకు విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు తెలంగాణలో, తెలంగాణ విద్యార్థులకు ఏపీలో 15 శాతం సీట్లు రెండు రాష్ట్రాలు కేటాయిస్తున్నట్టు చెప్పారు. కానీ, ఈ ఏడాది జూన్ 2 నాటికి పదేళ్లు ముగియనుండటంతో ఆ తర్వాత నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో తెలంగాణ ప్రభుత్వం ఏపీ విద్యార్థులకు 15 శాతం సీట్లను కేటాయించేది లేదని చెప్పారన్నారు. దీనిపై ఏపీ ఉన్నత విద్య అధికారులు తెలంగాణ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఈఏపీసెట్ చైర్మన్, జేఎన్‌టీయూ కాకినాడ వైస్ చాన్సలర్ జీవీఆర్ ప్రసాద రాజు, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్‌పర్సన్లు కె. రామమోహన రావు, పి.ఉమామహేశ్వరీదేవి, కార్యదర్శి వై.నజీర్ అహ్మద్, సెట్స్ ప్రత్యేక అధికారి ఎం.సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన డబ్బు పంపిణీ వీడియో వైరల్

పోలవరం రూరల్: ఏలూరు జిల్లా పోలవరం మండలంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పంపిణీ చేశామంటున్న డబ్బు వివరాలపై బుధవారం పోలవరంలో జరిగిన సమావేశంలో వాడివేడిగా జరిగిన వాగ్వివాదాల వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరలవుతోంది. డబ్బు పంపిణీ సరిగా చేయలేదంటూ ఒకరినొకరు విమర్శించుకుంటున్న ఈ వీడియో నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు డబ్బు పంపిణీ సరిగా జరగలేదని కూటమికి సంబంధించి కార్యకర్తలు ఆరోపించారు. దీనిపై నిర్వహించిన సమావేశంలో పార్టీ గెలుపు, నగదు పంపిణీ వ్యవహారంపై విస్తృతంగా చర్చించుకున్నారు. ఈ మండలానికి పంపిణీకి ఎంత సొమ్ము వచ్చింది? ఎన్ని ప్రాంతాల్లో పంపిణీ చేశారు? ఎవరు పంపిణీలో ప్రధాన భూమిక పోషించారు, నగదును పూర్తిస్థాయిలో ఎందుకు పంచలేదు, మిగిలిన సొమ్ము ఏమైందంటూ ఆ సమావేశంలో ప్రశ్నల వర్షం కురిపించారు. సుమారు గంట సేపు జరిగిన చర్చల అనంతరం ఆయా పార్టీల శ్రేణులు వెనుదిరిగాయి. ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేసి నెగ్గాలని చూసిన కూటమి తీరును పలువురు తప్పుపడుతున్నారు.

అఖిలప్రియ అనుచరుడిపై హత్యాయత్నం

టీడీపీ నేత ఏవీ సుబ్బారెడ్డే కారణమని బాధితుడి ఫిర్యాదు

ఆళ్లగడ్డ: మాజీ మంత్రి అఖిలప్రియ అనుచరుడు నిఖిల్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనతో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ ఒక్కసారిగా ఉలిక్కి పడింది. దాడికి టీడీపీకి చెందిన రెండు వర్గాల మధ్యనున్న పాత కక్షలే కారణమని భావిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు చెందిన నిఖిల్ మాజీ మంత్రి అఖిలప్రియకు అనుచరుడు. మంగళవారం అర్ధరాత్రి అఖిలప్రియ ఇంటి ముందు ప్రధాన రోడ్డుపై నిఖిల్ మరికొందరితో కలిసి పహారా కాస్తున్నాడు. ఇంతలో నాలుగురోడ్ల సెంటర్ నుంచి దూసుకొచ్చిన కారు నిఖిల్‌ను ఢీకొట్టింది. అనంతరం కిందపడ్డ నిఖిల్‌పై దుండగులు రాడ్లు, కత్తులతో విచక్షణా రహితంగా నరికారు. తప్పించుకున్న నిఖిల్.. అఖిలప్రియ ఇంట్లోకి పారిపోయాడు. దీంతో దుండగులు అక్కడి నుంచి అదే కారులో ఉడాయించారు. విషయం తెలిసిన వెంటనే సీఐ రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని నంద్యాల వైద్యశాలకు తరలించారు. టీడీపీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి ప్రోద్బలంతో చంద్ర, మరి కొంత మంది తనను హత్య చేసేందుకు యత్నించారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెడ్‌బుక్ కేసు విచారణ జూన్ 18కి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో సాక్షులను ‘రెడ్ బుక్’ పేరుతో లోకేశ్ బెదిరిస్తున్న పిటిషన్‌పై విచారణను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం జూన్ 18వ తేదీకి వాయిదా వేసింది. న్యాయస్థానంలో బుధవారం ఈ కేసు విచారణ సందర్భంగా లోకేశ్ తరఫు న్యాయవాదులు తమ అభ్యంతరాలను వినేందుకు సమయం ఇవ్వాలని కోరారు. దాంతో కేసు విచారణను న్యాయస్థానం వాయిదా వేసింది. స్కిల్ స్కామ్ కేసులో అప్రూవర్‌గా మారిన చంద్రకాంత్ షా, అసైన్డ్ భూముల కేసులో అప్రూవర్‌గా మారిన కె.బ్రహ్మానందరెడ్డి తమ వాంగ్మూలాలను నమోదు చేయాలని కోరుతూ వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను కూడా న్యాయమూర్తి జూన్ 18వ తేదీకి వాయిదా వేశారు.

తిరుపతి గంగమ్మ జాతరకు శ్రీకారం

చాటింపుతో ఆరంభమైన తాతయ్యగుంట గంగమ్మ జాతర

నేడు అమ్మవారికి సారె సమర్పించనున్న ఎమ్మెల్యే భూమన



బైరాగి వేషంలో గంగమ్మ ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

తిరుపతి కల్చరల్: ప్రాచీనమైనదిగా ప్రాచుర్యం పొంది దేశానికి జాతర ఉత్సవాల సంస్కృతిని వ్యాప్తి చేసిన శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరకు తిరుపతిలో శ్రీకారం చుట్టారు. గంగజాతరలో అత్యంత భాగస్వామ్యమైన కైకాల వంశీయులు విశేష పూజలనంతరం మంగళవారం అర్ధరాత్రి తిరుపతి సరిహద్దుల్లో అష్టబంధనం చేపడుతూ డప్పు వాయిద్య దరువుల నడుమ చేపట్టిన చాటింపుతో గంగజాతర ప్రారంభమైంది. గంగమ్మ తల్లి పుట్టినిల్లుగా భావించే అవిలాల నుంచి పుట్టింటి సారె గంగమ్మకు సమర్పణ అనంతరం చేపట్టిన చాటింపు గంగమ్మతల్లి జానపద కళా జాతర సంబరాలు భక్తజన సందడితో హోరెత్తాయి. 7 రోజుల పాటు పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు కులమతాలకు అతీతంగా వేషధారణలతో పురవీధుల్లో సందడి చేస్తూ అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. ఈనెల 21న అర్ధరాత్రి తర్వాత శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో కొలువయ్యే అమ్మవారి విశ్వరూపాన్ని దర్శించుకునేందుకు అనేక ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు జాతరకు హాజరై అమ్మవారిని దర్శించుకోనున్నారు. గంగమ్మ జాతర ప్రారంభం కావడంతో తిరుపతి గ్రామదేవతగా భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మకు గురువారం టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సాంప్రదాయ సారెను సమర్పించనున్నారు. పద్మావతి పురంలోని ఎమ్మెల్యే స్వగృహం నుంచి గంగమ్మ ఆలయం వరకు అమ్మవారి సారె మహోత్సవం సాగనుంది. ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే భూమన కుటుంబం సారథ్యంలో భక్తుల నడుమ, జానపద కళా రూపాల ప్రదర్శనలు, డప్పు దరువులు, మేళ తాళాలు, మంగళవాయిద్యాల మధ్య అమ్మవారికి సారె ఊరేగింపు సాగనుంది.

జార్ఖండ్ మంత్రి ఆలంగీర్ అరెస్ట్



రాంచీ: కాంగ్రెస్ నేత, జార్ఖండ్ గ్రామీణాభి వృద్ధి శాఖ మంత్రి ఆలంగీర్ ఆలంను మనీ లాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అరెస్ట్ చేశారు. రాంచీలోని జోనల్ కార్యాలయంలో మంగళవారం 9 గంటలపాటు ఆయన్ను విచారించారు. బుధవారం కూడా ఆరు గంటలపాటు విచారించిన అనంతరం కస్టడీలోకి తీసుకున్నారు. గత వారం ఈడీ బృందం రాంచీలోని ఓ ఇంట్లో జరిపిన సోదాల్లో రూ.32 కోట్ల నగదు పట్టుబడటంతో ఇందుకు సంబంధించి ఆలం వ్యక్తిగత కార్యదర్శి, రాష్ట్ర పరిపాలనా విభాగం అధికారి సంజీవ్ కుమార్ లాల్‌తోపాటు ఆయన పనిమనిషి జహంగీర్ ఆలంను అరెస్ట్ చేయడం తెల్సిందే. మంత్రి ఆలంగీర్‌తో పాటు ఇతర పలుకుబడి కలిగిన వ్యక్తుల తరఫున కాంట్రాక్టర్ల నుంచి లాల్ కమీషన్లు వసూలు చేస్తున్నారని ఈడీ ఆరోపిస్తోంది.

జ్యోతిరాదిత్యకు మాతృవియోగం



మాధవీ రాజె

న్యూఢిల్లీ/గ్వాలియర్: కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తల్లి మాధవీ రాజె సింధియా(70) బుధవారం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో కన్నుమూశారు. న్యుమోనియా, సెప్సిస్‌తో బాధపడుతున్న మాధవీ రాజె మూడు నెలలుగా ఎయిమ్స్‌లోనే చికిత్స పొందుతున్నారు. కొన్ని రోజులుగా వెంటిలేటర్‌పై కొనసాగుతున్న ఆమె బుధవారం ఉదయం 9.28 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. నేపాల్ రాజ కుటుంబీకురాలైన మాధవీ రాజె, మధ్యప్రదేశ్‌కు చెందిన ఒకప్పటి గ్వాలియర్ రాజ కుటుంబ వారసుడు, కేంద్ర మాజీ మంత్రి మాధవ్‌రావు సింధియాను 1966లో వివాహమాడారు. ఈ దంపతులకు కుమారుడు జ్యోతిరాదిత్య సింధియా, కుమార్తె చిత్రాంగద రాజె సింగ్ ఉన్నారు. గురువారం ఆమె అంత్యక్రియలు గ్వాలియర్‌లో జరుగుతాయని కుటుంబవర్గాలు తెలిపాయి. మాధవీ రాజె సింధియా మృతిపట్ల ప్రధాని మోదీ సంతాపం ప్రకటించారు. ఆమె మృతి తీరని లోటని పేర్కొన్నారు.

'న్యూస్‌క్లిక్' పురకాయస్థ అరెస్ట్ అక్రమం

కస్టడీ నుంచి విడుదల చేయండి: సుప్రీం



న్యూఢిల్లీ: న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పురకాయస్థ అరెస్ట్ చట్టం దృష్టిలో చెల్లదని పేర్కొంటూ ఆయనను కస్టడీ నుంచి విడుదలచేయాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. ''గత ఏడాది అక్టోబర్ నాలుగో తేదీన ఆయన రిమాండ్ ఉత్తర్వులను ఢిల్లీ హైకోర్టు జారీచేయడానికి ముందే పురకాయస్థకు రిమాండ్ దరఖాస్తు ప్రతిని చట్టప్రకారం ఇవ్వాలి. కనీసం ఆయన తరఫు లాయర్‌కు ఆ రిమాండ్ అప్లికేషన్ కాపీని ఇవ్వలేదు. చట్టం దృష్టిలో ఈ రకంగా అరెస్ట్ చెల్లదు. ఆ లెక్కన రిమాండ్‌కు పంపడం కూడా చట్టప్రకారం కుదరదు. అందుకే పంకజ్ బన్సల్ కేసు తరహాలోనే ఈయన విడుదలకు ఆదేశాలిస్తున్నాం'' అని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం పేర్కొంది. దీంతో బుధవారం తిహార్ జైలు నుంచి పురకాయస్థ విడుదలయ్యారు. '' ఈయన అరెస్ట్‌కు, రిమాండ్‌కు ఆదేశాలిస్తూ గతంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేస్తున్నాం. గత ఏడాది అక్టోబర్ మూడున అరెస్ట్ చట్టవ్యతిరేకం కాబట్టి విడుదల వేళ ఆయన ఎలాంటి పూచీకత్తు బాండ్లు సమర్పించాల్సిన అవసరం లేదు. కానీ ఇప్పటికే ఈ కేసులో చార్జ్‌షీట్ కోర్టులో దాఖలుచేసిన కారణంగా ట్రయల్ కోర్టు సంతృప్తిమేరకు బెయిల్ బాండ్లను సమర్పించాలని ఆదేశిస్తున్నాం'' అని కోర్టు వివరించింది.

పిండానికీ జీవించే ప్రాథమిక హక్కుంది

27 వారాల గర్భ విచ్ఛిత్తికి సుప్రీం నో



న్యూఢిల్లీ: 27 వారాల గర్భ విచ్ఛిత్తికి అనుమతించాలంటూ 20 ఏళ్ల అవివాహిత వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. పిండానికి కూడా జీవించే ప్రాథమిక హక్కు ఉందని వ్యాఖ్యానించింది. గర్భవిచ్ఛిత్తికి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు మే 3వ తేదీన ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బాధితురాలు వేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఎస్ భట్టి, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారించింది. బాధితురాలు నీట్‌కు ప్రిపేరవుతోందని, ఆమె ప్రస్తుతం బయటకు వెళ్లలేని బాధాకరమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఆమె శారీరక, మానసిక శ్రేయస్సును పరిగణనలోకి తీసుకోవాలని ఆమె తరఫు లాయర్ తెలిపారు. స్పందించిన ధర్మాసనం.. 'కడుపులో ఉన్న ఏడు నెలల పిండానికి కూడా జీవించే ప్రాథమిక హక్కు ఉంది. దానిపై మీరేం చెబుతారు? చట్టానికి విరుద్ధంగా ఎటువంటి ఆదేశాలను జారీ చేయలేం' అని పేర్కొంది.

స్లొవాకియా ప్రధానిపై కాల్పులు

- మీటింగ్ నుంచి తిరిగి వెళ్తుండగా దారుణం
- నాలుగైదు రౌండ్లు పేల్చిన దుండగుడు
- తల, ఛాతీ, పొట్టలో గాయాలు, పరిస్థితి విషమం
- పోలీసుల అదుపులో అనుమానితుడు



కాల్పులకు కొద్దిసేపటి ముందు మీడియాతో మాట్లాడుతున్న ఫికో



దుండగుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రేగ్: స్లొవాకియా ప్రధానమంత్రి రాబర్ట్ ఫికో (59)పై హత్యాయత్నం జరిగింది. ఆయన బుధవారం మధ్యాహ్నం హండ్లోవా నగరంలో ఓ ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తిరిగి వెళ్తూ భవనం బయట గుమిగూడిన అభిమానులకు అభివాదం చేస్తుండగా ఓ దుండగుడు తుపాకీతో ఆయనపై నాలుగైదు రౌండ్లకు పైగా కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడ్డ ఫికోను హుటాహుటిన బాన్స్క్ బైస్ట్రికాలోని ఆస్పత్రికి హెలికాప్టర్‌లో తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు ప్రధాని అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేసిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. తూటాలు పొట్టలోంచి దూసుకుపోయినట్టు చెబుతున్నారు. ఫికో తలకు, ఛాతీకి కూడా గాయాలైనట్టు ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. ఘటన జరిగిన వెంటనే అనుమానితున్ని ప్రధాని బాడీగార్డులతో పాటు అభిమానులు నిర్బంధించినట్టు సమాచారం. దీన్ని దేశ ప్రజాస్వామ్యంపైనే దాడిగా అధ్యక్షురాలు జుజానా కపుటోవా అభివర్ణించారు. దుండగునిగా భావిస్తున్న 71 ఏళ్ల అనుమానితున్ని అదుపులోకి తీసుకున్నట్టు ప్రకటించారు. అతను రచయిత అని, ప్రత్యర్థి పార్టీకి చెందిన రాజకీయ కార్యకర్త అని రకరకాలుగా వార్తలొస్తున్నాయి. దుండగుడు తన లైసెన్స్‌డ్ తుపాకీతో కాల్పులకు తెగబడ్డట్టు సమాచారం. దాడికి కారణం తెలియరాలేదు. దాడి సమయంలో స్లొవాకియా పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నాయి. ఘటనపై స్పీకర్ ప్రకటన అనంతరం సభ వాయిదా పడింది. మూడు వారాల్లో యూరోపియన్ పార్లమెంట్‌కు ఎన్నికలు జరగనున్నాయి. వాటిలో ఫికో పార్టీతో కూడిన అతివాద పక్షాల కూటమిదే పై చేయి అవుతుందని భావిస్తున్న వేళ ఈ దారుణం చోటుచేసుకుంది. దాడిని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, నాటో ప్రధాన కార్యదర్శి జెన్స్ స్టోల్టెన్‌బర్గ్, ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లియన్, పలు దేశాల అధినేతలు తీవ్రంగా ఖండించారు.

రష్యా అనుకూలుడు

ఫికో రష్యా అనుకూలునిగా పేరుబడ్డారు. దేశవ్యాప్తంగా ప్రజాదరణ ఉన్న నాయకుడు. గత సెప్టెంబర్లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో రష్యా అనుకూల, అమెరికా వ్యతిరేక ప్రచారంతో తన జాతీయవాద సంకీర్ణ కూటమికి విజయం సాధించిపెట్టి మూడోసారి ప్రధాని అయ్యారు. వెంటనే ఉక్రెయిన్‌కు సాయాన్ని నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఫికో రాకతో స్లొవాకియా పాశ్చాత్య అనుకూల విధానాలకు తెరపడుతుందని, హంగరీ వంటి యూరప్ దేశాల మాదిరిగా రష్యా అనుకూల వైఖరితో దేశ భద్రతను ఆయన ప్రమాదంలోకి నెడతారని విమర్శకులు అంటున్నారు. ఫికో విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ కొద్ది రోజులుగా రాజధానిలో వేలాదిమంది రోడ్లపైకి వచ్చి ఆందోళనలకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనపై దాడి జరిగింది. ఫికో, దేశాధ్యక్షుడు కపుటోవా రాజకీయ ప్రత్యర్థులు. ఫికో రాజకీయ మిత్రుడైన పీటర్ పలెగ్రినీ ఇటీవలే అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. దేశ ప్రజాస్వామ్యానికి పొంచి ఉన్న పెను ముప్పుకు ఫికోపై దాడి తాజా ఉదాహరణ అని పలెగ్రినీ అన్నారు. రాజకీయ అభిప్రాయాలను పోలింగ్ బూత్‌ల్లో కాకుండా ఇలా తూటాల ద్వారా వ్యక్తం చేస్తూ పోతే దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు 30 ఏళ్లుగా చేసిన కృషి మట్టిపాలవుతుందని ఆవేదన వెలిబుచ్చారు. చెకస్లొవాకియా 1992లో చెక్ రిపబ్లిక్, స్లొవాకియాగా విడిపోవడం తెలిసిందే.

బైడెన్, ట్రంప్ రె'ఢీ'

డిబేట్‌కు సిద్ధమని ప్రకటించిన అధ్యక్ష అభ్యర్థులు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ఇరు పార్టీల అభ్యర్థులు వాదనలతో ఎదురెదురుగా బలాబలాలు తేల్చుకునే 'చర్చల' అంకానికి డెమొక్రటిక్ అభ్యర్థి జో బైడెన్, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తెరలేపారు. సీఎన్ఎన్ టీవీ ఛానల్‌లో జూన్ 27వ తేదీన, ఏబీసీ ఛానల్‌లో సెప్టెంబర్ పదో తేదీన ఈ డిబేట్‌లు ఉంటాయి. మూడు దశాబ్దాలుగా డిబేట్‌లు నిర్వహించే 'కమిషన్ ఆన్ ప్రెసిడెన్షియల్ డిబేట్'ను కాదని ఈసారి మీడియాసంస్థల ఆధ్వర్యంలో టీవీ ఛానళ్లలో డిబేట్‌కు బైడెన్ ప్రచార బృందం ఓకే చెప్పింది. ''అట్లాంటా స్టూడియోలో ఈ డిబేట్‌ను నిర్వహిస్తాం' అని సీఎన్ఎన్ తెలిపింది. జనం మధ్యలో డిబేట్ జరిపితే బాగుంటుందని ట్రంప్ అన్నారు.

మతం ఆధారంగా బడ్జెట్ కేటాయింపులా?


- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 15 శాతం నిధులు మైనార్టీలకే
- మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంలో మోదీ ధ్వజం



నాసిక్: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో 15 శాతం నిధులను మైనార్టీలకే కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ కుట్రలు పన్నుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. మతం ఆధారంగా బడ్జెట్ కేటాయింపులను తాము అనుమతించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. అలాగే విద్య, ఉద్యోగాల్లో మతపరమైన రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమని స్పష్టంచేశారు. 2004 నుంచి 2014 దాకా కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు బడ్జెట్‌లో 15 శాతం నిధులను వారికి ప్రీతిపాత్రమైన ఓటు బ్యాంక్‌కు కట్టబెట్టడానికి ప్రయత్నించిందని చెప్పారు. అప్పట్లో బీజేపీ గట్టిగా ప్రతిఘటించడంతో కాంగ్రెస్ వెనక్కి తగ్గిందని పేర్కొన్నారు. ఆ సమయంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న తాను కాంగ్రెస్ ప్రతిపాదనను వ్యతిరేకించానని తెలిపారు. కానీ, మైనార్టీలకు 15 శాతం నిధుల ఆలోచనను కాంగ్రెస్ ఇప్పటికీ విరమించుకోలేదని, ఒకవేళ కేంద్రంలో అధికారంలోకి వస్తే అమలు చేయాలని యోచిస్తోందని విమర్శించారు. బుధవారం మహారాష్ట్రలోని పింపాల్‌గావ్ బస్వంత్, థానే పట్టణాల్లో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. మతం ఆధారంగా బడ్జెట్ కేటాయింపులు అనేది చాలా ప్రమాదకరమైన ఆలోచన అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మత ఆధారంగా దేశాన్ని ఇప్పటికే ఒకసారి విభజించిందని, మరోసారి అలాంటి పథకమే రచిస్తోందని ధ్వజమెత్తారు. తాము మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం సాధించిన ఘనతలను ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఇప్పుడు జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు కేవలం ఎంపీలను ఎన్నుకోవడం కోసం కాదని అన్నారు. దేశం కోసం బలమైన నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం గల ప్రధానమంత్రిని ఎన్నుకోవడానికి జరుగుతున్నాయని ఉద్ఘాటించారు. ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని వివరించారు. గత పదేళ్లలో తన పని తీరును ప్రజలు గమనించారని. వికసిత్ భారత్ కోసం తనను మూడోసారి గెలిపించాలని కోరారు.

కేజ్రీవాల్‌కు స్పెషల్ ట్రీట్‌మెంట్ !

- చాలా మంది ఇలాగే భావిస్తున్నారు
- కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్‌పై అమిత్ షా వ్యాఖ్య



న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానంలో అవకతవకలు జరిగాయంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్ట్ చేసిన అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిల్ సాధారణ 'ప్రక్రియ'లాగా లేదని బీజేపీ అగ్రనేత అమిత్ షా వ్యాఖ్యానించారు. బుధవారం ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అమిత్ షా పలు అంశాలపై మాట్లాడారు. ఇంటర్వ్యూ విశేషాలు ఆయన మాటల్లోనే..

జడ్జీలు ఇది గమనించాలి

''కేజ్రీవాల్‌కు ఎన్నికల సందర్భంగా బెయిల్ రావడం చూస్తుంటే సుప్రీంకోర్టు ఆయన విషయంలో స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇచ్చినట్లు అనిపిస్తోంది. ఈ మాట నేను అనట్లేదు. దేశవ్యాప్తంగా చాలా మంది ఇలాగే భావిస్తున్నారు. విపక్షాల కూటమి అధికారంలోకి వస్తే తాను మళ్లీ జైలు కెళ్లాల్సిన అవసరం రాదని బెయిల్ తర్వాత కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ వ్యాఖ్యలు పూర్తిగా కోర్టు ధిక్కారమే. ఎవరైనా ఎన్నికల్లో గెలిస్తే వాళ్లను సుప్రీంకోర్టు జైలుకు పంపదని ఆయన మాటల్లోని అసలు అర్థం. ఆయన మాటలు విన్నాక అయినా ఆయనకు బెయిల్ ఇచ్చిన జడ్జీలు.. కేజ్రీవాల్ బెయిల్‌ను ఎలా వాడుకుంటున్నారు, ఎంతగా దుర్వినియోగం చేస్తున్నాడు అనే విషయాన్ని గమనించాలి'' అని షా విజ్ఞప్తిచేశారు.

బెయిల్ తీర్పుపై..

''చట్టాన్ని ఏ కేసుల్లో ఎలా అపాదించాలో సర్వోన్నత న్యాయస్థానానికి బాగా తెలుసు. అయితే ఈ ఒక్క కేజ్రీవాల్ బెయిల్ విషయంలో మాత్రం కోర్టు ఇచ్చిన తీర్పు మిగతా తీర్పుల్లా సాధారణంగా అనిపించట్లేదు. దేశ జనాభాలో చాలా మంది మనసుల్లో ఇలాంటి భావనే నెలకొంది. తిహార్ జైలు అమర్చిన కెమెరాల సీసీటీవీ ఫుటేజీ నేరుగా ప్రధాని మోదీకి వెళ్తుందని కేజ్రీవాల్ ఆరోపించారు. అది పూర్తిగా అబద్ధం. ఎందుకంటే తిహార్ జైలు కేంద్రం అధీనంలో ఉండదు. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో పనిచేస్తుంది అని వివరించారు.

ప్రధానిగా మోదీ రిటైర్మెంట్‌పై

''వచ్చే ఏడాదికి మోదీకి 75 ఏళ్లు వస్తాయి. 75కి చేరినందుకు బీజేపీ నియమావళి ప్రకారం మోదీని పక్కనబెట్టి అమిత్‌షాను ప్రధాని చేయాలని చూస్తున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. అదంతా అబద్ధం. ఇప్పుడు, ఎప్పుడూ మోదీయే మా ప్రధాని అభ్యర్థి. మేం గెలిచాక 2029 ఏడాదిదాకా మోదీయే ప్రధానిగా కొనసాగుతారు. ఆయన సారథ్యం, మార్గదర్శకత్వంలోనే 2029 సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారానికి వెళ్తాం'' అని అమిత్ అన్నారు.

పీవోకే మనదే వెనక్కి తీసుకొస్తాం: షా

కోల్‌కతా: పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే) ముమ్మాటికీ భారత్‌లో అంతర్భాగమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టంచేశారు. పీఓకేను వెనక్కి తీసుకొస్తామని ప్రకటించారు. పీఓకే ప్రస్తుతం నిరసనలతో అట్టుడికిపోతోందని, అక్కడి ప్రజలు స్వాతంత్ర్యం కోరుకుంటున్నారని చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో గతంలో జనం ఆజాదీ కోసం నినదించే వారని గుర్తుచేశారు. 2019లో ఆర్టికల్ 370 రద్దయ్యాక అవన్నీ ఆగిపోయాయని చెప్పారు. పీఓకే మన దేశంలో కలిసిపోతే అక్కడ శాంతి నెలకొంటుందని శ్రీరాంపూర్ (బెంగాల్) ప్రచార సభలో అన్నారు.

400కుపైగా సీట్లొస్తే ఇండియాలో పీఓకే విలీనం: అస్సాం సీఎం

రామ్‌గఢ్: బీజేపీకి 400కు పైగా స్థానాలు లభిస్తే పీఓకేను ఇండియాలో విలీనం చేయడం తథ్యమని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ వెల్లడించారు. బుధవారం జార్ఖండ్‌లోని రామ్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారంలో హిమంతబిశ్వ శర్మ ఈ వ్యాఖ్యలు చేశారు. శ్రీకృష్ణ జన్మభూమి ఆలయం, జ్ఞానవాపీ ఆలయం నిర్మించడానికి బీజేపీకి 400కుపైగా సీట్లు కావాలన్నారు.

హెచ్1-బీ వీసాదారులకు తీపికబురు

- ఉద్యోగం పోతే 60 రోజులకు పైగా అమెరికాలో ఉండొచ్చు
- వీసా స్టేటస్‌ను మార్చుకొనే అవకాశం

వాషింగ్టన్: అమెరికాలోని ఐటీ కంపెనీలు ఉద్యోగాల్లో కోత విధిస్తున్నాయి. గూగుల్, మెటా, ఆపిల్, డెల్, ట్విటర్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రఖ్యాత కంపెనీల్లో ఉద్యోగాల కోత కొనసాగుతోంది. నాన్-ఇమ్మిగ్రెంట్లను తొలగిస్తున్నాయి. ఫలితంగా వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఈ ఏడాది ఇప్పటిదాకా అమెరికాలో 237 ఐటీ కంపెనీలు 58,499 మందిని తొలగించాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. లే-ఆఫ్‌ల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ప్రధానంగా హెచ్-1బీ వీసాలతో అమెరికా ఐటీ కంపెనీల్లో పని చేస్తున్న భారతీయుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. కంపెనీ యాజమాన్యం జాబ్ నుంచి తొలగిస్తే 60 రోజుల్లోగా మరో ఉద్యోగం వెతుక్కోవాలి. లేకపోతే స్వదేశానికి వెళ్లిపోవాల్సిందే. ఇలాంటి వారికి యూఎస్ సిటిజెన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) తీపి కబురు అందించింది. హెచ్-1బీ వీసాదారులు ఉద్యోగం పోతే 60 రోజులు దాటినా కూడా అమెరికాలోనే చట్టబద్ధంగా ఉండొచ్చని వెల్లడించింది. అయితే, నాన్-ఇమిగ్రెంట్ వీసా స్టేటస్ మార్చుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అమెరికాలోనే ఉన్న జీవిత భాగస్వామిపై డిపెండెంట్‌గా మారొచ్చు. అంటే హెచ్-4, ఎల్-2 వీసా పొందొచ్చు. ఈ వీసాలు ఉన్నవారికి పని చేసుకొనేందుకు(వర్క్ ఆథరైజేషన్) అనుమతి లభిస్తుంది. స్టూడెంట్(ఎఫ్-1), విజిటర్ (బి-1/బి-2) స్టేటస్ కూడా పొందొచ్చు. కానీ, బి-1/బి-2 వీసా ఉన్నవారికి పని చేసుకొనేందుకు అనుమతి లేదు. 60 రోజుల గ్రేస్ పిరియడ్‌లోనే వీసా స్టేటస్ మార్పు కోసం దరఖాస్తు చేసుకోవాలని యూఎస్‌సీఐఎస్ సూచించింది.

రాజ్యాంగ పరిరక్షణే ప్రధానం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: తాను మళ్లీ జైలుకెళ్తే ఎలాగ అనే విషయం వదిలేసి రాజ్యాంగ పరిరక్షణ మీదే దృష్టిపెట్టాలని, అది మీ బాధ్యత అని ఓటర్లకు ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ హితవు పలికారు. బుధవారం చాందినీ చౌక్, నార్త్‌వెస్ట్ ఢిల్లీ కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచార రోడ్‌షోలో కేజ్రీవాల్ ప్రసంగించారు. ' హరియాణా, ఉత్తరప్రదేశ్.. ఇలా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో వాకబు చేశా. దేశవ్యాప్తంగా చూస్తే బీజేపీ గెలవబోయే సీట్లు బాగా తగ్గిపోతున్నాయి. విపక్షాల 'ఇండియా' కూటమి అధికారంలోకి రాగానే దేశాభివృద్ధి కోసం పని మొదలుపెడతాం. దీంతో నియంతృత్వం అంతమవుతుంది. నేను మళ్లీ జైలుకెళ్తే ఎలాగ అన్న ఆలోచనలు పక్కనపడేయండి. రాజ్యాంగ పరిరక్షణే అత్యవశ్యకం. అది మీ బాధ్యత'' అని ఓటర్లకు హితవు పలికారు.



ఢిల్లీలో ఓ మహిళకు పౌరసత్వ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న హోం శాఖ కార్యదర్శి అజయ్

సీఏఏ ద్వారా పౌరసత్వం సర్టిఫికెట్ల జారీ

న్యూఢిల్లీ: శరణార్థులుగా భారత్‌కు వచ్చిన మూడు దేశాలకు చెందిన ముస్లిమేతర కాందిశీకులకు భారత పౌరసత్వం ఇచ్చే ప్రక్రియ మొదలైంది. పౌరసత్వ(సవరణ)చట్టం (సీఏఏ) కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో తొలి విడతగా 14 మందికి బుధవారం ఢిల్లీలో స్వయంగా కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా సర్టిఫికేట్లు అందజేశారు. ఆన్‌లైన్‌లో వందలాది మందికి డిజిటల్ సంతకంతో కూడిన సర్టిఫికెట్లను కేంద్రం ఈమెయిల్ ద్వారా పంపింది. సంబంధిత చట్టం అమల్లోకి వచ్చినట్లు రెండు నెలల క్రితం కేంద్రం నోటిఫై చేసిన తర్వాత పౌరసత్వం ఇవ్వడం ఇదే తొలిసారి. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అధికార, విపక్ష పార్టీలు పలు అంశాలపై పరస్పర విమర్శలు గుప్పించుకుంటున్న ఈ తరుణంలో మోదీ సర్కార్ పౌరసత్వాల జారీ ప్రక్రియ చేపట్టడం గమనార్హం. ''పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లో మతపర వివక్ష, దాడులకు గురైన వారు దశాబ్దాలుగా భారత పౌరసత్వం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుంది' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. '' భారత పౌరసత్వం పొందడం గొప్ప అనుభూతినిస్తోంది. భారత్ నాకు కొత్త జీవితాన్ని ప్రసాదించింది'' అని 24 ఏళ్ల భరత్‌కుమార్ అన్నారు. 11 ఏళ్ల క్రితం పాక్‌లోని సింధ్ నుంచి భారత్‌కు వచ్చిన భరత్ బుధవారం పౌరసత్వం తీసుకున్న వారిలో ఉన్నారు.



ఎన్నికల వి-చిత్రం

ఈయన పేరు బీకే శర్మ. పంజాబ్‌లోని అమృత్‌సర్ జిల్లాలో రోడ్డు పక్కన దాబా నడుపుకుంటున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో అమృత్‌సర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి స్వతంత్రునిగా పోటీ చేస్తున్న బీకే శర్మ బుధవారం తన సొంత దాబాలో ఎప్పటిలాగానే ఇలా వంట చేస్తూ కనిపించారు..!

ఎలక్షన్ బీట్

వారణాసిలో రంగీలా నామినేషన్ తిరస్కరణ

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి లోక్‌సభ స్థానానికి కమెడియన్ శ్యామ్ రంగీలా వేసిన నామినేషన్‌ను తిరస్కరించినట్లు బుధవారం ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అచ్చం ప్రధాని మోదీలా మాట్లాడుతూ శ్యామ్ రంగీలా బాగా పేరు తెచ్చుకున్నాడు. వారణాసిలో ప్రధాని మోదీపై పోటీకి దిగుతానని ఎప్పటి నుంచో ఇతడు చెబుతున్నాడు. అయితే, మే 10వ తేదీ నుంచి నామినేషన్ పేపర్లను ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నా అధికారులెవరూ స్పందించడం లేదని చెప్పాడు. మోదీ నామినేషన్ వేసిన ఈ నెల 14వ తేదీన, కనీసం కలెక్టరేట్ ఆవరణలోకి కూడా తనను రానివ్వలేదని వాపోయాడు. ఎట్టకేలకు సాయంత్రం తన నామినేషన్ పత్రాలను అధికారులు తీసుకున్నారని సోషల్ మీడియాలో ప్రకటించాడు. ఆ మరునాడే అతడి నామినేషన్‌ను తిరస్కరిస్తున్నట్లు ఈసీ తన వెబ్‌సైట్‌లో తెలిపింది. కారణాలను మాత్రం వివరించలేదు. తనను పోటీ చేయనివ్వరాదని ఈసీ ముందే నిర్ణయించుకున్న విషయం దీంతో రుజువైందని 'ఎక్స్' వేదికగా శ్యామ్ వ్యాఖ్యానించాడు.

కూటమికి బయటి నుంచి మద్దతు: మమత

కోల్‌కతా: కాంగ్రెస్‌తో సీట్ల ఒప్పందంలో విభేదాలు రావడంతో ఇండియా కూటమిలో చేరేందుకు ససేమీరా అన్న , తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కాస్త మెత్తబడ్డారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తే.. తాము బయటి నుంచి మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. 'ఇండియా కూటమికి నాయకత్వాన్ని అందిస్తాం. బయటి నుంచే అవసరమైన అన్నివిధాలుగా సహాయపడతాం. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. అప్పుడు బెంగాల్‌లోని మా తల్లులు, అక్కాచెల్లెళ్లకు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా ఉంటాయి. 100 రోజుల ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారికీ ఎలాంటి సమస్యలూ రావు' అని మమత బుధవారం అన్నారు. అయితే ఇండియా కూటమికి మమత తనదైన కొత్త నిర్వచనాన్ని ఇచ్చారు. అందులో సీపీఎం. అధిర రంజన్ చౌదరి నేతృత్వంలోని బెంగాల్ కాంగ్రెస్ భాగస్వాములు కావన్నారు. సీపీఎం, బెంగాల్ కాంగ్రెస్‌లు తమతో లేవని, బీజేపీతో కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు.

మతం పేరుతో ఏమార్చుతోంది: ప్రియాంక

రాయ్‌బరేలీ: ఎన్నికల ప్రచారంలో మతం ప్రస్తావన తెస్తూ బీజేపీ ప్రజల దృష్టిని మరల్చుతోందని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ఆరోపించారు. మతం పేరుతో అధికారంలోకి రావొచ్చనే విషయం గ్రహించిన బీజేపీ..గత పదేళ్లుగా ప్రజల సమస్యలను పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు. బుధవారం ఆమె రాయ్‌బరేలీలో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 'దేశంలో రెండు రకాలైన రాజకీయాలు నడుస్తున్నాయి. అందులో ఒక వర్గం నిజాయతీ, అంకితభావంతో ప్రజలకోసం పనిచేయాలని భావిస్తుండగా మరో వైపు బీజేపీ ప్రజల మనోభావాలను వాడుకుంటూ మతం పేరుతో అధికారంలో కొనసాగుతోంది'అని ఆమె అన్నారు. తమకే ఓట్లేయించాలంటూ రాయ్‌బరేలీలోని గ్రామ పెద్దలను బీజేపీ బెదిరింపులకు గురిచేస్తోందని ప్రియాంక ఆరోపించారు.

ప్రభుత్వరంగం ప్రైవేట్‌పరం

బీజేపీపై రాహుల్ గాంధీ ఆరోపణలు

బలాంగీర్(ఒడిశా): బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం ఒడిశాలోని బాలాంగీర్ పట్టణంలో ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. రాజ్యాంగ ప్రతిని చూపిస్తూ.. '' బీజేపీ ఈ పుస్తకాన్ని చించిపడేయాలని చూస్తోంది. బీజేపీ అందుకు ప్రయత్నిస్తే కాంగ్రెస్‌తోపాటు దేశ ప్రజలంతా ఆ పని జరగకుండా అడ్డుకుంటారు. దేశంలోని పేదలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, రైతులు, కార్మికులు ఎలాంటి లబ్ధిపొందినా అది రాజ్యాంగం వల్లే సాధ్యమైంది. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్‌ను రద్దుచేస్తారు. ప్రభుత్వరంగమంతా ప్రైవేట్‌పరం చేస్తారు. 22 మంది బిలియనీర్లే దేశాన్ని పాలిస్తారు. అందుకే ప్రజాప్రభుత్వం ఏర్పడాల్సిన సమయం వచ్చిందని పదేపదే చెబుతున్నాం'' అని అన్నారు.

దక్షిణాదిన బీజేపీ మాయం: జైరాం రమేశ్

రాంచీ: లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో ప్రధాని మోదీ పదవి నుంచి దిగిపోవడం ఖాయమని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ జోస్యం చెప్పారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ 'ఇప్పటి వరకు జరిగిన పోలింగ్ సరళిని చూసి మోదీలో నిరాశ కనిపిస్తోంది. అమిత్ షా సైతం హోం మంత్రి పదవి నుంచి తప్పుకుంటారు. వీరిద్దరి ప్రచారం 'మోదీ కీ గ్యారెంటీ, వికసిత్ భారత్' బదులుగా ఇప్పుడు మొత్తం హిందూ-ముస్లిం కేంద్రంగానే సాగుతోంది. ఈ అబద్ధాల మహమ్మారిని జూన్ 4 తర్వాత వదిలించుకోబోతున్నాం'అని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా, బీజేపీ దక్షిణాదిన తుడిచిపెట్టుకుపోతుందని, మిగతా చోట్ల ఆ పార్టీకి సగం సీట్లు మాత్రమే దక్కుతాయని ఆయన తెలిపారు.

మేమొస్తే 10 కేజీల ఉచిత బియ్యం: ఖర్గే

లక్నో: కేంద్రంలో 'ఇండియా' కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలకు నెలకు 10 కిలోల చొప్పున బియ్యం ఉచితంగా అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం 5 కిలోలు మాత్రమే ఇస్తోందని, తమ ప్రభుత్వం వచ్చాక రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చారు. దేశంలో ఆహార భద్రత చట్టాన్ని తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. బుధవారం ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో కలిసి ఖర్గే మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటకలో పేదలకు 10 కిలోల బియ్యం ఉచితంగా ఇస్తున్నట్లు గుర్తుచేశారు. కేంద్రంలో తమ ప్రభుత్వం వస్తే దేశమంతటా అమలు చేస్తామన్నారు.

అమిత్ షాతో శ్రీకళారెడ్డి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన బీఎస్పీ నేత శ్రీకళారెడ్డి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. బుధవారం తన ఎక్స్ ఖాతా వేదికగా ఈ విషయాన్ని ప్రకటించడంతో రాజకీయం వేడెక్కింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ప్రధాని మోదీ జౌన్‌పూర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఇదే సభలో ప్రధాని మోదీ సమక్షంలో ఆమె బీజేపీలో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. తెలంగాణకు చెందిన శ్రీకళారెడ్డి జౌన్‌పూర్‌కు చెందిన బలమైన నేత, బీఎస్పీ మాజీ ఎంపీ ధనంజయ్ సింగ్ భార్య. శ్రీకళారెడ్డిని జౌన్‌పూర్ అభ్యర్థిగా బీఎస్పీ ప్రకటించింది. కానీ ఆ తర్వాత ఎందుకో బరిలోనుంచి తప్పించి సిట్టింగ్ ఎంపీ శ్యామ్‌సింగ్ యాదవ్‌కు మళ్లీ టికెట్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో శ్రీకళారెడ్డి కేంద్రమంత్రి అమిత్ షాను బుధవారం కలిశారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం : 16 : మే : 2024

ఇన్ఫోసిస్ అవార్డుల వయో పరిమితి కుదింపు

బనశంకరి: ఈ ఏడాది నుంచి 40 ఏళ్ల లోపు ప్రతిభావంత పరిశోధకులనే ఇన్ఫోసిస్ పురస్కారాలకు ఎంపిక చేస్తామని ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ ట్రస్టీ ఎన్ఆర్ నారాయణమూర్తి తెలిపారు. బుధవారం బెంగళూరులోలో విలేకరులతో నారాయణమూర్తి మాట్లాడారు. సాధారణంగా 15 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు వారికి అవార్డుల కోసం ట్రస్టు ఎంపిక చేస్తుంది. 2024-25లో ఈ వయో పరిమితిని 50 ఏళ్ల నుంచి 40 ఏళ్లకి తగ్గించారు. ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, బయో టెక్నాలజీ, మానసిక, సమాజ విజ్ఞానం, గణితం, భౌతికశాస్త్రంలో సేవలు చేసిన వారికి ఇప్పటివరకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అవార్డులను అందిస్తున్నామన్నారు. ఇకపై అర్థశాస్త్రంలోనూ ప్రత్యేక పురస్కారం అందిస్తామని, మొత్తం ఆరు విభాగాలు అవుతాయని తెలిపారు. ఈ దఫా 2025 జనవరిలో అవార్డులను అందజేస్తామని ఆయన తెలిపారు.

న్యూస్‌రీల్



బుధవారం బెంగళూరు మడివాళ అండర్‌పాస్‌లో ఇరుక్కున్న ట్రక్కు. గంట ప్రయత్నం తరువాత బయటకు వచ్చింది

శ్రీకంఠేశ్వరునికి రూ. 1.72 కోట్ల కానుకలు

మైసూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన జిల్లాలోని నంజనగూడులో శ్రీకంఠేశ్వర దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. రూ. 1.72 కోట్ల విలువైన నగదు, బంగారు కానుకలను భక్తులు సమర్పించారు. దేవస్థాన దాసోహ భవనంలో మొత్తం 35 హుండీల్లోని కానుకలను లెక్కించారు. రూ. 1,72,85,296 నగదు, 33 దేశాల నోట్లు, 92 గ్రాముల బంగారం, 3.5 కేజీల వెండి హుండీలో లభ్యమైనట్లు ఈఓ జగదీశ్ కుమార్ తెలిపారు.

హుబ్లీ- విజయవాడ రైళ్ల రద్దు

దొడ్డబళ్లాపురం: రైల్వే ట్రాక్ భద్రతా పనులు జరుగుతున్నందున నేటి నుంచి హుబ్లీ - విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సంచారాన్ని రద్దు చేశారు. గుంటూరు విభాగం పరిధిలో రైల్వే భద్రతకు సంబంధించిన కొన్ని పనులు ఉన్నందున హుబ్లీ- విజయవాడ స్టేషన్‌ల మధ్య రోజూ సంచరించే 17329, 17330 నంబర్ల రైళ్లను ఈ నెల 16 నుంచి మే 31 వరకు రద్దు చేసినట్లు తెలిపారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు



మైసూరు: రసాయనాలు, విత్తనాలు, ఎరువుల దుకాణాలలో అధికారులు హఠాత్తుగా సోదాలు నిర్వహించారు. సహాయక వ్యవసాయ డైరెక్టర్, వ్యవసాయాధికారి, ఇతర పరిశీలకులు మైసూరు తాలూకాలోని ఎరువులు, పెస్టిసైడ్ల దుకాణలను తనిఖీలు చేశారు. కొన్ని రసాయనాలు, విత్తనాలు, ఎరువులను నాణ్యత పరీక్షల నిమిత్తం లేబోరేటరీకి తరలించారు. కొనుగోలు తర్వాత రైతులకు కచ్చితంగా రసీదులను అందివ్వాలని దుకాణాల యజమానులను ఆదేశించారు. అనేక ఎరువుల షాపుల్లో నాసిరకం ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అధిక రేట్లకు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. వ్యవసాయ సీజన్ ఆరంభం కావడంతో అధికారులు తనిఖీలు ప్రారంభించారు. ఉత్తుత్తి తనిఖీలు కాకుండా నకిలీ ఎరువులు, పురుగు మందులను అమ్మకుండా వ్యాపారులను కట్టడి చేయాలని రైతులు కోరారు.

మహిళ హత్య కేసులో యువతి అరెస్టు



హతురాలు దివ్య, నిందితురాలు మోనిక

యశవంతపుర: కోనసంద్రలో ఈ నెల 10న జరిగిన దివ్య అనే మహిళ హత్య కేసును కెంగేరి పోలీసులు ఛేదించారు. ఇంటిలో అద్దెకు ఉన్న యువతి దివ్యను గొంతు పిసికి చంపేసినట్లు నిర్ధారించారు నిందితురాలిని అరెస్ట్ చేశారు. వివరాలు.. గురుమూర్తి, దివ్య దంపతులకు చెందిన ఇంటిలోని ఒక పోర్షన్‌లో కోలారు జిల్లాకు చెందిన మోనిక (24) అనే యువతి అద్దెకు ఉండేది. ప్రియుడినే భర్తగా చూపి ఇల్లు అద్దెకు తీసుకుంది. ప్రైవేట్ సంస్థలో డేటా ఎంట్రీ అపరేటర్‌గా పని చేస్తోంది. ప్రియుడు అప్పుడప్పుడు వచ్చి వెళ్లేవాడు. విలాసాలకు అలవాటు పడిన మోనిక తన ప్రియుడికి క్యాంటర్ వాహనం కొనివ్వాలని డబ్బు కోసం ప్రయత్నించింది. ఇంటి యజమాని దివ్య మెడలో ఉన్న బంగారంపై మోనికాకు కన్నుపడింది.
దివ్య భర్త గురుమూర్తి కెంగేరి శివనపాళ్యంలో సెలూన్ నడుపుతుండగా, అత్తమామలు ఉదయం పనులకెళ్లి రాత్రికి వచ్చేవారు. దివ్య తన రెండేళ్ల చిన్నారితో ఇంటిలో ఉండేది. గమనించిన మోనిక.. ఈ నెల 10న ప్రియునితో కలసి దివ్యను గొంతుపిసికి హత్య చేసి ఆమె మెడలోని 36 గ్రాముల బంగారం చైన్ తీసుకొని ఉడాయించారు. పోలీసులు అనుమానంతో మోనికను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా అసలు విషయం బయట పడింది. ప్రియుడు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

ప్రజ్వల్.. ఎప్పుడైనా రాక?

- బెంగళూరు విమానాశ్రయంలో పోలీసుల మకాం
- కుమార తిమింగలంపై చర్చ
- వీడియోలపై మేధావుల ఆగ్రహం

బనశంకరి: లైంగిక దాడి ఘటన, అశ్లీల వీడియోలు బయటకు రావడంతో ఎంపీ ప్రజ్వల్ గత నెల 27న విదేశాలకు వెళ్లిపోయారు. ఆయన గురువారం తెల్లవారుజాము లోగా బెంగళూరుకు వచ్చే అవకాశముందని తెలిసింది. లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ ద్వారా వస్తారని తెలిసి సిట్ అధికారులు విమానాశ్రయంలో మకాం వేశారు. ఆయన జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఉన్నారని తెలుస్తోంది. బెంగళూరుకు రావడానికి హర్యానాలోని ఒక ట్రావెల్స్ ద్వారా బిజినెస్ క్లాస్ టికెట్ బుక్ చేసుకున్నట్లు తెలిసింది. ప్రజ్వల్ వచ్చిన తక్షణం అదుపులోకి తీసుకోవాలని సిట్ సన్నద్ధమైంది. విమానాశ్రయంలో పోలీసులను నియమించారు. విచారణకు రావాలని సిట్ ప్రజ్వల్‌కు పలు మార్లు నోటీసులు పంపింది. అలాగే లుక్‌అవుట్ నోటీస్, బ్లూ కార్నర్ నోటీసులు జారీ అయినా స్పందన లేదు. తండ్రి హెచ్‌డీ.రేవణ్ణకు ఈ కేసుల్లో బెయిలు రావడంతో బెంగళూరుకు వచ్చేయాలని ప్రజ్వల్ నిర్ణయించినట్లు సమాచారం. మహిళ కిడ్నాప్ కేసులో ఏ1గా రేవణ్ణ, ఏ2గా ప్రజ్వల్ ఉన్నారు.

హాసన్‌లో 18 చోట్ల సోదాలు

ఎంపీ ప్రజ్వల్ వీడియోల కేసులో బుధవారం సిట్ అధికారులు హాసన్‌లో ముమ్మరంగా సోదాలు చేపట్టారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రీతంగౌడ ఆప్తులైన క్వాలిటీ బార్ శరత్, వల్లభాయిరోడ్డు పునీత్, కృష్ణ హోటల్ యజమాని హెచ్‌పీ.కిరణ్, భువనహళ్లి శ్రీనివాస్ తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలైన పుట్టరాజు పాపణ్ణ, నల్కే నవీన్‌గౌడ, ప్రజ్వల్ మాజీ కారుడ్రైవరు కోటే కార్తీక్, చెన్నరాయపట్టణ బైక్ షోరూం యజమాని శశి, బేలూరు అరేహళ్లి చేతన్‌గౌడ నివాసంలో గాలింపు నిర్వహించారు. శరత్ ఇంట్లో ఐఫోన్‌ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 18 చోట్ల గాలింపు సాగింది.



ఎంపీ ప్రజ్వల్‌ని అరెస్టు చేయాలని బుధవారం కలబుర్గిలో ప్రజాసంఘాల ఆందోళన



ప్రజ్వల్ చిత్రంతో నిరసన (ఫైల్)

న్యాయ పోరాటం చేస్తా: రేవణ్ణ

మహిళ కిడ్నాప్ కేసులో నేను ఎలాంటి తప్పుచేయలేదని, అంతా దేవునికి వదిలిపెట్టానని జేడీఎస్ నేత హెచ్‌డీ.రేవణ్ణ అన్నారు. బుధవారం విలేకరులతో రేవణ్ణ మాట్లాడుతూ తాను ఇప్పుడే హాసన్‌కు వెళ్లనని, బెంగళూరులోనే ఉంటూ న్యాయపోరాటం చేస్తానని చెప్పారు.

తిమింగలం ఎవరు: హోంమంత్రి

పెన్‌డ్రైవ్ వైరల్‌లో తిమింగలం ఎవరు అనేది బహిరంగపరిస్తే ఈ కేసు ముగుస్తుందని మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామికి హోంమంత్రి పరమేశ్వర్ సూచించారు. బెంగళూరులో నివాసంలో పరమేశ్వర్ మాట్లాడుతూ రోజుకో మాట మాట్లాడుతున్నారు. పెన్ డ్రైవ్ వెనకున్న తిమింగలం ఎవరో ఆధారాలు అందించి విచారణ కోరాలన్నారు. ప్రజ్వల్ ఎప్పుడు వస్తున్నాడో తాను బయటకు చెప్పరాదన్నారు. ప్రజ్వల్ గురించి సాహితీవేత్తలు రాసిన లేఖను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని చెప్పారు.

కవులు, మేధావుల ఆక్రోశం

దొడ్డబళ్లాపురం: ఎంపీ ప్రజ్వల్‌ను తక్షణమే అరెస్టు చేయాలని సీఎం సిద్ధరామయ్యకు రాష్ట్రంలోని సాహితీ, మేధావి, ప్రగతిపర సంఘాల నేతలు లేఖ పంపారు. ప్రజ్వల్ కేసు సభ్య సమాజం మొత్తం సిగ్గుతో తలదించుకోవాల్సిన సంఘటన. 2,900 వీడియోలను తీసి పెట్టుకోవడం, మహిళలను బెదిరించి లొంగదీసుకోవడం, ఈ దారుణాలను కొందరు ఎన్నో ఏళ్లుగా బయటకు చెప్పకుండా దాయడం ఘోరమైన నేరంగా పరిగణించాలని లేఖలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనను రాజకీయ పార్టీలు స్వప్రయోజనాలకు దుర్వినియోగం చేసుకోవడం విచాకరమన్నారు. సదరు అశ్లీల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడం వల్ల యువత తప్పుదారిపడుతోంది. వాటిని లీక్ చేసి పంపిణీ చేసిన వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని లేఖలో డిమాండు చేశారు.

పెన్‌డ్రైవ్ కేసులో కాంగ్రెస్ హస్తం: అశోక్

శివాజీనగర: ప్రజ్వల్ రేవణ్ణ పెన్‌డ్రైవ్ కేసులో కాంగ్రెస్ హస్తం ఉందని, దీనిని బీజేపీపై నెట్టే ప్రయత్నాన్ని కాంగ్రెస్ నాయకులు చేస్తున్నారని బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడిన ఆయన, మాజీ మంత్రి రేవణ్ణను తక్షణమే అరెస్ట్ చేసినా డ్రైవర్ కార్తీక్‌ని మాత్రం అరెస్ట్ చేయలేదు. సిట్ అధికారులు పక్షపాత ధోరణితో పని చేస్తున్నారు. హెచ్‌డీ కుమారస్వామి చెప్పినట్లుగా ఇక్కడ తిమింగలమే ఉంది. దానిని పట్టుకొని తినాలా, వద్దా అని హెచ్‌డీ దేవెగౌడ కుటుంబం తీర్మానించనుంది. విచారణలో ప్రతి సమాచారం ముందుగా కాంగ్రెస్ నాయకులకు చేరుతోంది. సిట్ అధికారులు కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లుగా వింటున్నారు. అందుచేత ఈ కేసును సీబీఐకి అప్పగించాలి అని డిమాండ్ చేశారు. కారు డ్రైవర్ ఎక్కడో ఉండి మెసేజ్‌లు పంపుతున్నాడు. ఎమ్మెల్యే మంజుతో పాటుగా వలువురిపై ఆరోపణలు చేశాడన్నారు. తిమింగలం ఎవరో మునుముందు తెలుస్తుందన్నారు.



అంజలి అంబిగేర (ఫైల్), నిందితుడు గిరీష్

హుబ్లీలో మరో ప్రేమోన్మాది



హుబ్లీ నగరంలో నేహా హిరేమఠ అనే అమ్మాయిని ఓ యువకుడు హత్య చేయడం మరువకముందే బుధవారం మరో ఘోరం జరిగింది. అంజలి అంబిగేర అనే యువతిని గిరీష్ సావంత్ అనే యువకుడు ప్రేమించలేదనే కోపంతో ఇంట్లోకి దూరి కత్తితో పొడిచి చంపాడు. ఆమె మృతదేహంతో ధర్నా చేస్తున్న బంధువులు

నేలరాలిన విద్యా కుసుమం

- పరీక్షకు లేటుగా వచ్చాడని తిరస్కృతి
- కాలేజీ పై నుంచి దూకి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



బనశంకరి: చదువుల ఒత్తిడి, అధ్యాపకుల వేధింపులు మరో విద్యా కుసుమాన్ని బలిగొన్నాయి. భవిష్యత్తులో గొప్ప ఇంజినీర్ కావలసిన యువకుడు విగతజీవిగా మారాడు. ఓ ప్రైవేటు కాలేజీ 6వ అంతస్తుపై నుంచి దూకి ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఐటీ నగరంలో పరప్పన అగ్రహార పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మృతుడు కరసాల రాహుల్ (21).

ఏం జరిగిందంటే..

వివరాలు.. రాహుల్ కుటుంబం కర్నూలుకు చెందినది కాగా, బళ్లారిలో స్థిరపడింది. అతని తండ్రి విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నారు. రాహుల్ ఎలక్ట్రానిక్ సిటీలోని పీఈఎస్ యూనివర్సిటీలో బీఈ కంప్యూటర్ సైన్సు మూడవ సంవత్సరం చదువుతున్నాడు. రాహుల్ తల్లితో కలిసి క్యాంపస్ నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు కాలేజీలో పరీక్ష ఉండగా ఆలస్యంగా వచ్చాడని అధ్యాపకులు అనుమతించలేదు. తల్లికి కూడా సమాచారం అందించారు. ఈ పరిణామాలతో తీవ్ర మనోవేదనకు లోనైన రాహుల్ కాలేజీ 6వ అంతస్తు పైకి వెళ్లి కిందికి దూకాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఘటనాస్థలానికి పరప్పన అగ్రహార పోలీసులు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని మృతదేహానికి విక్టోరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రేమించి పెళ్లాడి.. ఆత్మహత్య



మనోజ్, రాఖీ పెళ్లి నాటి ఫోటో



పెళ్లయిన నాలుగు నెలలకే నూరేళ్లు

- విజయపురలో విషాదం

సాక్షి బళ్లారి/ హుబ్లీ: ప్రేమించుకొని పెళ్లి చేసుకొన్న నవ దంపతులు ఎన్నో ఆశలతో కొత్త జీవితాన్ని ప్రారంభించారు. కానీ విధి మరోలా తలచింది. అంతు తెలియని సమస్యలతో ఆ జంట ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన విజయపురలో చోటు చేసుకుంది.
వివరాలు.. విజయపుర నగరంలోని సిద్దేశ్వర బడావణెలో నివాసం ఉంటున్న మనోజ్‌కుమార్ పోలా (30), రాఖీ (23) అనే యువతీ యువకులు ప్రేమలో పడ్డారు. నాలుగు నెలల క్రితం పెద్దలను కాదని గుడిలో పెళ్లి చేసుకొన్నారు. మనోజ్ తల్లి ఇంట్లోనే ఇద్దరూ కాపురం పెట్టారు. అయితే ఏం జరిగిందో ఏమో కాని మంగళవారం రాత్రి ఇద్దరూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నారు. మనోజ్‌కుమార్ తల్లి ఊరికి వెళ్లి బుధవారం ఉదయమే తిరిగి రాగా ఈ ఘోరం వెలుగు చూసింది. ఈ ఘటనపై జలనగర పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సమస్యలతో పాటు ఆర్థిక సమస్యలే కారణం కావచ్చని స్థానికులు తెలిపారు.

బిల్ కలెక్టర్ రాసలీలలు

- ఆఫీసులోనే అరాచకాలు



హరికృష్ణ చిత్రాలు

కేజీఎఫ్: కోలారు జిల్లా కేజీఎఫ్ తాలూకాలోని రామసాగర గ్రామ పంచాయతీలో బిల్ కలెక్టర్ కామాంధునిగా అవతారమెత్తాడు. పనుల కోసం వచ్చే మహిళలను బెదిరించి లోబర్చుకుని కామలీలలకు పాల్పడుతున్నాడు. తోటి మహిళా ఉద్యోగుల మీద కూడా కన్నేశాడు. ఓ కాంట్రాక్టు ఉద్యోగినితో అతగాడు రాసలీలలు చేసిన వీడియోలు గత రెండు రోజుల నుంచి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వివరాలు.. బిల్ కలెక్టర్ అర్జున్ హరికృష్ణ (36) లీలలు ఇవి. బాధితురాలు మాట్లాడుతూ పంచాయతీలో ఉద్యోగం పర్మినెంట్ చేయడంతో పాటు, భర్తకు కూడా ఉద్యోగం కల్పిస్తానని తనకు ప్రలోభాలు పెట్టేవాడని తెలిపింది. ఒప్పుకోకుంటే తీవ్రచర్యలుంటాయని భయపెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొంది. పంచాయతీ కార్యాలయంలోనే ఈ అకృత్యం చోటుచేసుకుంది. హరికృష్ణపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ సభ్యులు పిడిఓకు విన్నవించారు. బాధితురాలిని ఒప్పించి ఆమె చేత బేత మంగల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. బాధితురాలి ఫిర్యాదుతో బిల్ కలెక్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

భారీ వర్షం.. జాగ్రత్త ముఖ్యం

- 7 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- 5 రోజుల పాటు వానలు!

బనశంకరి: రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. 7 జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీవర్షం పడుతుందని భారతీయ వాతావరణ శాఖ హెచ్చరించింది. బళ్లారి, చామరాజనగర, హాసన్, కొడగు, మండ్య, మైసూరు, శివమొగ్గ జిల్లాలకు ఎల్లో అలర్ట్ ని ప్రకటించారు. 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. కాబట్టి ప్రజలు చెట్ల కింద, పాడుబడిన కట్టడాల కింద ఉండరాదని, సురక్షిత ప్రదేశాలను ఎంచుకోవాలని తెలిపింది. బెంగళూరు నగర, గ్రామాంతర జిల్లాల్లో సాధారణ వర్షం కురుస్తుంది.

పలు జిల్లాల్లో కుండపోత

- మరోపక్క రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వర్షం కొనసాగుతుండగా ఎండలతో నుంచి ప్రజలకు ఉపశమనం కలిగింది. ఉత్తర కన్నడ జిల్లా శిరసి, సిద్దాపుర ప్రాంతంలో కుండపోత, గాలి ధాటికి చెట్లు, కరెంటు స్తంభాలు కూలిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడింది. జిల్లాలో కార్వార, ముండగోడు, దాండేలి, జోయిడాలో వర్షాలు రావచ్చు.
- చిక్కబళ్లాపురలో కూడా వర్షం కురవడంతో రైతులు ముఖాల్లో ఆనందం నెలకొంది. రెండు మూడురోజులుగా కురిసిన వర్షాలకు చామంతి, గులాబీ పూల తోటలకు జీవం వచ్చింది. ద్రాక్ష, దానిమ్మ తోటలు, టమాటా, బీరకాయ లాంటి కూరగాయల రైతులు ఊపిరి పీల్చుకున్నారు.
- హుబ్లీలో భారీ వర్షం వల్ల చెట్టు కూలి రెండు బైకులు ధ్వంసమయ్యాయి. రోడ్లు జలమయం కాబడ్డాయి. ఉడుపిలో పిడుగు పడి సురేశ్‌శెట్టి అనే వ్యక్తి చనిపోయాడు.

ముందే రానున్న రుతు పవనాలు

- అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మరో 5 రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.
- 17 నుంచి రాష్ట్రంలోని కరావళి, దక్షిణ ఒళనాడు జిల్లాల్లో వరుణుడు తీవ్రమయ్యే అవకాశం ఉంది. పలు జిల్లాల్లో నైరుతికి ముందే వర్షాలు మొదలయ్యాయి.
- బుధవారం నుంచి వానలు కురుస్తాయని, మేఘావృతమై ఉంటుందని, సాయంత్రం, రాత్రి సమయాల్లో వానలు పడవచ్చు. కొన్నిచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురవవచ్చని వాతావరణ శాఖ తెలిపింది.



బెంగళూరు, గ్రామీణ ప్రాంతాలకు వర్షసూచన



మైసూరు, ఉడుపి జిల్లాల్లో భారీ వర్షం పడే అవకాశం



బెంగళూరు లాల్‌బాగ్‌లో గొడుగులతో జనం (ఫైల్)

రాజధానిలో డెంగీ బెడద

- నెలలో 930 మందికి జ్వరం



బనశంకరి/ మైసూరు: రాష్ట్రంలో ఎండలు, వర్షాల మధ్య బెంగళూరు నగరవాసులకు డెంగీ భయం నెలకొంది. ఈ విషజ్వరం కేసుల సంఖ్య వెయ్యిని తాకుతోంది. ఏప్రిల్ నుంచి మే 10 వరకు నగర పరిధిలో 930 మంది డెంగీకి గురయ్యారు. ఇప్పటివరకు 1,974 మంది నుంచి రక్త నమూనాలు సేకరించగా అందులో 930 మందికి డెంగీ నిర్ధారణ అయ్యింది. దక్షిణ వలయంలో ఎక్కువమందికి డెంగీ సోకింది. బొమ్మనహళ్లి 20, దాసరహళ్లి 2, ఈస్ట్ 224, మహదేవపుర 97, ఆర్ఆర్.నగర 18, బెంగళూరు దక్షిణ 453, వెస్ట్ 99, యలహంకలో 17 డెంగీ కేసులు నమోదయ్యాయి.

కేరళలో వెస్ట్‌నైల్.. మైసూరులో అలర్ట్

మరోవైపు పొరుగు రాష్ట్రం కేరళలో వెస్ట్ నైల్ జ్వరం కనిపించడంతో మైసూరు జిల్లాలో ఆరోగ్య శాఖ హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలోని హెచ్‌డీ కోటె తాలూకాలోని డీబీ కొప్ప తదితర ప్రాంతాలు కేరళను ఆనుకుని ఉండడంతో గట్టి నిఘా ఉంచారు. ఆరోగ్య శాఖ సిబ్బంది ఈ వైరస్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు,. జ్వరం, నొప్పులతో పాటు దేహంపై దద్దుర్లు కనిపిస్తే అవి వెస్ట్ నైల్ లక్షణాలుగా తెలిపారు. వెంటనే సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స పొందాలని ఆరోగ్య శాఖ తెలిపింది. వెస్ట్ నైల్ ప్రాణాంతకం కాదు. సాధారణ జ్వరానికి ఇచ్చే చికిత్సనే ఇందులోనూ ఇస్తున్నట్లు డీహెచ్ఓ పీసీ కుమారస్వామి తెలిపారు.

క్లుప్తంగా

బస్సులో సీటు కోసం మహిళల ఫైటు



బస్సులో గొడవ పడుతున్న మహిళలు

హుబ్లీ: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం విజయవంతంగా కొనసాగుతుండగా, బస్సుల్లో రద్దీ వల్ల కొన్ని అపశ్రుతులు జరుగుతున్నాయి. బీదర్ జిల్లాలో బస్సులో సీటు కోసం ఇద్దరు మహిళలు పరస్పరం చెప్పులతో కొట్టుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బీదర్ నుంచి కలబుర్గి వెళ్లే మార్గమధ్యంలో ఆర్టీసీ బస్సులో ఈ ఘటన జరిగింది. శక్తి యోజన ద్వారా ఉచిత టిక్కెట్ పొందిన మహిళలు గొడవకు దిగి సీటు నాదంటే నాది అని పట్టుబట్టి పరస్పరం తలపడ్డారు. ఒకరినొకరు బాగా నిందించుకోవడమేగాక చెప్పులతో కొట్టుకున్నారు. చివరకు బస్సు డ్రైవర్, తోటి ప్రయాణికులు మహిళల జగడాన్ని విడిపించి శాంతింపజేశారు.

డ్రగ్స్ విక్రేత అరెస్టు

దొడ్డబళ్లాపురం: ఎండీఎంఏ డ్రగ్స్ విక్రేత సరుకుతోపాటు పట్టుబడ్డ సంఘటన మంగళూరు తాలూకా వామంజూరు మైదానంలో చోటుచేసుకుంది. పెర్మన్నూరుకు చెందిన దావూద్ పర్వీజ్ (37) పట్టుబడ్డ నిందితుడు. ఇతని నుంచి పోలీసులు రూ.15 వేల విలువైన 10 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పీఎన్ రవీంద్ర

చిక్కబళ్లాపురం: జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పీఎన్ రవీంద్ర అధికారులను ఆదేశించారు బుధవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమై మాట్లాడారు. ముందస్తు వర్షాలు కురుస్తున్నాయని, సాధారణ వర్షపాతం 26 మిల్లీమీటర్లు కాగా కేవలం 2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. వచ్చే రోజుల్లో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులకు రూ. 55 కోట్ల పరిహారం అందజేశామని, విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. రాగులు, జొన్నలు, కందులు, వేరుశనగ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. దుస్థితిలో ఉన్న పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి వివరాలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఏడీసీ తిప్పేస్వామి, అసిస్టెంట్ కమిషనర్ అశ్విన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలే ధ్యేయం



రోటరీ సభ్యులను పూలమాలతో సన్మానించిన దృశ్యం

విజయపుర: పట్టణంలోని రోటరీ సంస్థ గత 50 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిందని ఆ సంస్థ జిల్లా గవర్నర్ వి.శ్రీనివాస్ మూర్తి కొనియాడారు. పట్టణంలోని సుబ్బమ్మ చెన్నప్ప కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన విజయపుర రోటరీ సంస్థ 50 ఏళ్ల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంస్థ ఆధ్వర్యంలో వందలాది ఆరోగ్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్యం, పేద విద్యార్థులకు విద్యను అందించడం ఇలా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. అనంతరం సువర్ణ సౌరభ స్మరణ సంచికను విడుదల చేశారు. కార్యక్రమంలో రోటరీ సంస్థాపక సభ్యులను సన్మానించారు.

కార్యకర్తల సేవలు వెలకట్టలేనివి

కృష్ణరాజపుర: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల తరపున ప్రచారం చేసిన కార్యకర్తలకు ఎమ్మెల్యే మంజుళ అరవింద లింబావళి కృతజ్ఞతలు తెలిపారు. మహదేవపుర నియోజకవర్గంలోని గోరవిగెరెలో ఉన్న సుమధుర బ్యాంక్వెట్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మంజుళ మాట్లాడుతూ మరోసారి ప్రధానిగా మోదీని, ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేసిన నియోజకవర్గ ముఖ్యులు, కార్యకర్తలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అరవింద లింబావళి, ఎంపీ పీసీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

50 మందిపై కేసులు

యశవంతపుర: ప్రభుత్వ భూమిని ఆక్రమించి అందులో పలు నిర్మాణాలు చేపట్టే విషయంపై గొడవ పడిన 50 మందిపై చిక్కమగళూరు జిల్లా తరీకెరె పోలీసులు కేసు నమోదు చేశారు. నాగేనహళ్లికి చెందిన ప్రభుత్వ భూమిని రెండు సముదాయాల ప్రజలు ఆక్రమించారు. అక్కడ ఆలయం నిర్మించాలని లంబాణి సముదాయం కంచె వేసింది. అయితే సముదాయ భవనం నిర్మించాలని మరో సముదాయం డిమాండ్ చేసింది. ఈ విషయం పెద్ద వివాదంగా మారటంతో రెండు సముదాయాలకు చెందిన 50 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అందరి నోట.. రాజఫలం మాట

- మామిడి ప్రదర్శన, విక్రయ మేళాకు శ్రీకారం
- నాణ్యమైన పండ్లను అందించడమే లక్ష్యం
- ఉద్యానవన శాఖాధికారి కాశీనాథ్ భద్రన్నవర్



మేళాలో నోరూరించే మధుర ఫలాలను ఆసక్తిగా తిలకిస్తున్న దృశ్యం



విక్రయ మేళాలో మామిడిపండ్లను కొనుగోలు చేస్తున్న మహిళలు

హుబ్లీ: జిల్లా యంత్రాంగం, జెడ్పీ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే మామిడి పండ్ల ప్రదర్శన, విక్రయ మేళాకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు వివిధ మామిడి రకాలతో ప్రదర్శన ఘుమఘుమలాడుతోంది. వినియోగదారులకు నాణ్యమైన వివిధ రకాల మామిడి పండ్లను అందుబాటులో ఉంచే నేపథ్యంలో ఈ మేళాను ఏర్పాటు చేశారు. మేళాలో 32కు పైగా మామిడి రకాలను విక్రయానికి ఉంచారు. పండించిన రైతుల నుంచి నేరుగా వినియోగదారులకు మంచి పండ్లు దొరకనున్నాయి. రైతులకు కూడా మంచి ధర కూడా దొరకనుంది. వినియోగదారులకు నాణ్యమైన పండ్లు, సరసమైన ధరలో లభించేలా ఈ మేళా జరుగుతుంది. ఈ మేళాలో ధార్వాడ రసపురి, సింధూరి, అపోస, మల్లిక, రత్నగిరి, అల్ఫాన్సా తదితర 100కు పైగా రకాల మామిడి పండ్లు లభిస్తున్నాయి. ముఖ్యంగా కేజీకి రూ.2.70 లక్షలకు ధర పలికే జపాన్ రాజఫలం విక్రయ మేళాలో కనువిందు కలిగిస్తోంది. ఇక్కడికి వచ్చిన వినియోగదారులందరూ జపాన్‌కు చెందిన మియా జాతి మామిడి పండు రుచి కన్నా ధర కంటిగింపుగా కనిపిస్తుంది. రుచి, నాణ్యతకు ఈ రకం పండు ఖ్యాతిగాంచింది. ఈ అత్యంత ఖరీదైన మామిడి పండు జిల్లాలోకి కలకేరి మామిడి రైతు ప్రమోద్ గాంవకర్ తోటలో పెంచారు. తొలిసారిగా మేళాలో ఈ పండును ప్రదర్శనకు ఉంచారు. మూడు రోజుల మేళాలో 30 టన్నుల పండ్లు విక్రయిస్తారని భావిస్తున్నారు. ఈ విషయమై ఉద్యానవన శాఖాధికారి కాశీనాథ్ భద్రన్నవర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 8 వేల ఎకరాల్లో మామిడి పండ్లు పండించారు. 20 నుంచి 30 టన్నుల మామిడి పండ్లు విక్రయించే ఉద్దేశం ఉందన్నారు. మామిడి రైతులు ప్రమోద్ గాంవకర్, రామనగౌడ పాటిల్, అసిస్టెంట్ చందాపుర, రైతులతో పాటు ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పొలం పనులు షురూ

- ముందుగానే వానల పలకరింత
- పుష్కలంగా విత్తనాలు, ఎరువులు



పొలంలో నాగలి దున్నుతున్న రైతన్న

రాయచూరు రూరల్: జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పొలాల్లో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఈసారి ఖరీఫ్‌లో ముందుగానే వానలు కురవడంతో రైతులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నారు. ఈ ఏడాది 3.44 లక్షల హెక్టార్లలో విత్తనాలు వేయడానికి రంగం సిద్ధమైంది. 84 వేల హెక్టార్లలో నీటిపారుదల, మిగిలిన హెక్టార్లలో ఏకదళ, ద్విదళ ధాన్య, వాణిజ్య పంటల సాగుకు అవకాశం ఉంది. జిల్లాలో 1.71 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉంది. కేఎస్ఎంఎఫ్‌లో 7393 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ దుకాణాల్లో 738.10 మెట్రిక్ టన్నుల ఎరువు ఉంది. 90 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు ఖరీఫ్‌కు సరిపడా నిల్వ ఉన్నాయని వ్యవసాయ శాఖ జేడీ దేవిక వెల్లడించారు. జిల్లాలోని 35 రైతు కేంద్రాల్లో రైతులకు ఎరువులు, క్రిమిసంహారక మందులు నిల్వ ఉన్నాయన్నారు. రైతులు సద్వినియోగ పరుచుకోవాలని కేంద్రం ప్రత్యేక అధికారి నాగిరెడ్డి తెలిపారు.

ప్రేమించలేదని యువతి దారుణ హత్య

హుబ్లీ: తన ప్రేమను నిరాకరించిందన్న కోపంతో ఓ యువకుడు యువతి ఇంట్లోకి చొరబడి కత్తితో పొడిచి యువతిని దారుణంగా హత్య చేసిన ఘటన నగరంలో బుధవారం తెల్లవారు జామున జరిగింది. వీరాపుర గుడి వీధి నివాసి అంజలి అంబిగేర(20) అనే యువతిని విశ్వ అలియాస్ గిరీష్ సావంత్(21) అనే యువకుడు గత కొంత కాలంగా ప్రేమించమని వెంటపడి వేధించేవాడు. అయితే అతని ప్రేమను ఆమె నిరాకరించింది. ఈక్రమంలో బుధవారం తెల్లవారుజామున యువతి నిద్రపోతుండగా నిందితుడు ఇంట్లోకి జొరబడ్డాడు. తన వెంట రావాలని బలవంతపెట్టి వెంట తెచ్చుకున్న కత్తితో యువతిని పొడిచి పరారైనట్లు జిల్లా ఎస్పీ గోపాల బ్యాకోడ తెలిపారు. బెణ్ణిగేరి పోలీస్ స్టేషన్‌లో ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, ప్రేమ విషయమా? మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో కేసును దర్యాప్తు చేపట్టామన్నారు. కాగా మృతురాలి సోదరుడు మాట్లాడుతూ ఉదయం 5 గంటలకు ఇంటిలోకి వచ్చిన నిందితుడు తన సోదరిని బయటకు పిలిచి తనతో రమ్మని బలవంత పెట్టాడన్నారు. దీనికి ఆమె నిరాకరించడంతో కోపగించుకున్న నిందితుడు కత్తితో తన సోదరి గొంతు, ఛాతీ, కడుపుపై పొడిచి పరారయ్యాడన్నారు. గతంలో కూడా తనతో మైసూరుకు రావాలని, రాకపోతే నేహా హిరేమఠ్‌ను చంపినట్లుగానే నిన్ను కూడా చంపుతానని బెదిరించాడన్నారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రాంపుర రిజర్వాయర్ పరిశీలన



రాంపుర జలాశయాన్ని సందర్శించిన నేతలు

రాయచూరు రూరల్: నగరంలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో రాంపుర జలాశయాన్ని నగర ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ నగరసభ సభ్యులు, అధికారులతో కలిసి పరిశీలించారు. సోమవారం సాయంత్రం గణేకల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేశారు. ఆ నీరు బుధవారం రాంపుర జలాశయానికి చేరుకున్నాయి. నగరవాసులకు సక్రమంగా తాగునీటిని అందించే దిశలో రాంపుర రిజర్వాయర్ నుంచి నీటిని వృథా చేయకుండా తాగునీటి అవసరాలకు వినియోగించాలని సిబ్బందికి సూచించారు.

కలుషిత నీటి సరఫరాపై భయాందోళన



మురుగు కాలువలో పైపులు, కలుషితమైన నీరు

హొసపేటి: విజయనగర జిల్లా కొట్టూరు పట్టణంలో పది రోజులుగా కలుషిత నీరు సరఫరా కావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నగరంలోని కొన్ని వార్డుల్లో తప్ప మిగతా అన్ని వార్డులకు తుంగభద్ర నీరు ప్రధానంగా సరఫరా అవుతుంది. వేసవిలో నీటి పరిమాణం తక్కువగా ఉన్నా కలుషిత నీటి సరఫరాకు అనుకూలంగా మారింది. పట్టణంలో 10 రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతున్నట్టు ఆరోపణలు వినబడుతున్నాయి. పట్టణంలోని చాలా ప్రాంతాల్లో నీటి పైపులు పగిలి వర్షపు నీరు, మురుగునీరు కలుషితమవుతున్నాయని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముడుకనకట్టె, వాల్మీకినగర్, రాజీవ్ నగర్ బరంగేతో పాటు పలు ప్రాంతాల్లో నీటి సరఫరా పైపుల్లో కలుషిత నీరు చేరింది. దీనిపై పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ప్రజలు వాపోతున్నారు. తుంగభద్ర నది నీటిని శుద్ధి చేసి హగరిబొమ్మనహళ్లి ప్లాంట్‌కు విడుదల చేస్తారు. అయితే తాగునీరు ఆకుపచ్చ రంగులో ఉండటంతో పాటు దుర్గాసన వెదజల్లుతున్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలని అధికారులు సూచిస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హత్య

హిందూపురం అర్బన్: మతి స్థిమితం లేని వ్యక్తిని కిరాతకంగా హతమార్చిన ఘటన హిందూపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... దొడ్డబళ్లాపురానికి చెందిన సెల్వకుమార్ (54)కు మతి స్థిమితం లేదు. దీంతో అతని అన్న శివకుమార్ పిలుచుకొచ్చి మూడేళ్ల క్రితం పరిగి మండలం మోదా గేట్ వద్ద ఉన్న సదానంద వృద్ధాశ్రమంలో చేర్పించాడు. అప్పటి నుంచి వృద్ధాశ్రమంలోనే ఆశ్రయం పొందుతున్న సెల్వకుమార్‌ను ఆదివారం ఓ వ్యక్తి వచ్చి బయటకు పిలుచుకెళ్లాడు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

అక్రమాలపై న్యాయ పోరాటం చేస్తాం

బనశంకరి: ముఖ్యమంత్రి సిద్దరామయ్య హయాంలో 2017-18 సంవత్సరంలో పాలకులు చట్టాలను గాలి కొదిలేసి అక్రమ వ్యవహారాలకు పాల్పడ్డారని, దీనిపై న్యాయ పోరాటం చేస్తానని బీజేపీ నేత ఎన్ఆర్.రమేశ్ తెలిపారు. 2017-18 లో ఇందిరానగర, కోరమంగల, హెచ్ఎస్ఆర్.లేఔట్, సదాశివనగర, ఆర్‌టీ.నగర, కాక్స్‌టౌన్, చంద్రాలేఔట్‌లో 7 బీడీఏ కాంప్లెక్సులను సీఎంకు అత్యంత ఆప్తుడైన మంత్రి కేజే.జార్జ్ భాగస్వామిగా ఉన్న సంస్థలకు 65 ఏళ్ల కాంట్రాక్టుకు అందించే ప్రజావ్యతిరేక చర్య తీసుకున్నారని ఎన్ఆర్.రమేశ్ ఆరోపించారు. ఈ విషయంపై 2019లో ముఖ్యమంత్రిగా ఉన్న బీఎస్.యడియూరప్పకు పలు ఆధారాలు సమర్పించగా ఆ టెండర్ ప్రక్రియ ను రద్దుచేయాలని ఆదేశించారన్నారు. ప్రస్తుతం రెండోసారి ముఖ్యమంత్రిగా ఎన్నికైన సిద్దరామయ్య ప్రస్తుతం మళ్లీ ఏడు బీడీఏ కాంప్లెక్స్‌లను మరు నిర్మాణం పేరుతో ఆ సంస్థలకు 65 ఏళ్ల పాటు కాంట్రాక్టుకు ఇవ్వడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు, హైకోర్టులో ప్రజాప్రయోజనాల పిల్ సైతం వేశామని, ఈ విషయాన్ని లేఖ ద్వారా సిద్దరామయ్య దృష్టికి తీసుకువచ్చామని ఎన్ఆర్.రమేశ్ తెలిపారు.

‘సహకార’ సేవలు అపారం



శ్రీనివాసగౌడను అభినందిస్తున్న దృశ్యం

కోలారు: జిల్లా సహకార రంగానికి మాజీ మంత్రి శ్రీనివాసగౌడ అందించిన సేవలు అపారమని అణ్ణిహళ్లి నాగరాజ్ శ్లాఘించారు. బుధవారం శ్రీనివాసగౌడ 7వ సారి అంతర్జాతీయ సహకార రంగానికి డైరెక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా ఆయన నివాసంలో అభినందనలు తెలిపి మాట్లాడారు. తాను డైరెక్టర్‌గా ఉన్న అణ్ణిహళ్లి సొసైటీ నుంచే శ్రీనివాసగౌడ డైరెక్టర్‌గా సహకార రంగంలోకి ప్రవేశించి అంచెలంచెలుగా ఎదిగారన్నారు. ఇఫ్కో టోకియో నుంచి ప్రతియేటా రోగుల చికిత్స కోసం సహాయ ధనం అందిస్తున్నారన్నారు. జిల్లా సహకార రంగానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారన్నారు. ఇఫ్కో మాత్రమే కాకుండా క్రిబ్కో అధ్యక్షుడిగా కూడా సేవలు అందించారన్నారు. జిల్లాలో ఎరువుల కొరత రాకుండా రైతులకు సహకారం అందించారన్నారు. టీఏపీసీఎంఎస్ డైరెక్టర్ చోళఘట్ట శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి రాష్ట్ర మంత్రిగా సేవలు అందించిన శ్రీనివాసగౌడ సహకార రంగంలో అందించిన సేవలు అపారమన్నారు. ఈనేపథ్యంలో శ్రీనివాసగౌడకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన హోదాతో గౌరవించాలన్నారు. కసబా సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సీఈఓ వెంకటేష్, టీఏపీసీఎంఎస్ సీఈఓ అంబరీష్ పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి చండికా హోమం



చండికా హోమం నిర్వహిస్తున్న దృశ్యం



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన దృశ్యం

కోలారు: తాలూకాలోని వక్కలేరిలో వెలసిన రాజరాజేశ్వరి ఆలయం 10వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం చండికా హోమం, అశ్లేష పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మనోజ్‌రావ్ నేతృత్వంలో చండికా హోమం, అశ్లేష పూజలు జరిగాయి. గ్రామస్తుల సహకారంతో పూజలను నిర్వహించినట్లు అర్చకుడు తెలిపారు, లోకకళ్యాణం కోసం, జిల్లాలో వానలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని హోమ పూజలు నిర్వహించగా, పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

మహిళలపై చిన్నచూపు తగదు

కోలారు: పురుష ప్రధాన సమాజంలో మహిళలపై చిన్నచూపు చూపుతూ రెండో స్థానం ఇవ్వడం శోచనీయమని ప్రగతిశీల మహిళా సంఘం సభ్యురాలు శాంతమ్మ తెలిపారు. బుధవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో నిర్వహించిన సంవాద కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పురుష ప్రధాన దేశంలో మహిళలకు సముచిత స్థానం లభించడం లేదని విచారం వ్యక్తం చేశారు. మొదట మహిళలు, శూద్రులు చదువుకునే అవకాశం ఉండేది కాదన్నారు. మహిళలపై దౌర్జన్యం ఇంటి నుంచే ప్రారంభం అవుతుందన్నారు. దేశంలో పురుషులకు ప్రాధాన్యత ఉండేంత వరకు మహిళలపై దౌర్జన్యం ఆగదన్నారు. సమాజంలో మహిళలపై మానసికంగా, శారీరకంగా దౌర్జన్యాలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. మహిళలపై దౌర్జన్యాలు, హింస జరిగినప్పుడు కోర్టులు, మీడియా తగిన విధంగా స్పందించి న్యాయం చేయాలన్నారు. మార్పు మహిళల నుంచే ప్రారంభం కావాలన్నారు. స్వార్థ చింతనలు పోయి కరుణ, ప్రేమ, విశ్వాసం, అందరిలో పెరగాలన్నారు. ప్రజ్వల్ రేవణ్ణ కేసులో బాధిత మహిళల్లో ధైర్యం నింపాలన్నారు. మధు భూషణ్, శకున్, తేజోవతమ్మ, హూవళ్లి నాగరాజ్, వెంకటాచలపతి, నేత్రావతి పాల్గొన్నారు.

పరిహారం కోసం రైతు సంఘం డిమాండ్



పండ్లను రోడ్డుపై పోసి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: చెన్నై కారిడార్ రహదారి పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు బుధవారం అంబేడ్కర్ ఫోటోతో ధర్నా చేసిన అనంతరం కాంట్రాక్టర్ నాయుడుకు వినతిపత్రం సమర్పించారు. రహదారి పనుల కోసం లారీలు, టిప్పర్లు తిరుగుతుండడం వల్ల ధూళి దుమ్ము రైతులు పండించిన పంటలపై పడి పంటలు నాశనమై తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లక్షలు ఖర్చు చేసి పండించిన టమోటా తదితర కూరగాయల పంటలకు తీవ్రంగా నష్టం కలిగిందన్నారు. 48 గంటల్లోగా రైతులకు పంట నష్టపరిహారం అందించాలని, లేని పక్షంలో తీవ్ర పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ తదితరులు ఉన్నారు.

వైభవంగా హసి కరగ



కరగ ఉత్సవం నిర్వహించిన దృశ్యం

కోలారు: తాలూకాలోని తొట్లి జీపీ పరిధిలోని చిట్నహళ్లిలో మంగళవారం రాత్రి ధర్మరాయస్వామి, ద్రౌపతాంబదేవి హసి కరగ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కరగ పూజారి సుబ్రమణితోపాటు కుమారుల గోవిందనామ స్మరణ మధ్యన కరగ సాగింది. రాత్రి 9 గంటలకు గంగా పూజ ముగిసిన అనంతరం 11 గంటలకు కరగ పూజారులు సుబ్రమణి, బాలరాజ్, పవన్ కరగను ఆలయం నుంచి బయటకు తీసుకొచ్చి తలపై మోసుకుని కత్తి ఝుళిపిస్తూ నృత్యం చేశారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో కరగ సంచరించిన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంది. దారి పొడవునా గ్రామస్తులు కరగకు నీరాజనాలు పట్టారు. వేల సంఖ్యలో భక్తులు కరగను వీక్షించారు.

మేత తిన్న కాసేపటికే ఆవుల మృతి



మృతి చెందిన ఆవులు

మండ్య: మేత తిన్న కాసేపటికే మూడు ఆవులు మరణించగా, పదికి పైగా మూగజీవాలు అస్వస్థతకు గురయ్యాయి. మండ్య తాలూకా లాళనకెరె గ్రామానికి చెందిన సోమశేఖర్ డెయిరీ ఏర్పాటు చేసుకొని పశువులను పోషిస్తూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం పాలు పితికే ముందు వాటికి మేత పెట్టారు. మేత తిన్న కొద్దిసేపటికే పశువులు అస్వస్థతకు గురయ్యాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడడంతో మూడు ఆవులు మృతి చెందాయి. పశువైద్యాధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మిగతా వాటికి చికిత్స అందించారు. కాగా ఆవుల మృతితో సోమశేఖర్ కుటుంబం ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.

బాలింత కడుపులో వస్త్రం.!

- సిజేరియన్ చేసి కుట్లు వేసిన వైనం
- ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం



బాలింత కడుపులో వదిలేసిన వస్త్రం ఇదే



బాలింత చంద్రిక

కోలారు : కాన్పు కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ఓ గర్భిణికి సిజేరియన్ చేసిన అనంతరం వైద్యులు ఆ మహిళ కడుపులోనే వస్త్రాన్ని వదిలేసిన ఘటన నగరంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. మాలూరు తాలూకా రామసాగర గ్రామానికి చెందిన గర్భిణి చంద్రిక కాన్పు కోసం ఈ నెల 5వ తేదీన ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. వైద్యులు ఆమెకు సిజేరియన్ చేసి కాన్పు చేశారు. అయితే ఆపరేషన్ అనంతరం గుడ్డ ముక్కను మహిళ కడుపులోనే వదిలేసి కుట్లు వేశారు. ప్రసవం అనంతరం వారం రోజుల తరువాత మహిళ కడుపు నొప్పితో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ ఆస్పత్రిలో నర్సు కడుపుపై ఉన్న గాయానికి ఆయింట్‌మెంట్ రాస్తుండగా వేలికి గుడ్డ ముక్క తగిలింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్వాకం తెలిసి తల్లిదండ్రులు వెంటనే ఈ విషయాన్ని జిల్లా ఆస్పత్రి సర్జన్ డాక్టర్ విజయకుమార్ దృష్టికి తేగా ఇకపై ఇలా జరగకుండా చూస్తామని చెప్పి చల్లగా జారుకున్నారని చంద్రిక తల్లిదండ్రులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. కాగా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంపై ప్రజలు మండిపడ్డారు.

విద్యుదాఘాతంతో మృతి

దొడ్డబళ్లాపురం: బెస్కాం కార్మికుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ ఘటన గదగ్ జిల్లా ముండరగి పట్టణంలోని అంబాభవాని నగర్‌లో చోటుచేసుకుంది. అజ్జయ్య వీరయ్య(46) బుధవారం మధ్యాహ్నం అంబాభవాని నగర్‌లో విద్యుత్ లైన్ రిపేరీ చేస్తుండగా కరెంటు సరఫరా అయ్యింది. దీంతో అతను విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. ముండరగి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆస్పత్రిలో కమిషన్ చైర్మన్ తనిఖీ



వివరాలు సేకరిస్తున్న అధ్యక్షుడు నాగరాజగౌడ

మాలూరు: పట్టణంలో ఈ నెల 9వ తేదీ జరిగిన భ్రూణ హత్యల కేసుపై విచారణకు స్పందించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ అధ్యక్షుడు కె నాగరాజగౌడ బుధవారం పట్టణంలోని సంజనా ఆస్పత్రిని సందర్శించారు. స్కానింగ్ సెంటర్ తదితరాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీపీఎన్‌డీటీ, కేపీఎంఏ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. బెంగళూరులో భ్రూణ హత్యల కేసులు వెలుగు చూసిన అనంతరం కూడా అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రశ్నించారు. భ్రూణ హత్యల విషయంలో అధికారులు నిర్లక్ష్య ధోరణిని అనుసరిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. అధికారులు ప్రైవేటు ఆస్పత్రులపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. ఆడ, మగ భేదభావం వల్లనే భ్రూణ హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. భ్రూణ హత్యలను అరికట్టడం అందరి బాధ్యత అన్నారు. దీనిని నియంత్రించడానికి ఎస్పీ, తాలూకా స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించారన్నారు. వైద్యులు జాగృతులు కావడంతో పాటు ప్రజలను కూడా జాగృతి చేయాలన్నారు. ఈ సందర్భంగా బాలల రక్షణా సమితి సభ్యుడు శశిధర్ కోసంబి, డాక్టర్ తిప్పేస్వామి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి జగదీష్ తదితరులు ఉన్నారు.

నివేదికల అందజేతలో నిర్లక్ష్యంపై నిరసన

రాయచూరు రూరల్: రాయచూరు వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) ప్రభుత్వ వైద్య పరిశోధన కళాశాలలో వైద్య పరీక్షల నివేదికలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడాన్ని రోగుల కుటుంబ సభ్యులు, బంధువులు ఖండించారు. బుధవారం రిమ్స్‌లో రోగులకు సంబంధించిన రక్త పరీక్ష, యూరిన్ పరీక్ష, బీపీ, షుగర్ పరీక్షలు చేసిన నివేదికల కోసం గంటల తరబడి వేచి ఉండడాన్ని తప్పుబట్టారు. వైద్యులు రోగులను చూడడానికి వచ్చేలోపు ఆ రిపోర్టులు లేకపోతే తిరిగి వైద్యులు మరుసటి రోజు ఉదయం వచ్చే వరకు రోగులకు వైద్యం చేయడం కుదరదని చెబుతున్నట్లు రోగుల బంధువులు ఆరోపించారు.

క్లుప్తంగా

ధైర్యంగా ఫిర్యాదులు చేయండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ పవన్ నిజ్జూర్

విజయపుర: ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు, సిబ్బంది లంచాలు డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తుంటే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని లోకాయుక్తా ఎస్పీ పవన్ నిజ్జూర్ ప్రజలకు సూచించారు. బుధవారం ఆయన పట్టణంలో ప్రజా సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ 19 ఫిర్యాదులు అందగా అందులో ఎక్కువగా పుర సభ ఉద్యోగులు, రెవెన్యూ శాఖ సిబ్బందిపై వచ్చినట్లు తెలిపారు. రాజకాలువ ఆక్రమణ, రోడ్ల ఆక్రమణ, అనధికారిక మైనింగ్, శిథిలమైన విద్యుత్ స్తంభాల తొలగింపు తదితర ఫిర్యాదులు అందినట్లు చెప్పారు.

అగరొత్తుల ఫ్యాక్టరీ ఆహుతి



పరిశీలిస్తున్న అధికారులు

మైసూరు: జిల్లాలోని నంజనగూడు బజార్ రోడ్డులో ఉన్న అగర్‌బత్తీల కర్మాగారంలో అగ్ని ప్రమాదం జరిగి రూ. 20 లక్షల నష్టం వాటిల్లింది. స్థానిక వ్యాపారి రఫీక్ దీనిని నిర్వహిస్తున్నాడు. ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి అగరొత్తులు తయారు చేసే యంత్రాలు, ఇతరత్రా సామాగ్రి కాలిపోయాయి. ఫైర్ సిబ్బంది వెంటనే వచ్చి మంటలను అదుపులోకి తీసుకురావడంతో మరింత నష్టం తప్పింది. తహశీల్దార్ శివకుమార్, నగరసభ పౌరాయుక్త నంజుండ స్వామి పరిశీలించారు.

పోలీసులపై దాడి చేసిన ఆరుగురి అరెస్ట్

మైసూరు: విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడి చేశారనే ఆరోపణలపై నగరానికి చెందిన కీర్తిరాజ్, సురేశ్, శరత్, మదన్, ఆదర్శ్, చిదానంద అనే నిందితులను మైసూరు విద్యారణ్యపురం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. విద్యారణ్యపురం పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ కెంపరాజు తన సహోద్యోగి కరియప్పతో కలసి ఈనెల 11న అర్ధరాత్రి గస్తీ డ్యూటీ చేస్తున్నాడు. పార్వతి కల్యాణ మంటపం ఎదరు రోడ్డులో ఐదారు మంది మద్యం సేవిస్తూ గట్టిగా అల్లరి చేస్తుండగా కానిస్టేబుళ్లు వెళ్లి ఆరా తీశారు. వివరాలు చెప్పకపోగా అసభ్య పదజాలంతో దూషించి పోలీసులపైనే దాడికి తెగబడి ఉడాయించారు బాధిత కానిస్టేబుళ్లు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు.

కార్మికుల పిల్లలు కలెక్టర్లుగా ఎదగాలి



కార్మిక దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్

పావగడ: భవన నిర్మాణ కార్మికుల పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించి కలెక్టర్లుగా ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఆకాంక్షించారు. స్థానిక ఎస్ఎస్‌కే రంగ మందిరంలో షిర్డీ సాయిబాబా భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్మికుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల పిల్లలు కార్మికులే కానక్కర్లేదని, ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థానాల్లో స్థిరపడాలన్నారు. కార్మిక శాఖ అందించే సౌలభ్యాలను వినియోగించుకోవాలన్నారు. పిల్లల విద్యాభ్యాసానికి, వివాహాల ఖర్చులకు నిధులు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం కార్యదర్శి కృష్ణమూర్తి తదితర పదాధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

షేర్ మార్కెట్ పేరుతో లక్షలు కొల్లగొట్టారు

మైసూరు: గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్ గ్రూప్‌లో చేరాలని ఆహ్వానిస్తే ఆలోచించాలి. ఎందుకంటే సైబర్ కేటుగాళ్లు వాట్సాప్‌లో చేర్చుకొని వంచనకు పాల్పడుతున్నారు. ఈ తరహా మోసం మైసూరులో వెలుగు చూసింది. నగరానికి చెందిన వ్యక్తి రూ. 17.80 లక్షలు కోల్పోయాడు. మైసూరు విజయనగరలో నివాసం ఉంటున్న పీఎస్ శరణ్ అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్ గ్రూప్‌లోకి ఆహ్వానించారు. వారి మోసం తెలియని శరణ్ అందులో చేరాడు. అనంతరం ఆ గ్రూప్‌లోని వ్యక్తులు షేర్ మార్కెట్ గురించి వివరించారు. అనంతరం నకిలీ యాప్ డౌన్‌లోడ్ చేయాలని సూచించారు. ఆ యాప్ ద్వారా డబ్బు పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఆ తర్వాత అధిక లాభాలు వస్తాయని ఆశ చూపారు. వారి మాటలు నమ్మిన శరణ్ దశలవారీగా రూ. 17.80 లక్షలను పెట్టుబడిగా పెట్టాడు. చివరికి లాభాలు రాకపోగా అసలు కూడా దక్కలేదు. దీంతో చివరికి మోసపోయానని గ్రహించి సైబర్ పోలీసులను ఆశ్రయించాడు.

పోలీసు కాల్పుల్లో రౌడీషీటర్ మృతి



మృతుడు నరసింహమూర్తి

దొడ్డబళ్లాపురం: హత్యకేసులో నిందితుడైన రౌడీషీటర్ పోలీసుల కాల్పుల్లో మృతి చెందాడు. ఈఘటన దొడ్డ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నిందితుడు రౌడీషీటర్ నరసింహమూర్తి ఈనెల 10వ తేదీన హేమంత్ గౌడ అనే యువకుడిని చర్చలకు పిలిచాడు. అనంతరం అనుచరులతో కలిసి మారణాయుధాలతో దాడిచేసి దారుణంగా హత్య చేశారు. ఆ రోజు రాత్రి నుంచి నిందితుడు పరారీలో ఉన్నాడు. పోలీసులు అతని కోసం విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఈక్రమంలో బుధవారం మధ్యాహ్నం దొడ్డ పట్టణ శివారులో ఒక చోట నిందితుడు నరసింహమూర్తి దాక్కున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి లొంగిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. అయితే నిందితుడు పోలీసులపై దాడికి యత్నించాడు. దీంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఒక బుల్లెట్ నరసింహమమూర్తికి తగలడంతో మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

సేవా తత్పరుడు జేఎస్ రెడ్డి

- దశదిన కర్మ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు



జేఎస్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



నివాళులర్పిస్తున్న కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి

శివాజీనగర: జేఎస్ రెడ్డిగా అందరికీ సుపరిచితులైన జక్కా శ్రీనివాసులురెడ్డి గొప్ప సేవా తత్పరుడని ప్రముఖులు అన్నారు. ఈ నెల 1వ తేదీన బెంగళూరులో తుదిశ్వాస విడిచిన జేఎస్ రెడ్డి దశదిన కర్మ కార్యక్రమాన్ని బుధవారం బెంగళూరులోని ఇందిరా నగర్ క్లబ్‌లో నిర్వహించారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడుతో పాటు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు మాజీ ఎమ్మెల్యే జే.కే.రెడ్డి, బెంగళూరు తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు డాక్టర్ ఏ.రాధాకృష్ణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు భక్తవత్సలరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకట్, నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు రాజకీయ నాయకులు, బెంగళూరుకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు పాల్గొని జేఎస్ రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. సమాజానికి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. సినీ నిర్మాత, దర్శకుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ జేఎస్ రెడ్డి తన పుట్టినగడ్డకు విశేష సేవలు అందించారన్నారు. జేఎస్ రెడ్డి ఉత్తమ వ్యక్తిత్వం కలిగి స్వశక్తితో ఎదిగారన్నారు. కాంట్రాక్టర్‌గా ఆయన ప్రతిభ అపారమన్నారు. గుజరాత్‌లో నర్మదా నది కాలువల నిర్మాణంలో ఆయన ప్రతిభను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మెచ్చుకొని జేఎస్ రెడ్డిని ప్రభుత్వం తరఫున సన్మానించారన్నారు. కాంట్రాక్టర్లకు అలాంటి గౌరవం దక్కడం అరుదైన విషయమన్నారు. కర్ణాటక రీజియన్‌లో అత్యధిక ఆదాయపు పన్ను చెల్లించిన వ్యాపారవేత్తగా ఆయనకు బిరుదు లభించిందన్నారు. రెడ్‌క్రాస్ ఆస్పత్రి భవన నిర్మాణానికి సొంత డబ్బు వెచ్చించడమే కాకుండా ఆస్పత్రి నిర్వహణను చూశారన్నారు. క్యాన్సర్ ఆస్పత్రిలో తన సొంత డబ్బుతో వేలాది మంది పేద రోగులకు వైద్యం అందించేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. కోట్ల రూపాయలతో చిల్డ్రన్స్ పార్కు నిర్మించారన్నారు. రైతుల సంక్షేమానికి దాదాపు రూ.15 కోట్లు వ్యయం చేశారన్నారు. ఎన్నో అభివృద్ధి పనులకు సహకరించారన్నారు. దాన ధర్మాలు సమాజ బాధ్యతగా భావించారన్నారు. ఆయన మృతి నెల్లూరు జిల్లాకు తీరని లోటని స్మరించుకున్నారు.

జేఎస్ రెడ్డి మృతి సమాజానికి తీరని లోటు: ఎం.వెంకయ్య నాయుడు

జేఎస్ రెడ్డి తనకు మంచి మిత్రుడని, గొప్ప సేవా తత్పరుడని, ఆయన మృతి వారి కుటుంబానికి, సమాజానికి పెద్ద లోటని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. జేఎస్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. జేఎస్ రెడ్డి భౌతికంగా లేకపోయినా అందరి హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారన్నారు. పెద్దల మాటలను గౌరవిస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. జేఎస్ రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో జేఎస్ రెడ్డి కుమారుడు భక్తవత్సలరెడ్డి, కుమార్తె ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా అభివృద్ధి పనులు శూన్యం

శివాజీనగర: అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల పేరుతో కాలం గడుపుతూ అభివృద్ధి వైపు దృష్టిపెట్టడం లేదని, ఇంత వరకు ఒక్క భూమిపూజ కూడా జరగలేదని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ.సునీల్‌కుమార్ ధ్వజమెత్తారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వ్యవసాయ, సహకార, ఇంధన, విద్యా, మహిళా శిశు సంక్షేమ, నగరాభివృద్ధి మంత్రికి సంబంధించి ఎలాంటి పనులు జరగటం లేదన్నారు. మంత్రులు అసమర్థులుగా మారారని ఆరోపించారు. శాంతిభద్రతల పరిరక్షణలో హోం మంత్రి విఫలమయ్యారని విమర్శించారు. పీఎల్‌డీ బ్యాంకుల్లో రైతులకు మళ్లీ రుణ సదుపాయం లభించటం లేదన్నారు. బ్రాండ్ బెంగళూరు దిక్కుతోచని బెంగళూరుగా మారిందన్నారు. ఏకనాథ్ శిందే వ్యాఖ్యల గురించి స్పందించిన ఆయన... కాంగ్రెస్ నాయకత్వంలో వివాదం నెలకొందన్నారు. వారిలో ఉన్న అసంతృప్తి వల్ల ప్రభుత్వం పతనం కావచ్చన్నారు. సిద్దరామయ్య, డీ.కే.శివకుమార్ మధ్య మళ్లీ సీఎం వార్ ప్రారంభమైనదని తెలిపారు.

వన్యమృగాల దాడిలో జింక మృతి



మృతి చెందిన జింక



ఘటన స్థలంలో అటవీశాఖ అధికారులు

చింతామణి: వన్య మృగాల దాడిలో జింక మృతి చెందింది. ఈఘటన తాలూకాలోని కాచిపల్లి శివార్లలో చోటు చేసుకుంది. బుధవారం ఉదయం స్థానికులకు విగతజీవిగా పడి ఉన్న జింక కనిపించింది. చిరుత దాడిలో జింక మృతి చెందినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తూ అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించారు. ఇది చిరుత దాడిలో మృతి చెందలేదని, ఏవో ఇతర వన్య మృగాల దాడిలో మృతి చెంది ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. అయితే ముందు జాగ్రత్త చర్యగా ఆ ప్రాంతంలో బోనులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జింక కళేబరాన్ని వెంట తీసుకెళ్లారు.

లారీని ఢీకొన్న టెంపో, ఒకరి మృతి

యశవంతపుర: లారీ, టీటీ వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా, ఐదు మంది గాయపడిన ఘటన చిక్కమగళూరు జిల్లా కడూరు తాలూకా బయలు బసప్ప దిబ్బ వద్ద బుధవారం జరిగింది. నిలిచి ఉన్న లారీని టిటి వాహనం ఢీకొంది. ప్రమాదంలో హాసనకు చెందిన మంజునాథ్ (40) మృతి చెందగా టీటీ వాహనంలో ఉన్న ఐదు మంది గాయపడ్డారు. కడూరు పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి వాహనాలను పక్కకు తొలగించారు.

కాలిపోయిన ఇల్లు

కరెంటు వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన కలబురగి జిల్లా ఆళంద తాలూకాలో జరిగింది. బుధవారం సాయిబణ్ణ అనే వ్యక్తి ఇంటిలో మంటలు వ్యాపించి క్షణాల్లోనే అంతా వ్యాపించాయి. రూ.20 వేల నగదు, బంగారు, బట్టలు, ధాన్యం కాలిపోయినట్లు బాధితులు విలపించారు. కలబురగి పోలీసులు పరిశీలించారు.

డీకేశికి పుట్టినరోజు శుభాకాంక్షలు

శివాజీనగర: డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు బుధవారం పుట్టినరోజు కావడంతో పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధనకర్ డీకేకి ఫోన్ చేసి శుభాకాంక్షలు చెబుతూ లేఖను పంపారు. దేశ సేవలో అంకితమైన మీకు ఆయురారోగ్యం కలగాలని అన్నారు. ఇందుకు డీకేశి సంతోషం వ్యక్తంచేశారు. ఆత్మీయ మిత్రుడు డీకే శివకుమార్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలని సీఎం సిద్దరామయ్య తెలిపారు. జీవితంలో సంతోషం, విజయవంతమైన కార్యకలాపాలు కొనసాగాలని ఆకాంక్షించారు. రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లోట్ ఎక్స్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు డీకే అభిమానులు, కాంగ్రెస్ నాయకులు అనేకచోట్ల కేక్ కట్ చేసి సంబరాలు సాగించారు.

చేపల గాలానికి చిక్కి పాము విలవిల



కొక్కాన్ని చూపుతున్న స్నేక్ కిరణ్

శివమొగ్గ: చేపల గాలానికి చిక్కుకొని అల్లాడి పోతున్న నాగుపామును స్నేక్ కిరణ్ రక్షించాడు. గాలం కొక్కాన్ని ఎవరో రోడ్డుపై పారేశారు. పాము అటుగా వెళుతూ కొక్కానికి చిక్కుకుని విలవిలలాడిపోయింది. స్థానికుల సమాచారం మేరకు స్నేక్ కిరణ్ అక్కడికి చేరుకుని సురక్షితంగా ఆ కొక్కేన్ని తొలగించి పామును రక్షించారు.

కారు ఢీకొని దంపతుల మృతి

మైసూరు: కారు మోపెడ్‌ను ఢీకొని దంపతులు మృతి చెందారు. ఈ ఘటన మైసూరు జిల్లా టీ నరసీపుర వద్ద జరిగింది. టీ నరసీపుర తాలూకా రంగసముద్ర గ్రామానికి చెందిన కాళశెట్టి (60) తన భార్య మహదేవమ్మ (54)కు అనారోగ్యంగా ఉండటంతో టీవీఎస్ వాహనంలో టీ నరసీపురలోని ఆస్పత్రికి వెళ్లాడు. చికిత్స అనంతరం రంగసముద్రం గ్రామం వద్ద వెళుతుండగా ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీ నరసీపుర పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

జేడీఎస్ టికెట్ అందజేత

శివాజీనగర: విధానపరిషత్ దక్షిణ ఉపాధ్యాయుల నియోజకవర్గం టికెట్‌ను జేడీఎస్ నేత వివేకానందకు పార్టీ అధినేత హెచ్.డీ.దేవెగౌడ అందజేశారు. ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ మాట్లాడుతూ బీజేపీ-జేడీఎస్ కూటమి అభ్యర్థిగా చేసేందుకు అందరూ ఆమోదించారు. గురువారం నామినేషన్ సమర్పిస్తారని తెలిపారు.

మేకు మింగి ఖైదీ ఆత్మహత్యాయత్నం

మైసూరు: విచారణ ఖైదీ ఇనుప మేకు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన మైసూరు కేంద్ర కారాగారంలో జరిగింది. సిద్ధరాజు అనే విచారణ ఖైదీ జైలులోని ఐదో గదిలో ఉంటున్నాడు. సిబ్బంది కళ్లుగప్పి మేకును మింగి ఆత్మహత్యకు యత్నించాడు. అనంతరం అతడే ఆ విషయాన్ని సిబ్బందికి తెలియజేశాడు. తక్షణమే జైలులోని ఎక్స్‌రే నిపుణులు అతనికి పరీక్షలు చేయగా మేకు మింగినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో కేఆర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈఘటనకు సంబంధించి మండిపోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మండ్య: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. మండ్య జిల్లా హలగూరు సమీపంలో బాణసముద్రం వద్ద ఉన్న అక్వేరల్ గార్మెంట్స్ సమీపంలో కారు-బైక్ ఢీకొని హలగూరు ముస్లిం బ్లాక్ నివాసి చాంద్ పాషా కుమారుడు మహమ్మద్ అర్బాజ్ (20) మృతి చెందాడు. ఈయన మళవళ్లికి వెళ్లి హలగూరికి వస్తుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. గాయపడిన మహమ్మద్‌ను మైసూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందవుతూ మృతి చెందాడు హలగూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పాల వ్యాన్ ఢీకొని..

బాగేపల్లి: చేళూరు నుంచి చాకవేలు వెళ్తున్న రెండు బైక్‌లను చేళూరు తాలూకా కేంద్రం సమీపంలో షేర్‌ఖాన్‌కోట క్రాస్ వద్ద బుధవారం పాల వ్యాన్ ఢీ కొట్టింది. ప్రమాదంలో ఒక బైక్‌లోని ఏపీలోని కమ్మరవారిపల్లి గ్రామానికి చెందిన పవన్ కుమార్ (19) అనే యువకుడు మృతి చెందగా గంగాధర్ అనే వ్యక్తి గాయపడ్డాడు. మరో బైక్‌లో ప్రయాణిస్తున్న బత్తలవారపల్లి గ్రామానికి చెందిన వెంకటరెడ్డి అనే వ్యక్తి గాయపడ్డాడు.

కన్నడ భవన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో ?



నిర్మాణం పూర్తికాని కన్నడ భవన నిర్మాణం

గౌరిబిదనూరు: కన్నడ భాషను పరిరక్షించడం, కన్నడ భాష కార్యక్రమాల కోసం చేపట్టిన కన్నడ భవన నిర్మాణం ఆగిపోయింది. ప్రముఖ కన్నడ కవి హంప నాగరాజయ్య మొదలైన వారు జన్మించిన తాలూకా కేంద్రంలో అప్పటి శాసనసభ్యుడు శివశంకరరెడ్డి చొరవతో దశాబ్దం క్రితం రూ. 20 లక్షలతో భవన నిర్మాణం చేపట్టారు. మొదటి అంతస్తు నిర్మాణం సగం నిర్మించిన తర్వాత నిధుల కొరతతో పనులు ఆగిపోయాయి. ప్రభుత్వాలు మారుతున్నా కన్నడ భవన నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే చొరవ చూపి నిధులు మంజూరు చేయించి భవన నిర్మాణం పూర్తి చేయాలని కన్నడ అభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆగిపోయిన భవన నిర్మాణ విషయంపై కన్నడ సంస్కృతి శాఖ మంత్రికి తెలియజేసినట్లు తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు టీఎన్ నంజుండప్ప తెలిపారు. ఇక్కడ గ్రంథాలయం సైతం ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.

దొంగ అరెస్ట్, నగలు స్వాధీనం

బనశంకరి: 20 ఏళ్లుగా చోరీలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ప్రకాష్ అలియాస్ బాలాజీ అనే నిందితుడు పట్టుబడ్డాడు. తాళం వేసిన ఇళ్లను నిందితుడు టార్గెట్‌గా చేసుకుని రాత్రి సమయంలో నకిలీ తాళంతో లోపలకు చొరబడి చోరీలకు తెగబడేవాడు. బండేపాళ్య పోలీస్‌స్టేషన్‌లో నమోదైన చోరీ కేసును సీసీబీ పోలీసులు దర్యాప్తు చేస్తుండగా ప్రకాష్ బుధవారం పట్టుబడ్డాడు. విచారణ చేపట్టగా 20ఏళ్లుగా తప్పించుకొని తిరుగుతున్నది ఇతడేనని తేలింది. నిందితుడినుంచి రూ. రూ.27 లక్షల విలువైన 422 గ్రాములు బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. 20 సంవత్సరాలుగా చోరీలు చేస్తున్న ఇతను బెంగళూరులో చోటు చేసుకున్న 57 కేసుల్లో భాగస్వామి అని తేలింది. ఇప్పటికే ఒకసారి జైలుకెళ్లి బయటికి వచ్చి మళ్లీ చోరీలబాట పడ్డాడు. నిందితుడి మామ పదవీవిరమణ చేసిన పోలీస్ అధికారి కావడం గమనార్హం.

ల్యాప్‌టాప్, ట్యాబ్‌లు చోరీ

మైసూరు: విద్యార్థి నివసిస్తున్న పీజీలోని గదిలోకి ఆగంతకుడు వెళ్లి రూ. 50 వేల విలువ చేసే ట్యాబ్, ల్యాప్‌ట్యాప్‌లను దొంగతనం చేశాడు. ఈ ఘటన మైసూరు శ్రీ విజయశ్రీపురలో జరిగింది. నగరంలోని ఎస్‌జేసీఈలో చదువుతున్న టీఆర్ కార్తీక్ అనే విద్యార్థి విజయశ్రీపురలోని ఒక పీజీలో ఉంటున్నాడు. ఉదయం స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్లి వచ్చేలోగానే ల్యాప్‌టాప్, ట్యాబ్‌లు దొంగతనానికి గురయ్యాయి. జయలక్ష్మీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గంజాయి విక్రేత అరెస్ట్

మైసూరు: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు సైబర్ పోలీసులకు పట్టుబడ్డారు. నగరానికి చెందిన ఆస్టర్ అహ్మద్, అక్బర్ బేగ అనే నిందితులు నలుపు ప్లాస్టిక్ కవర్లలో గంజాయి ఉంచి గౌసియా నగర వద్ద విక్రయిస్తుండగా గస్తీలో ఉన్న పోలీసులు గుర్తించి నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 365 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

మహిళ హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

యశవంతపుర: శివమొగ్గ జిల్లా భద్రావతి తాలూకా అరకెరె గ్రామానికి చెందిన నేత్రావతి(47) హత్యకేసులో భద్రావతికి చెందిన కుమార్, చిదానందప్ప అనే నిందితులను దావణగెరె జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నగిరి తాలూకా బసవపట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని కణివె బిళచి గ్రామం వద్ద భద్ర కాలువలో ఈ నెల 9న మృతదేహం లభ్యమైంది. తొలుత గుర్తు తెలియని మహిళగా పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో మృతురాలి అనవాళ్లు లభించటంతో దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులు ఆమెను హత్య చేసి మృతదేహాన్ని కాలువలో పడేసినట్లు తేలింది. వక్కచెట్లు నరికేసిందనే కోపంతో ఆమెను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. గాలింపు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు.

రెబల్ అభ్యర్థిగా హరీష్ ఆచార్య

దొడ్డబళ్లాపురం: కర్ణాటక కోస్తా ప్రాంతంలో బీజేపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే నైరుతీ పట్టభద్రుల స్థానంలో రెబల్ అభ్యర్థిగా రఘుపతిభట్ పోటీ చేస్తుండగా కొత్తగా మరో అభ్యర్థి బరిలో దిగనున్నారు. టికెట్ ఆశించి భంగపడ్డ డా.ఎస్ఆర్ హరీష్ ఆచార్య రెబల్‌గా పోటీ చేయడానికి సిద్ధమై నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటికే జేడీఎస్, బీజేపీ కూటమి అభ్యర్థిగా ఎమ్మెల్సీ ఎల్ భోజేగౌడకు టికెట్ కేటాయించారు.

హోసూరు వార్తలు..

ఏనుగు దాడిలో రైతు బలి



మృతుడు తిమ్మ రాయప్ప(ఫైల్)



ఆందోళన చేస్తున్న బంధువులు, గ్రామస్తులు

- ఎమ్మెల్యే, గ్రామస్తుల ధర్నా

కెలమంగలం: డెంకణీకోట సమీపంలో ఒంటి ఏనుగు దాడిలో రైతు మృతి చెందాడు. దీంతో బాధిత బంధువులు డెంకణీకోట- అంచెట్టి రోడ్డుపై ఆందోళన చేయడంతో ఉద్రిక్తతకు దారితీసింది. వివరాల్లోకెళితే డెంకణీకోట సమీపంలోని అలసట్టి గ్రామానికి చెందిన రైతు తిమ్మరాయప్ప (39) మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంటి బయటకు రాగా అక్కడే పొంచి ఉన్న ఒంటి ఏనుగు దాడిచేసి చంపేసింది. డెంకణీకోట ప్రాంతంలో గత కొన్నిరోజులుగా ఒంటి ఏనుగు దాడి వల్ల ముగ్గురు మృతి చెందారని, అటవీశాఖ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ అధ్యక్షతన బుధవారం ఉదయం డెంకణీకోట అటవీశాఖ ఆఫీసు ముందు బంధువులు, గ్రామస్తులు నిరాహార దీక్ష చేపట్టారు. డెంకణీకోట పోలీసులు, అటవీశాఖాధికార్లు చేరుకొని వారితో చర్చించారు. 45 రోజుల్లో ఒంటి ఏనుగును బంధిస్తామని, బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామని, అటవీ గ్రామాల్లో సోలార్ కంచె ఏర్పాటు చేసి ప్రజలకు రక్షణ కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించుకొన్నారు.

ఆన్‌లైన్ మోసం.. రూ. 11 లక్షలు హాంఫట్

హోసూరు: పార్ట్ టైం ఉద్యోగం పేరుతో ఉద్యోగి సెల్‌ఫోన్‌కు లింక్ పంపి రూ. 11 లక్షలు కాజేశారు సైబర్ దొంగలు. వివరాల మేరకు హోసూరు సమీపంలోని ఆవులపల్లి ప్రాంతానికి శంకర్ (45) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. ఈ ఏడాది జనవరి 17న అతని సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్‌పై స్పందించి సంప్రదించారు. పార్ట్ టైం ఉద్యోగంతో అధిక రాబడి పొందవచ్చునని, ఇందుకోసం తమ వద్ద పెట్టుబడులు పెట్టాలని చెప్పగా సరేనన్నాడు. విడతలవారీగా రూ. 11 లక్షల నగదును జమ చేయించుకొన్నారు. తరువాత వారి నుంచి స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకుని శంకర్ క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జిల్లాలో తరచూ ఇటువంటి సైబర్ నేరగాళ్ల బారిన పడి ప్రజలు ఎంతో డబ్బును కోల్పోతున్నారు. ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టడం చేయవద్దని పోలీసులు కూడా ప్రచారం చేస్తున్నా స్పందన లేదు.

సొరంగ మార్గంలో రద్దీ సమస్య

క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరి బస్టాండు సమీపంలో జాతీయ రహదారిపై కింద భాగంలో ఏర్పాటు చేసిన వంతెన సొరంగమార్గం ఆక్రమణలకు గురికావడంతో బస్టాండుకెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్య ఎదురుకావడంతో ఆలస్యంగా వెళ్లవలసి వస్తుందని, సంబంధిత శాఖాధికార్లు చర్యలు చేపట్టి ఆక్రమణలు తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సూళగిరి బస్టాండు హోసూరు- క్రిష్ణగిరి హైవే పక్కనే ఏర్పాటైంది. బస్సులు అనేకం వచ్చి వెళ్తుంటాయి. బస్టాండు సమీపంలో జాతీయ రహదారి అడుగు భాగంలో ఏర్పాటు చేసిన సొరంగ మార్గంలో ఇరువైపులా షాపులు వెలిశాయి. దీంతో దారి కుంచించుకుపోవడంతో వాహనదారులు, బస్సులకు దారి లభించక రద్దీ ఏర్పడుతోంది.

కొలనులో జలసమాధి

హోసూరు: మిత్రులతో కలసి ఈతకెళ్లిన అబ్బాయి నీటిలో మునిగి మృతి చెందిన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు వేలూరు జిల్లా వాణియంబాడి ప్రాంతానికి చెందిన సుభాన్ కొడుకు ఆరిఫ్ (17), హోసూరు సమీపంలోని ఓ. కారపల్లి గ్రామంలో తాపీ పని చేసేవాడు. మంగళవారం మిత్రులతో కలిసి రామనాయకుని చెరువు కట్ట కింద జలకంఠేశవరస్వామి ఆలయ కొలనులో ఈతకెళ్లారు. ఈ సమయంలో లోతైన చోట ఆరిఫ్ నీటిలో మునిగి మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

సంతానం లేదని ఆత్మహత్య

కెలమంగలం: పెళ్లి జరిగి ఆరేళ్లు గడిచినా సంతానం కలగలేదనే బాధతో మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన డెంకణీకోట వద్ద జరిగింది. వివరాల మేరకు డెంకణీకోట సమీపంలోని తొలువబెట్ట గ్రామానికి చెందిన శివణ్ణ (32), భార్య మల్లిక (25). వీరికి గత ఆరేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి పిల్లలు లేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన మల్లిక మంగళవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. డెంకణీకోట పోలీసులు కేసు నమోదు చేశారు.

మామిడి గోదాముల్లో తనిఖీలు

హోసూరు: ప్రస్తుతం మామిడి సీజన్ కావడంతో క్రిష్ణగిరి జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున వ్యాపారులు మామిడికాయల మాగబెట్టి పండ్లుగా విక్రయిస్తున్నారు. కొంతమంది రసాయనాలను ఉపయోగించి త్వరగా మాగేలా చేసి అమ్ముతున్నారని, వాటిని తింటే ఆరోగ్యం చెడిపోతుందని జిల్లా కలెక్టర్ శరయుకు ఫిర్యాదులందాయి. ఆమె ఆదేశాల మేరకు జిల్లా ఆహార భద్రతాశాఖాధికారి వెంకటేశ్ నేతృత్వంలోఅధికారులు క్రిష్ణగిరిలోని మామిడి గిడ్డంగుల్లో తనిఖీలు నిర్వహించారు. రసాయనాలతో మాగబెట్టిన 86 కిలోల మామిడి పండ్లను గుర్తించి ధ్వంసం చేశారు. సహజంగా మాగపెబెట్టాలని, రసాయనాలతో పండ్లు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

ఓటు వేసేందుకు వచ్చి మృత్యువాత

ఇద్దరు డ్రైవర్లు సహా ఆరుగురు సజీవ దహనం

- హైదరాబాద్ నుంచి ఓటర్లను పిలిపించిన టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి
- తిరుగు ప్రయాణంలో చిలకలూరిపేట వద్ద బస్సు ప్రమాదం
- టిప్పర్‌ను బస్సు ఢీకొనడంతో చెలరేగిన మంటలు
- పూర్తిగా దగ్ధమైన బస్సు, టిప్పర్
- 30 మందికి గాయాలు.. ఒక మహిళ పరిస్థితి విషమం
- బస్సు ప్రమాద ఘటనపై సీఎం జగన్ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం
- తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేల సాయం



పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం ఈవూరిపాలెం డొంక వద్ద ఎదురెదురుగా ఢీకొని దగ్ధమైన టిప్పర్, ప్రైవేట్ బస్సు

బస్సు ప్రమాద ఘటనపై సీఎం జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి : పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద బస్సు ప్రమాదంలో ఆరుగురు మరణించిన ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సహాయంగా నిలుస్తామన్నారు. మరణించిన వారి కుటుంబాలకు సీఎం జగన్ సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున పరిహారం ప్రకటించారు.

‘అర్ధరాత్రి.. అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. ఒక్క సారిగా దఢేల్ మని పే..ద్ద శబ్దం.. కళ్లు తెరిచి చూసేలోగా మంటలు.. నిప్పు రవ్వలు మీద పడి అంటుకుంటున్న దుస్తులు.. కేకలు, అరుపులు.. కాపాడండని ఆర్తనాదాలు.. కిటికీ అద్దాలు పగుల గొట్టి కొందరు.. డోర్ తెరుచుకుని మరికొందరు బయటకు దూకి ప్రాణాలు కాపాడుకోగా.. ఇద్దరు డ్రైవర్లు సహా ఆరుగురు అక్కడికక్కడే క్షణాల్లో కాలి బూడిదయ్యారు.. అంతా కలలోలాగా జరిగింది. నిజంగా కల అయితే బాగుండు’ అని ఆ ప్రమాదం నుంచి బయట పడిన వారుఅంటున్నారు. వారింకా షాక్ నుంచి తేరుకోలేదు.

మృతుల వివరాలివీ..

ఈ దుర్ఘటనలో చీరాలలోని పేరాలకు చెందిన బస్సు డ్రైవర్ షేక్ మస్తాన్ షరీఫ్ (47), టిప్పర్ డ్రైవర్ మధ్యప్రదేశ్‌కు చెందిన హరిసింగ్ (39), బస్సులో ప్రయాణిస్తున్న చినగంజాం మండలం నీలాయపాలెం గ్రామానికి చెందిన దంపతులు ఉప్పగుండూరు కాశీబ్రహ్మేశ్వరరావు (65), ఉప్పగుండూరు లక్ష్మీ(55), వీరి మనవరాలు ఒంగోలు పట్టణానికి చెందిన బొప్పిరాజు ఖ్యాతి సాయి (9), చినగంజాం మండలం గోనెపూడి గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసరావు (54) సజీవ దహనమయ్యారు. వీరి మృతదేహాలు గుర్తు పట్టలేని విధంగా కాలిపోయాయి.

ప్రమాదం జరిగిందిలా..

చిలకలూరిపేట మండలం ఈవూరివారిపాలెం డొంక సమీపానికి బస్సు రాగానే, అదే సమయంలో పసుమర్రు వైపు నుంచి గ్రావెల్‌తో కూడిన టిప్పర్ (చీరాల వైపు వెళుతూ) ఎదురుగా వస్తోంది. ఈ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో రోడ్డు మార్జిన్ కనిపించక వేగంగా వస్తున్న బస్సు అదుపు తప్పి టిప్పర్‌ను ఢీకొంది. టిప్పర్ డ్రైవర్ రోడ్డు మార్జిన్ దిగినప్పటికీ, బస్సు వేగంగా వెళ్లి టిప్పర్ లారీకి ఉన్న డీజిల్ ట్యాంకును ఢీకొట్టింది. ఈ క్రమంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో రూరల్ సీఐ పి.శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ జి.రవికృష్ణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనా స్థలం వద్దే మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు.



దగ్ధమైన ప్రైవేట్ బస్సు



దగ్ధమైన టిప్పర్



దగ్ధమవుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, టిప్పర్



బస్సులో బూడిదగా మారిన ప్రయాణికుల, డ్రైవర్ మృతదేహాలు (పసుపు స్టిక్కర్లు ఉంచిన చోట)

చినగంజాం/చిలకలూరిపేట : ప్రైవేట్ బస్సు, టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓటు వేసేందుకు వచ్చి తిరిగి వెళ్తున్న చినగంజాం, చీరాల వాసులు నలుగురు, రెండు వాహనాల డ్రైవర్లు మృత్యువాత పడ్డారు. మరో మహిళ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఇంకో 20 మందికి పైగా తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం ఈవూరివారిపాలెం వద్ద ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఓటేసేందుకు వచ్చి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని మృతుల కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లో ఉంటున్న చాలా మందికి పర్చూరు నియోజకవర్గంలో ఓట్లు ఉన్నాయి. దీంతో పర్చూరు టీడీపీ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసి, ఆదివారం రాత్రి వారిని పర్చూరుకు తరలించారు. ఇందులో భాగంగా చినగంజాంకు చెందిన ఓటర్లు సైతం హైదరాబాద్ నుంచి వచ్చారు. వీరంతా సోమవారం ఓట్లు వేసి, మంగళవారం రాత్రి ఏలూరు సాంబశివరావు ఏర్పాటు చేసిన బస్సుల్లో హైదరాబాద్‌కు తిరిగి పయనమయ్యారు. చినగంజాంకు చెందిన 42 మంది చీరాలకు చెందిన ట్రావెల్స్ బస్సు (ఏపీ 27 టీటీ 6577)లో రాత్రి 11 గంటలకు బయలు దేరారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 1.30 గంటలకు ఈ బస్సు.. పల్నాడు జిల్లా ఈవూరుపాలెం వద్ద ఎదురుగా కంకర మట్టి లోడుతో వస్తున్న టిప్పర్ (ఆర్‌జే 23 జీసీ 2452)ను ఆయిల్ ట్యాంక్ వద్ద బలంగా ఢీకొట్టింది. దాంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అటు టిప్పర్, ఇటు బస్సుకు మంటలు వ్యాపించాయి. ఒక్కసారిగా బస్సులో బ్యాటరీ ఫెయిల్ అవడంతో చీకటి అలముకొంది. నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులు తప్పించుకొని వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. ఆ సమయంలో బస్సు డోర్ వద్ద ఉన్న చినగంజాంకు చెందిన యువకుడు సింగోతు సాయి కేకలు వేస్తూ ప్రయాణికులను నిద్ర లేపాడు. చాలా మంది ప్రయాణికులు హాహాకారాలు చేస్తూ డోర్ ద్వారా బయటకు రాగా, మరికొంత మంది కిటికీ అద్దాలను పగులగొట్టి, అత్యవసర ద్వారాన్ని తెరచుకొని బయటకు దూకేశారు. అప్పటికే మంటలు అంటుకొని కొందరు ప్రయాణికులు హృదయ విదారకంగా కేకలు పెట్టారు. ఈ లోగా మంటలు భారీగా చెలరేగి బస్సు, టిప్పర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రయాణికులు నలుగురు బస్సులోనే కాలి బూడిదయ్యారు.

ఒకే కుటుంబంలో ముగ్గురు..

ఉప్పుగుండూరి కాశీ బ్రహ్మేశ్వరరావు, అతని భార్య లక్ష్మీ బస్సు వెనుక భాగంలో కూర్చొన్నారు. వీరు వృద్ధులు కావడంతో త్వరగా బయట పడలేకపోయారు. పైగా మనవరాలు ఖ్యాతి సాయి నిద్రలో ఉండటంతో ఆ పాపను లేపి.. బయటకు రాలేకపోయారు. అంతలోనే మంటలు చుట్టు ముట్టడంతో తప్పించుకోలేని స్థితిలో ఆహుతై ప్రాణాలు విడిచారు. వృద్ధ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దమ్మాయి భావన హైదరాబాద్‌లో, చిన్నమ్మాయి పూజ ఒంగోలులో ఉంటున్నారు. ఓటు వేసేందుకని పెద్ద కుమార్తెతో కలిసి నీలాయపాలెం వచ్చారు. అనంతరం ఒంగోలుకు వెళ్లి చిన్న కుమార్తె కూతురు ఖ్యాతి సాయిని వెంట తీసుకుని చినగంజాం నుంచి టీడీపీ వారు ఏర్పాటు చేసిన బస్సులో హైదరాబాద్ బయలు దేరారు. పిల్లల చదువుల నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్న దావులూరి శ్రీను కూడా ఓటు వేసేందుకే వచ్చారు.

20 మంది క్షతగాత్రులు చినగంజాం వాసులే

దుర్ఘటనలో గాయపడిన 30 మందిని చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల మండలాలకు చెందిన 108 వాహనాల ద్వారా చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం ఎస్.కీర్తి, కె.వెంకటరావు, సీహెచ్.శంకర్రావు, ఎస్.రాజ్యలక్ష్మి, ఎస్.కళావతి, డి.భువన, సీహెచ్.ఆదిలక్ష్మి, పి.లక్ష్మి, కె.లిప్సికను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మరో 20 మందికి ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి పంపించారు. క్షతగాత్రుల్లో 20 మందికి పైగా చినగంజాం మండల వాసులే. మృతి చెందిన పాప పెద్దమ్మ భావన తన వారిని రక్షించుకునే క్రమంలో తీవ్ర గాయాలపాలైంది. శరీరం బాగా కాలిపోవడంతో గుంటూరులో చికిత్స పొందుతోంది. కడవకుదురుకు చెందిన తాటి రాజీ (సాఫ్ట్‌వేర్), గొల్లపూడి ఉదయభాను(సాఫ్ట్‌వేర్), చినగంజాంకు చెందిన తాటి సాయిలక్ష్మి (సాఫ్ట్‌వేర్), మమత (కోచింగ్), అడివీధిపాలెంకు చెందిన రాయని బాలాజీ (ఫొటోగ్రాఫర్), పెదసింగు నాగరాజు, పెదసింగు తిరుపతమ్మ, పెదసింగు నాగరాజు కుమారుడు ఈశ్వరసాయి, కుమార్తె జస్వంతి, బొమ్మిడి మాలతి, గొనసపూడికి చెందిన కందిమళ్ల తేజీ, యలమల ఆకాష్, నీలాయపాలెంకు చెందిన దంపతులు అంజిబాబు, సామినేని సింధూజ, చినగంజాం అంబేడ్కర్ నగర్‌కు చెందిన బొలిమెర సుధాకర్, మేడికొండ చినఅంకయ్య, అతని భార్య సౌజన్య, కుమార్తె అక్షయ, బడుగు సంజన తదితరులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన మంత్రి రజిని

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, పోలీస్ ఏడీజీ శంఖబ్రత బాగ్చి, గుంటూరు ఎస్పీ తుషార్ డూడి, నరసరావుపేట డీఎస్పీ వర్మ, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుల కుటుంబీకులను పరామర్శించి ప్రభుత్వం నుంచి తగు సహాయం అందేలా చూస్తామని మంత్రి రజిని హామీ ఇచ్చారు. ప్రమాద ఘటనపై నరసరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ.. బస్సు అతివేగమే ప్రమాదానికి ప్రాథమిక కారణంగా భావిస్తున్నట్లు తెలిపారు. క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ టీమ్ ద్వారా శాంపిల్స్ సేకరిస్తున్నామని, డ్రైవర్లు మద్యం సేవించారా లేదా అనే విషయం ల్యాబ్ రిపోర్టుల తర్వాత తెలుస్తుందని చెప్పారు.



బాధితులను పరామర్శిస్తున్న మంత్రి విడదల రజిని

చిట్టితల్లికి అప్పడే నూరేళ్లు నిండాయి

ఒంగోలు టౌన్: ఒంగోలులోని సత్యనారాయణపురంలో ఉంటున్న సుబ్బారావు, పూజ దంపతుల గారాల పట్టి, ఏకైక పుత్రిక ఖ్యాతి సాయి. పెద్దయ్యాక పెద్ద డాక్టరై మంచి పేరు తెచ్చుకోవాలన్న ఉద్దేశంతో ఆ పాపకు ఖ్యాతి అని పేరు పెట్టుకున్నారు. ప్రాణంగా పెంచుకున్నారు. చిట్టి తల్లిని చూసి మురిసిపోయారు. స్కూలులో మీ పాపే ఫస్ట్ అని టీచర్లు చెప్పిన మాటలు విని సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. పాపకు మంచి చదువులు చదివించుకోవచ్చని దర్శి మండలం వీరాయపాలెం నుంచి ఒంగోలుకు వచ్చి ఉంటున్నారు. నగరంలోని లంబాడిడొంకలో ఒక స్కానింగ్ సెంటర్లో సుబ్బారావు పీఆర్‌ఓగా, పూజ రిసెప్షనిస్టుగా పని చేస్తున్నారు. ఇద్దరి సంపాదనతో ఖ్యాతిని బాగా చదివించుకోవాలని కలలు కన్నారు. అయితే విధి వక్రీకరించింది. కన్నకూతురు కాలి బూడిదైందన్న వార్త విన్న ఆ దంపతుల గుండె పగిలిపోయింది. గుండెలవిసేలా రోధించారు. స్కూలుకు సెలవులు కావడంతో అవ్వా తాతల వెంట హైదరాబాద్‌కు పంపారు. ఖ్యాతి ఇక లేదన్న వార్త విని చుట్టుపక్కల వారంతా కంట నీరు పెట్టుకున్నారు. పాప తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి వల్లా కాలేదు.



ప్రమాదంలో మృతి చెందిన మనుమరాలు ఖ్యాతి, తాత బ్రహ్మేశ్వరరావు, అమ్మమ్మ లక్ష్మి

విశాఖ ఉత్తరం సహా మూడుచోట్ల ఓడిపోతాం

టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

మహారాణిపేట (విశాఖ): ఈ ఎన్నికల్లో విశాఖ ఉత్తరం నియోజకవర్గంతోపాటు మరో రెండు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు ఓడిపోతున్నట్లు టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ చెప్పారు. విశాఖలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఉత్తరం నుంచి పోటీచేసిన బీజేపీ అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజుకు ఓటమి తప్పదని చెప్పారు. అలాగే మరో రెండుస్థానాల్లో కూటమి అభ్యర్థులు ఓడిపోతారన్నారు. దీన్నిబట్టి ఈ ఎన్నికల్లో టీడీపీకి ఓటమి భయం పట్టుకుందని అర్థమవుతోంది.

ఫ్యాకల్టీకి అదనపు ప్రోత్సాహకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 12 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీకి అదనపు ప్రోత్సాహకం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులిచ్చారు. గిరిజన, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని పాడేరు, మార్కాపురం, పార్వతీపురం, పిడుగురాళ్ల, పెనుకొండ కాలేజీల్లోని ఫ్యాకల్టీకి బేసిక్ మీద 50 శాతం ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. మైదాన ప్రాంతాల్లోని పులివెందుల, మదనపల్లె, ఆదోని, అమలాపురం, బాపట్ల, పాలకొండ, నర్సీపట్నం కళాశాలల్లో బేసిక్ మీద 30 శాతం ప్రోత్సాహకాన్ని అందించనున్నారు. ఈ కళాశాలల్లో పోస్టుల భర్తీకి నిరంతర ప్రక్రియ చేపట్టినప్పటికీ ఖాళీలు భర్తీ అవకపోవడంతో అదనపు ప్రోత్సాహకాల కల్పనలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు కృష్ణబాబు పేర్కొన్నారు.

మంటల వెనుక మర్మమేంటి?

- ‘నోవా అగ్రిటెక్’ ప్రొడక్ట్స్ ఏవైనా ఉన్నాయా?
- ప్రమాదకర రసాయనాలు తరలించారా?
- క్షణాల్లో అంతగా మంటలెలా వ్యాపిస్తాయి?
- బస్సు ప్రమాద ఘటనపై ప్రత్యక్ష సాక్షుల అనుమానాలు



ప్రమాదంలో కాలిపోయిన బస్సు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పసుమర్రు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జరిగిన ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాద ఘటనపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. బస్సు వెళ్లి టిప్పర్‌ను ఢీకొన్న క్షణాల్లోనే మంటలు వ్యాప్తి చెందడం, ఆరుగురు మత్యువాత పడటం, రెండు వాహనాలు దగ్ధం కావడానికి కారణాలు ఏంటని నిపుణులు ఆరా తీస్తున్నారు. బస్సులో ఏవైనా ప్రమాదకర రసాయనిక ఉత్ప్రేరకాలు ఉన్నాయా.. అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఓటర్లు ఏళ్ల తరబడి హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో వివిధ వృత్తుల్లో కొనసాగుతున్నారు. వారి ఓటు హక్కు మాత్రం నియోజకవర్గంలోని స్వగ్రామాల్లోనే ఉంది. ఆయా ప్రాంతాల్లో సాధారణ నివాసం ఉన్న వారికి మాత్రమే ఓటు హక్కును కొనసాగించాల్సి ఉన్నప్పటికీ, ఇతర ప్రాంతాల్లో ఏళ్ల తరబడి ఉంటున్నా స్వగ్రామాల్లో కూడా ఓటు హక్కు కొనసాగిస్తుండటం గమనార్హం. నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాలో అనేక తప్పులు ఉన్నాయనే ఫిర్యాదులు అందడంతో అధికారులు పరిశీలించి 13,558 బోగస్ ఓట్లను ఎన్నికలకు ముందు తొలగించిన సంగతి తెలిసిందే. ఇంకా పెద్ద సంఖ్యలో ఇక్కడ కూడా ఓటు ఉన్న వారు ఆయా ప్రాంతాల్లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వారిని పర్చూరు నియోజకవర్గంలోని స్వస్థలాలకు తీసుకొచ్చి.. ఓటు వేయించి తిరిగి వారిని అక్కడికి చేర్చేందుకు సుమారు 50 బస్సులను స్థానిక ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు చీరాలలోని నాగసాయి తదితర ట్రావెల్స్ ద్వారా ఏర్పాటు చేయించారు. ఈ నేపథ్యంలోనే ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి ముందు రోజు రాత్రి హైదరాబాద్ వెళ్లిన డ్రైవర్.. మంగళవారం రాత్రి డ్యూటీకి రాలేనని చెప్పడంతో క్లీనర్ ద్వారా బస్సు నడిపించినట్లు సమాచారం. చినగంజాంలో బస్సు బయలుదేరే సమయంలో డ్రైవర్ (క్లీనర్) మద్యం తాగి ఉన్నాడని, వాసన వస్తోందని కొందరు ప్రయాణికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కొంత దూరం వెళ్లాక డ్రైవర్ ఎక్కుతారని సర్ది చెప్పి, బస్సును పంపించారు.

ఎన్నో ప్రశ్నలు

- బస్సు.. టిప్పర్‌ను ముందు భాగంలో ఢీకొంది. రెండు వాహనాల క్యాబిన్‌లు ధ్వంసమయ్యాయి. ఇద్దరు డ్రైవర్లు మృతి చెందారు. టిప్పర్‌కు మధ్య భాగంలో ఉన్న డీజిల్ ట్యాంకర్ వెంటనే ఎలా అంటుకుంది?
- ప్రయాణికులంతా టీడీపీ వర్గీయులే. ఎమ్మెల్యే సాంబశివరావుకు హైదరాబాద్‌లో నోవా అగ్రిటెక్ అనే సంస్థ ఉంది. ఇందులో జీవ రసాయన ఎరువులు (బయో ఫర్టిలైజర్స్) తయారవుతాయి. ఇటీవలి కాలంలో పురుగు మందులు కూడా ఉత్పత్తి చేస్తూ విక్రయాలు కొనసాగిస్తున్నారు. బయో ఎరువులు అంటూ ఇతర దేశాల రసాయనాలు కలుపుతూ రైతులను మోసగిస్తున్నారనే ఫిర్యాదులు నోవా అగ్రిటెక్‌పై వెల్లువెత్తాయి. కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రమాదానికి గురైన బస్సులో ఏవైనా ప్రమాదకర రసాయనాలు తరలించారా అనే అనుమానాన్ని బాధిత కుటుంబాల వారు వ్యక్తం చేస్తున్నారు.
- ‘నేను ఘటన జరిగిన సమయంలో డ్రైవర్‌కు సమీపంలోనే ఉన్నాను. అతని పరిస్థితి గమనించి కబుర్లు చెపుతూ, జాగ్రత్తగా వెళ్లండి, హైవే పైకి చేరుకున్న తర్వాత టీ తాగుదాం అని కూడా చెప్పాను. ఉన్నట్లుండి బస్సు టిప్పర్‌ను ఢీకొంది. వెంటనే బస్సులోని లైట్లన్నీ ఆరిపోయాయి. నేను అప్రమత్తంగా ఉన్నందున వెంటనే డోర్ వద్దకు వచ్చి తెరిచాను. ఆ తర్వాత అత్యవసర ద్వారం పగులగొట్టాం. కేకలు వేస్తూ అందరినీ లేపి బయటకు పంపించాం. అంతలోనే మంటలు అంటుకున్నాయి. ఒక్కసారిగా అలా మంటలు ఎందుకు వ్యాపించాయో మాకు అంతు బట్టడం లేదు. బస్సులో ప్రమాదకరమైన రసాయన, మరేవైనా వస్తువులు ఉన్నాయోమోనని కొందరు అన్నారు’ అని చినగంజాం భాగ్యనగర్‌కు చెందిన సింగోతు సాయికుమార్ తెలిపారు.

‘సెంచూరియన్’ బస్సును ఢీకొన్న టిప్పర్

8 మంది విద్యార్థులు, ఇద్దరు డ్రైవర్లకు గాయాలు



బస్సును ఢీకొన్న టిప్పర్

బొండపల్లి: విజయనగరం జిల్లా బొండపల్లి మండల కేంద్రానికి సమీపంలోని జాతీయ రహదారి–26పై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది విద్యార్థులతో పాటు ఇద్దరు డ్రైవర్లు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజపతినగరం నుంచి నెల్లిమర్ల మండలం చందకపేట పరిధిలోని సెంచూరియన్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఫస్టియర్ సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు వర్సిటీ బస్సులో వెళ్తున్నారు. అదే సమయంలో విజయనగరం నుంచి గజపతినగరం వైపు వస్తున్న టిప్పర్ అదుపుతప్పి బొండపల్లి సమీపంలో జాతీయ రహదారిపై బస్సును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 8 మంది విద్యార్థులు గాయపడ్డారు. బస్సు డ్రైవర్ కృష్ణంరాజు క్యాబిన్‌లో ఇరుక్కోవడంతో స్థానికులు బయటకు లాగారు. టిప్పర్ డ్రైవర్‌కూ గాయాలయ్యాయి. లోగిస గ్రామానికి చెందిన వసంత కుమారి అనే విద్యార్థి కాలు విరిగిపోయింది. వీరిద్దరినీ విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించారు. స్వల్పగాయాలైన మిగిలిన విద్యార్థులను గజపతినగరంలోని సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో నాలుగు కిలోమీటర్ల మేర ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. గజపతినగరం సీఐ ప్రభాకరరావు, బొండపల్లి ఎస్‌ఐ కె.లక్ష్మణరావు రాకపోకలను క్రమబద్ధీకరించారు.

‘ఉపాధి’లో మళ్లీ ఏపీనే టాప్

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు దాదాపు ఉండని వేసవి కాలంలో పేదలకు ఉపాధిహామీ పథకం ద్వారా పనుల కల్పనలో మన రాష్ట్రం ఈ ఏడాది కూడా మొదటి స్థానంలో ఉంది. పనులు దొరక్క పేదలు నగరాలకు వలస పోయే పరిస్థితి లేకుండా సొంత ఊళ్లలో పనుల కల్పనలో.. ప్రత్యేకించి వేసవిలో ఇలాంటి పనుల కల్పనలో ఐదేళ్లుగా మన రాష్ట్రమే దేశంలో తొలి స్థానంలో ఉంటోంది. ఈ వేసవిలో కూడా ఏప్రిల్ 1వ తేదీ నుంచి బుధవారం (మే 15వ తేదీ) వరకు 6.99 కోట్ల పనిదినాల పాటు ప్రభుత్వం పనికల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా 99 శాతానికిపైగా గ్రామ పంచాయతీల్లో అంటే.. 13,299 పంచాయతీల్లో కేవలం 45 రోజుల్లోనే మొత్తం 32.37 లక్షల కుటుంబాలు ప్రభుత్వం కల్పించిన ఈ పనులు చేసుకుని రూ.1,713.27 కోట్ల మేర లబ్ధిపొందాయి. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ అధికారిక వెబ్‌సైట్ ప్రకారమే దేశంలో మన రాష్ట్రమే మొదటి స్థానంలో నిలిచింది. రెండోస్థానంలో ఉన్న తెలంగాణ ఈ 45 రోజుల్లో 4.49 కోట్ల పనిదినాలు మాత్రమే పేదలకు ఉపాధి కల్పించింది. ఉపాధి పనుల కల్పనలో మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, బిహార్ ఉన్నాయి.

ఇంటి పనులతోనే సమయం సరిపోవడం లేదనే కంప్లైంట్ గృహిణుల నోట తరచూ వినిపిస్తుంటుంది. కొందరు మాత్రం కొద్దిపాటి ఖాళీ సమయాన్ని కూడా సద్వినియోగం చేసుకుంటూ తమని తాము తీర్చిదిద్దుకుంటారు. అలాంటి కొందరిలో పద్మాసని దరూరి ఒకరు. హైదరాబాద్ మాదాపూర్‌లో ఉంటున్న 53 ఏళ్ల పద్మాసని దరూరి గృహిణిగా ఉంటూ సంస్కృతంతో పాటు అనేక భాషల మీద పట్టు సాధించారు. భర్త ఉద్యోగరీత్యా పుణెలో ఉండటంతో అక్కడి స్థానిక వంటకాలను నేర్చుకున్నారు. పిల్లలు ఉద్యోగాలు చేసే సమయానికి వచ్చేసరికి నగరవాసులకు 'పావ్ మంత్ర' పేరుతో మహారాష్ట్రియన్ వంటకాలను పరిచయం చేస్తూ ఎంట్రప్రెన్యూర్‌గా ఎదిగారు. పుణెలోనూ 'పంచసత్వ' పేరుతో సౌత్ ఇండియన్ క్యుజిన్‌ను ప్రారంభిస్తున్నారు. గృహిణిగా ఉంటూనే వ్యాపారవేత్తగా ఎదిగిన పద్మాసని దరూరిని పలకరిస్తే ఇలా ఎన్నో కబుర్లు మన ముందుంచారు.

వడాపావ్ మంత్రం

పద్మాసని విజయరహస్యం


పద్మాసని దరూరి

''మనలో అభిరుచి ఉండాలే గానీ ఎక్కడ ఉన్నా దానిని వృద్ధిలోకి తీసుకురావచ్చు. మా వారి ఉద్యోగ రీత్యా పుణేలో ఉండేవాళ్లం. గృహిణిగా ఇల్లు, పిల్లల పనులు ఎప్పుడూ ఉండేవే. పిల్లలు హైస్కూల్‌కి వచ్చాక నేను వేదాంత అకాడమీలో చేరి మూడు నెలల్లో సంస్కృతాన్ని నేర్చుకున్నాను. మన పురాణేతిహాసాలు చదువుతూ సబ్జెక్ట్‌పై పట్టు సాధించగలిగాను. కార్పొరేట్ కంపెనీలలో పని చేసే వారి ఆసక్తిని బట్టి, అక్కడకు వెళ్లి సంస్కృతం క్లాసులు తీసుకునే దాన్ని. రామాయణ, మహా భారతాల గురించి క్షుణ్ణంగా వివరించే దాన్ని. వేదాంత అకాడమీలో నేర్చుకున్న విషయాలను ఇంటికి వచ్చి పిల్లలకు చెబుతుండేదాన్ని. దీంతో వారు స్కూల్లో చదువుకున్న విషయాలే కాకుండా మన వేదాల గురించి, పురాణాల గురించీ కూడా తెలుసుకోగలిగారు.

వివిధ రకాల భాషలు

సంస్కృతంతో పాటు హిందీ, ఇంగ్లిష్, మరాఠీ.. ఇలా రకరకాల భాషలను ఆసక్తితో నేర్చుకున్నాను. వీటితోపాటు దేశంలోని అన్ని రకాల ప్రాచీన సంస్కృతుల గురించి తెలుసుకోవడం, వాటిని ఆచరించడం చేస్తుండేదాన్ని. ఈ క్రమంలో అన్ని రకాల వంటకాల తయారీని ఇష్టంగా చేసేదాన్ని. వాటిని మా ఇంట్లో వారికే కాదు మా చుట్టు పక్కల వారికీ రుచి చూపించేదాన్ని. అందరూ మెచ్చుకునేవారు. మా అబ్బాయిలిద్దరూ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తయ్యాక నాకు మరింత వెసులుబాటు దొరికింది. నా వంటకాల రుచితో బిజినెస్ చేయాలనే ఆలోచన వచ్చింది.


రుచిగా.. పావ్ మంత్ర

తరచూ ఇంట్లో బిజినెస్ ఆలోచనల గురించి చర్చ జరుగుతున్నప్పుడు నేను, మా పెద్దబ్బాయి కలిసి ఒక ఫుడ్ స్టార్టప్ ప్రారంభించాలనుకున్నాం. మా స్టార్టప్‌కి వాత్సల్య అనే పేరు అనుకున్నాం. పుణెలో స్థానిక ఫుడ్ వడా పావ్. అక్కడ స్ట్రీట్‌ఫుడ్‌గా దీనికి పేరుంది. హైదరాబాద్ వాసులకు ఈ వడాపావ్ రుచిని కొత్తగా అందించాలనుకున్నాను. పుణెలో వడా పావ్ టేస్ట్, మన దగ్గర టేస్ట్‌కి భిన్నంగా ఉంటుంది. ఏ పనైనా ఒకసారి మొదలుపెడితే దాంట్లో నూటికి నూరు శాతం దృష్టి పెట్టాల్సిందే అనుకొని వ్యాపారంలోకి దిగాను. పావ్‌కి విభిన్నమైన రుచిని తెప్పించడం కోసం రకరకాల ప్రయోగాలు చేసి, విజయవంతమయ్యాం. మా పిల్లలు వామన్, కేశవ్ లు తమ పూర్తి సహకారాన్ని నాకు అందించారు. దాంతో 'పావ్‌మంత్ర' పేరుతో ఫుడ్ బిజినెస్‌ను కరోనా సెకండ్ వేవ్‌లో మాదాపూర్‌లో ప్రారంభించాం. మా స్టార్టప్‌కి మహారాష్ట్ర, పార్సీ అంబియన్స్ వచ్చేలా ప్లాన్ చేశాం. కొద్ది రోజుల్లోనే నోటి మాట ద్వారానే అందరికీ తెలియడంతో మంచి పేరు వచ్చింది. నేను కన్న కల రెండున్నరేళ్లలోనే సాకారం అయ్యింది. ఈ నెలలో పుణెలో 'పంచసత్వ' పేరుతో సౌత్ ఇండియన్ క్యుజిన్‌ను అందించబోతున్నాను. గృహిణిగా ఇంటి పనులు, వంట పనులు చేసుకుంటూ ఉన్న నేను 53 ఏళ్ల వయసులో ఇలా బిజినెస్ ఉమెన్‌గా ఎదుగుతానని అస్సలు ఊహించలేదు. నా అభిరుచికి మేరకు ఒక్కో ప్రయత్నం చేస్తూ ప్రయాణిస్తున్నాను. ఈ ప్రయాణంలో నా పిల్లలు తోడయ్యారు. తొంభై ఏళ్ల వయసున్న నా తల్లిదండ్రులూ నా ఆసక్తిని, అభిరుచిని గౌరవిస్తూ తమ ఆశీస్సులను అందిస్తున్నారు. అమ్మానాన్నలను చూసుకుంటూ, భర్త, పిల్లల బాగోగులను గమనిస్తూ, నన్ను నేనుగా మెరుగుపరుచుకోవడానికి చేసిన ప్రయత్నం ఎప్పుడూ నాకు మంచి ఫలితాలను ఇస్తూ వచ్చింది. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ మరింతగా ఎదగడానికి ప్రయత్నిస్తున్నాను' అంటూ వివరించారు పద్మాసని.

– నిర్మలారెడ్డి

బ్యూటిప్స్

పసుపు.. కొబ్బరిపాలు... రోజ్‌వాటర్


- టీస్పూను పసుపు, టీస్పూను ముల్తానీ మట్టి, టీస్పూను ఆరెంజ్ పీల్ పౌడర్, కప్పు రోజ్‌వాటర్, టీస్పూను కొబ్బరి పాలు, ఆరు చుక్కల నిమ్మనూనెను తీసుకుని ఒక బౌల్‌లో వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఐస్‌క్యూబ్స్ ట్రేలో పోసి గడ్డకట్టేంత వరకు రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. ఈ క్యూబ్‌లు మూడు వారాల వరకు తాజాగా ఉంటాయి.
- ముఖాన్ని శుభ్రంగా కడిగి ఈ ఐస్‌క్యూబ్స్‌తో ఇరవై నిమిషాలపాటు సున్నితంగా మర్దన చేయాలి
- ఇరవై నిమిషాల తరువాత నీటితో కడిగి తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు మాయిశ్చరైజర్ లేదా అలోవెరా జెల్‌ను రాసుకోవాలి.
- ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల ముఖంపై పేరుకుపోయిన మొటిమల తాలూకు మచ్చలు, వైట్, బ్లాక్ హెడ్స్, ట్యాన్ పోయి ముఖం ప్రకాశవంతంగా... తాజాగా కనిపిస్తుంది.



- చర్మం జిడ్డు కారడం నియంత్రణలో ఉండడమేగాక, దీర్ఘకాలంగా వేధిస్తోన్న మొటిమలు కూడా తగ్గుముఖం పడతాయి.
- పసుపు, కొబ్బరి పాలు వృద్ధాప్య ఛాయలను నియంత్రించి చర్మం యవ్వనంగా కనిపించేలా చేస్తాయి.

కిచెన్ టిప్స్

తాజాగా... పొడిగా...



అరకిలో వెల్లుల్లి రెబ్బలను తొక్క తీసి చిన్నచిన్న ముక్కలుగా తరగాలి. కప్పు సూజీ రవ్వను బాణలిలో వేసి, వేడెక్కిన తరువాత రవ్వలో వెల్లుల్లి ముక్కలను వేసి వేయించాలి. రవ్వ, వెల్లుల్లి ముక్కలు గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు వేయించి దించేయాలి. వెల్లుల్లి ముక్కలను రవ్వ నుంచి వేరుచేసి మిక్సీజార్‌లో వేసి పొడిచేసుకోవాలి. దీనిని పిండి జల్లెడతో జల్లించుకుని మెత్తని పొడిని గాలిచొరబడని డబ్బాలో నిల్వచేసుకోవాలి. ఇది ఆరు నెలల పాటు తాజాగా ఉంటుంది. వెల్లుల్లి పేస్టుకు బదులు ఈ పొడిని కావాల్సిన కూరల్లో వేసుకోవచ్చు. ఈ పొడి ఉంటే తరచూ వెల్లుల్లి పొట్టు తీసి దంచే పని ఉండదు.



- అన్నం కొద్దిగా మాడినా, అడుగున మొత్తం మాడిపోయినా మిగతా అన్నం కూడా మాడు వాసన వస్తుంది. ఆ వాసనకు అన్నం తినబుద్ధి కాదు. ఒక ఉల్లిపాయను తీసుకుని నాలుగు ముక్కలుగా తరగాలి. మాడిన అన్నం గిన్నె మధ్యలో నాలుగు ముక్కలను నాలుగు చోట్ల పెట్టి పదిహేను నిమిషాలపాటు మూత పెట్టి ఉంచాలి. పావు గంట తరువాత మూత తీసి ఉల్లిపాయ ముక్కలను తీసేయాలి. ఇలా చేయడం వల్ల మాడు వాసన పోతుంది. అన్నం ఉల్లిపాయ వాసన కూడా రాకుండా చక్కగా ఉంటుంది.




- ఇంట్లో అల్లం ఎక్కువగా ఉన్నప్పుడు... తొక్క తీసి కొద్దిగా నూనె వేసి పేస్టులా చేసుకోవాలి. ఈ పేస్టుని ఐస్ ట్రేలో వేసుకుని ఫ్రీజర్‌లో నిల్వ చేసుకోవాలి. ఈ అల్లం క్యూబ్స్ ఎప్పుడంటే అప్పుడు వాడుకోవచ్చు.



- స్ప్రే బాటిల్‌లో టేబుల్ స్పూను బేకింగ్ సోడా, టేబుల్ స్పూను వెనిగర్, టీస్పూను డిష్‌వాష్ లిక్విడ్, రెండు గ్లాసులు నీళ్లుపోసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కిచెన్ ప్లాట్‌ఫాం, స్టవ్ మీద చల్లుకుని తుడుచుకుంటే ఎటువంటి క్రిములు దరిచేరవు.
- సాల్ట్ డబ్బా అడుగు భాగంలో కొద్దిగా బియ్యం వేసి తరువాత సాల్ట్ వేయాలి. సాల్ట్‌లోని తేమను బియ్యం పీల్చుకుని సాల్ట్‌ను పొడిగా ఉంచుతుంది.



- ప్లాస్టిక్ రోల్ అతుక్కుని త్వరగా ఊడి రాదు. ఇటువంటప్పుడు అరగంట పాటు రోల్‌ని రిఫ్రిజిరేటర్‌లో పెట్టి తరువాత ఓపెన్ చేస్తే అతుక్కోకుండా సులభంగా వచ్చేస్తుంది.

రైజ్ ఏ చైల్డ్

కొత్త తల్లులకు పెద్ద బాలశిక్ష

'పాపాయి నిద్రపుచ్చినంతసేపు కూడా పడుకోలేదు. భుజానికెత్తుకుని తిప్పి తిప్పి నిద్రపుచ్చి ఇలా మంచం మీద పెట్టానో లేదో వెంటనే లేచేసింది. ఈ బిడ్డతో నేనేం చేయను' చంటిబిడ్డను పెంచే ప్రతి తల్లి నుంచి వినవచ్చే మాటే ఇది. ఆ తల్లి వెలిబుచ్చిన నిస్సహాయతలో అగాధం వంటి ఆవేదన దాగి ఉంటుంది. ఈ పాట్లన్నీ పడి పాపాయిని ఆరు నెలలు పెంచేసరికి మెటర్నిటీ లీవ్ అయిపోతుంది. అప్పుడు మరో ప్రశ్న... 'బిడ్డను కేర్ టేకర్ చేతిలో పెట్టి ఉద్యోగానికి వెళ్లవచ్చా. చక్కగా చూసుకోగలిగిన ఆయాలు దొరికితే బావుణ్ను'. బిడ్డకు ఘనాహారం ఎప్పుడు ఇవ్వాలో డాక్టర్‌లు చెబుతారు. కానీ ఎలా తినిపించాలనేది మాత్రం బిడ్డను పెంచిన అనుభవం ఉన్న తల్లులే చెప్పాలి. పిల్లల్ని పెంచడంలో ఎదురయ్యే ఇలాంటి ఎన్నో సందేహాలను నివృత్తి చేసుకోవడానికి వెలిసిందో గ్రామం. దాని పేరే 'రైజ్ ఏ చైల్డ్'. ఎక్కడ ఉందీ గ్రామం. ఈ గ్రామం అడ్రస్ చెప్పాలంటే కేరాఫ్ డిజిటల్ మీడియా అని చెప్పాలి.

ఇప్పుడు ఉమ్మడి కుటుంబాల్లేవు, నగరాల్లో అన్నీ న్యూక్లియర్ ఫ్యామిలీలే. పసిబిడ్డ అమ్మమ్మ, నానమ్మల చేతిలో పెరిగే అవకాశాలు తగ్గిపోయిన ఈ కాలంలో బిడ్డ సంరక్షణలో తల్లులకు ఎదురయ్యే సందేహాలను డిజిటల్ మాధ్యమం ద్వారా ఒకరికొకరు షేర్ చేసుకుంటున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న తల్లులు ఇందులో జాయిన్ అయ్యారు. 'క్వశ్చన్స్ అరౌండ్ బ్రెస్ట్ ఫీడింగ్, బ్రెస్ట్ ఫీడింగ్ సపోర్ట్ ఫర్ ఇండియన్ మదర్స్, బేబీ లెడ్ వీనింగ్, గుడ్ షెడ్యూల్ ఫర్ బేబీస్, క్లాత్ డయాపరింగ్ ఇండియా, ఫస్ట్ ఫార్టీ డేస్ ఆఫ్టర్ చైల్డ్ బర్త్' వంటి పది గ్రూప్‌లను ఒక గొడుగు కిందకు తీసుకువస్తూ 'రైజ్ ఏ చైల్డ్' పేరుతో ఒక వర్చువల్ విలేజ్‌కి రూప కల్పన చేసింది రోహిణి అనే మహిళ. ''నిజానికి నాకెదురైన సమస్యలే ఈ వర్చువల్ విలేజ్ రూపకల్పనకు నాంది. గర్భధారణ, ప్రసవం 30 ఏళ్ల లోపు జరగాలని వైద్యులు సూచిస్తుంటారు. కానీ ఇప్పటి పరిస్థితుల్లో ఉన్నత చదువులు, ఉద్యోగాలలో స్థిరపడిన తరవాతనే పెళ్లి. దాంతో పిల్లలను కనే వయసు దాటిపోతోంది. నేను 32 ఏళ్ల వయసులో గర్భం దాల్చాను. డాక్టర్ పర్యవేక్షణలో ఉన్నప్పటికీ రోజువారీ ఎదురయ్యే ఇబ్బందుల పరిష్కారం కోసం మళ్లీ డాక్టర్ చెకప్ వరకు ఆగలేం. అప్పటికీ రోజూ ఫోన్ చేసి అమ్మ, అత్తగారిని అడిగి తెలుసుకుంటున్నప్పటికీ నేను సరైన జాగ్రత్తలు తీసుకుంటున్నానా లేదా అనే సందేహం. పాత తరం వారి అనుభవంతోపాటు కొత్తతరంలో అందుబాటులోకి వచ్చిన సౌకర్యాలను కూడా తెలుసుకోవాలని చేసిన ప్రయత్నంలో సోషల్ మీడియాలో ఇన్ని వేదికలున్నాయని తెలిసింది. ఆ గ్రూప్‌ల అడ్మిన్‌లందరితో మాట్లాడి అన్నింటినీ 'రైజ్ ఏ చైల్డ్' గొడుగు కిందకు తీసుకువచ్చాను. గర్భిణులకు, కొత్త తల్లులకు ఇది ఒక వరంగా మారింది. ఇది మనదేశంలో ఉన్న వాళ్లకే కాదు, విదేశాల్లో ఉన్న మనవాళ్లకు కూడా ఉపయోగపడుతోంది. నిజానికి మనకంటే వాళ్లకే ఎక్కువగా ఉపయోగపడుతోంది. ఎందుకంటే ఐర్లాండ్‌లో ఉన్న ఒక మహిళ అక్కడి వైద్యవిధానాలు, వైద్యుల సూచనను యథాతథంగా పాటించింది. కానీ ఆ పద్ధతులు పాపాయికి సౌకర్యంగా అనిపించడం లేదని తెలిసి 'రైజ్ ఏ చైల్డ్'లో చేరింది. చాలా సంతోషంగా ఉంది. ఇందులో ఒకరు తమ సమస్యను పోస్ట్ చేసిన తర్వాత అలాంటి సమస్యను ఎదుర్కొని బయటపడిన వాళ్లు తాము ఆ సమస్య ఎలా పరిష్కరించుకున్నారో అనుభవపూర్వకంగా తెలియచేస్తారు'' అని వివరించింది రోహిణి. రైజ్ ఏ చైల్డ్ మొత్తానికి కొత్త తల్లులకు పెద్దబాలశిక్ష అయింది.



> ఇందులో ఒకరు తమ సమస్యను పోస్ట్ చేసిన తర్వాత ఆలాంటి సమస్యను ఎదుర్కొని బయటపడిన వాళ్లు తాము ఆ సమస్య ఎలా పరిష్కరించుకున్నారో అనుభవపూర్వకంగా తెలియచేస్తారు.

మల్టీ టాలెంట్

ప్రీతిక మెహతాను వరల్డ్ ఎకనామిక్ ఫోరం 'గ్లోబల్ షార్పర్'గా గుర్తించింది. చండీగఢ్‌కు చెందిన ప్రీతిక బహుముఖ ప్రజ్ఞాశాలి. గణిత మేధావి, డేటా సైంటిస్ట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎక్స్‌పర్ట్‌గా పేరు తెచ్చుకున్న ప్రీతిక 'బటర్ నట్ ఏఐ'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా రాణిస్తోంది. మరోవైపు మోటివేషనల్ స్పీకర్‌గా ఎంతోమందికి ధైర్యాన్ని ఇస్తోంది. మార్గనిర్దేశం చేస్తోంది....

విజయ ప్రతీక


ప్రీతిక మెహతా

లెక్కలు అంటే చాలామంది పిల్లలకు భయం. అయితే చిన్నప్పటి నుంచి ప్రీతికకు లెక్కలు అంటే చెప్పలేనంత ఇష్టం. బొమ్మలు వేయడం అంటే కూడా ఇష్టం. పద్నాలుగు సంవత్సరాల వయసులో కోడింగ్ నేర్చుకోవడం మొదలుపెట్టింది.

ఒక ప్రాడక్ట్ స్టార్టప్‌లో తొలి ఉద్యోగం చేస్తున్నప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై ఆసక్తి పెరిగింది. దాంతో ఉద్యోగాన్ని వదులుకొని న్యూయార్క్‌లోని స్టేట్ యూనివర్శిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో మాస్టర్స్ చేసింది.

ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు ఖర్చుల కోసం ఒక రెస్టారెంట్‌లో పనిచేసేది.

గ్రాడ్యుయేషన్ సెర్మనీకి ప్రీతిక తల్లి అమెరికాకు వచ్చింది. తల్లిని తన ప్రొఫెసర్‌కు పరిచయం చేసింది.

'మీ అమ్మాయి బ్రైట్ స్టూడెంట్. క్లాస్‌రూమ్‌లో లోతైన ప్రశ్నలు అడిగేది. మీ కూతురికి మంచి భవిష్యత్ ఉంది' అంటూ ఆ ప్రొఫెసర్ ప్రీతికపై ప్రశంసల వర్షం కురిపించాడు.

ప్రొఫెసర్ మాటలు విన్న తరువాత ప్రీతికకు తన మీద ఉన్న నమ్మకం రెట్టింపు అయింది.

'యస్. నేను సాధించగలను' అనుకుంది.

బోస్టన్‌లోని 'బాంక్ ఆఫ్ అమెరికా'లో పనిచేసే అవకాశం ప్రీతికకు వచ్చింది. అయితే సొంతంగా ఏదైనా సాధించాలనే లక్ష్యంతో అధిక వేతనంతో కూడిన ఉద్యోగానికి రాజీనామా చేసింది. ప్రీతిక నిర్ణయం కుటుంబ సభ్యులతో సహా చాలామందికి నచ్చలేదు.

'బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఉద్యోగ జీవితం బాగున్నప్పటికీ నాలో ఉన్న అన్ని టాలెంట్స్‌ను ఉపయోగించుకునే అవకాశం దొరకలేదు' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటుంది ప్రీతిక.

అమెరికా నుంచి వచ్చిన తరువాత పిల్లలకు కోడింగ్ నేర్పించడానికి 'కిడ్డీకోడర్స్'ను స్టార్ట్ చేసి పన్నెండు దేశాలకు వెళ్లింది. ఆ తరువాత సాక్‌సోహో.కామ్‌తో మెన్స్ ఫ్యాషన్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది.

'మెన్స్ ఫ్యాషన్ ఇండస్ట్రీలో మంచి అవకాశాలు ఉన్నాయని రిసెర్చ్ ద్వారా తెలుసుకున్నాను. ఈ స్పేస్‌లో గ్లోబల్ స్టార్టప్ నిర్మించవచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సాక్‌సోహో మొదలు పెట్టాను' అంటుంది ప్రీతిక.

తనకు పట్టు ఉన్న డేటా, ఏఐ సబ్జెక్ట్‌లతో కస్టమర్‌ల వ్యక్తిగత అనుభవాలతో కంపెనీని బిల్ట్ చేసింది. యూఎస్‌లో చదువుకునే రోజుల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగిగా ఒక ఇటాలియన్ రెస్టారెంట్‌లో పనిచేసింది. అది కస్టమర్–ఫేసింగ్ జాబ్ కావడం వల్ల ఎన్నో విషయాలపై అవగాహన వచ్చింది. ఆ జ్ఞానం 'సాక్‌సోహో'కు ఉపయోగపడింది. డైరెక్ట్–టు–కన్స్యూమర్ ఫ్యాషన్ బ్రాండ్ 'సాక్‌సోహో'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయకేతనం ఎగరేసింది ప్రీతిక.

'మనపై మనకు ఉన్న నమ్మకమే శక్తి. దానితో ఎన్ని విజయాలైనా సాధించవచ్చు' అంటుంది ప్రీతిక మెహతా.

అమ్మ చెప్పిన మాట



చదువుకునే రోజుల్లో ఎందరో విజేతల కథలు నాకు స్ఫూర్తి ఇచ్చాయి. అదే సమయంలో 'ప్రతి రంగంలో పురుషులతో పోల్చితే మహిళా విజేతలు ఎందుకు తక్కువగా ఉన్నారు?' అని ఆలోచించేదాన్ని. ఈ ఆలోచనలతోనే నా వంతుగా ఏదైనా సాధించాలనే పట్టుదల పెరిగింది. చిన్నప్పుడు స్కూల్ మార్చమని ఇంట్లో గొడవ చేశాను. దీనికి కారణం క్లాసులో 80 మంది స్టూడెంట్స్ ఉండడం. 'ఇంత మంది మధ్య నేను టాపర్‌గా ఎలా ఉండగలను' అన్నాను. 'ఇరవైమందిలో ఎలాగైతే టాపర్‌గా నిలిచావో 80 మందిలో కూడా టాపర్‌గా నిలవాలి' అని అమ్మ చెప్పింది. వందమందిలో రాణించగలిగినప్పుడు వెయ్యిమందిలో కూడా రాణించగలం అనే సత్యం బోధపడింది. మనలో సామర్థ్యం ఉన్నప్పుడు సంఖ్య ముఖ్యం కాదు. ఒకవైపు భవిష్యత్ లక్ష్యాలు. మరోవైపు ఇరుగు పొరుగు వారి సూటిపోటి మాటలు. 'ఈ డ్రెస్‌తో బయటికి వెళతావా?' 'అబ్బాయిలా పొడుగ్గా పెరుగుతున్నావేమిటి?'... ఇలాంటి నాన్‌సెన్స్ మైండ్‌సెట్ కామెంట్స్ చిరాకు కలిగించేవి కానీ నా భవిష్యత్ లక్ష్యాలను నీరుగార్చలేకపోయాయి. మన దేశంలోనే కాదు అమెరికాలోనూ వృత్తిజీవితంలో లింగవివక్షతను ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. అయితే అలాంటి వాటికి చిన్నబుచ్చుకోకుండా టాలెంట్‌తోనే సమాధానం చెప్పాను.

– ప్రీతిక మెహతా

మార్గనిర్దేశం

'ఉన్నత స్థానానికి చేరుకున్న మహిళలకు తమ స్థాయిని కాపాడుకోవడానికి రెట్టింపు కష్టపడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో లక్ష్యసాధనకు సంబంధించి అమ్మాయిలకు మార్గనిర్దేశం చేయడానికి వారికి సమయం దొరకదు' అంటున్న ప్రీతిక ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎంత బిజీగా ఉన్నప్పటికీ లక్ష్యసాధన విషయంలో అమ్మాయిలకు మార్గనిర్దేశం చేయడానికి ఎన్నో సమావేశాల్లో పాల్గొంది. ఎంటర్‌ప్రెన్యూర్‌గానే కాదు మోటివేషనల్ స్పీకర్‌గా కూడా మంచి పేరు తెచ్చుకుంది. 'థింక్. లెర్న్. డిసైడ్ విత్ యువర్ ఓన్ హెడ్ అండ్ హార్ట్' అనేది ఎన్నో సమావేశాలలో ప్రీతిక నుంచి వినిపించే మాట.



తొలి రౌండ్‌లోనే సుమిత్ ఓటమి

నెల రోజుల తర్వాత పాల్గొన్న తొలి టోర్నీలో భారత టెన్నిస్ నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు నిరాశ ఎదురైంది. ఫ్రాన్స్‌లోని బోర్డెక్స్‌లో జరుగుతున్న బీఎన్‌పీ పరిబా ప్రైమ్‌రోజ్ ఏటీపీ-175 చాలెంజర్ టోర్నీలో సుమిత్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు. ప్రపంచ 93వ ర్యాంకర్ సుమిత్ 2-6, 2-6తో ప్రపంచ 130వ ర్యాంకర్ హారోల్డ్ మయోట్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం చవిచూశాడు. 69 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయాడు.




అర్జున్‌కు మిశ్రమ ఫలితాలు

షార్జా మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ ఏడో ర్యాంకర్ ఇరిగేశి అర్జున్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. తొలి రౌండ్ గేమ్‌లో అర్జున్ 45 ఎత్తుల్లో ఎల్తాజ్ సఫారిల్ (అజర్‌బైజాన్)పై గెలిచాడు. రెండో రౌండ్ గేమ్‌లో అర్జున్ 28 ఎత్తుల్లో నికోలస్ (గ్రీస్) చేతిలో ఓడిపోయాడు. తెలంగాణకే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ తొలి గేమ్‌లో 28 ఎత్తుల్లో అభినవ్ మిశ్రా (అమెరికా) చేతిలో ఓడిపోయి...లియోన్ మెండోకా (భారత్)తో జరిగిన రెండో గేమ్‌ను 28 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు.

మళ్లీ ఓడిన రాజస్తాన్

వరుసగా నాలుగో ఓటమి ● పంజాబ్‌ను గెలిపించిన స్యామ్ కరన్ ● అదరగొట్టిన చహర్, హర్షల్



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్యామ్ కరన్

గువాహటి: పంజాబ్ కింగ్స్ ఆల్‌రౌండ్ 'షో' ధాటికి రాజస్తాన్ రాయల్స్ చేతులెత్తేసింది. ఐపీఎల్ టోర్నీలో వరుసగా నాలుగో పరాజయం చవిచూసింది. కెప్టెన్ స్యామ్ కరన్ (2 వికెట్లు; 41 బంతుల్లో 63 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరిపించి పంజాబ్ కింగ్స్ జట్టుకు ఐదు వికెట్ల తేడాతో విజయాన్ని అందించాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. రియాన్ పరాగ్ (34 బంతుల్లో 48; 6 ఫోర్లు) ఒక్కడే రాణించాడు. స్యామ్ కరన్, హర్షల్ పటేల్, రాహుల్ చహర్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పంజాబ్ కింగ్స్ 18.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేసి గెలిచింది. జితేశ్ శర్మ (20 బంతుల్లో 22; 2 సిక్స్‌లు), అశుతోష్ శర్మ (11 బంతుల్లో 17 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్)లతో స్యామ్ కరన్ విలువైన భాగస్వామ్యాలు నమోదు చేశాడు.

పరాగ్ నిలబడటంతో...

ఇప్పటికే ప్లే ఆఫ్స్ దశకు అర్హత పొందిన రాజస్తాన్ జట్టు బ్యాటింగ్‌లో తీవ్రంగా నిరాశపరిచింది. ఓపెనర్లు యశస్వి (3), కొహ్లెర్ (18), టాపార్డర్ బ్యాటర్ సామ్సన్ (18) వికెట్లు పారేసుకోవడంతో మెరుపులు కాదుకదా... పరుగుల్లో వేగమే కనిపించలేదు. పరాగ్, అశ్విన్ (19 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) ఉన్నంత సేపు ఇన్నింగ్స్ మెరుగవుతుందనిపించింది. కానీ అశ్విన్ అవుట్ కాగానే క్రీజులోకి వచ్చిన ఐదుగురు బ్యాటర్లలో బౌల్ట్ (12) మినహా ఇంకెవరూ పది పరుగులైనా చేయలేదు.

కెప్టెన్ ఇన్నింగ్స్

సులువైన లక్ష్యమే అయినా పంజాబ్ తడబడింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ (6)... అవేశ్ వేసిన ఐదో ఓవర్లో రోసో (13 బంతుల్లో 22; ఫోర్లు), శశాంక్ (0) అవుట్ కావడంతో 36 పరుగులకే 3 కీలక వికెట్లను కోల్పోయింది. కాసేపటికే బెయిర్‌స్టో (14)ను చహల్ అవుట్ చేయడంతో రాజస్తాన్ సంబరాల్లో మునిగింది. 48/4 స్కోరు వద్ద పీకల్లోతు కష్టాల్లో పడిన పంజాబ్‌ను కెప్టెన్ స్యామ్ కరన్... జితేశ్ శర్మతో కలిసి ఆదుకున్నాడు. ఇద్దరు వికెట్‌ను కాపాడుకొని తర్వాత భారీషాట్లపై దృష్టి పెట్టారు. జట్టు స్కోరు 100 దాటాకా ఐదో వికెట్‌కు 63 పరుగులు జోడించాక జితేశ్ ఆటను చహల్ ముగించాడు. ఈ దశలో స్యామ్ కరన్ పంజాబ్‌ను లక్ష్యం వైపు తీసుకెళ్లాడు. అశుతోష్‌తో కలిసి మరో వికెట్ పడకుండా 19వ ఓవర్లోనే మ్యాచ్‌ను ముగించాడు.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (బి) స్యామ్ కరన్ 4; టామ్ కోహ్లెర్ (సి) జితేశ్ (బి) చహర్ 18; సామ్సన్ (సి) చహర్ (బి) ఎలిస్ 18; పరాగ్ (ఎల్బీ డబ్ల్యూ) (బి) హర్షల్ 48; అశ్విన్ (సి) శశాంక్ (బి) అర్ష్‌దీప్ 28; జురెల్ (సి) హర్‌ప్రీత్ (బి) స్యామ్ కరన్ 0; పావెల్ (సి అండ్ బి) చహర్ 4; ఫెరీరా (సి) రోసో (బి) హర్షల్ 7; బౌల్ట్ (రనౌట్) 12; అవేశ్ ఖాన్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 144. వికెట్ల పతనం:** 1-4, 2-40, 3-42, 4-92, 5-97, 6-102, 7-125, 8-138, 9-144. **బౌలింగ్:** స్యామ్ కరన్ 3-0-24-2, అర్ష్‌దీప్ 4-0-31-1, ఎలిస్ 4-0-24-1, హర్షల్ 4-0-28-2, రాహుల్ చహర్ 4-0-26-2, హర్‌ప్రీత్ 1-0-10-0. **పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్:** ప్రభ్‌సిమ్రన్ (సి) చహల్ (బి) బౌల్ట్ 6; బెయిర్‌స్టో (సి) పరాగ్ (బి) చహల్ 14; రోసో (సి) యశస్వి (బి) అవేశ్ 22; శశాంక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అవేశ్ 0; స్యామ్ కరన్ (నాటౌట్) 63; జితేశ్ (సి) పరాగ్ (బి) చహల్ 22; అశుతోష్ (నాటౌట్) 17; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (18.5 ఓవర్లలో 5 వికెట్లకు) 145. వికెట్ల పతనం:** 1-6, 2-36, 3-36, 4-48, 5-111. **బౌలింగ్:** బౌల్ట్ 3-0-27-1, సందీప్ 4-0-28-0, అవేశ్ ఖాన్ 3.5-0-28-2, అశ్విన్ 4-0-31-0, చహల్ 4-0-31-2.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.రే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్తాన్	13	8	5	0	16	0.273
చెన్నై	13	7	6	0	14	0.528
హైదరాబాద్	12	7	5	0	14	0.406
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
బెంగళూరు	13	6	7	0	12	0.387
లక్నో	13	6	7	0	12	-0.787
గుజరాత్	13	5	7	1	11	-1.063
పంజాబ్	13	5	8	0	10	-0.347
ముంబై	13	4	9	0	8	-0.271

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ X గుజరాత్
వేదిక: హైదరాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

మూడో రౌండ్‌లో మనిక



కపాడోసియా (టర్కీ): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ లెవెల్ టోర్నీలో భారత నంబర్‌వన్ మనిక బత్రా మూడో రౌండ్‌లోకి చేరింది. ప్రపంచ 24వ ర్యాంకర్ మనిక బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో 11-9, 6-11, 11-8, 9-11, 11-5తో వాంగ్ జిజు (చైనీస్ తైపీ)పై గెలిచింది. భారత్‌కే చెందిన కృత్విక, యశస్విని, స్వస్తిక కూడా మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో కృత్విక 11-9, 11-8, 11-7తో ఆడ్రీ జరీఫ్ (ఫ్రాన్స్)పై, యశస్విని 11-9, 11-7, 8-11, 11-4తో సిమే కులాక్‌సెకెన్ (టర్కీ)పై, స్వస్తిక 11-5, 11-5, 11-9తో గరీమా గోయల్ (భారత్)పై విజయం సాధించారు.

సెమీస్‌లో అభిషేక్

అస్తానా: ఎలోర్డా కప్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్ అభిషేక్ యాదవ్ (67 కేజీలు) సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. క్వార్టర్ ఫైనల్లో అభిషేక్ 5-0తో రఖాత్ సెటిజాన్ (కజకిస్తాన్)పై గెలిచి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన పవన్ (54 కేజీలు), కవీందర్ సింగ్ బిష్త్ (57 కేజీలు), వరీందర్ సింగ్ (60 కేజీలు), హితేశ్ (71 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు.

సాత్విక్-చిరాగ్ జోడీ శుభారంభం

ప్రణయ్‌పై మిరాబా సంచలన విజయం





మిరాబా

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో టాప్ సీడ్ సాత్విక్-చిరాగ్ ద్వయం 21-13, 21-13తో నూర్ మొహమ్మద్-తాన్ వీ కియోంగ్ (మలేసియా) జంటపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్, ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ హెచ్ఎస్ ప్రణయ్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. భారత రైజింగ్ స్టార్, ప్రపంచ 84వ ర్యాంకర్ మైస్నం మిరాబా లువాంగ్ వరుస గేముల్లో ప్రణయ్‌ను ఓడించి తన కెరీర్‌లో గొప్ప విజయాన్ని అందుకున్నాడు. 55 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో మిరాబా 21-19, 21-18తో ప్రణయ్‌ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. భారత్‌కే చెందిన కిరణ్ జార్జి, సతీశ్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. కిరణ్ 15-21, 21-13, 17-21తో మాడ్స్ క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్) చేతిలో... సతీశ్ 13-21, 17-21తో జేసన్ గుణవన్ (హాంకాంగ్) చేతిలో పరాజయం పాలయ్యారు.

అష్మిత మినహా...

మహిళల సింగిల్స్‌లో భారత్ నుంచి ఐదుగురు బరిలోకి దిగగా... అష్మిత మినహా మిగతా నలుగురు ఉన్నతి హుడా, సామియా, మాళవిక, ఆకర్షి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. అష్మిత 19-21, 21-15, 21-14తో ఎస్తర్ నురిమి (ఇండోనేసియా)పై గెలిచింది. ఉన్నతి 21-14, 14-21, 19-21తో లియాన్ టాన్ (బెల్జియం) చేతిలో, సామియా 13-21, 13-21తో గావో ఫాంగ్ జి (చైనా) చేతిలో ... మాళవిక 11-21, 10-21తో హాన్ యువె (చైనా) చేతిలో, ఆకర్షి 13-21, 8-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యారు.

నేపాల్ క్రికెటర్ సందీప్ లమిచానే శిక్ష రద్దు



ఖాట్మండు: క్రిమినల్ కేసు నుంచి నేపాల్ స్టార్ క్రికెటర్ సందీప్ లమిచానేకు హైకోర్టులో పెద్ద ఊరట లభించింది. ఓ మహిళపై లైంగిక దాడి కేసులో ఖాట్మండు జిల్లా కోర్టు విధించిన 8 ఏళ్ల జైలు శిక్షను పటాన్ హైకోర్టు రద్దు చేసింది. నేపాల్ మాజీ కెప్టెన్ లమిచానే 2022 ఆగస్టు 21న ఓ మహిళను రేప్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఖాట్మండు కోర్టు అతనికి రూ. 3 లక్షలు జరిమానా, మరో రూ. 2 లక్షలు బాధితురాలికి పరిహారంతో పాటు 8 ఏళ్ల జైలు శిక్షను ఖరారు చేసింది. బెయిల్‌పై బయటికి వచ్చిన లమిచానే కేసును బుధవారం విచారించిన హైకోర్టు కింది కోర్టు శిక్షను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. 23 ఏళ్ల లమిచానే నేపాల్ తరఫున 51 వన్డేలు ఆడి 112 వికెట్లు, 52 టి20లు ఆడి 98 వికెట్లు తీశాడు.

నీరజ్ చోప్రాకు స్వర్ణం



భువనేశ్వర్: స్వదేశంలో మూడేళ్ల తర్వాత తొలిసారి బరిలోకి దిగిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్, ఒలింపిక్, ప్రపంచ చాంపియన్ నీరజ్ చోప్రా స్వర్ణ పతకంతో మెరిశాడు. గతవారం దోహాలో జరిగిన డైమండ్ లీగ్ మీట్‌లో రెండో స్థానంలో నిలిచిన నీరజ్...బుధవారం జరిగిన ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ మీట్‌లో పసిడి పతకం సాధించాడు. హరియాణాకు చెందిన 26 ఏళ్ల నీరజ్ నాలుగో ప్రయత్నంలో జావెలిన్‌ను 82.27 మీటర్ల దూరం విసిరి బంగారు పతకాన్ని ఖరారు చేసుకున్నాడు. కర్ణాటకకు చెందిన డీపీ మనూ 82.06 మీటర్లతో రజత పతకాన్ని దక్కించుకోగా... మహారాష్ట్రకు చెందిన ఉత్తమ్ పాటిల్ 78.39 మీటర్లతో కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు. గత ఏడాది ఆసియా క్రీడల్లో రజత పతకం నెగ్గిన కిశోర్ కుమార్ జెనా నిరాశపరిచాడు. ఒడిశాకు చెందిన కిశోర్ జావెలిన్‌ను 75.25 మీటర్ల దూరం విసిరి ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. చివరిసారి భారత్‌లో 2021 మార్చి 17న భువనేశ్వర్‌లోనే జరిగిన ఫెడరేషన్ కప్‌లో నీరజ్ పోటీపడి స్వర్ణ పతకం సాధించాడు. మూడేళ్ల తర్వాత ఇదే వేదికపై పోటీ పడ్డ నీరజ్ పసిడి ఫలితాన్ని పునరావృతం చేశాడు.

సినిమా

మీరు నా కెరీర్ రైలు దిగనందుకు కృతజ్ఞతలు

- కాన్స్ చిత్రోత్సవాల్లో నటి మెరిల్ స్ట్రీప్



మెరిల్ స్ట్రీప్



ఊర్వశీ రౌతేలా



దీప్తీ సద్వానీ

ఫ్రాన్స్ నగరంలోని కాన్స్‌లో 77వ కాన్స్ చలన చిత్రోత్సవాలు అట్టహాసంగా ఆరంభమయ్యాయి. ఈ ఏడాది కాన్స్ జ్యూరీ ప్రెసిడెంట్‌గా నటి-దర్శకురాలు గ్రెటా గెర్విగ్ వ్యవహ రిస్తున్నారు. ఆమె నేతృత్వంలో జ్యూరీ ఈ సంవత్సరం పోటీ పడుతున్న 22 చిత్రాల నుండి విజేతను ఎంపిక చేస్తుంది. వేడుక చివరి రోజు విజేతకు అవార్డు ప్రదానం చేస్తారు. ఇక వేడుకలు ప్రారంభం అయ్యే ముందు విలేకరులతో 'మీ టూ' మూమెంట్ గురించి, సమాజంలో సానుకూల మార్పు తెచ్చే శక్తి బలమైన కథలకు ఉంటుందని గ్రెటా గెర్విగ్ పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 25 వరకూ జరిగే ఈ ఫెస్టివల్‌లో తొలి రోజు ప్రారంభ చిత్రంగా క్వెంటిన్ డ్యూపియక్స్ దర్శకత్వంలో రూపొందిన 'ది సెకండ్ యాక్ట్' ప్రదర్శితమైంది. అలాగే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'పామ్ డి ఓర్' పురస్కారాన్ని నటి మెరిల్ స్ట్రీప్‌కి ప్రదానం చేశారు. సినీ రంగానికి మెరిల్ చేసిన సేవలకు గాను ఆమెను ఈ పురస్కారంతో గౌరవించారు. 1989లో కాన్స్ ఉత్సవాల్లో పాల్గొన్నారు మెరిల్. 'ఈవిల్ ఏంజెల్స్'లో కనబర్చిన నటనకుగాను ఆ ఏడాది ఆమె ఉత్తమ నటి అవార్డు అందుకున్నారు. 40 ఏళ్ల వయసు అప్పుడు ఆ అవార్డు అందుకున్న మెరిల్ ఇప్పుడు 74 ఏళ్ల వయసులో ఈ చిత్రోత్సవాలకు హాజరయ్యారు. దాదాపు 35 ఏళ్లకు మళ్లీ కాన్స్‌లో పాల్గొనడం, ప్రతిష్టాత్మక పామ్ డి ఓర్ పురస్కారం అందుకోవడం, అవార్డు అందుకుంటున్న సమయంలో వీక్షకులు ఓ 2 నిమిషాల పాటు నిలబడి చప్పట్లతో అభినందించడంతో మెరిల్ స్ట్రీప్ ఒకింత ఉద్వేగానికి గురై, ఈ విధంగా స్పందించారు.

''గతంలో నేను కాన్స్ చిత్రోత్సవాల్లో పాల్గొన్నప్పుడు నా వయసు 40. అప్పటికి ముగ్గురు పిల్లల తల్లిని. నా కెరీర్ ముగిసిపోయిందనుకున్నాను. కానీ ఈ రాత్రి (కాన్స్ వేదికను ఉద్దేశించి) నేను ఇక్కడ ఉన్నానంటే దానికి కారణం మేడమ్ ప్రెసిడెంట్ (గ్రెటా గెర్విగ్‌ని ఉద్దేశించి... 2019లో గ్రెటా దర్శకత్వం వహించిన 'లిటిల్ ఉమెన్' చిత్రంలో నటించారు మెరిల్)తో సహా నేను పని చేసిన ఎంతోమంది ప్రతిభావంతులైన కళాకారులు. ఇక్కడ నా సినిమాల క్లిప్పింగ్స్‌ని చూస్తుంటే నా కెరీర్‌ని బుల్లెట్ ట్రైన్ కిటికీలోంచి చూస్తున్నట్లుగా ఉంది. ఆ కిటికీలోంచి నా యవ్వనం మధ్యవయసుకి ఎగరడం నుంచి ఇదిగో ఇప్పుడు ఈ వేదిక వరకూ రావడం.. అంతా కనిపిస్తోంది. ఈ ప్రయాణంలో ఎన్నో ప్రదేశాలు... ఎన్నో ముఖాలు గుర్తొస్తున్నాయి. అన్నింటికీ మించి ఇన్నేళ్లుగా నన్ను ఆదరిస్తున్న మీకు (ప్రేక్షకులు) చాలా కృతజ్ఞతలు. నా ముఖం పట్ల మీరు విముఖత చూపనందుకు నా కెరీర్ ట్రైన్‌ని మీరు దిగనందుకు ధన్యవాదాలు'' అంటూ తన ప్రసంగాన్ని ముగించారు మెరిల్ స్ట్రీప్.

మెరిసిన దేశీ తారలు

ఈ వేడుకల్లో పలువురు దేశ, విదేశీ తారలు పొడవాటి గౌనుల్లో ఎర్ర తివాచీపై క్యూట్‌గా క్యాట్‌వాక్ చేసి ఆకట్టుకున్నారు. బాలీవుడ్ తారలు దీప్తీ సద్వానీ, ఊర్వశీ రౌతేలా తదితరులు పాల్గొన్నారు. టీవీ సిరీస్ 'తారక్ మెహతా కా ఉల్టా చష్మా' ఫేమ్, పలు హిందీ చిత్రాల్లో నటించిన దీప్తీ సద్వానీ రెడ్ కార్పెట్ పై మెరిశారు. ప్రారంభ వేడుకలో పాల్గొన్న ఈ బ్యూటీ మొత్తం మూడు రోజుల పాటు ఈ చిత్రోత్సవాల్లో పాల్గొననున్నారు. కాన్స్ ఉత్సవాల్లో పొడవాటి గౌను ధరించిన తొలి తారగా రికార్డ్ సాధించారు దీప్తి. ''ఈ రెడ్ కార్పెట్‌పై నడవడం గౌరవంగా భావిస్తున్నాను. అది కూడా రికార్డు బద్దలు కొట్టే పొడవాటి ట్రైల్ ఉన్న గౌను ధరించడం హ్యాపీగా ఉంది'' అని పేర్కొన్నారు దీప్తీ సద్వాని. ఇక గత ఏడాది కాన్స్ చిత్రోత్సవాల్లో పాల్గొన్న బాలీవుడ్ తార ఊర్వశీ రౌతేలా ఈసారీ హాజరయ్యారు. పింక్ కలర్ ఫ్రాక్‌లో ఆకట్టుకున్నారామె. కాగా 2018లో ఈ వేడుకల్లో పాల్గొన్న దీపికా పదుకోన్ పింక్ రంగు గౌను ధరించారు. ఇప్పుడు ఊర్వశీ ధరించిన గౌనుని అప్పటి దీపికా గౌనుతో పోల్చుతున్నారు.

ఇలా తారల తళుకులు, పురస్కార గ్రహీత భావోద్వేగాలతో కాన్స్ చిత్రోత్సవాలు ఆకట్టుకునేలా సాగుతున్నాయి.

తెలంగాణలో థియేటర్లు బంద్

- రెండు వారాల పాటు సింగిల్ స్క్రీన్స్ మూత



తెలంగాణ రాష్ట్రంలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు బంద్ కానున్నాయి. రేపటి నుంచి (శుక్రవారం) పది రోజుల పాటు థియేటర్లు మూసివేయాలని 'తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్' నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయానికి కారణం థియేటర్లకు ప్రేక్షకులు రాకపోవడమే. వేసవి సెలవులను క్యాష్ చేసుకునేందుకు దర్శక-నిర్మాతలు, హీరోలు తమ సినిమాలను సమ్మర్‌లో రిలీజ్ చేసేందుకు పోటీ పడేవారు. అయితే ఈ ఏడాది వేసవిలో పెద్ద సినిమాలేవీ విడుదలకు నోచుకోలేదు. చిన్న చిత్రాలు రిలీజ్ చేస్తున్నా ప్రేక్షకుల ఆదరణ అంతంత మాత్రమే. పైగా ఓ వైపు ఎన్నికల హడావిడి.. మరోవైపు ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల సందడి.. దీనికి తోడు ఎండలు మండుతున్నాయి. మల్టీప్లెక్స్ కల్చర్ కూడా ఎక్కువ అయింది. అదే విధంగా ఓటీటీల ప్రభావం థియేటర్లపై పడుతోంది. సినిమా విడుదలైన మూడు నాలుగు వారాలకే ఓటీటీలోకి వస్తుండటం వల్ల కొందరు థియేటర్‌కు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ కారణాల వల్ల సింగిల్ స్క్రీన్ థియేటర్లలో సీటింగ్ సామర్థ్యం తగినంత లేదు. దీంతో రోజువారీ ఖర్చులు కూడా రావడం లేదన్నది ఎగ్జిబిటర్స్ (థియేటర్ యజమానులు) ఆవేదన. ఒక్కో థియేటర్‌కు రోజుకు రూ. 12 వేల నుంచి 18 వేల వరకు ఖర్చు అవుతోంది. ఇందులో పది శాతం కూడా కలెక్షన్లు రావడం లేదని వాపోతున్నారు. స్టార్ హీరోల సినిమాలు విడుదలైతే ప్రేక్షకులు థియేటర్లకు వస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద సినిమాల రిలీజ్ లేదు. అందుకే ఈ శుక్రవారం నుంచి పది రోజుల వరకు థియేటర్లను మూయాలనే నిర్ణయానికి వచ్చారట థియేటర్ యజమానులు.

కిరాక్ పోరి వస్తే



● సంజయ్ దత్, రామ్

'ఉస్తాద్ ఇస్మార్ట్ శంకర్ అలియాస్ డబుల్ ఇస్మార్ట్', 'కిరాక్ పోరి వస్తే సైట్ మార్.. ఖతర్నాక్ బీట్ వస్తే స్టెప్పా మార్', 'నాకు తెల్వకుండా నాతో సినిమా ప్లాన్ చేస్తే గుద్దులో కాల్తది' అంటూ హీరో రామ్ చెప్పే డైలాగులు 'డబుల్ ఇస్మార్ట్' ట్రైలర్‌లో ఉన్నాయి. రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. వీరి కాంబినేషన్‌లో వచ్చిన హిట్ మూవీ 'ఇస్మార్ట్ శంకర్' (2019) కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందుతోంది. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కావ్యా థాపర్ కథానాయికగా, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. బుధవారం (మే 15) రామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''డబుల్ ఇస్మార్ట్' టీజర్‌తో ప్రేక్షకులు డబుల్ డోస్ యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్, మాస్ ఉల్లాసాన్ని ఆస్వాదించారు. పూరి మరోసారి తన హీరోని బెస్ట్ స్టైలిష్, మాస్, యాక్షన్-ప్యాక్డ్ అవతార్‌లో చూపించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. అలీ, గెటప్ శ్రీను ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: శ్యామ్ కె .నాయుడు, జియాని జియాన్నెలి.

ఆ పిల్ల కనులే...



● గాయత్రి, అల్లు శిరీష్

అల్లు శిరీష్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బడ్డీ'. శామ్ ఆంటోన్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్‌గా చేశారు. కేఈ జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ మూవీ విడుదలకు సిద్ధమవుతోంది. హిప్ హాప్ తమిళ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఆ పిల్ల కనులే, చూశాక తననే ఊహల్లో ఎగిరే మైకంలో మునిగే , మైకంలో తేలే, మబ్బులు తాకే, ఇద్దరి కథ ఇక మొదలాయే, నింగీ నేల కలిశాయో...' అంటూ సాగే పాటని విడుదల చేశారు. సాయి హేమంత్ లిరిక్స్ అందించిన ఈ పాటను హిప్ హాప్ తమిళ, సంజిత్ హెగ్డే, ఐరా, విష్ణు ప్రియ రవి పాడారు. ''యూత్‌ఫుల్ లవ్ ఎంటర్ టైనర్‌గా 'బడ్డీ' రూపొందింది. 'ఆ పిల్ల కనులే..' పాట మంచి రొమాంటిక్‌గా సాగుతుంది. త్వరలో సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అన్నారు మేకర్స్.

సైకో థ్రిల్లర్



● ధన్సిక

'మంత్ర, మంగళ' చిత్రాల ఫేమ్ ఓషో తులసీరామ్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'దక్షిణ'. రజనీకాంత్ 'కబాలి' మూవీ ఫేమ్ సాయి ధన్సిక లీడ్ రోల్‌లో నటించారు. కల్ట్ కాన్సెప్ట్స్ మూవీ బ్యానర్‌పై అశోక్ షిండే నిర్మించిన ఈ చిత్రం రిలీజ్‌కి రెడీ అవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను 'ఉప్పెన' మూవీ ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు సానా విడుదల చేసి, మాట్లాడుతూ – ''ట్రైలర్ చాలా బాగుంది. ఈ మధ్య కాలంలో నన్ను భయపెట్టిన ట్రైలర్ ఇదే. తులసీరామ్‌గారు టాలీవుడ్‌కి మరో ట్రెండ్ సెట్టర్ సైకో థ్రిల్లర్‌ని 'దక్షిణ'తో ఇవ్వబోతున్నారు'' అన్నారు. ''సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ మూవీ ఇది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు అశోక్ షిండే.

అహంతో వినోదం



● శివాని, రాహుల్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ జంటగా మణికాంత్ గెల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'విద్య వాసుల అహం'. మహేష్ దత్తా, లక్ష్మి నవ్య నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) 'ఆహా' ఓటీటీలో రిలీజ్ అవుతోంది. బుధవారం ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వేడుకలో మణికాంత్ గెల్లి మాట్లాడుతూ– ''కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'విద్య వాసుల అహం' రూపొందింది. వెంకీ అద్భుతమైన కథ రాయడం వల్లే నేను ఈ సినిమా చేయగలిగాను'' అన్నారు. రాహుల్ విజయ్ మాట్లాడుతూ– ''ఇదొక చిన్న క్యూట్ ఈగోస్ (అహం) ఉండే ఫన్ ఫిలిం'' అన్నారు. ''రాహుల్ మంచి రైటర్ కూడా. ఈ స్క్రిప్ట్‌ని తను ఒప్పుకున్నాడంటే కథ బాగుంటుందని అనిపించి నేను కూడా ఓకే చేశాను'' అన్నారు శివానీ రాజశేఖర్.

చర్యలు తప్పవు



● మెహరీన్

''ఎగ్ ఫ్రీజింగ్ (అండాలు నిల్వ ఉంచడం) అనేది సున్నితమైన అంశం. దాని గురించి మహిళల్లో అవగాహన కల్పించేందుకు ముందుకొచ్చి నా వంతు ప్రయత్నం చేశాను. ఎగ్ ఫ్రీజింగ్ చేయడానికి మహిళలు గర్భం దాల్చాల్సిన అవసరం లేదని చెప్పాను. అయితే కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారు. మరికొందరు నేను గర్భవతి అయ్యానంటూ కల్పిత వార్తలు రాశారు'' అని హీరోయిన్ మెహరీన్ మండిపడ్డారు. కొద్దిరోజుల క్రితం మెహరీన్ ఎగ్ ఫ్రీజింగ్ గురించి ఒక పోస్ట్ పెట్టారు. పిల్లలు అప్పుడే వద్దని భావించే తల్లిదండ్రులు తమ అండాలను భద్రపరుచుకుంటారు. అవసరమైనప్పుడు గర్భం దాల్చేందుకు ఉపయోగించుకుంటారు. ఈ క్రమంలో మెహరీన్ కూడా ఎగ్ ఫ్రీజింగ్‌ను ఎంపిక చేసుకున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలిపారు. అయితే దీనిపై కొందరు తప్పుగా అర్థం చేసుకుని వార్తలు ప్రచురించారంటూ తాజాగా ఆమె మరో పోస్ట్ పెట్టారు. ''తప్పుడు వార్తలకు ఫుల్‌స్టాప్ పెట్టకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. నాపై పెట్టిన పోస్ట్‌లు తొలగించి, క్షమాపణలు చెప్పాలి'' అన్నారు మెహరీన్.

సాక్షి బిజినెస్
గురువారం
16-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	118	72,987
నిఫ్టీ ▽	17	22,201

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	16,717	△ 206
డోజోన్స్	39,837	△ 279
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,446	△ 18
డాక్స్	18,869	△ 153
షాంఘై	3,120	▽ 26
నికాయ్	38,386	▽ 30

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (24 క్యారెట్)	71,430
బంగారం (22 క్యారెట్)	68,030
వెండి (కేజీ)	91,000

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.09	84.11
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.06	106.60
€	యూరో	ఎస్‌బీఐ	89.34	91.70
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.86	54.03
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.62	56.56
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.59	64.27
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.44	12.51

డిపాజిట్లపై ఎస్‌బీఐ వడ్డీరేట్లు అప్

ముంబై: రిటైల్ స్థిర డిపాజిట్లకు (రూ.2 కోట్ల వరకూ ఎఫ్‌డీలు) సంబంధించి కొన్ని కాల పరిమితులపై బ్యాంకింగ్ దిగ్గజం – స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వడ్డీరేట్లను పెంచింది. 2023 డిసెంబర్ తర్వాత బ్యాంక్ ఎఫ్‌డీలపై వడ్డీరేటు పెంచడం ఇదే తొలిసారి. బ్యాంక్ వెబ్‌సైట్ ప్రకారం, ఈ రేట్లు మే 15 నుంచి అమల్లోకి వస్తాయి. 46 రోజుల నుంచి 179 రోజులు, 180 నుంచి 210 రోజులు, 211 రోజుల నుంచి ఏడాది లోపు కాలపరిమితుల డిపాజిట్ రేట్లు 25 నుంచి 75 బేసిస్ పాయింట్ల శ్రేణిలో (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) పెరిగాయి. కాగా, సీనియర్ సిటిజన్‌లకు ఆయా కాలపరిమితులపై (టేబుల్‌లో పేర్కొన్న రేట్ల కన్నా అదనంగా) పేర్కొన్న డిపాజిట్ రేట్లకు అదనంగా మరో 50 బేసిస్ పాయింట్ల వడ్డీరేటు లభిస్తుంది. దీర్ఘకాలిక (ఐదేళ్ల నుంచి పదేళ్ల మధ్య) డిపాజిట్‌పై ఏకంగా 1% వరకూ అదనపు వడ్డీరేటు లభిస్తుంది.

తాజా రేట్లు ఇలా...

కాల పరిమితి	వడ్డీ(%)
7–45 రోజులు	3.5
46-179 రోజులు	5.5
180-210 రోజులు	6.0
211 రోజులు- ఏడాది	6.25
ఏడాది-రెండేళ్లు	6.80
రెండేళ్లు-మూడేళ్లు	7.00
మూడేళ్లు- ఐదేళ్లు	6.75
ఐదేళ్లు- పదేళ్లు	6.50



వణికిస్తున్న వాణిజ్యలోటు

- ఏప్రిల్‌లో 4 నెలల గరిష్ట స్థాయి
- 19.1 బిలియన్ డాలర్లుగా నమోదు
- ఏప్రిల్‌లో ఎగుమతులు 1% వృద్ధి
- విలువలో 35 బిలియన్ డాలర్లు
- దిగుమతులు 10 శాతం పెరిగి 54.09 బిలియన్ డాలర్లకు అప్

న్యూఢిల్లీ: భారత్ వస్తు ఎగుమతులు–దిగుమతుల విలువల మధ్య నికర వ్యత్యాసం– వాణిజ్యలోటు ఏప్రిల్‌లో ఆందోళన కలిగించింది. తాజాగా వెలువడిన గణాంకాల ప్రకారం, సమీక్షా నెల్లో ఎగుమతుల విలువ కేవలం ఒక శాతం పెరిగి (2023 ఇదే నెలతో పోల్చి) 35 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతుల విలువ ఇదే కాలంలో 10.25 శాతం ఎగసి 54.09 బిలియన్ డాలర్లకు చేరింది. వెరసి ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం- వాణిజ్యలోటు 19.1 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. గడచిన నాలుగు నెలల్లో ఈ స్థాయి వాణిజ్యలోటు ఇదే తొలిసారి. కొన్ని ముఖ్యాంశాలు పరిశీలిస్తే...

- ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, పెట్రోలియం ప్రొడక్టులు, ఫార్మా ఎగుమతులు బాగున్నాయి.



- విలువైన మెటల్స్ దిగుమతులు రెట్టింపై 3.11 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.
- క్రూడ్ ఆయిల్ దిగుమతులు 20.22% పెరిగి 16.5 బిలియన్ డాలర్లుకు ఎగసింది.
- 30 కీలక రంగాల్లో 13 వస్తు ఎగుమతుల్లో పెరుగుదలను నమోదుచేశాయి. వీటిలో కాఫీ, పొగాకు, సుగంధ ద్రవ్యాలు, ప్లాస్టిక్, హస్తకళలు ఉన్నాయి.

2023-24లో రికార్డు

మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో వస్తు, సేవల ఎగుమతుల మొత్తం విలువ 778.21 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఇది ఒక రికార్డు. ఇందులో వస్తు ఎగుమతులు 437.1 బిలియన్ డాలర్లు. సేవల ఎగుమతుల విలువ 341.1 బిలియన్ డాలర్లు.

సేవలు ఇలా...

తొలి అంచనాల ప్రకారం ఏప్రిల్‌లో సేవల ఎగుమతులు 29.57 బిలియన్ డాలర్లు. 2023 ఇదే నెల్లో ఈ విలువ 25.78 బిలియన్ డాలర్లు. దిగుమతుల విలువ 16.97 బిలియన్ డాలర్లు. 2023 ఇదే నెల్లో ఈ విలువ 13.96 బిలియన్ డాలర్లు.

ఎగుమతుల వృద్ధి కొనసాగుతుంది..

అనిశ్చిత అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు ఉన్నప్పటికీ కొత్త ఆర్థిక సంవత్సరం కొంత సానుకూలంగానే ప్రారంభమైంది. ఎగుమతుల వృద్ధి కొనసాగుతుందని భావిస్తున్నాం.
– సునీల్ భరత్వాల్, వాణిజ్య కార్యదర్శి



పీఎఫ్‌సీ లాభం జూమ్



ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి (క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 7,556 కోట్లను అధిగమించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 20,074 కోట్ల నుంచి రూ. 24,176 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 12,312 కోట్ల నుంచి రూ. 14,579 కోట్లకు పెరిగాయి. స్టాండెలోన్ లాభం సైతం రూ. 3,695 కోట్ల నుంచి రూ. 4,549 కోట్లకు బలపడింది. వాటాదారులకు షేరుకి రూ. 2.5 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇక పూర్తి ఏడాదికి పీఎఫ్‌సీ 25 శాతం అధికంగా రూ. 26,461 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది సరికొత్త రికార్డ్‌కాగా.. 2022–23లో రూ. 21,179 కోట్లు నమోదైంది. నికర వడ్డీ మార్జిన్లు 3.36 శాతం నుంచి 3.46 శాతానికి మెరుగయ్యాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.91 శాతం నుంచి 3.34 శాతానికి తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో పీఎఫ్‌సీ షేరు బీఎస్‌ఈలో 3.7 శాతం లాభంతో రూ. 437 వద్ద ముగిసింది.

ఎన్‌సీసీ డివిడెండ్ రూ.2.20



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ రంగ సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్ 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.2.20 డివిడెండ్ చెల్లించాలని బోర్డు ప్రతిపాదించింది. మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో కంపెనీ నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 25 శాతం పెరిగి రూ.239 కోట్లకు చేరింది. ఎబిటా రూ.464 కోట్ల నుంచి రూ.550 కోట్లకు ఎగసింది. ఈపీఎస్ రూ.3.04 నుంచి రూ.3.81 తాకింది. టర్నోవర్ రూ.4,981 కోట్ల నుంచి రూ.6,530 కోట్లకు పెరిగింది. 2023–24లో నికరలాభం రూ.609 కోట్ల నుంచి రూ.710 కోట్లకు, ఎబిటా రూ.1,459 కోట్ల నుంచి రూ.1,769 కోట్లు నమోదైంది. టర్నోవర్ రూ.15,701 కోట్ల నుంచి రూ.20,971 కోట్లకు ఎగసింది. జనవరి–మార్చి కాలంలో సంస్థ రూ.27,283 కోట్ల విలువైన ఆర్డర్లను దక్కించుకుందని ఎన్‌సీసీ ఎండీ ఏఏవీ రంగ రాజు వెల్లడించారు. ఆర్డర్ బుక్ రూ.57,536 కోట్లకు చేరిందన్నారు.

ఫలితాల నేపథ్యంలో ఎన్‌సీసీ షేరు ధర బీఎస్‌ఈలో బుధవారం 0.85 శాతం క్షీణించి రూ.251.05 వద్ద స్థిరపడింది.

3 రోజుల లాభాలకు బ్రేక్

- సూచీలకు స్వల్ప నష్టాలు
- పరిమిత శ్రేణిలో ట్రేడింగ్



ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీ రంగ షేర్ల పతనంతో బుధవారం స్టాక్ సూచీలు స్వల్ప నష్టాలతో ముగిశాయి. దేశవ్యాప్తంగా ఎన్నికలు కొనసాగుతుండడం, అమెరికా సీపీఐ ద్రవ్యోల్బణ గణాంకాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. దేశీయ హోల్‌సేల్ ద్రవ్యోల్బణ 13 నెలల గరిష్టానికి చేరుకోవడం, క్రూడాయిల్ ధరలు పెరగడం, మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 118 పాయింట్లు పతనమై 72,987 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 17 పాయింట్లు నష్టపోయి 22,201 వద్ద నిలిచింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ప్రారంభంలోనే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. రోజంతా పరిమిత శ్రేణిలో తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఎఫ్‌ఎంసీజీ, ఆటో, బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లు నష్టపోయాయి.

టీబీఓ టెక్ సూపర్ హిట్



టీబీఓ టెక్ లిస్టింగ్ భారీ హిట్టయ్యింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.920) తో పోలిస్తే 50% ప్రీమియంతో రూ.1380 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 58% పెరిగి రూ.1,456 వద్ద గరిష్టాన్ని అందుకుంది. ఆఖరికి 53% లాభంతో రూ.1,405 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.15,255 కోట్లుగా నమోదైంది.

ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఫ్లాట్..

ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ షేరు బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.315)తో పోలిస్తే 0.30% స్వల్ప నష్టంతో రూ.314 వద్ద ఫ్లాట్‌గా లిస్టయ్యింది. కొనుగోళ్ల మద్దతు లభించడంతో ట్రేడింగ్‌లో 9% పెరిగి రూ.343 వద్ద గరిష్టాన్ని అందుకుంది. చివరికి నాలుగున్నర శాతం లాభంతో రూ.329.55 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.14,053 కోట్లుగా నమోదైంది.

బిగ్‌బాస్ సీజన్ 7 విజేతకు జోస్ ఆలుక్కాస్ సత్కారం



హైదరాబాద్: జోస్ ఆలుక్కాస్ తెలుగు బిగ్‌బాస్ సీజన్ 7 విజేత పల్లవి ప్రశాంత్‌ను సత్కరించింది. బిగ్‌బాస్ హౌస్‌లో ప్రకటించిన విధంగా సంస్థ ఎండీ జాన్ ఆలుక్కా అత్యంత విలువైన డైమండ్ నెక్లెస్ పల్లవి ప్రశాంత్‌కు అందజేశారు. "వివిధ రంగాలలో నిష్ణాతులైన వారిని ప్రోత్సహించడంలో జోస్ ఆలుక్కాస్ ముందుంటుంది. విభిన్న నేపథ్యాలు కలిగిన వ్యక్తులకు అండగా నిలవాలనే నిబద్ధత భవిష్యత్తులోనూ స్థిరంగా ఉంటుంది'' అని జాన్ ఆలుక్కా తెలిపారు. బేగంపేట్ జోస్ ఆలుక్కాస్ షోరూంలో నిర్వహించిన ఈ సత్కార కార్యక్రమంలో జోనల్ మేనేజర్ లీనో, షోరూమ్ మేనేజర్ షాన్‌జ్‌లూ పాల్గొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-5-2024	
విశాఖ	550–00
చిత్తూరు	618–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
హైదరాబాద్	550–00
వరంగల్	552–00

గ్రాన్యూల్స్ 8 శాతం జంప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 8 శాతం ఎగసి రూ.129 కోట్లు సాధించింది. ఎబిటా 12 శాతం అధికమై రూ.255 కోట్లకు చేరింది. ఎబిటా మార్జిన్ 19 నుంచి 22 శాతంగా ఉంది. టర్నోవర్ 2 శాతం క్షీణించి రూ.1,176 కోట్లు నమోదైంది. నికర రుణాలు రూ.842 కోట్లుగా ఉన్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను నికరలాభం 22 శాతం తగ్గి రూ.405 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా 6 శాతం క్షీణించి రూ.856 కోట్లుగా ఉంది. టర్నోవర్ రూ.4,512 కోట్ల నుంచి రూ.4,506 కోట్లకు పడిపోయింది. 'ఆర్థిక ఫలితాలు అంచనాల కంటే తక్కువగా నమోదయ్యాయి. సైబర్ దాడి, ప్యారాసిటమాల్ డిమాండ్ తక్కువగా ఉండడం ఇందుకు కారణం' అని గ్రాన్యూల్స్ సీఎండీ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి తెలిపారు.

షేరు ధర బీఎస్‌ఈలో బుధవారం 0.91 శాతం క్షీణించి రూ.396.15 వద్ద స్థిరపడింది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్రంలో స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్..ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం(ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఐఐటీ–జేఈఈ, నీట్ తదితర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఒక్కో దాంట్లో 40 సీట్లు ఉంటాయి.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 320.
» **గ్రూపులు:** ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతి మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.05.2024
» **వెబ్‌సైట్:** www.tsmodelschools.com

ఎన్‌ఎస్‌కేటీయూ, తిరుపతిలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలోని నేషనల్ సాంస్క్రిట్ యూనివర్శిటీ (ఎన్‌ఎస్‌కేటీయూ).. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ విభాగాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** ఆచార్య, ఎంఏ(సద్భోధ), ఎంఏ హిందీ, ఎంఎస్సీ(కంప్యూటర్ సైన్స్, యోగా థెరపీ), ఎంఏఐఎంటీ.
» **అర్హత:** సీయూఈటీ ఉత్తీర్ణత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.06.2024
» **వెబ్‌సైట్:** https://nsktu.ac.in

యూపీఎస్సీ- 82 ఉద్యోగాలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. దేశవ్యాప్తంగా కేంద్రశాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 82
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ కమీషనర్–01, టెస్ట్ ఇంజనీర్–01, మార్కెటింగ్ ఆఫీసర్–33, సైంటిఫిక్ ఆఫీసర్ (మెకానికల్)–01, ఫ్యాక్టరీ మేనేజర్–01, అసిస్టెంట్ మైనింగ్ ఇంజనీర్–07, అసిస్టెంట్ రీసెర్చ్ ఆఫీసర్–15, ట్రైనింగ్ ఆఫీసర్–15, ప్రొఫెసర్లు–03, అసోసియేట్ ప్రొఫెసర్–03, అసిస్టెంట్ ప్రొఫెసర్–02.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.05.2024
» **వెబ్‌సైట్:** https://upsc.gov.in

ఐఐపీ ముంబైలో పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫైడ్ కోర్సుల్లో ప్రవేశాలు

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ).. దేశవ్యాప్తంగా ఐఐపీ క్యాంపస్‌లలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫైడ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» **ఎంఎస్ ప్యాకేజింగ్ టెక్నాలజీ:** **అర్హత:** బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. **కోర్సు వ్యవధి:** రెండేళ్లు(ఫుల్ టైం); **క్యాంపస్:** హైదరాబాద్, ఢిల్లీ.
» **బీఎస్సీ ప్యాకేజింగ్ టెక్నాలజీ:** **అర్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్/బయాలజీ/ అగ్రికల్చర్ సైన్స్–ఒకేషనల్ సైన్స్ ప్రధాన సబ్జెక్టులుగా 12వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు(ఫుల్ టైం).
» **పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్(పీజీడీపీ):** **అర్హత:** సైన్స్/ఇంజనీరింగ్/ ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **కోర్సు వ్యవధి:** రెండేళ్లు(ఫుల్ టైం). **క్యాంపస్:** ముంబై, కోల్‌కతా,అహ్మదాబాద్.
» **సర్టిఫైడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్(సీపీఈసీ):** **అర్హత:** బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **కోర్సు వ్యవధి:** ఏడాది(ఆన్‌లైన్). **క్యాంపస్:** చెన్నై.
» **వయసు:** 31.05.2024 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది. సీపీఈసీ కోర్సుకు వయోపరిమితి లేదు.
» **ఎంఎస్/పీజీడీపీ కోర్సు ఎంపిక విధానం:** రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.07.2024
» **ప్రవేశ పరీక్ష తేది:** 14.07.2024.
» **వెబ్‌సైట్:** https://www.iipin.com

ప్లాస్టిక్ ఇంజనీరింగ్.. కెరీర్ షైనింగ్

» డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులకు సిపెట్ నోటిఫికేషన్
» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు
» కోర్సులు పూర్తి చేసుకుంటే ఉపాధి అవకాశాలు

ఐటీ నుంచి బ్యాంకింగ్ వరకూ.. ఏ రంగంలో చూసినా తీవ్రమైన పోటీ! వందల్లో పోస్టులుంటే.. లక్షల్లో దరఖాస్తులు!! ఇలాంటి పరిస్థితుల్లో కోర్సు పూర్తి చేసుకుంటూనే ఉపాధికి మార్గం చూపుతోంది..ప్లాస్టిక్ ఇంజనీరింగ్! ప్రభుత్వ రంగ సంస్థ.. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సిపెట్)..తాజాగా డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. సిపెట్-డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల వివరాలు, ప్రవేశం, ఉద్యోగావకాశాలపై ప్రత్యేక కథనం..

దేశంలో ప్లాస్టిక్ రంగానికి అవసరమైన మానవ వనరులను తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నెలకొల్పిన సంస్థ.. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్). ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 30 ప్రాంతాల్లో సిపెట్ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో ప్లాస్టిక్ ఇంజనీరింగ్‌లో పీజీ,పీహెచ్‌డీ, బీటెక్,ఎంటెక్, డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులను అందిస్తున్నారు.

అర్హతలు

- కోర్సును అనుసరించి పదో తరగతి, డిప్లొమా, బీఎస్సీ (ఎంపీసీ) ఉత్తీర్ణత ఉండాలి.
- చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్మిషన్ టెస్ట్ ముగిసిన ఎనిమిది వారాల్లోగా సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుంది.

డిప్లొమా, పోస్ట్ డిప్లొమా

- దేశ వ్యాప్తంగా 30 క్యాంపస్‌ల ద్వారా పలు స్థాయిల్లో కోర్సులను అందిస్తున్న సిపెట్.. తాజాగా 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా, పోస్ట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.
- **డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డింగ్ టెక్నాలజీ(డీపీఎంటీ): అర్హత:** పదో తరగతి, **కోర్సు వ్యవధి:** మూడేళ్లు.
- **డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ(డీపీటీ): అర్హత:** పదో తరగతి, కోర్సు వ్యవధి: మూడేళ్లు.
- **పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/క్యామ్ (పీడీ-పీఎండీ క్యాడ్/క్యామ్): కోర్సు వ్యవధి:** ఒకటిన్నర సంవత్సరం; **అర్హత:** మెకానికల్/ప్లాస్టిక్ /పాలిమర్/టూల్/ప్రొడక్షన్/మెకట్రానిక్స్/ఆటో మొబైల్/టూల్ అండ్ డై మేకింగ్ /పెట్రో కెమికల్స్/ఇండస్ట్రియల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/టెక్నాలజీల్లో డిప్లొమా ఉత్తీర్ణత లేదా సిపెట్ డీపీఎంటీ/డీపీటీ ఉత్తీర్ణత ఉండాలి.
- **పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్(పీజీడీ-పీపీటీ):**
- **కోర్సు వ్యవధి:** రెండేళ్లు; **అర్హత:** బీఎస్సీ (ఎంపీసీ) ఉత్తీర్ణత ఉండాలి.

ప్రవేశ పరీక్ష

డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు సిపెట్ అడ్మిషన్ టెస్ట్ 2024ను నిర్వహిస్తారు. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. కోర్సును అనుసరించి పరీక్ష వేర్వేరు విధానాల్లో ఉంటుంది.

ఉపాధి వేదికలు

ప్లాస్టిక్ ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఆటోమొబైల్ సంస్థలు, పెట్రోలియం ఉత్పత్తుల సంస్థలు. ఆర్ అండ్ డీ విభాగాల్లో ఉపాధి లభిస్తోంది. వీరికి ప్రభుత్వ రంగంలో పెట్రోలియం మంత్రిత్వ శాఖ,ఓఎన్‌జీసీ,ఆయిల్ ఇండియా కార్పొరేషన్ తదితర సంస్థల్లోనూ అవకాశాలు లభిస్తాయి.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్

సిపెట్ క్యాంపస్‌లలో కోర్సులు పూర్తి చేసుకున్న వారికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నారు. ఏటా పలు కంపెనీలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ డ్రైవ్స్ ద్వారా నియామకాలు చేపడుతున్నాయి. గత మూడేళ్ల గణాంకాలను పరిశీలిస్తే.. సిపెట్ క్యాంపస్‌లలో దాదాపు 90% మందికి ఆఫర్లు లభించాయి.



ఆసక్తి ప్రధానం

ప్లాస్టిక్ ఇంజనీరింగ్ రంగంలో రాణించేందుకు ఆసక్తి ప్రధానమని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా సృజనాత్మకత, కొత్త అంశాలను నేర్చుకునే నేర్పు ఎంతో అవసరం. అంతేకాకుండా మార్కెట్‌లో ప్రవేశించే కొత్త వస్తువులు, వాటి డిజైన్ వెనుక ఇమిడి ఉన్న సాంకేతికతలను పరిశీలించే నైపుణ్యం ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ అప్లికేషన్ చివరి తేదీ:** 2024, మే 31
- **ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** 2024, జూన్ 9
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.cipet.gov.in/academics/cipet_admission.php

కలినరీ ఆర్ట్స్.. మాస్టర్ చెఫ్‌కు మార్గం!

» ఐసీఐలో బీబీఏ, ఎంబీఏ ప్రవేశాలకు నోటిఫికేషన్
» ఇంటర్, బ్యాచిలర్ డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి బీబీఏ కలినరీ ఆర్ట్స్, ఎంబీఏ కలినరీ ఆర్ట్స్ కోర్సుల్లో అడ్మిషన్స్‌కు దరఖాస్తులు కోరుతున్నారు. ఇందులో ప్రవేశం పొందిన వారికి కిచెన్ మేనేజ్‌మెంట్-కలినరీ స్పెషలిస్టులుగా రాణించేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణను అందిస్తారు. ఈ నేపథ్యంలో.. కలినరీ ఆర్ట్స్ కోర్సుల ప్రత్యేకత, దరఖాస్తుకు అర్హతలు, ఉపాధి అవకాశాలు తదితర వివరాలు..

కలినరీ ఆర్ట్స్ అంటే ఆహార అలంకరణ మాత్రమేకాదు. అందులో ఉపయోగించే పదార్థాలలో అత్యధిక పోషకాలు ఉండేటట్లు చూడటం కూడా ముఖ్యమే! కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ (ఐసీఐ)కు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి,ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో క్యాంపస్‌లు ఉన్నాయి. ఈ రెండు ఇన్‌స్టిట్యూట్స్‌లో కలిపి బీబీఏ(కలినరీ ఆర్ట్స్)లో 240 సీట్లు, ఎంబీఏ(కలినరీ ఆర్ట్స్)లో 60 సీట్లు ఉన్నాయి. ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో ఈ కోర్సులు అందిస్తున్నారు.

బీబీఏ కలినరీ ఆర్ట్స్

- కోర్సు వ్యవధి మూడేళ్లు, ఆరు సెమిస్టర్లుగా ఉంటుంది.
- **అర్హత:** కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/10+2 ఉత్తీర్ణత ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు సాధించాలి. ఇంటర్ ఫైనల్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంపిక విధానం:** సీయూఈటీ (యూజీ) 2024 స్కోరు లేదా ఐసీఐ నిర్వహించే ఐజీఎన్‌టీయూ–ఐసీఐ జేఈఈ (యూజీ) 2024 స్కోరు ఆధారంగా సీటు కేటాయిస్తారు.

ఎంబీఏ కలినరీ ఆర్ట్స్

- ఈ కోర్సు వ్యవధి రెండేళ్లు, నాలుగు సెమిస్టర్లుగా ఉంటుంది.
- **అర్హత:** కనీసం 45 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి.
- **ఎంపిక విధానం:** సీయూఈటీ (పీజీ) 2024 స్కోరు లేదా ఐసీఐ నిర్వహించే ఐజీఎన్‌టీయూ–ఐసీఐ జేఈఈ (పీజీ) 2024 స్కోరు తదితరాల ఆధారంగా సీటు కేటాయిస్తారు.

ఉద్యోగావకాశాలు

బీబీఏ, ఎంబీఏ కోర్సులను పూర్తిచేసిన వారు టూరిజం రంగంలోని రెస్టారెంట్లు, హోటళ్లలో చెఫ్‌లుగా అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. అదేవిధంగా హాస్పిటాలిటీ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఎయిర్‌వేస్, రైల్వేస్‌లో కేటరింగ్, ఇండియన్ నేవీలో కిచెన్ మేనేజ్‌మెంట్ కొలువులు సొంతం చేసుకోవచ్చు. ప్రముఖ హోటళ్లలో చెఫ్, న్యూట్రిషనిస్ట్, కిచెన్ మేనేజర్, హాస్పిటాలిటీ సర్వీసెస్ తదితర విభాగాల్లో అవకాశాలుంటాయి. కలినరీ ఆర్ట్స్‌లో టీచింగ్ అవకాశాలు కూడా ఉన్నాయి.



ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:**2024, మే 25
- **ఆన్‌లైన్ జేఈఈ(యూజీ/పీజీ) పరీక్ష:** 2024, మే 26
- **వెబ్‌సైట్:** https://www.icitirupati.in

క్లుప్తంగా...

'ఇగ్నో' ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో జూలై-2024 నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ డీఆర్ శర్మ తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్, డిగ్రీ, డిగ్రీ ఆనర్స్, పీజీ డిప్లొమో, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం జూన్ 30 ఆఖరు తేదీగా ప్రకటించినట్లు తెలిపారు. పీజీ రెండో సంవత్సరం, డిగ్రీ రెండు, మూడు సంవత్సరాలు, సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజులను ఆన్‌లైన్ ద్వారా జూన్ 30వ తేదీ లోపు చెల్లించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు బీఏ, బీకాం డిగ్రీ కోర్సులకు ఫీజు మినహాయింపుతో ఆన్‌లైన్ ద్వారా కొత్త అడ్మిషన్, రీ-రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వివరించారు. ఇతర వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్‌ను గాని లేదా విజయవాడ కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గాని లేదా 0866-2565253 నంబర్‌లో సంప్రదించవచ్చని ఆ ప్రకటనలో వివరించారు.

శ్రీసిటీని సందర్శించిన జపాన్ కాన్సుల్ జనరల్



జపాన్ కాన్సుల్ తకాహిషి మునియోతో శివశంకర్ తదితరులు

శ్రీసిటీ (సత్యవేడు(తిరుపతి జిల్లా): నూతనంగా నియమితులైన చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ తకాహిషి మునియో బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ ఆయనకు స్వాగతం పలికి, పారిశ్రామిక నగరం ప్రగతి, ప్రత్యేకతల గురించి సమగ్రమైన ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శ్రీసిటీలోని జపనీస్ పరిశ్రమల అసోసియేషన్ సభ్యులతో కాన్సుల్ జనరల్ సమావేశమై చర్చలు జరిపారు. ఇసుజు, ఐనస్, టీహెచ్‌కే పరిశ్రమలను సందర్శించి అక్కడి పారిశ్రామిక కార్యకలాపాలను పరిశీలించారు.

వెల్లివిరిసిన మహిళా చైతన్యం

ఏపీలో పురుషులకంటే ఓట్లు వేసిన మహిళల సంఖ్య 4.78 లక్షలు అధికం

- పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి మొత్తం పోలింగ్ శాతం 81.86 శాతం
- అసెంబ్లీకి అత్యధికంగా దర్శిలో 90.91 శాతం.. అత్యల్పంగా తిరుపతిలో 63.62 శాతం
- లోక్‌సభకు అత్యధికంగా ఒంగోలులో 87.06 శాతం.. విశాఖలో 71.11 శాతం ఓట్లు
- దేశంలో ఇప్పటివరకు జరిగిన 4 దశల ఎన్నికల్లో అత్యధిక పోలింగ్ రాష్ట్రంలోనే
- ఎన్నికల్లో ఈవీఎంలను ధ్వంసం చేసిన వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తాం
- 33 చోట్ల 350 స్ట్రాంగ్ రూముల్లో మూడంచెల భద్రత నడుమ ఈవీఎంలు
- హింసాత్మక ఘటనలకు పాల్పడిన వారిని రెండు రోజుల్లో అరెస్ట్ చేస్తాం
- ఎన్నికల తర్వాత జరిగిన హింస అదుపులోకి వచ్చింది
- హింసాత్మక ఘటనలు జరిగిన ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు
- 715 పోలీస్ పికెట్స్‌తో గొడవలను అదుపులోకి తెచ్చాం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా





సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో మహిళా ఓటర్ల చైతన్యం వెల్లి విరిసింది. పురుషులకంటే 4,78,535 మంది మహిళలు అధికంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 81.86 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో పోలైన ఓట్ల తుది వివరాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనా బుధవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం జరిగిన పోలింగ్‌లో ఈవీఎంల ద్వారా 80.66 శాతం (3,33,340,333 ఓట్లు), పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1.2 శాతం ఓట్లు నమోదైనట్లు చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఇంత భారీ స్థాయిలో ఓట్లు నమోదవడం ఇదే తొలిసారన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో దేశంలో జరిగిన నాలుగు దశల పోలింగ్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైనట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్‌లో ఉద్యోగులు, అత్యవసర సర్వీసు ఓటర్లు, 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు పాల్గొన్నారని తెలిపారు. 2019 ఎన్నికల్లో 2.62 లక్షల మంది పోస్టల్ బ్యాలెట్లను వినియోగించుకోగా, ఈసారి 4.97 లక్షల మంది వినియోగించుకున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో 56 వేల పోస్టల్ బ్యాలెట్లు తిరస్కరణకు గురయ్యాయని, ఈసారి ఉద్యోగులు ఎంతో జాగ్రత్తగా ఉన్నందున అటువంటి పరిస్థితి తలెత్తలేదని చెప్పారు.

పోలింగ్ ఇలా..

రాష్ట్రంలో మొత్తం ఓటర్లు	4,13,33,702
లోక్‌సభకు పోలైన ఓట్లు	3,33,40,560
అసెంబ్లీకి పోలైన ఓట్లు	3,33,40,333

ఈవీఎంల ద్వారా పోలైన ఓట్లు

పురుషులు	1,64,30,359
మహిళలు	1,69,08,684
ఇతరులు	1,517 మంది

పోస్టల్ బ్యాలెట్ ద్వారా మొత్తం వచ్చిన ఓట్లు 4.97 లక్షలు

ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల ఓట్లు	4.44 లక్షలు
85 ఏళ్ల పైబడిన వృద్ధులు	13,700
దివ్యాంగులు	12,700
అత్యవసర సర్వీసు ఓటర్లు	27,100

విశాఖలో ఎక్కువ ఓట్లు పోలవడం శుభపరిణామం

లోక్‌సభ నియోజకవర్గాల్లో ఒంగోలులో అత్యధికంగా 87.06 శాతం ఓట్లు రాగా, అత్యల్పంగా విశాఖపట్నంలో 71.11 శాతం వచ్చాయన్నారు. శాసన సభ నియోజకవర్గాల్లో అత్యధికంగా దర్శి నియోజకవర్గంలో 90.91 శాతం పోలింగ్ నమోదవగా, అత్యల్పంగా తిరుపతిలో 63.32 శాతం నమోదైనట్లు తెలిపారు. గత ఎన్నికల్లో తిరుపతిలో 65.9 శాతం పోలింగ్ నమోదవగా, ఈసారి 63.32 శాతానికి తగ్గడానికి ఆ నియోజకవర్గంలో బోగస్ ఓట్లను నియంత్రించడమే ప్రధాన కారణమని తెలిపారు. విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 67 శాతం పోలింగ్ నమోదుకాగా, ఈసారి ప్రత్యేకించి విశాఖ పట్టణ ప్రాంతంలో 71.11 శాతం పోలింగ్ జరగడం ఎంతో శుభపరిణామమని అన్నారు.

ఎవరూ రీపోలింగ్ కోరలేదు

దేశ, విదేశాల నుండి ఓటర్లు పెద్ద ఎత్తున ఓటింగ్‌కు తరలి రావడం, చివరి రెండు గంటల ముందు క్యూలలో ఓటర్లు ఎక్కువగా ఉండటం వల్ల అర్ధరాత్రి వరకూ ఓటింగ్ కొనసాగిందని మీనా తెలిపారు. దీనికితోడు 5,600 పోలింగ్ స్టేషన్లలో 1,200కు పైబడి ఓటర్లు ఉండటం కూడా ఓటింగ్ ఆలస్యానికి కారణమైందన్నారు. దాదాపు 3,500 పోలింగ్ స్టేషన్లలో నిర్ణీత సమయమైన సాయంత్రం 6.00 గంటలు దాటి పోలింగ్ కొనసాగిందని, చివరి పోలింగ్ స్టేషన్‌లో అర్ధరాత్రి 2 గంటలకు పోలింగ్ ముగిసిందని చెప్పారు. శ్రీకాకుళం, కోనసీమ, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో వాతావరణం సహకరించకపోవడం వల్ల ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత ఎలక్షన్ టీమ్‌లు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు వచ్చేసరికి ఆలస్యమైందన్నారు. ఎన్నికలు ముగిసిన తదుపరి రోజు పరిశీలకులు, అభ్యర్థులతో రిటర్నింగ్ అధికారి సమావేశం ఏర్పాటు చేసి ఎక్కడైనా రీపోలింగ్‌కు అవసరం ఉందా లేదా అనే విషయాన్ని సమీక్షిస్తారన్నారు. ఈ సమీక్షల్లో ఒక్క పరిశీలకుడు కూడా రీపోలింగ్‌కు సిఫార్సు చేయకపోవడంవల్ల 25 లోక్‌సభ నియోజకవర్గాలు, 175 అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలను అన్నింటినీ మంగళవారం రాత్రి 33 ప్రాంతాల్లో నున్న 350 స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచినట్లు తెలిపారు. ఈ స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల భద్రత కల్పించామని చెప్పారు. ఈ ప్రక్రియ మొత్తం ముగిసిన తరువాతే అసలైన పోలింగ్ శాతాన్ని ఖరారు చేస్తామని, అందువల్లే పోలింగ్ శాతాన్ని ప్రకటించడంలో కొంత ఆలస్యం జరిగిందని వివరించారు.

హింసాత్మక ఘటనలపై ఈసీ సీరియస్

ఎన్నికల అనంతరం ప్రత్యేకించి తాడిపత్రి, మాచర్ల, చంద్రగిరి, నర్సరావుపేట ప్రాంతాల్లో పలుచోట్ల హింసాత్మక ఘటనలు జరిగాయని మీనా చెప్పారు. ఈ ఘటనలను ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించి, వెంటనే డీజీపీతో చర్చించిందని తెలిపారు. మంగళవారం నుంచి పోలీస్ యంత్రాంగం ప్రత్యేకమైన చర్యలు చేపట్టిందని, ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నదని తెలిపారు. ఈ నాలుగు ప్రాంతాలకు సీనియర్ అధికారులు, అదనపు పోలీసు బలగాలను పంపినట్లు చెప్పారు. స్థానికంగా జన సంచారాన్ని నియంత్రించడమే కాకుండా సంబంధిత పార్టీల అభ్యర్థులను గృహ నిర్బంధం చేశామన్నారు. తదుపరి విచారణ జరిపి పోలీస్ కేసులను కూడా పెట్టడం జరుగుతుందన్నారు. 715 ప్రాంతాల్లో పోలీస్ పికెట్లను కూడా ఏర్పాటు చేశామని, అన్ని చోట్లా పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని ఆయన తెలిపారు.

25 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ శాతం

నియోజకవర్గం	పోలింగ్ శాతం
అరకు (ఎస్టీ)	73.68
శ్రీకాకుళం	74.43
విజయనగరం	81.05
విశాఖ	71.11
అనకాపల్లి	82.03
కాకినాడ	80.30
అమలాపురం (ఎస్సీ)	83.85
రాజమండ్రి	80.93
నరసాపురం	82.59
ఏలూరు	83.68
మచిలీపట్నం	84.05
విజయవాడ	79.37
గుంటూరు	78.81
నరసరావుపేట	85.65
బాపట్ల (ఎస్సీ)	85.48
ఒంగోలు	87.06
నంద్యాల	80.61
కర్నూలు	76.80
అనంతపురం	80.51
హిందుపురం	84.70
కడప	79.57
నెల్లూరు	79.05
తిరుపతి (ఎస్సీ)	79.10
రాజంపేట	79.09
చిత్తూరు (ఎస్సీ)	85.77

కాకిస్‌నూరు.. ఓటింగ్‌లో సూపర్..

- ఓటింగ్‌లో దేశానికే ఆదర్శంగా నిలిచిన కుగ్రామం
- అష్టకష్టాలు పడి కేంద్రానికి చేరుకున్న అధికారులు
- సాదరంగా ఆహ్వానించిన గిరిజనం
- 93.22 శాతం ఓటింగ్ నమోదు
- ఎక్స్‌లో హర్షం వ్యక్తం చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

అది బాహ్య ప్రపంచంతో సంబంధం లేని ఓ కుగ్రామం. ఏలూరు జిల్లా కేంద్రానికి 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ గూడేనికి చేరుకోవడమే ఓ ప్రహసనం. ఎలాంటి రహదారి సౌకర్యం లేని అక్కడి పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలంటే కొయిదా గ్రామం నుంచి గోదావరి నదిగుండా బోట్‌లో ప్రయాణించి, ఆవలి ఒడ్డు నుంచి సుమారు మూడు కిలోమీటర్లు గుట్టల నడుమ కాలినడకన ప్రయాణించాల్సి ఉంటుంది. అక్కడ మొత్తం 472మంది కొండరెడ్ల ఓటర్లున్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో 440 ఓట్లు పోల్ కాగా 93.22శాతం ఓటింగ్ నమోదు చేసుకుని ఎలక్షన్ కమిషన్ దృష్టిని ఆకర్షించింది. అంతేనా... అధికారుల ప్రశంసలను కూడా అందుకుని దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఆ గ్రామమే పోలవరం నియోజకవర్గం పరిధిలోని కాకిస్‌నూరు.



వేలేరుపాడు: ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని అత్యంత మారుమూల, దట్టమైన అటవీ ప్రాంత గ్రామమైన కాకిస్‌నూరు గ్రామం ఇప్పుడు దేశం దృష్టిని ఆకర్షించింది. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 93.22 ఓటింగ్ శాతం నమోదు చేసుకుని ఆదర్శంగా నిలిచింది. అక్కడ ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు ఈ నెల 12వ తేదీ రాత్రి వెళ్లిన అధికారులకు గ్రామ కొండరెడ్లు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అధికారులను పూలమాలలతో సన్మానించారు. వారి సహృదయతకు ముచ్చటపడిన భారత ఎన్నికల సంఘం 'ఎక్స్' వేదికగా అధికారులకు స్వాగతం పలికిన ఫొటోను అప్‌లోడ్ చేసి, వివరాలతో ట్వీట్ చేశారు. దీనికి దేశవ్యాప్తంగా విశేష స్పందన లభించింది.

బోటుపై వచ్చి ఓటు హక్కు వినియోగం

దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న కాకిస్‌నూరు పోలింగ్ కేంద్రం పరిధిలోని పేరంటపల్లి, టేకుపల్లి, చినమకోలు, పెదమంకోలు గ్రామాల ఓటర్లు 440 మంది గోదావరిలో బోటుపై వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 16,37,430 ఓటర్లున్న ఏలూరు జిల్లాలోని 1,744 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ సకల ఏర్పాట్లు చేశారు. కాకిస్‌నూరు గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి అక్కడ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యుత్ సౌకర్యం లేని ఆ గ్రామంలో జనరేటర్ సమకూర్చి, తాత్కాలికంగా లైట్లు ఏర్పాటు చేయించారు. ఫోన్ కవరేజ్ లేకపోవడంతో ఈ గ్రామంలో శాటిలైట్ ఫోన్ ఏర్పాటు చేశారు. ఓటర్లు వచ్చేందుకు బోటు సౌకర్యం కల్పించడమే కాకుండా ఓటింగ్‌కు ఒక రోజు ముందు వారికి ఓటింగ్‌పై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఎన్నికల అధికారులు 12న కాకిస్‌నూరు గ్రామానికి చేరుకొని, ఇంటింటికీ తిరిగి ప్రతిఒక్కరూ ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రజాస్వామ్యంలో ఓటుకున్న విలువను వివరించారు. ఫలితంగా ఓటింగ్ శాతం పెరిగింది. తమ గ్రామానికి దేశస్థాయిలో గుర్తింపు రావడంపై భారత ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు గ్రామ కొండరెడ్లు కృతజ్ఞతలు తెలిపారు.

మా ఓటు వల్లనే ఊరికి మంచి పేరు



మేమంతా ఓటు వేయడం వల్లనే మా ఊరికి మంచి పేరొచ్చింది. మా ఊరు దేశ ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లింది. మాకు చాలా సంతోషంగా ఉంది. –సిద్ది శ్రీనివాసరెడ్డి

సానా సంతోషంగా ఉందయ్యా



మేమంతా ఓటెయ్యడం వల్ల ఊరికే పేరు రావడం నాకు సానా సంతోషంగా ఉందయ్యా.. పెద్ద సార్లకు కృతజ్ఞతలు చెబుతున్నా. – కోళ్ల కన్నమ్మ

ఈ–ఆఫీస్ వ్యవస్థ మరింత బలోపేతం

- ప్రభుత్వ సేవల్లో పారదర్శకత కోసమే అప్‌గ్రెడేషన్
- పాత వెర్షన్‌ని 7Xకి అప్‌డేట్ చేస్తున్న కేంద్రం
- ఇప్పటికే 14 రాష్ట్రాల్లో కొత్త ఫీచర్ల వినియోగం
- ఈ –ఆఫీస్ ఫైళ్లలో ట్యాంపరింగ్ అసాధ్యం
- ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ కార్యకలాపాలు, సేవల్లో పారదర్శకత, సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఈ-ఆఫీస్‌ను కేంద్ర ప్రభుత్వం తాజా వెర్షన్ 7Xకి అప్‌గ్రేడ్ చేస్తోందని రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్- కమ్యూనికేషన్స్ విభాగం కార్యదర్శి కోన శశిధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఈ-ఆఫీస్‌ను మే 17 నుంచి 25 వరకు అప్‌గ్రేడ్ చేయాలని కేంద్రం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. అప్‌గ్రెడేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి ప్రత్యక్ష పాత్ర లేదని చెప్పారు. ప్రక్రియనంతా కేంద్ర ప్రభుత్వం, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయన్నారు. ఈ-ఆఫీస్ ఫైల్‌లు అత్యంత భద్రతతో కూడిన ఎన్‌క్రిప్టెడ్ ఫార్మాట్‌లో నిల్వ ఉంటాయని తెలిపారు. ఏదైనా విపత్తు సంభవించినా సంబంధిత ఫైల్‌కు బ్యాకప్ సదుపాయం ఉంటుందన్నారు. ఒక్కసారి ఈ-ఫైల్‌లోకి సమాచారం చేరితే సంబంధిత ఫైల్‌ను తొలగించడం, మార్పులు చేర్పులు చేయడం అసాధ్యమని వివరించారు. ఈ-ఆఫీస్ ఫైళ్లను నిర్వహిస్తున్న ఎన్ఐసీలో డేటాబేస్ శాశ్వతంగా నిల్వ ఉంటుందన్నారు. ఎవరికీ వాటిని మార్చేందుకు వీలు కాదని స్పష్టం చేశారు. ఈ-ఆఫీస్ ఫైళ్లను ట్యాంపరింగ్ చేయొచ్చని జరుగుతున్న ప్రచారం పూర్తిగా నిరాధారం, అవాస్తవమన్నారు. ఇప్పటికే 14 రాష్ట్రాలు తాజా వెర్షన్‌కి అప్‌గ్రేడ్ అయ్యాయని తెలిపారు. ఇవి ఈ-ఆఫీస్ కొత్త ఫీచర్లను ఉపయోగించుకుంటున్నాయన్నారు. పాత వెర్షన్‌లో తలెత్తిన సాంకేతిక లోపాలను సవరించి కొత్త వెర్షన్‌ను అందుబాటులోకి తెచ్చారన్నారు.

టీడీపీ విధ్వంసకాండకు ఈసీదే బాధ్యత

స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఈసీ పక్షపాతంతో వ్యవహరిస్తోంది

- పోలింగ్ రోజు, ఆ తర్వాత రాష్ట్రంలో టీడీపీ గూండాల విధ్వంసం
- రాజకీయ కక్షతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలపై టీడీపీ దాడులు
- పట్టించుకోని పోలీసులు.. కనీసం నిలువరించలేదు
- కౌంటింగ్ రోజునా అల్లర్లకు టీడీపీ కుట్ర
- బీజేపీతో పొత్తుతో పురందేశ్వరి ద్వారా ఈసీ విధుల్లోకి దూరిన టీడీపీ
- సుజనా చౌదరి వ్యాపార భాగస్వామి విందుకు హాజరైన పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా
- టీడీపీ ఆఫీసులో తయారయ్యే ప్రణాళికను దీపక్ మిశ్రా ద్వారా ఈసీ అమలు చేసింది
- ఆధారాలు లేకపోయినా 25 మంది పోలీసు అధికారులపై వేటు
- అధికారులపై బదిలీ వేటు వేసిన ప్రాంతాల్లోనే టీడీపీ గూండాల దాడులు
- జగన్ మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయం
- పక్షపాతంతో వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోలింగ్ రోజున, పోలింగ్ పూర్తయ్యాక జరుగుతున్న టీడీపీ గూండాల విధ్వంసకాండకు ఎన్నికల సంఘాని (ఈసీ)దే బాధ్యత అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఈసీ మేడిపండులా మారి, ఉదాసీనంగా పక్షపాతంతో వ్యవహరించిందని, ఇందుకు పల్నాడు, తాడిపత్రి, తిరుపతి, జమ్మలమడుగు తదితర ప్రాంతాల్లో టీడీపీ మూకలు చేస్తున్న ఏకపక్ష దాడులే నిదర్శనమని ధ్వజమెత్తారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 'పోలింగ్ రోజున మంత్రి అంబటి రాంబాబును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. దీనిపై రాంబాబు ఎస్పీకి ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. అంతకుముందు మాచర్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భార్య, కుమారుడిపైన, తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దారెడ్డి నివాసంపైన టీడీపీ మూకలు దాడి చేస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. నరసరావుపేటలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇంటిపై టీడీపీ గూండాలు దాడి చేస్తుంటే పోలీసులు పట్టించుకోలేదు. పోలింగ్ పూర్తయ్యాక గురజాల నియోజకవర్గంలో బీసీలపై టీడీపీ మూక దాడి చేసినా పట్టించుకోలేదు. ఇవన్నీ అసహజ సంఘటనలే. రాజకీయ కక్షతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలపై టీడీపీ గూండాలు దాడులకు తెగబడ్డారు. పోలీసులు వారిని కనీసం నిలువరించలేదు' అని ధ్వజమెత్తారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

పోలింగ్ సజావుగా సాగకుండా టీడీపీ దాడులు

ఎన్నికల షెడ్యూలు వెలువడిన తర్వాత అధికార యంత్రాంగం మొత్తం ఈసీ పరిధిలోకి వెళ్తుంది. ఈసీని, ఎన్నికల నియమావళిని సీఎం జగన్, మంత్రులు, వైఎస్సార్‌సీపీ గౌరవించాయన్న విషయం ప్రజలంతా గమనించారు. 2019 ఎన్నికల్లో అప్పటి సీఎం చంద్రబాబు ఈసీ కార్యాలయానికి వెళ్లి వీరంగం వేసి, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని బెదిరించిన దృశ్యమూ ఇంకా ప్రజల కళ్ల ముందే ఉంది. అధికారపక్షానికి, ప్రతిపక్షానికి సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఈసీది. సీఎం వైఎస్ జగన్ నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, ఆ మైనార్టీలు, నా అక్కాచెల్లెమ్మలు అంటూ అందరినీ అక్కున చేర్చుకున్నారు. ఆ వర్గాలన్నీ వైఎస్సార్‌సీపీ పట్ల సానుకూలంగా ఉన్నాయి. పోలింగ్ సజావుగా జరిగితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలు, వృద్ధులు ఓట్లు వేసేందుకు వస్తారు. అది వైఎస్సార్‌సీపీకి ప్రయోజనం. శాంతియుత వాతావరణం లేకపోతే వారు ఓట్లేసేందుకు రారు. వైఎస్సార్‌సీపీకి వచ్చే ఓట్లను అడ్డుకొని, రిగ్గింగ్‌కు పాల్పడేందుకే టీడీపీ రౌడీలతో దాడులకు తెగబడింది. టీడీపీ మూకలు రెచ్చగొట్టినా వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంయమనం పాటించాయి. కౌంటింగ్ రోజున కూడా ఇదే విధంగా భారీ ఎత్తున అల్లర్లు సృష్టించడానికి టీడీపీ కుట్ర చేస్తోంది. సంఘ విద్రోహ శక్తులతో అరాచకం సృష్టించిన చంద్రబాబే.. రాష్ట్రంలో ఏదో అయిపోతోందని గవర్నర్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేయడం విడ్డూరం. సంక్షేమ పథకాలను అడ్డుకున్న చంద్రబాబే.. ఇప్పుడు ఆ నిధులను కాంట్రాక్టర్లకు బిల్లులుగా చెల్లిస్తున్నారని ఫిర్యాదు చేయడం హేయం.

బీజేపీతో పొత్తుతో ఈసీ విధుల్లోకి దూరిన టీడీపీ

బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకున్న తర్వాత.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, చంద్రబాబు వదిన పురందేశ్వరి ద్వారా ఈసీ విధుల్లోకి టీడీపీ దూరిందని అనిపిస్తోంది. రాష్ట్రంలో కీలకమైన స్థానాల్లో ఉన్న 29 మంది అధికారులపై బదిలీ వేటు వేసి, వారి స్థానంలో కొందరు అధికారులను నియమించాలని సిఫార్సు చేస్తూ ఈసీకి పురందేశ్వరి లేఖ రాయడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. ఎలాంటి ఫిర్యాదులు, ఆధారాలూ లేకపోయినా 29 మంది అధికారులపై బదిలీ వేటు వేశారు. అందులో 25 మంది పోలీసు అధికారులే. వారిలో 90 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, రెడ్డి సామాజికవర్గం వారే. పోలింగ్‌కు ముందు రోజు నంద్యాల ఎస్పీని, అంతకు ముందు డీజీపీని, ఇంటెలిజెన్స్ చీఫ్‌ను తప్పించారు. ఈసీ ఎక్కడైతే అధికారులపై బదిలీ వేటు వేసిందో అక్కడే ఇప్పుడు టీడీపీ మూకలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఆ ప్రాంతాల్లో ఈసీ నియమించిన అధికారులకు స్థానిక పరిస్థితులపై అవగాహన లేకపోవడం వల్లే ఈ దుస్థితి దాపురించింది.

ఈసీ నిష్పక్షపాతంగా వ్యవహరించిందని ఎలా నమ్మాలి?

ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో పరిస్థితులపై అవగాహన ఉన్న అధికారులు అవసరం. పోలీసు పరిశీలకుడిగా (అబ్జర్వర్‌గా) నియమితులైన రిటైర్డు అధికారి దీపక్ మిశ్రా టీడీపీ అధినేత చంద్రబాబుకు సన్నిహితుడు, విజయవాడ పశ్చిమ అభ్యర్థి సుజనాచౌదరి వ్యాపార భాగస్వామి అయిన విష్ణువర్ధన్‌రావు ఇచ్చిన విందుకు హాజరయ్యారు. అలాంటి వ్యక్తి పోలీసు అబ్జర్వర్‌గా ఉంటే ఈసీ నిష్పక్షపాతంగా వ్యవహరించిందని ఎలా నమ్మాలి? విజయవాడలో సీఎం జగన్‌పై టీడీపీ మూక హత్యాయత్నానికి తెగబడితే.. 164 స్టేట్‌మెంట్ తీసుకోవాలని పోలీసులపై దీపక్ మిశ్రా ఒత్తిడి తేవడమేమిటి? టీడీపీ ఆఫీసులో తయారయ్యే ప్రణాళికను దీపక్ మిశ్రా ద్వారా ఈసీ అమలు చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, రెడ్డి సామాజికవర్గం అధికారులపై బదిలీ వేటు వేసింది.

సీఎస్, డీజీపీని ఈసీ పిలిపించుకోవడమేమిటి?

జూన్ 4వ తేదీ వరకూ ఈసీ పరిధిలోనే అధికార యంత్రాంగం పనిచేస్తుంది. పరిస్థితులు మరింత ప్రమాదకర స్థాయికి చేరకుండా ఉండాలంటే తక్షణమే పోలీసు అబ్జర్వర్‌ను మార్చాలని ఈసీని డిమాండ్ చేశాం. సీఎస్, డీజీపీని ఈసీ పిలిపించడమేమిటి? అధికారుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం దారుణం. ఈసీ పర్యవేక్షణలో ఉన్న వ్యవస్థ విఫలమైతే ఆ బాధ్యత ఈసీదే. పరిస్థితిని చక్కదిద్దడానికి ఈసీ నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలి. పరిపాలనలో ఈసీ మితిమీరిన జోక్యం తగ్గించుకోకపోతే పరిస్థితులు మరింత దిగజారుతాయి. స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ అంటే సంక్షేమ పథకాలను అడ్డుకోవడమా? ఎప్పటికప్పుడు వీటిపై ఫిర్యాదులు చేస్తున్నా వాటిని సరిదిద్దే ప్రయత్నం ఈసీ చేయడంలేదు.

పక్షపాతంతో వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవు

ప్రజలు తీర్పును ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. సీఎం జగన్ ఏ వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం పని చేశారో.. ఆ వర్గాల దీవెనలు లభించాయి. మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదల ఓటింగ్ పెరగడమే దీనికి నిదర్శనం. వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యం. జగన్ సీఎంగా మరోసారి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయం. పక్షపాతంతో ఏకపక్షంగా వ్యవహరించే అధికారులను గుర్తుపెట్టుకుంటాం. వారిపై చర్యలు తప్పవు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

బస్సులో సీటు కోసం మహిళల ఫైటు



బస్సులో గొడవ పడుతున్న మహిళలు

హుబ్లీ: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం విజయవంతంగా కొనసాగుతుండగా, బస్సుల్లో రద్దీ వల్ల కొన్ని అపశ్రుతులు జరుగుతున్నాయి. బీదర్ జిల్లాలో బస్సులో సీటు కోసం ఇద్దరు మహిళలు పరస్పరం చెప్పులతో కొట్టుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బీదర్ నుంచి కలబుర్గి వెళ్లే మార్గమధ్యంలో ఆర్టీసీ బస్సులో ఈ ఘటన జరిగింది. శక్తి యోజన ద్వారా ఉచిత టిక్కెట్ పొందిన మహిళలు గొడవకు దిగి సీటు నాదంటే నాది అని పట్టుబట్టి పరస్పరం తలపడ్డారు. ఒకరినొకరు బాగా నిందించుకోవడమేగాక చెప్పులతో కొట్టుకున్నారు. చివరకు బస్సు డ్రైవర్, తోటి ప్రయాణికులు మహిళల జగడాన్ని విడిపించి శాంతింపజేశారు.

పైనుంచి కిందపడి కార్మికుడు మృతి

హుబ్లీ: నిర్వహణ సేవలు అందిస్తుండగా ఒక కార్మికుడు అదుపు తప్పి 130 అడుగుల ఎత్తు నుంచి కింద పడటంతో మృతి చెందిన ఘటన బుధవారం విజయపుర జిల్లాలోని కుడగి వద్ద ఉన్న ఉష్ణ విద్యుత్ స్థావరంలో చోటు చేసుకుంది. మృతుడిని కిషన్‌కుమార్ భరద్వాజ్(33)గా గుర్తించారు. కిషన్‌కుమార్ ఉత్తర ప్రదేశ్‌కు చెందినవాడు. ఎన్‌టీపీసీ యూనిట్‌లో నిర్వహణ వేళ హెల్పర్‌గా పని చేస్తుండగా అదుపు తప్పి పైనుంచి కింద పడటంతో మృతదేహం ఛిద్రమైంది. చేతులతో పాటు శరీరంలోని ఇతర భాగాలు తెగిపడ్డాయి. మృతదేహాన్ని విజయపుర ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబానికి తగిన పరిహారం అందించాలని సదరు కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. ఘటనా స్థలంలో పోలీసులు తగిన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

ఆర్‌ఎంపీల బెడద అరికట్టండి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలో ఆర్‌ఎంపీ వైద్యుల బెడదను అరికట్టాలని రాష్ట్ర బేడర సమితి డిమాండ్ చేసింది. బుధవారం జిల్లా ఆరోగ్య అధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షులు ఆంజనేయ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు తమకు ఇష్టం వచ్చిన మందులు రాసివ్వడం, ఇంజెక్షన్లు ఇస్తున్నారని, అవి వికటించి ప్రాణాలు తీస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ఆర్‌ఎంపీ, నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్రబాబుకు వినతిపత్రం సమర్పించారు.

మొక్కలతో పచ్చదనం వృద్ధి



మొక్కలు నాటుతున్న వేణుగోపాల్

రాయచూరు రూరల్: జిల్లాలో మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని రామకృష్ణ స్వామి వివేకానంద ఆశ్రమ సంచాలకుడు వేణుగోపాల్ పిలుపునిచ్చారు. నగరంలోని ఆశాపూర్ రహదారిలోని నిరాశ్రితుల కేంద్రంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ శివశంకర్ గురూజీ జన్మదినోత్సవంలో భాగంగా మొక్కలు నాటి మాట్లాడారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రీన్ రాయచూరు సంస్థ లాలాజీ, గురురాజ్, రాజేంద్ర కుమార్, గణేష్, తాయప్ప, సంధ్యలున్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న భక్తులు

రాయచూరు రూరల్: యాదగిరి జిల్లాలోని హుణసిగి, బెణకనహళ్లిలో బుధవారం త్రైత సిద్ధాంత శిఖామణి గ్రంథాలు, భగవద్గీత పుస్తకాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆధ్వర్యంలో రాసిన పుస్తకాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక భక్తులు అందించి ప్రచారం చేశారు. కార్య క్రమంలో వీరేష్, శ్రీదేవి, మనోహర్, భరత్, సురేష్, గణేష్, రామాంజి, రవి, నాగేంద్ర, పురుషోత్తం, వరుణ్, వెంకటరాముడు, సుధాకర్ తదితరులున్నారు.

రాజరాజేశ్వరికి చండికా హోమం

కోలారు: తాలూకాలోని వక్కలేరిలో వెలసిన రాజరాజేశ్వరి ఆలయం 10వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం చండికా హోమం, అశ్లేష పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మనోజ్‌రావ్ నేతృత్వంలో చండికా హోమం, అశ్లేష పూజలు జరిగాయి. గ్రామస్తుల సహకారంతో పూజలను నిర్వహించినట్లు అర్చకుడు తెలిపారు.

అందరి నోట.. రాజఫలం మాట

- మామిడి ప్రదర్శన, విక్రయ మేళాకు శ్రీకారం
- నాణ్యమైన పండ్లను అందించడమే లక్ష్యం
- ఉద్యానవన శాఖాధికారి కాశీనాథ్ భద్రన్నవర్



మేళాలో నోరూరించే మధుర ఫలాలను ఆసక్తిగా తిలకిస్తున్న దృశ్యం



విక్రయ మేళాలో మామిడిపండ్లను కొనుగోలు చేస్తున్న మహిళలు

హుబ్లీ: జిల్లా యంత్రాంగం, జెడ్పీ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే మామిడి పండ్ల ప్రదర్శన, విక్రయ మేళాకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు వివిధ మామిడి రకాలతో ప్రదర్శన ఘుమఘుమలాడుతోంది. వినియోగదారులకు నాణ్యమైన వివిధ రకాల మామిడి పండ్లను అందుబాటులో ఉంచే నేపథ్యంలో ఈ మేళాను ఏర్పాటు చేశారు. మేళాలో 32కు పైగా మామిడి రకాలను విక్రయానికి ఉంచారు. పండించిన రైతుల నుంచి నేరుగా వినియోగదారులకు మంచి పండ్లు దొరకనున్నాయి. రైతులకు కూడా మంచి ధర కూడా దొరకనుంది. వినియోగదారులకు నాణ్యమైన పండ్లు, సరసమైన ధరలో లభించేలా ఈ మేళా జరుగుతుంది. ఈ మేళాలో ధార్వాడ రసపురి, సింధూరి, అపోస, మల్లిక, రత్నగిరి, అల్ఫాన్సా తదితర 100కు పైగా రకాల మామిడి పండ్లు లభిస్తున్నాయి. ముఖ్యంగా కేజీకి రూ.2.70 లక్షలకు ధర పలికే జపాన్ రాజఫలం విక్రయ మేళాలో కనువిందు కలిగిస్తోంది. ఇక్కడికి వచ్చిన వినియోగదారులందరూ జపాన్‌కు చెందిన మియా జాతి మామిడి పండు రుచి కన్నా ధర కంటిగింపుగా కనిపిస్తుంది. రుచి, నాణ్యతకు ఈ రకం పండు ఖ్యాతిగాంచింది. ఈ అత్యంత ఖరీదైన మామిడి పండు జిల్లాలోకి కలకేరి మామిడి రైతు ప్రమోద్ గాంవకర్ తోటలో పెంచారు. తొలిసారిగా మేళాలో ఈ పండును ప్రదర్శనకు ఉంచారు. మూడు రోజుల మేళాలో 30 టన్నుల పండ్లు విక్రయిస్తారని భావిస్తున్నారు. ఈ విషయమై ఉద్యానవన శాఖాధికారి కాశీనాథ్ భద్రన్నవర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 8 వేల ఎకరాల్లో మామిడి పండ్లు పండించారు. 20 నుంచి 30 టన్నుల మామిడి పండ్లు విక్రయించే ఉద్దేశం ఉందన్నారు. మామిడి రైతులు ప్రమోద్ గాంవకర్, రామనగౌడ పాటిల్, అసిస్టెంట్ చందాపుర, రైతులతో పాటు ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పొలం పనులు షురూ

- ముందుగానే వానల పలకరింత
- పుష్కలంగా విత్తనాలు, ఎరువులు



పొలంలో నాగలి దున్నుతున్న రైతన్న

రాయచూరు రూరల్: జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పొలాల్లో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఈసారి ఖరీఫ్‌లో ముందుగానే వానలు కురవడంతో రైతులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నారు. ఈ ఏడాది 3.44 లక్షల హెక్టార్లలో విత్తనాలు వేయడానికి రంగం సిద్ధమైంది. 84 వేల హెక్టార్లలో నీటిపారుదల, మిగిలిన హెక్టార్లలో ఏకదళ, ద్విదళ ధాన్య, వాణిజ్య పంటల సాగుకు అవకాశం ఉంది. జిల్లాలో 1.71 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉంది. కేఎస్ఎంఎఫ్‌లో 7393 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ దుకాణాల్లో 738.10 మెట్రిక్ టన్నుల ఎరువు ఉంది. 90 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు ఖరీఫ్‌కు సరిపడా నిల్వ ఉన్నాయని వ్యవసాయ శాఖ జేడీ దేవిక వెల్లడించారు. జిల్లాలోని 35 రైతు కేంద్రాల్లో రైతులకు ఎరువులు, క్రిమిసంహారక మందులు నిల్వ ఉన్నాయన్నారు. రైతులు సద్వినియోగ పరుచుకోవాలని కేంద్రం ప్రత్యేక అధికారి నాగిరెడ్డి తెలిపారు.

అకాలవర్షంతో 188 హెక్టార్లలో పంటనష్టం

హొసపేటి: విజయనగర జిల్లాలో అకాలవర్షం కారణంగా సుమారు 188 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని చైర్మన్, జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. వర్షంతో హొసపేటి, కమలాపుర ఫిర్కాల్లో అరటి, బొప్పాయి, తమలపాకు తదితర ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయని ఉద్యానశాఖ అధికారులు నివేదిక సమర్పించినట్లు తెలిపారు. పశువులు, ప్రాణనష్టం జరిగిన కేసులకు నష్టపరిహారం పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ నెలలో జిల్లాలో పలు ప్రాంతాల్లో మంచి వర్షాలు కురిసినట్లు తెలిపారు. జిల్లాలోని 18 ఫిర్కాల్లోనూ మే 11న సగటున 1.38, మే 12న 8.12, మే 13న 11.87 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. తాలూకాలో అత్యధికంగా 26.92 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందని వివరించారు.

త్వరలో పంట నష్టపరిహారం పంపిణీ

ఈ పంట నష్టాన్ని ఎస్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం రాబోయే కొద్ది రోజుల్లో యాప్‌లో నమోదు చేసి పంట నష్టం పరిహారం అందిస్తారన్నారు. జిల్లాలో ఏప్రిల్ నెలాఖరు వరకు రెండు ప్రాణనష్టం కేసులు నమోదయ్యాయి. కొట్టూరు తాలూకాలో ఒకరు, హరపనహళ్లి తాలూకాలో మరొకరు మరణించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం ఇప్పటికే పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 8 పెద్ద పశువులు, 6 చిన్న పశువులు మృతి చెందగా, వాటి యజమానులకు పరిహారం అందజేశారు. జిల్లాలో మొత్తం 14 ఇళ్లు వర్షానికి దెబ్బతిన్నాయని, త్వరలో పరిహారం పంపిణీ చేస్తామని తెలిపారు.

ప్రేమించలేదని యువతి దారుణ హత్య

- వాణిజ్యనగరి హుబ్లీలో దారుణం
- ఇటీవల విద్యార్థిని నేహా హత్య ఘటన మరువక మునుపే మరో ఘటన



హతురాలు, హంతకుడు(ఫైల్)

హుబ్లీ: తన ప్రేమను నిరాకరించిందన్న కోపంతో ఓ యువకుడు యువతి ఇంట్లోకి చొరబడి కత్తితో పొడిచి యువతిని దారుణంగా హత్య చేసిన ఘటన నగరంలో బుధవారం తెల్లవారు జామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు..వీరాపుర గుడి వీధి నివాసి అంజలి అంబిగేర(20) అనే యువతిని విశ్వ అలియాస్ గిరీష్ సావంత్(21) అనే యువకుడు గత కొంత కాలంగా ప్రేమించమని వెంటపడి వేధించేవాడు. అయితే అతని ప్రేమను ఆమె నిరాకరించింది. ఈక్రమంలో బుధవారం తెల్లవారుజామున యువతి నిద్రపోతుండగా నిందితుడు ఇంట్లోకి జొరబడ్డాడు. తన వెంట రావాలని బలవంత పెట్టి వెంట తెచ్చుకున్న కత్తితో యువతిని పొడిచి పరారైనట్లు జిల్లా ఎస్పీ గోపాల బ్యాకోడ తెలిపారు. బెండిగేరి పోలీస్ స్టేషన్‌లో ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, ప్రేమ విషయమా? మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో కేసును దర్యాప్తు చేపట్టామన్నారు. కాగా మృతురాలి సోదరుడు మాట్లాడుతూ ఉదయం 5 గంటలకు ఇంటిలోకి వచ్చిన నిందితుడు తన సోదరిని బయటకు పిలిచి తనతో రమ్మని బలవంత పెట్టాడన్నారు. దీనికి ఆమె నిరాకరించడంతో కోపగించుకున్న నిందితుడు కత్తితో తన సోదరి గొంతు, ఛాతీ, కడుపుపై పొడిచి పరారయ్యాడన్నారు. గతంలో కూడా తనతో మైసూరుకు రావాలని, రాకపోతే నేహా హిరేమఠ్‌ను చంపినట్లుగానే నిన్ను కూడా చంపుతానని బెదిరించాడన్నారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

వైభవంగా వాసవీ జయంతి



పుష్ప సేవలో పాల్గొన్న మహిళా భక్తులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాయచూరు రూరల్: నగరంలో వాసవీ మాత జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. బుధవారం వందలాది మంది భక్తుల సమక్షంలో అమ్మవారికి అభిషేకం, బ్రహ్మ ఉత్సవాలు నెరవేర్చారు. నగరంలోని నగరేశ్వరాలయంలో వాసవీ మాతకు విశేష పూజలు జరిపి అమ్మవారి విగ్రహానికి పుష్ప వృష్టి, ప్రత్యేక అలంకార సేవలు, పల్లకీ సేవల్లో ఊరేగించారు. సామూహిక కుంకుమార్చన, అలంకార సేవ, మహిళలతో కుంభ కలశాలతో ఊరేగింపు చేశారు. ఇల్లూరు గోపాలయ్య కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు జరిపారు.

రాంపుర రిజర్వాయర్ పరిశీలన



రాంపుర జలాశయాన్ని సందర్శించిన నేతలు



కాలువ నుంచి నీటిని పంపింగ్ చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో రాంపుర జలాశయాన్ని నగర ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ నగరసభ సభ్యులు, అధికారులతో కలిసి పరిశీలించారు. సోమవారం సాయంత్రం గణేకల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేశారు. ఆ నీరు బుధవారం రాంపుర జలాశయానికి చేరుకున్నాయి. నగరవాసులకు సక్రమంగా తాగునీటిని అందించే దిశలో రాంపుర రిజర్వాయర్ నుంచి నీటిని వృథా చేయకుండా నగరవాసుల తాగునీటి అవసరాలకు వినియోగించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా నగరసభ సభ్యుడు శశిరాజ్, నేతలు రవీంద్ర జాలదార్, నరసింహులు, ఆంజనేయ తదితరులున్నారు.

ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించండి



సమావేశంలో వైద్యులు, వైద్య శాఖ అధికారులతో మాట్లాడుతున్న జిల్లాధికారి దివాకర్

- వైద్యాధికారులకు జిల్లాధికారి సూచన

హొసపేటి: ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని, ఆస్పత్రులకు వచ్చే రోగులు, వారి బంధువులపై వైద్యులు, సిబ్బంది సహనం, సంయమనం, ఓర్పుతో ప్రవర్తించాలని జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ సూచించారు. ఆయన బుధవారం తన కార్యాలయ సభామందిరంలో జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు సమక్షంలో విజయనగర జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ ఆస్పత్రులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. తప్పుగా ప్రవర్తించవద్దు. మానవత్వంతో ఉండండి. ఎవరైనా దోషులుగా తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందక మరణాలు సంభవిస్తున్నాయని స్థానిక సంస్థల నుంచి అందిన ఫిర్యాదులపై ప్రధానంగా చర్చించారు. ఈనెల 8న నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చోటు చేసుకున్న ఘటనపై, శాంతి భద్రతల పరిరక్షణపై సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో జరిగిన ఈ ఘటన ప్రజల ఆగ్రహానికి దారి తీస్తోందని, దీనిపై ప్రైవేట్ హాస్పిటల్స్ యూనియన్ సభ్యులు, ఐఎంఏ ఆఫీస్ బేరర్లు, సభ్యులు దృష్టి సారించాలని సమావేశంలో కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరాపై భయాందోళన



మురుగు కాలువలో పైపులు, కలుషితమైన నీరు

హొసపేటి: విజయనగర జిల్లా కొట్టూరు పట్టణంలో పది రోజులుగా కలుషిత నీరు సరఫరా కావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నగరంలోని కొన్ని వార్డుల్లో తప్ప మిగతా అన్ని వార్డులకు తుంగభద్ర నీరు ప్రధానంగా సరఫరా అవుతుంది. వేసవిలో నీటి పరిమాణం తక్కువగా ఉన్నా కలుషిత నీటి సరఫరాకు అనుకూలంగా మారింది. పట్టణంలో గత 10 రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతున్నట్లు ఆరోపణలు జోరుగా వినబడుతున్నాయి. పట్టణంలోని చాలా ప్రాంతాల్లో నీటి పైపులు పగిలి వర్షపు నీరు, మురుగునీరు కలుషితమవుతున్నాయని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముడుకనకట్టె, వాల్మీకినగర్, రాజీవ్ నగర్ బరంగేతో పాటు పలు ప్రాంతాల్లో నీటి సరఫరా పైపుల్లో కలుషిత నీరు చేరింది. దీనిపై పట్టణ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ప్రజలు వాపోతున్నారు. తుంగభద్ర నది నీటిని శుద్ధి చేసి హగరిబొమ్మనహళ్లి ప్లాంట్‌కు విడుదల చేస్తారు. అయితే తాగునీరు ఆకుపచ్చ రంగులో ఉండటంతో పాటు దుర్గాసన వెదజల్లుతున్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు అధికారులు సూచిస్తున్నారు.

యువత భవితకు స్కిల్ సెంటర్ సేవలు భేష్



లబ్ధిదారులతో సంస్థ ప్రముఖులు

బళ్లారిఅర్బన్: యువశక్తి భవిత రూపకల్పనలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సేవలు ప్రశంసనీయమని శ్రీచైతన్య సామూహిక విద్యా సంస్థల ముఖ్యస్థులు రాధాకృష్ణ తెలిపారు. జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ సభాంగణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ తరఫున విద్యార్థులకు ప్రమాణ పత్రాలను ప్రదానం చేసి ఆయన మాట్లాడారు. నేటి విద్యా వ్యవస్థలో నైపుణ్యతకు ప్రాధాన్యత తగ్గిందన్నారు. అయితే జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభించడం ద్వారా యువశక్తి సరికొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకోవడానికి కృషి చేస్తోందన్నారు. నైపుణ్య సాధన ద్వారా యువత జీవితాల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. తద్వారా మంచి భవిష్యత్తును నిర్మించుకుంటున్నారన్నారు. యువతకు తమ జీవిత పోరాటంలో ధైర్యాన్ని కల్పించేందుకు సెంటర్ ఎంతో కృషి చేసిందన్నారు. ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ ద్వారా నిరుద్యోగుల్లో విశ్వాసాన్ని పెంచిందన్నారు. వీరశైవ విద్యావర్ధక సంఘం అధ్యక్షుడు అల్లం గురుబసవరాజ్ సదరు సెంటర్‌ను ప్రారంభించి కర్ణాటకలో విశేషంగా తన సేవలు అందిస్తోందని కొనియాడారు. ఈ సంస్థకు అవసరమైన సహాయ సహకారాలను సంఘం అందిస్తుందన్నారు. ఆ సంస్థ సీనియర్ ఉపాధ్యక్షుడు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ చెర్మన్ యశ్వంతరాజ్ నాగిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల సంస్థ జేడీ డాక్టర్ మర్చేడు మల్లికార్జునగౌడతో పాటు సురేష్‌బాబు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారిఅర్బన్: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రతిష్టాత్మక పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ప్రతిభావంతులైన విద్యార్థులకు అర్హత పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ ఏడీ మమత తెలిపారు. హాస్టల్ రహిత పాఠశాల అల్లీపురలోని విశ్వేశ్వరయ్య హైస్కూల్, విద్యానగరలోని నందా వసతి పాఠశాల, బెళగల్ క్రాస్‌లోని నంది హైస్కూల్‌తో పాటు వసతితో కూడిన సిరుగుప్ప విజయమేరీ ప్రాథమిక పాఠశాల, దమ్మూరులోని ఇంటర్ నేషనల్ స్కూల్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్సీ విద్యార్థుల కుటుంబ ఆదాయం రూ.2 లక్షల లోపల ఉండి 5వ తరగతిలో 60 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ఈ పాఠశాలల్లో చేరాలనే ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో ఈ నెల 21 లోగా కౌల్‌బజార్ మొదటి గేట్ సమీపంలోని డాక్టర్ అంబేడ్కర్ భవనంలోని అసిస్టెంట్ ఆఫీసర్ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు 08392–244738, 9480843073కు సంప్రదించాలని ఆమె ఈ మేరకు ఓ ప్రకటనలో కోరారు.

భగీరథ జయంతి



జయంతిని ఆచరిస్తున్న దృశ్యం

హొసపేటి: కంప్లి తాలూకా ఎమ్మెల్యే గణేష్ కార్యాలయంలో భగీరథ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం సంఘం తాలూకా అధ్యక్షుడు భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కంప్లి తాలూకా సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలీలకు అన్యాయంపై ధర్నా



ఆందోళన చేస్తున్న నరేగ కూలీలు

రాయచూరు రూరల్: తమకు సక్రమంగా కూలీ డబ్బులు చెల్లించడంలో అన్యాయం జరిగిందంటూ కూలీ కార్మికులు ఆందోళనకు దిగారు. బుధవారం జిల్లాలోని సిరవార తాలూకా వటగల్‌లో జాతీయ ఉద్యోగ ఖాత్రి పథకంలో భాగంగా వ్యవసాయం కూలీలకు కూలీ డబ్బులు చెల్లిచడంలో జూనియర్ ఇంజినీర్ మొయిన్ పాషా తక్కువ కూలీలు ఇవ్వడాన్ని ఖండిస్తూ నిరసన తెలిపారు.

నివేదికల అందజేతలో నిర్లక్ష్యంపై నిరసన



ఆందోళన చేస్తున్న రోగుల కుటుంబ సభ్యులు

రాయచూరు రూరల్: రాయచూరు వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) ప్రభుత్వ వైద్య పరిశోధన కళాశాలలో రోగులకు సంబంధించిన వైద్య పరీక్షల నివేదికలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడాన్ని రోగుల కుటుంబ సభ్యులు, బంధువులు ఖండించారు. బుధవారం రిమ్స్‌లో రోగులకు సంబంధించిన రక్త పరీక్ష, యూరిన్ పరీక్ష, బీపీ, షుగర్ పరీక్షలు చేసిన నివేదికల కోసం గంటల తరబడి వేచి ఉండడాన్ని తప్పుబట్టారు. వైద్యులు రోగులను చూడడానికి వచ్చేలోపు ఆ రిపోర్టులు లేకపోతే తిరిగి వైద్యులు మరుసటి రోజు ఉదయం వచ్చే వరకు రోగులకు వైద్యం చేయడం కుదరదని చెబుతున్నట్లు రోగుల బంధువులు ఆరోపించారు.

ఉసురు తీసిన బెట్టింగ్ భూతం



ముదిబసవ(ఫైల్)

రాయచూరు రూరల్: ఐపీఎల్ బెట్టింగ్‌లో ఓడిపోవడంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి జిల్లాలోని సింధనూరు తాలూకా ఉద్బాళలో జరిగింది. గ్రామానికి చెందిన ముదిబసవ(29) అనే యువకుడు ఓ లాడ్జిలో ఫ్యాన్‌కు ఉరేసుకొన్నట్లు సింధనూరు టౌన్ పోలీసులు తెలిపారు. క్రికెట్ పోటీలపై వేలాది రూపాయల మేర బెట్టింగ్‌లు కట్టి అప్పుల పాలు కావడంతో ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు.

బాలింత కడుపులో వస్త్రం.!

- సిజేరియన్ చేసి కుట్లు వేసిన వైనం
- ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం



బాలింత కడుపులో వదిలేసిన వస్త్రం ఇదే



బాలింత చంద్రిక

కోలారు : కాన్పు కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ఓ గర్భిణికి సిజేరియన్ చేసిన అనంతరం వైద్యులు ఆ మహిళ కడుపులోనే వస్త్రాన్ని వదిలేసిన ఘటన నగరంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. మాలూరు తాలూకా రామసాగర గ్రామానికి చెందిన గర్భిణి చంద్రిక కాన్పు కోసం ఈ నెల 5వ తేదీన ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. వైద్యులు ఆమెకు సిజేరియన్ చేసి కాన్పు చేశారు. అయితే ఆపరేషన్ అనంతరం గుడ్డ ముక్కను మహిళ కడుపులోనే వదిలేసి కుట్లు వేశారు. ప్రసవం అనంతరం వారం రోజుల తరువాత మహిళ కడుపు నొప్పితో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ ఆస్పత్రిలో నర్సు కడుపుపై ఉన్న గాయానికి ఆయింట్‌మెంట్ రాస్తుండగా వేలికి గుడ్డ ముక్క తగిలింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్వాకం తెలిసి తల్లిదండ్రులు వెంటనే ఈ విషయాన్ని జిల్లా ఆస్పత్రి సర్జన్ డాక్టర్ విజయకుమార్ దృష్టికి తేగా ఇకపై ఇలా జరగకుండా చూస్తామని చెప్పి చల్లగా జారుకున్నారని చంద్రిక తల్లిదండ్రులు అసంతృప్తిని వ్యక్తం చేశారు.

డీకేశి పుట్టిన రోజు వేడుక

బళ్లారిఅర్బన్: నగరంలోని కనక దుర్గమ్మకు పూజలు చేయడం ద్వారా ఆలయ ఆవరణలో ఉపముఖ్యమంత్రి డీకే.శివకుమార్ పుట్టిన రోజు వేడుకను బుధవారం కాంగ్రెస్ ప్రముఖులు వెంకటేష్ హెగ్డే ఆధ్వర్యంలో నెరవేర్చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు కేక్ కట్ చేసి చిన్నారులకు, భక్తులకు పంచిపెట్టారు. బుడా అధ్యక్షులు జేఎస్ ఆంజనేయులు, కల్లుకంబ పంపాపతి, వీరేంద్రకుమార్, బోయపాటి విష్ణు, మంజుల, రాజేశ్వరి, జ్యోతి, వెంకటలక్ష్మి, సంతోష్ స్వామి, కాంద్ర సతీష్, రిహానా, రోహిణి, మల్లమ్మ, హసీనా తదితరులు పాల్గొన్నారు.